జాతీయ

# స్ఫూర్తి

పక్షపత్రిక

RNI Regn No. 52879/93

2020 నవంబర్ 1-30

వెల : రూ. 50



## మార్క్సిజానికి కొత్త చూపు

# ఆంటోనియో గ్రాంసీ

## 1891- 1937

## 130వ జయంతి ప్రత్యేక సంచిక

One of the Biggest Cooperative Urban Banks in India with **105** Years of Service

# THE VISAKHAPATNAM COOPERATIVE BANK LIMITED

(MSCS/CR/1101/2014) (MULTI STATE COOPERATIVE URBAN BANK)

A common man's bank since 1916

Dwarakanagar, Visakhapatnam-530016, Ph: 0891-2788461, 62, 63, 66, 71

## BOARD OF DIRECTORS


**Sri M.Anjaneyulu**
Chairman Emeritus


**Sri Ch.Raghavendra Rao**
Chairman


**Sri G.Bhaskara Rao**
Sr.Vice Chairman


**Sri M.Raghava Rao**
Vice Chairman


Sri Naga Bhusana Chowdary


Sri A J Stalin


Sri N.Kamaraju


Smt K Bhavani


Sri Rao Venkata Jaggarao


Sri V.Chandra Sekhar


Sri G.Janardhana Rao


Smt T Padmavathi


Sri Ch Ramarao


Sri Ch.Adinarayana Sastry


Smt U.Parvathi Devi


Sri K.Prasada Rao


Sri S.J. Ramachandra Raju


Sri P.V.Ramana Rao


Sri J.V. Satyanarayana Murthy


Sri Ch. Koteswara Rao


Sri P. Narayana Swamy


Sri D.Babu Rao


Sri R.Vaidyanadhan


Sri P.V.Narasimha Murthy
CEO

### Salient Features

- Higher Rate of Interest on Deposits.
- Additional rate of Interest on deposits of Senior Citizens.
- All Deposits are insured upto Rupees 5,00,000/- for each individual
- DDs/Bankers Cheques on all important places in India and RTGS, NEFT
- All Branches works on Sunday Extended Working hours for Customer's convenience.
- Safe Deposit Locker facility
- Corporate Agency with United India Insurance Company Ltd,
Life Insurance corporation of India,
IFFCO TOKIO General Insurance Company Ltd

### Members Welfare Schemes

- All members covered under Personal Accident Policy upto Rs.50,000/- Members with share capital of Rs.5000/- and above covered under **"Arogya Visakha Bima"** for medical expenses upto Rs.50,000/- per year with additional coverage of Spouse.
- In case of unfortunate death of member, legal heirs are entitled to received Death Benefit Fund equal to Share Capital with a minimum of Rs.5000/- and a maximum of Rs.1.00.000/-
- Yearly Cash Awards for Meritorious children of our members

**THE BIGGEST COOPERATIVE BANK IN SOUTH INDIA**

# ఆంటోనియో గ్రాంసీని అధ్యయనం చేద్దాం

## సంపాదకీయం

ఇది ఆంటోనియో గ్రాంసీ 130వ జయంతి సంవత్సరం. గ్రాంసీ ప్రముఖ ఇటాలియన్ కమ్యూనిస్టు. మార్క్స్-ఎంగెల్స్‌ల రచనల తర్వాత ప్రపంచ వ్యాపితంగా గ్రాంసీ రచనల మీద విస్తారమైన చర్చ సాగుతున్నది. పలు స్రవంతుల మేధావులు గ్రాంసీ రచనల మీద చేస్తున్న అధ్యయనాలు వెల్లువెత్తుతున్నాయి. మార్క్స్-ఎంగెల్స్ రచనలను పునాది చేసుకున్న గ్రాంసీ భావజాలానికి అనేక కొత్త కోణాలను ఆవిష్కరించి మనకు కొత్త చూపును ఇచ్చాడు.

మార్క్స్-ఎంగెల్స్ రచనలలోని పునాది ఉపరితలం విశ్లేషణల మీద వారి కాలంలోనే అనేక వక్రీకరణలు జరిగాయి. మార్క్సిజాన్ని కేవలం ఆర్థిక నియతివాదంగా కుదించిన కుహనా మార్క్సిస్టులను ఎద్దేవా చేస్తూ మార్క్స్ స్వయంగా "నేను మార్క్సిస్టుని కాను" అని ప్రకటించుకోవలసి వచ్చింది. ఆ తర్వాత 1890లో జె.బ్లోహ్‌కి ఎంగెల్స్ రాసిన లేఖలో ఈ ఆర్థికవాద కుదింపును తిరస్కరిస్తూ "యువకులు ఒక్కొక్కసారి ఆర్థిక పార్శ్వానికి దానికి యోగ్యమైనదాని కన్న ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తున్నారంటే, ఈ దోషంలో స్వయంగా మార్క్సుకూ, నాకూ కూడా పాక్షికంగా కొంత బాధ్యత ఉంది. ఆర్థిక అంశాన్ని తిరస్కరించిన మా ప్రత్యర్థులకు వ్యతిరేకంగా, ఆ ప్రధాన సూత్రాన్ని మేము నొక్కి చెప్పాల్సి వచ్చింది. పరస్పర వర్తనలో ఇమిడి వున్న యితర అంశాలకు సముచితమైన స్థానాన్ని యిచ్చే వ్యవధి గాని, స్థలం గాని, అవకాశం గాని మాకు అన్నప్పుడు లభ్యం కాలేదు" అని రాశాడు. గ్రాంసీ తన రచనలలో మార్క్స్-ఎంగెల్స్‌లు విశ్లేషించిన సామాజిక పునాదిపై నిలబడి ఉపరితలంపై లోతైన విశ్లేషణ చేసి పునాది - ఉపరితలాల పరస్పరవర్తనలో ఇమిడి వున్న అంశాలను ఆవిష్కరించి మార్క్సిజాన్ని సుసంపన్నం చేశాడు.

ఆర్థిక పునాది స్థాయిలో మౌలికవర్గమైన కార్మికవర్గం తన పరిశ్రమలో లేదా అదే తరహా పరిశ్రమలలో జరిగే దోపిడీ మీద, పని పరిస్థితుల మీద జరిగే పోరాటాన్ని తొలి దశగానూ, తర్వాత వివిధ రంగాలకు చెందిన భిన్నతరహా పనులు చేసే శ్రామికులందరూ పరస్పరం సహకరించుకుంటూ ఒకే వర్గం అన్న భావనతో చేసే వర్గపోరాటాలను రెండవదశగానూ విశ్లేషించారు. ఇది పునాది స్థాయిలో జరిగే ఆర్థిక పోరాటంగా వివరించాడు. పెట్టుబడిదారీ వర్గ పాలన అంతం కోసం కార్మికవర్గం పోరాటం సాగించే దశ ఆర్థిక పోరాటం నుండి రాజకీయ పోరాటంగా మారడాన్ని వివరించాడు. ఆర్థికపోరాటం ప్రధానంగా పునాదిస్థాయిలో జరిగితే రాజకీయ పోరాటం ఉపరితలంలో పౌరసమాజంలో జరుగుతుందని విశ్లేషించాడు. పాలకవర్గాలు తమ వర్గపాలనను స్థిరపరచుకోవడానికి పౌర సమాజ సమ్మతిని, రాజకీయ అధికారాన్ని వినియోగించిన తీరును వెల్లడించాడు. దీనికి ప్రతిగా మౌలికవర్గమైన కార్మికవర్గం పౌరసమాజంలో అత్యధికుల సమ్మతిని పొందడానికి అది ప్రత్యేకమైన పాత్రను పోషించాలని, రాజకీయ పోరాటం కార్మికవర్గ ఒంటరి పోరాటం కాదని అది సమాజంలోని ఉపశ్రేణుల సమ్మేళనంగా ఒక చారిత్రక సంఘటన ద్వారా జరగాలని సూత్రీకరించారు. అందుకోసం కార్మికవర్గం తన స్వప్రయోజనాలకే పరిమితం కాకుండా ఉపశ్రేణులందరి ప్రయోజనాలకు గొంతునివ్వడానికి వీలుగా తన ఏకైక ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవాలని, అది మొత్తం జాతి ప్రయోజనాలను ప్రతిబింబించే శక్తిగా రూపొందాలని ప్రకటించాడు. ఈ చారిత్రక సంఘటన రూపుదిద్దుకోవడానికి, స్థిరపడడానికి తగిన ఉమ్మడి ప్రపంచ దృక్పథాన్ని సాధించాలని, దానికి సవర్గ మేధావుల ఆవశ్యకతని, ప్రజలలో నెలకొన్న లోకుల జ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే సాంస్కృతిక విప్లవం ఎంతో ప్రాధాన్యత గలదిగా ఆయన భావించారు. రాజకీయ అధికారం సాధించడానికి ముందే పౌరసమాజం మీద సమ్మతితో కూడిన ఆధిపత్యాన్ని సాధించాలని దానిని యుద్ధ సన్నాహంగా పేర్కొంటూ ఇది జరిగితే రాజ్యాధికారం సిద్ధించడం తథ్యం అని స్పష్టం చేశాడు.

ఇలా కార్మికవర్గ పోరాటం రాజకీయ పోరాటంగా పరిణమించడానికి సాగించాల్సిన బహుముఖ కార్యాచరణకు గ్రాంసీ రచనలు ప్రేరణగా వుంటాయి. విప్లవాలు ఏ రూపంలో జయప్రదం కావాలన్నా పౌరసమాజంలో సమ్మతితో కూడిన ఆధిపత్యాన్ని సాధించడం అన్న కీలక అంశాన్ని మనముందుంచారు. వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా ఉపకరించే గ్రాంసీ రచనలను అన్ని స్రవంతుల ప్రజా ఉద్యమకారులు అధ్యయనం చెయ్యాలి.

జాతీయ స్ఫూర్తి ప్రత్యేక సంచిక అలాంటి అధ్యయనానికి, ఆచరణకీ ప్రేరణ ఇస్తుందని భావిస్తున్నాము. ఈ సంచికలో బహు స్రవంతుల మేధావులు గ్రాంసీ భావజాలాన్ని పరిచయం చేస్తూ విలువైన వ్యాసాలు అందించారు. వారికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. ❑

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2020 నవంబర్ 1-30 సంపుటి : 29 సంచిక : 3,4

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్


## ఈ సంచికలో...


3 గ్రాంసీ జీవన చిత్రాలు - జ్ఞాపికలు
4 గ్రాంసీ జీవితరేఖలు
6 మన మార్క్స్
9 మార్క్స్ క్యాపిటల్‌కు భిన్నంగా రష్యా విప్లవం
11 నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం
13 బూర్జువా వార్తాపత్రికలు కార్మికవర్గానికి శత్రువులు
14 గ్రామ్‌సీ : ఆందోళన - ప్రచారం
16 'మనిషి' అంటే ఎవరు ?
21 సమకాలీన ప్రపంచంలో ప్రముఖ మేధావి — డా॥ యలమంచిలి రాధాకృష్ణమూర్తి
23 గ్రాంసీ సిద్ధాంతం సార్వత్రికమైనది — సుశీ తారు
27 గ్రాంసీ భావనలు - సంక్షిప్త పరిచయం
35 గ్రాంసీ జీవన చిత్రాలు - జ్ఞాపికలు
36 ఉద్యమాలకు ఉజ్వలభావావిష్కర్త గ్రామ్‌స్కీ — తెలకపల్లి రవి
41 ఇది క్రూర పాలకులు రాజ్యమేలే కాలం : గ్రాంసీ — అశోక్ కుంబము
48 క్రాస్ రోడ్స్‌లో కమ్యూనిజం గ్రాంసీ ఒక దిక్సూచి — హెచ్చార్కె
54 గ్రాంషీ - భావజాలం — రావు కృష్ణారావు
59 గ్రామ్ సీ నోట్ బుక్స్ — మందలపర్తి కిషోర్
62 మనిషికీ సత్యానికీ ఉన్న బంధమే సైన్సు : గ్రాంసి — డాక్టర్ దేవరాజు మహారాజు
64 గ్రాంసీ మాటలలో శ్రామిక విద్య, సంస్కృతి — కొత్తపల్లి రవిబాబు
66 భావజాల పోరాటంలో వయోజన విద్య — డా॥ సి. కృష్ణమోహనరావు
70 మార్క్స్ వారసుడు గ్రాంసీ — జి రాములు
73 ఉపశ్రేణుల్ని విస్తృతం చేసిన గ్రాంసీ — కొప్పర్తి
76 ఉపశ్రేణుల ప్రవక్త గ్రాంసీ — కొప్పర్తి
79 విప్లవోద్యమానికి గ్రాంసీ విలువైన బోధనలు — మర్ల విజయ కుమార్
82 మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన గ్రాంసీ — డా॥ బి. రమేష్‌చంద్రబాబు
85 మార్క్సివాద మేధావి ఆంటోనియో గ్రాంసీ — తక్కోలు మాచిరెడ్డి
87 పౌర సమాజం - గ్రాంసీ - ఒక పరిశీలన — డా॥ బి.వి.వి. బాలకృష్ణ
88 ఎమ్.ఎన్.రాయ్ జ్ఞాపకాలలో గ్రాంసీ — గౌరవ్
89 ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు బూస్టర్డ్ హెజిమనీ - ప్రజా హెజిమనీ — డి వి వి యస్ వర్మ


### గమనిక

**గ్రాంసీ రచనలపై వచ్చిన పుస్తకాల కవర్ పేజీలు**

వివిధ రచయితల వ్యాసాల మొదటి పేజీలలో గ్రాంసీ రచనలపై వచ్చిన కొన్ని పుస్తకాల కవర్‌పేజీలను ప్రచురించాము. గ్రాంసీపై వస్తున్న పుస్తకాల విస్తృతిని పాఠకులకు అందించడానికి మాత్రమే ఉద్దేశించబడినవిగా గమనించగలరు.

### జాతీయ స్ఫూర్తి రిపబ్లిక్ దినోత్సవ సంచిక

భారత రిపబ్లిక్ రాజ్యాంగపరంగానూ, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలపరంగానూ ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషించే వ్యాసాలతో 2021 జనవరి 20న జాతీయస్ఫూర్తి ప్రత్యేక సంచికగా వెలువడుతుంది.

### జాతీయ స్ఫూర్తి ప్రత్యేక సంచికలు దొరుకు చోటు

ఈ ప్రత్యేక సంచిక అన్ని విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవచేతన, నవ తెలంగాణా పుస్తకాల షాపులలో అందుబాటులో వుంటాయి.

ఈ సంచికపై మీ అభిప్రాయాలు పంపండి., ఇతర వివరాలకు డి.వి.వి.యస్. వర్మ, ఎడిటర్, వాట్సాప్ : 85006 78977ను సంప్రదించండి

# గ్రాంసీ జీవన చిత్రాలు - జ్ఞాపికలు




తండ్రి - సోదరులు



15 ఏళ్ల నాటి గ్రాంసీ



విద్యార్థిగా గ్రాంసీ




అమెరికాలో స్మారక కేంద్రం



వియన్నాలో గ్రాంసీ

# గ్రాంసీ జీవిత రేఖలు

గ్రాంసీ 1891 జనవరి 22 న జన్మించారు. దక్షిణ ఇటలీలోని సార్డీనియాలోని ఆలెస్ జన్మస్థానం. ఏడుగురి సంతానంలో నాల్గవ వాడు చిన్నతనం నుండీ అనారోగ్య పీడితుడు. వెన్నుపూసకు సంబంధించిన జబ్బు జీవితాంతం వెంటాడింది. పెరుగుదల 5 అడుగుల లోపు దగ్గరే ఆగిపోయింది. గూని కూడా వచ్చింది.

1897లో తండ్రి జైలు పాలు కావడంతో గ్రాంసీ చదువుకు అంతరాయం వచ్చింది. రెండేళ్ల పాటు సంపాదన కోసం పని చేసాడు. తండ్రి తిరిగి వచ్చిన తర్వాత హైస్కూల్ విద్య పూర్తి చేశాడు. 1911లో పేద పిల్లల స్కాలర్‌షిప్ పొంది తురిన్‌లో యూనివర్సిటీలో చేరాడు. అనారోగ్యం, తిండి వసతికి తగిన డబ్బు లేకపోవడంతో చదువుకు అనేక అవరోధాలు వచ్చాయి.

1915లో యూనివర్సిటీ విద్యకు స్వస్తి చెప్పి జర్నలిస్టుగా పని చేశాడు. చదువులో గ్రాంసీకి మక్కువే కాదు. ఆసక్తి బహు రంగాలకు విస్తరించడం కనిపిస్తుంది. హైస్కూల్‌లో లెక్కలు, సైన్స్ పట్ల ఆసక్తితో ప్రారంభమైంది. యూనివర్సిటీలో వివిధ కోర్సులు తీసుకుని పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు.

భాషా శాస్త్రం, ఇటాలియన్ లిటరేచర్, రోమన్ లా, జాగ్రఫీ, గ్రీక్ లాటిన్ గ్రామర్, మోరల్ ఫిలాసఫీ, మోడరన్ హిస్టరీ, గ్రీక్ లిటరేచర్ కోర్సులు చేసాడు. 1915 లో ఫిలాసఫీ కోర్సు తీసుకున్నాడు. ప్రిజన్ నోట్స్‌లో అయన రచనలలో వైవిధ్యం విశ్వరూపంగా కనిపిస్తుంది.

### ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒకటి రెండు విషయాలు

1922 లో పార్టీ ప్రతినిధిగా మాస్కోలో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌కు హాజరయ్యాడు. అక్కడ అనారోగ్యంతో శానిటోరియంలో చేరాడు. అప్పుడు జూలియాతో పరిచయం తర్వాత పెళ్లి, 1924లో మొదటి బిడ్డ డెలియో పుట్టాడు.

1925లో జూలియా రోమ్‌లో సోవియట్ ఎంబసీలో ఉద్యోగిగా వచ్చింది. 1926 జూన్ వరకు కలిసి వున్నారు. ఇటలీలో పరిస్థితులు మారడంతో గర్భవతిగా వున్న జూలియా తిరిగి మాస్కో వెళ్ళింది. అక్కడ రెండో బిడ్డ జులియానో పుట్టాడు. అప్పటికే జైలు పాలైన గ్రాంసీ ఆ బిడ్డ ఫోటో తప్ప చూసే వీలు రాలేదు.

1926 నుండి జైలులో వున్న గ్రాంసీ 1937 ఏప్రిల్ 27న మరణించాడు.

### గ్రాంసీ రాజకీయ జీవితం

1913లో విద్యార్థిగా ఉండగానే సోషలిస్ట్ పార్టీతో సంబంధాలు వచ్చాయి. అప్పటికే ఆయన వ్యాసాలు రాయడం మొదలైంది.

1915లో యూనివర్సిటీ నుండి బైటికి వచ్చి సోషలిస్టు పత్రికలో చేరాడు. అప్పుడే సోషలిస్ట్ పార్టీ సభ్యుడయ్యాడు

1917లో తురిన్ పార్టీ విభాగానికి కార్యదర్శి అయ్యాడు. 1918లో సోషలిస్టు పార్టీ సభ జరిగింది. అక్కడే కమ్యూనిస్ట్ గ్రూపు ఏర్పడింది.

1921లో సోషలిస్టు మహాసభ జరిగింది. కమ్యూనిస్టులు అక్కడ చీలి పార్టీని ఏర్పాటు చేశారు.

1922 కమ్యూనిస్టు పార్టీ 2వ మహాసభ రోమ్‌లో జరిగింది. కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌కు గ్రాంసీని ప్రతినిధిగా పంపారు. ఆ తర్వాత 1923 కొమింటర్న్ పనుపున వియన్నా వెళ్ళాడు. అక్కడ నుండి ఇటలీ, యూరప్ దేశాల కమ్యూనిస్ట్ పార్టీల సమన్వయము బాధ్యతలు నిర్వహించాడు.

1924 లో ఇటలీ పార్లమెంటుకు ఎన్నికయ్యాడు, ఇటలీకి వచ్చిన తర్వాత పార్టీ కార్యకలాపాలలో వున్నాడు. పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు.

1925 లో ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తెచ్చింది.

1926 నవంబర్‌లో గ్రాంసీని అరెస్ట్ చేశారు. దీనితో ఆయన జైలు జీవితం ప్రారంభమైంది.

ఈ కాలంలో చేసిన కృషిలో మూడు అంశాలను ప్రస్తావించాలి

1. సోషలిస్టు పార్టీలో కమ్యూనిస్ట్ గ్రూపు ఏర్పాటు అంతిమంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు మళ్ళీ అంతర్గత పోరాటం విప్లవ పార్టీ నిర్మాణం
2. కార్మికోద్యమ నిర్మాణం – ఫాక్టరీ కౌన్సిళ్ల ఉద్యమం
3. రాజకీయ సిద్ధాంత పరమైన అంశాలపై పునాదులు

## జైలు జీవితం

1926లో ప్రత్యేక చట్టాల కింద అరెస్టు 5 సంవత్సరాలశిక్ష 1927లో ముస్సోలిని హత్యా ప్రయత్నం కేసులో ఇరికించారు.

ప్రత్యేక ట్రిబ్యునల్‌లో విచారణ

ప్రాసిక్యూటర్ వాదన - ఈ మనిషి బుర్రను 20 సంవత్సరాలు పని చేయకుండా నిరోధించాలి

జడ్జి రాజును మించిన రాజభక్తిని ప్రదర్శించాడు. 20 సంవత్సరాల 4 నెలల 5 రోజులు శిక్ష వేశాడు.

జైలులో ఆయన పోరాడి సాధించినవి వున్నాయి. రాసుకోడానికి వీలుగా ప్రత్యేక సెల్ - నెలవారీగా ఉత్తరాలు రాసి సంఖ్యను పెంచడం - పుస్తకాలు తెచ్చుకుని చదివే అవకాశం

సెన్సార్ నిబంధనల పరిధిలో రాయడానికి అనుమతి సంపాదించుకున్నాడు.

వదిన తాతియానా రచనకు నిరంతర ప్రోత్సాహం, రాసిన ప్రతులను భద్రపరిచింది. మరో మిత్రుడు స్రాఫా అవసరమైన పుస్తకాలు తెప్పించుకోడానికి పరిమితి లేని ఖాతాను తెరిచాడు.

## ప్రిజన్ నోట్స్

మొత్తం 33 నోట్ బుక్స్ పూర్తి చేసాడు. ఏ అంశాన్ని ఒక పుస్తకంగా రాయలేదు. అనేక అంశాలపై తన అభిప్రాయాలను నోట్స్ రూపం ఇచ్చాడు. కొన్నింటిని తిరగ రాసాడు

మొత్తం మీద ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని రూపుదిద్దడం పనిగా పెట్టుకున్నాడు దానికి అవసరమైన చారిత్రిక సిద్ధాంత, సాంస్కృతికపరమైన అంశాలను ఈ నోట్స్‌లో వివరించాడు. ❑



**1922లో గ్రాంసీ సోవియట్ యూనియన్‌లో వున్నప్పుడు అక్కడ జూలియాను వివాహం చేసుకున్నాడు.**
**మొదటి కొడుకు డెలియో. 1925-26లో ఇటలీలో కొంత కాలం కలిసి జీవించారు. తర్వాత రెండో కొడుకు గిలియానో**



**టాట్యానా షుక్ట్ :** **ఇతర వస్తువులతో పాటు గ్రాంసీ 33 జైలు నోట్‌బుక్స్ తీసి జాగ్రత్త చేయగలిగారు. వాటిని ఓ బ్యాంకులో భద్రపరిచి, సంవత్సరం తరువాత రాయబార కార్యాలయం ద్వారా మాస్కోకు పంపించారు. ఆ విధంగా అవి టోగ్లియాటీకి చేరాయి. చాలా నోట్‌బుక్స్‌ని, ఉత్తరాలను పలు సంవత్సరాల తరువాత - 1945లో ఫాసిస్టు పాలన నుంచి ఇటలీ విముక్తమయ్యాకే ప్రచురించగలిగారు. వాటి ఇంగ్లీషు అనువాదాలు 1957లో మొదలయ్యాయి. జైలు రచనల నుంచి ఎంపిక చేసినవి 1971లో పుస్తక రూపంలో వెలువడ్డాయి. జైలు రచనల సంపూర్ణ ఇటాలియన్ ప్రచురణ 1975లో గాని వెలుగు చూడలేదు. ప్రస్తుతం అవి ఇంగ్లీషులోనికి అనువాదం అవుతున్నాయి.**



**పీరో స్రాఫా :** **ఈయనకు గ్రాంసీతో తొలినాటి ఇటాలియన్ కమ్యూనిస్టు ఉద్యమంతో ఉన్న సంబంధం దృష్ట్యా, ఇతని ఆర్థిక రచనలకు గల ప్రాచుర్యం దృష్ట్యా ఆధునిక మార్క్సిజంలో ఒక ప్రముఖమైన స్థానం ఉంది. 1918-20 మధ్య 'రెడ్‌టురిన్'లో విద్యార్థిగా ఉండి స్రాఫా ఆర్డినోనోవోలో వ్యాసాలు రాశారు. 1924 నాటికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, దానిలోని విభేదాలను చూసి స్రాఫా ఆ ఉద్యమానికి దూరమయ్యారు. ఆ తరువాత కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఉన్న పీరో స్రాఫా జైలులో ఉన్న గ్రాంసీకి పుస్తకాలు అందించడానికి మిలన్‌లోని ఒక బుక్ షాపులో పరిమితి లేని ఖాతా ఏర్పాటు చేశారు. జైలులో ఉన్న గ్రాంసీకి చాలా పుస్తకాలు అలా అందుబాటులోకి వచ్చాయి. గ్రాంసీ విడుదల కోసం జనాన్ని సమీకరించడంలో ప్రధానంగా పనిచేసింది కూడా స్రాఫాయే.**




# మన మార్క్సు

గ్రాంసీ స్వీయ రచనలు

సరిగ్గా వంద సంవత్సరాల కింద మార్క్సు శతజయంతి సందర్భంగా మార్క్సిజం విశిష్టతను చాటి చెపుతూ ఇటలీకి చెందిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఆంటోనియో గ్రాంషీ రాసిన వ్యాసం.

(ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంషీ (1891-1937) ఇటలీకి చెందిన సోషలిస్టు పత్రిక ఇల్ గ్రిడో డెల్ పొపొలొలో 1918 మే 4న మార్క్సు శత జయంతి సందర్భంగా రాసిన వ్యాసం ఇది. సరిగ్గా ఆ సమయానికే ఇటలీలో బెనిటో ముసోలినీ నాయకత్వంలో ఫాసిజం బలపడడం మొదలయింది. చివరికి 1922లో ముసోలినీ ప్రధానమంత్రి కూడ అయి ఫాసిస్టు పాలన ప్రారంభించాడు. తన మీద హత్యా ప్రయత్నానికి కమ్యూనిస్టులు కుట్ర పన్నుతున్నారనే అబద్ధపు ఆరోపణతో ముస్సోలినీ 1926లో కమ్యూనిస్టుల మీద, ప్రగతి శీలవాదుల మీద దారుణ దమనకాండ ప్రారంభించి, అప్పటికి ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ఉన్న గ్రాంషీని అరెస్టు చేయించాడు. గ్రాంషీకి వ్యతిరేక



వాదనలు చేస్తూ ప్రాసిక్యూషన్‌ని ఈ మేధను కనీసం ఇరవై సంవత్సరాలు పని చేయించకుండా ఉండడం అవసరం అని న్యాయస్థానాన్ని కోరింది. న్యాయస్థానం వెంటనే గ్రాంషీకి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఏడాది తర్వాత మరొక ఇరవై సంవత్సరాల శిక్ష విధించింది. అరెస్టయ్యే నాటికి ముప్పై ఐదేళ్ళ వయసులో ఉన్న గ్రాంషీ జైలులో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. గ్రాంషీని విడుదల చేయాలని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనలను, విజ్ఞప్తులను ముసోలినీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. చివరికి పదకొండు సంవత్సరాల జైలు జీవితం తర్వాత 1937లో గ్రాంషీ జైలులోనే మరణించాడు. ఆయన జైలులో చేసిన ఆలోచనలు, రచనలు దాదాపు మూడు వేల పేజీలు, ముప్పై నోట్ పుస్తకాలలో మిగిలిపోయాయి. అంతకు ముందూ, జైలులోనూ కూడ ఆయన మార్క్సిజం మీద ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల మీద చేసిన ఆలోచనలు మార్క్సిస్టు ఆలోచనా ధారకు ఎన్నో సృజనాత్మక కానుకలందించాయి.

మనం మార్క్సిస్టులమేనా ? అసలు మార్క్సిస్టులనే వాళ్లు ఉంటారా? మూర్ఖత్వమా, నువ్వొకదానివే శాశ్వతమైన దానివి. బహుశా ఈ ప్రశ్న రానున్న కొన్ని రోజుల్లో, మార్క్సు శతజయంతికి అటూ ఇటుగా, చాలా మంది లేవనెత్తుతారు. ఎన్నెన్నో సిరా నదులూ, తెలివిమాలినతనపు నదులూ ప్రవహిస్తాయి. పిచ్చి ప్రేలాపనలూ, కళాత్మకమైన టక్కుటమారాలూ ఎప్పటికీ చెడిపోని మానవ వారసత్వ సంపద కదా... మార్క్సు ఒక అందమైన చిన్న సిద్ధాంతం ఏదీ రాయలేదు. స్థల కాలావధులకు అతీతంగా, ప్రశ్నించడానికి వీలులేని, పరమ నియమాలతో, నిర్ద్వంద్వమైన కర్తవ్యాలతో నిండిన కాల్పనిక కథావళులను వదిలిపోయిన ప్రవక్త కాడాయన. ఆయన వదిలిపోయినది ఒకే ఒక్క విస్పష్టమైన కర్తవ్యం, నియమం : అది ప్రపంచ కార్మికులారా, ఏకం కండి అనే నినాదం. సంఘటితం చేసే కర్తవ్యం, ఆ కర్తవ్యాన్ని ప్రచారం చేయడం ఒక్కటే బహుశా మార్క్సిస్టులకూ, మార్క్సేతరులనూ వేరు చేసేది. అది చాల చిన్నదనిపిస్తుంది. కాని చాల పెద్దది కూడ. మరి ఇందులో మార్క్సిస్టు కాకుండా ఉండాలని ఎవరనుకుంటారు ?

అయినా అది అలాగే ఉంటుంది. తమకు తెలిసినా తెలియకపోయినా ప్రతి ఒక్కరూ ఎంతో కొంత మార్క్సిస్టులే.

మార్క్స్ మహానుభావుడు. ఆయన ఆచరణ ఫలప్రదమైంది. ఆయనేమీ శూన్యంలోంచి ఏదో కనిపెట్టాడని కాదు. ఆయన తన ఊహలోంచి ఒక చారిత్రక దృక్పథాన్ని తవ్వి తీశాడని కాదు. కాని అప్పటివరకూ శకలాల రూపంలో, అసంపూర్ణంగా, అపరిణతంగా ఉన్నది ఆయనలో పరిణతిగా, వ్యవస్థగా, చైతన్యంగా రూపుదిద్దుకుంది. ఆయన వ్యక్తిగతంగా సాధించిన అవగాహన ప్రతి ఒక్కరి అవగాహన అయింది. అందువల్ల మార్క్స్ కేవలం మేధావి కాదు, ఆయన ఆచరణవాది. ఆయన ఆలోచనలో మాత్రమే కాదు ఆచరణలో కూడ మహానుభావుడు, సార్థక జీవి. ఆయన పుస్తకాలు ఆలోచనలను మార్చినట్టుగానే ప్రపంచాన్ని మార్చాయి. మానవజాతి చరిత్రలో మేధస్సు, చైతన్య స్ఫూర్తి ప్రవేశించిందనడానికి మార్క్స్ సూచన.

సరిగ్గా చరిత్రలో మనిషి పాత్ర గురించి థామస్ కార్లైల్‌కూ హెర్బర్ట్ స్పెన్సర్‌కూ మధ్య జరిగిన మహా చర్చ కాలంలోనే ఆయన కృషి వెలువడింది.

కార్లైలేమో ఆధ్యాత్మిక ఐక్యతతో నిగూఢమైన సమ్మేళనం జరిగిన నాయకుడే, మహా వ్యక్తే మానవజాతి భవిష్యత్తును నిర్ధారిస్తాడని, సంపూర్ణతా, పవిత్రతా నిండిన భ్రమాజనిత స్థలంలో అపరిచితమైన, క్షణభంగురమైన గమ్యానికి నడిపిస్తాడనీ అన్నాడు.

స్పెన్సరేమో ప్రకృతినీ, పరిణామాన్నీ, యాంత్రిక చలనాన్నీ, నిర్జీవ సాధారణీకరణనూ నొక్కి చెప్పాడు. మనిషంటే ఒక ప్రాకృతిక శరీరంలోని ఒకానొక అణువు అన్నాడు. అమూర్తమైన నియమానికి విధేయంగా ఉండే అణువు అనీ, కాని వ్యక్తులలో అది చారిత్రక నిర్దిష్టతగా, తక్షణ ప్రయోజనంగా పర్యవసిస్తుందనీ అన్నాడు.

ఈ చరిత్రలో ఒక మహాకాయుడిలా బలవత్తరమైన శక్తితో విస్పష్టంగా తనను తాను ప్రవేశ పెట్టుకున్నాడు మార్క్స్. ఆయన మార్మికవాది కాదు. ప్రత్యక్షేక వాదం ప్రతిపాదించిన అధి భౌతికవాదీ కాదు. ఆయన చరిత్రకారుడు. గత కాలపు దస్తావేజుల వ్యాఖ్యానకర్త. ఆ దస్తావేజులలో కొన్ని ఎంపిక చేసుకుని వ్యాఖ్యానించిన వాడు కాదు, సమస్త దస్తావేజులనూ తన పరిధిలోకి తీసుకున్నవాడు.

అప్పటి వరకూ మానవానుభవాల చరిత్రల అంతర్గత లోపం అదే. అవన్నీ దస్తావేజులలోని ఒక భాగాన్ని మాత్రమే పరీక్షించి, పరిగణనలోకి తీసుకున్నవి. ఆ ఎంపిక చేసిన భాగం కూడ చారిత్రక సంకల్పం వల్ల కాదు, కేవలం పాక్షిక అభిప్రాయ దురభిప్రాయాల వల్ల జరిగింది. ఆ అభిప్రాయ దురభిప్రాయాలు అసంకల్పితంగా, మంచి మనసుతోనే ఏర్పడినా సరే. ఆ పరిశోధనంతా సత్యం కోసం, కచ్చితత్వం కోసం, గతకాలపు జీవితాన్ని సమగ్రంగా పునఃసృష్టించడం కోసం జరగలేదు. కేవలం ఒక ప్రత్యేక కార్యకలాపాన్ని ఎత్తి పట్టడానికి, అంతకు ముందే తమ మనసులో ఉన్న ప్రాతిపదికను నిరూపించడానికి మాత్రమే జరిగింది. చరిత్ర సంపూర్ణంగా భావాల క్షేత్రం. మనిషిని కేవలం ఒక ఆత్మగా, శుద్ధ చైతన్యంగా మాత్రమే అక్కడ గుర్తించారు. ఈ భావన వల్ల రెండు తప్పుడు పర్యవసానాలు సంభవించాయి. మనుషులలో రూపొందిన భావాలన్నీ కేవలం యథేచ్ఛగా, కాల్పనికంగా వెలువడినట్టు అనిపించింది. ఇక ప్రాముఖ్యత పొందిన వాస్తవాలు కేవలం పిట్ట కథలూ ఉపాఖ్యానాలూ మాత్రమే గాని చరిత్ర కాదు. చరిత్రను దాని నిజమైన అర్థంలో రాసి ఉన్నారంటే అది కేవలం ఆయా వ్యక్తులు విడివిడిగా ప్రదర్శించిన అద్భుత ప్రజ్ఞ వల్లనే కాని చరిత్ర రచనను ఒక క్రమబద్ధమైన, చైతన్యపూర్వకమైన శాస్త్రీయ కార్యాచరణగా భావించినందు వల్ల కాదు.

మార్క్స్‌కు కూడ చరిత్ర అంటే భావాల క్షేత్రమే. ఆయనకు కూడ మనిషి చైతన్యమే ప్రధానం. వ్యక్తులు ఒంటరిగా గాని, సంఘటితంగా గాని సాగించే చైతన్య పూర్వక కార్యాచరణే చరిత్ర. కాని మార్క్స్ దృష్టిలో ఆ భావాలు, చైతన్యం సారాన్ని సంతరించు కున్నాయి. తమ యథేచ్ఛను వదిలించుకున్నాయి. అవి ఇంకెంత మాత్రమూ కాల్పనికమైన మత లేదా సామాజిక అమూర్తత్వాలు కావు. వాటి సారాంశం ఆర్థిక వ్యవస్థలో, వాస్తవికమైన కార్యాచరణలో, ఉత్పత్తికీ, వినిమయానికీ సంబంధించిన వ్యవస్థలలో, సంబంధాలలో ఉంది. అంటే చరిత్రగా జరిగేది శుద్ధమైన వాస్తవిక (ఆర్థిక, నైతిక) కార్యాచరణ. ఒక భావన నిజం కావాలంటే అది కేవలం తార్కికంగా శుద్ధ సత్యంతో, శుద్ధ మానవతతో సమన్వయంలో ఉంటే సరిపోదు. అది ఒక ప్రణాళిక లాగనో, మానవజాతి సాధించవలసిన సాధారణ నైతిక లక్ష్యం లాగనో మాత్రమే ఉనికిలో ఉండదు. అందుకు భిన్నంగా అది ఆర్థిక వాస్తవికతలోనే తన సార్థకతను సాధిస్తుంది. ఆర్థిక వాస్తవికతలోనే తనను తాను నడుపుకోగల సాధనాన్ని కనిపెడుతుంది.

ఒక దేశపు, ఒక సమాజపు, ఒక సామాజిక బృందపు చారిత్రక లక్ష్యాలు ఏమిటో ఖచ్చితంగా తెలుసుకోవాలంటే, మొట్టమొదట ఆ దేశంలో, ఆ సమాజంలో ఎటువంటి ఉత్పత్తి,

వినిమయ వ్యవస్థలూ సంబంధాలూ ఉన్నాయో తెలుసుకోవాలి. ఆ పరిజ్ఞానం లేనట్టయితే కేవలం పాక్షిక గ్రంథాలు, సిద్ధాంత పత్రాలు రాయడం మాత్రమే వీలవుతుంది. ఆ గ్రంథాలు సంస్కృతీ చరిత్రకు ఉపయోగకరమైనవే. వాటిలో అప్రధానమైన ప్రతిఫలనాలు దొరుకుతాయి, సుదూర పర్యవసానాలు దొరుకుతాయి కాని అది చరిత్ర కాజాలదు. సుదృఢమైన సాంద్రతతో ఉండే వాస్తవిక కార్యాచరణ అందులో బైటపడదు.

విగ్రహాలు వాటి వేదికల మీది నుంచి కూలిపోతాయి. దేవతల కళ్ల ముందర సుగంధ ద్రవ్యాల పరిమళపు మేఘాలు చెల్లాచెదురై పోతాయి. మనిషికి భౌతిక వాస్తవికత గురించి స్ఫురణ కలుగుతుంది. సంఘటనల పరంపర వెనుక అసలు కారణమేమిటో రహస్యం మనిషికి తెలిసిపోతుంది. మానవజీవి తనను తాను తెలుసుకుంటుంది. తన వ్యక్తిగత సంకల్పం విలువేమిటో మనిషికి తెలిసి వస్తుంది. ఆవశ్యకతకు విధేయం కావడం ద్వారా, క్రమశిక్షణ గరపడం ద్వారా ఆ సంకల్పాన్ని మరింత శక్తిమంతం చేసుకోవచ్చునని మనిషికి తెలిసి వస్తుంది. చివరికి ఆ వ్యక్తిగత సంకల్పం ఆవశ్యకత మీద కూడ ప్రాబల్యం వహిస్తుంది. తన సొంత లక్ష్యాలతో మమేకమవుతుంది. మరి ఏ మనిషి తనను తాను తెలుసుకుంటారు? సాధారణంగా ఏ మనిషైనా అని కాదు. ఆవశ్యకత కాడి బరువు మోస్తున్న మనిషికి మాత్రమే ఆ అవకాశం ఉంది. ఈ చరిత్ర సారాంశం కోసం అన్వేషిస్తే, ఆ సారాంశాన్ని ఉత్పత్తి, వినిమయాల వ్యవస్థలలో, సంబంధాలలో గుర్తిస్తే, ఎవరైనా మానవ సమాజం ఎలా రెండు వర్గాలుగా చీలిపోయిందో గుర్తించక తప్పదు. ఉత్పత్తి సాధనాలను సొంతం చేసుకున్న వర్గం ఇప్పటికే తప్పనిసరిగా తానెవరో గుర్తించే ఉంది. తన శక్తి గురించీ, కర్తవ్యం గురించీ దానికొక చైతన్యం ఉంది. కాకపోతే అది గందరగోళ భరితమైనదీ, శకలాల రూపంలో ఉన్నదీ కావచ్చు. దానికి వ్యక్తిగత లక్ష్యాలున్నాయి, వాటిని సాధించడానికి ఉద్దేశపూర్వకంగా, వస్తుగతంగా సంఘటితమయ్యే సామర్థ్యం ఉంది. ఆ లక్ష్యసాధనా మార్గం ఆకలితో చిక్కిన శరీరాలతో, యుద్ధ రంగాలలోని మృత దేహాలతో నిర్మాణ మయ్యిందని దానికి లెక్కే లేదు.

వాస్తవ చారిత్రక మృత జీవులను సంఘటితం చేసే బాధ్యత తన మీద ఉందని మరొక వర్గం గుర్తించడం ఒక జ్ఞానోదయం వంటిది. ఆ గుర్తింపే కాపరి లేని పెద్ద మందను పద్ధతిలో పెట్టే సూత్రంగా మారుతుంది. ఆ క్రమంలో ఆ మంద స్వీయచైతన్యాన్ని పొందుతుంది. తనను తాను ఒక వర్గంగా స్థాపించుకునే ప్రయత్నంలో ఎంతటి కర్తవ్యం దాగి ఉన్నదో అది గ్రహిస్తుంది. తన వ్యక్తిగత లక్ష్యాలను సాధించడానికి అవసరమైన సాధనాలు సంపాదించే వరకూ, ఆ కోరికలు తన సంకల్పంగా మారే వరకూ తన లక్ష్యాలన్నీ ఉత్తి యథాలాపపు బోలుమాటలే, మితిమీరిన ఆకాంక్షలే అవుతాయని ఆ వర్గం చైతన్యం పొందుతుంది.

స్వచ్ఛంద వాదమా – ఆ మాటకు అర్థం లేదు. లేదా దాన్ని యథేచ్ఛా సంకల్పం అనే అర్థంలో వాడుతుండవచ్చు. కాని మార్క్సిస్టు అర్థంలో సంకల్పం అంటే లక్ష్యం గురించిన అవగాహన. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తన సొంత శక్తి గురించి ఖచ్చితమైన పరిజ్ఞానం, దాన్ని కార్యాచరణలో వ్యక్తీకరించే సాధనాల గురించి పరిజ్ఞానం. దాని అర్థమేమంటే, మొట్టమొదట, ఆ వర్గం నిర్దిష్టతను సంతరించుకుంటుంది. విశిష్టమైనదవుతుంది. తన ప్రత్యేక లక్ష్యాలు సాధించడానికి సుదృఢంగా సంఘటిత మవుతుంది. క్రమశిక్షణా యుతమవుతుంది. ఊగిసలాటలకు లోను కాకుండా, పక్కదారి పట్టకుండా ఉంటుంది. దాని అర్థం అది ఒక సుదూర మజిలీ దాకా నేరుగా సరళరేఖలో సాగిపోయే ప్రేరణగా ఉంటుంది. మధ్య దారిలో దారి పక్క పచ్చిక బయలులో అలుపు తీర్చుకోవడానికి ఆగడమో, ఆ పచ్చదనంతో మెత్తనయిన సుహృద్భావ సోదరులు అందించే పానీయం తాగడమో, గౌరవమూ ప్రేమా కలిసిన మృదు భాషణ వినడమో ఏవీ చేయకుండా సాగవలసి ఉంటుంది. కాని మార్క్సిస్టు అర్థంలో అనే మాట అర్థరహితం. ఆ మాటతో సందిగ్ధాలు రావచ్చు. మతి లేని మాటల జల్లు కురియవచ్చు. మార్క్సిస్టు, మార్క్సిస్టు అర్థంలో... వంటి మాటలు ఎందరెందరి చేతుల్లోనో చలామణీ అయి అరిగిపోయిన నాణాల్లా మారిపోయాయి.

మనకు కార్ల్ మార్క్స్ అంటే మానసిక, నైతిక జీవిత మార్గదర్శి. ఒక పంగలకర్ర పట్టుకున్న పశుల కాపరి కాదు. ఆయన మన మానసిక సోమరితనాన్ని వదిలించే ప్రేరకుడు. మన నిద్రాణమైన శక్తులను మేల్కొలిపి, మంచి పోరాటం కొరకు సిద్ధం చేసే వైతాళికుడు. శూన్యంలో, అమూర్తతల గురించి మాట్లాడకుండా ఉండడానికి అవసరమైన స్పష్టమైన భావాల నిజాయితీ, దృఢమైన సంస్కృతి సాధించడానికి ఎంత తీవ్రంగా, పట్టు వదలకుండా పని చేయాలో ఆయనే ఉదాహరణ. తెలుసుకోగలిగిన, ఆలోచించ గలిగిన ఏకశిలా సదృశ మానవమేధ ఆయన. మాట్లాడడానికి ఆయన నాలుక కోసం వెతుక్కోడు. అనుభూతి చెందడానికి ఆయన గుండె మీద చెయ్యి పెట్టుకోడు. కాని ఆయన వాస్తవికతా సారాంశాన్ని చుట్టు ముట్టి, దాన్ని అధీనం

☞ మిగతా 13వ పేజీలో


గ్రాంసీ స్వీయ రచనలు

# మార్క్స్ కాపిటల్‌కు భిన్నంగా రష్యా విప్లవం



బోల్షివిక్ విప్లవం ఇప్పుడు నిజంగా రష్యా ప్రజల విప్లవమైంది. జరుగుతున్న పరిణామాలు ఆగిపోయి భవిష్యత్ వైపు నడక నిలిచిపోరాదనే సంకల్పంతో బోల్షివిక్‌లు రెండు నెలల క్రితం వరకూ బూర్జువాలతో ఒప్పందానికి కూడా సిద్ధపడ్డారు. కానీ వాళ్లే ఇప్పుడు అధికారాన్ని కైవసం చేసుకుని శ్రామిక నియంతృత్వ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. విప్లవం ఇప్పటికే అసాధారణ ప్రయోజనాలను సాధించింది. సామ్యవాద చక్రంలో స్థిరపడడానికి అవసరమైన సంఘీభావాన్ని సృష్టించడానికీ, ముఖాముఖీ ఘర్షణలని నివారించడానికీ కృషి చేస్తోంది.

బోల్షివిక్ విప్లవంలో సిద్ధాంతాల కన్నా సంఘటనలే ప్రాముఖ్యత వహించాయి. (అందువల్ల అంతరార్థంలో మనం ఇప్పటి వరకూ తెలుసుకున్న దానికన్న ఎక్కువ తెలుసుకోవలసినదేమీ లేదు.) ఇది మార్క్స్ కాపిటల్‌కు భిన్నమైన విప్లవం. రష్యాలో మార్క్స్ కాపిటల్ బూర్జువాల పుస్తకమే గానీ, శ్రామికుల పుస్తకం కాదు. అది ఇట్లా జరుగుతుందని ముందుగా చెప్పబడిన పరిణామాలని అనుసరించడంలో విమర్శనాత్మక ఉదాహరణగా నిలిచింది. శ్రామికులు తమ వర్గ డిమాండ్లనూ, తమ తిరుగుబాటునీ , తమ విప్లవాన్నీ ఊహామాత్రంగానైనా గుర్తించక మునుపే, అది రష్యాలో పాశ్చాత్య నాగరికతను నెలకొల్పడం ద్వారా బూర్జువా వర్గం ఎట్లా అభివృద్ధి చెందాలో పెట్టుబడిదారీ వ్యవస్థకు తలుపులెట్లా తెరుచుకోవాలో తెలియచెప్పింది. అయితే సంఘటనలు సిద్ధాంతాలను అధిగమించాయి. చారిత్రక భౌతికవాద దృక్పథ సూత్రాల నుంచి విప్పార వలసిన రష్యా చరిత్రను ఈ సంఘటనలు పేల్చివేశాయి. బోల్షివిక్‌లు కార్ల్‌మార్క్స్‌ను తిరస్కరించారు. చారిత్రక భౌతికవాద సూత్రాలు అందరూ భావించి నంత లేదా విశ్వసించినంత వొంగనివి కావని వారి చర్యలూ విజయాలూ రుజువు చేస్తున్నాయి.




బోల్షివిక్‌లు కాపిటల్‌లో ఉన్న కొన్ని నిర్దేశాల్ని పక్కకు నెట్టారు. అయితే అందులో అంతర్లీనమై ఉన్న బలాన్ని వారు నిర్లక్ష్యం చేయలేదు. వాళ్లు మార్క్సిస్టులు కారు, అంతే ! వాళ్లు తమ ఉపాధ్యాయుడి సిద్ధాంతాలని ప్రశ్నించడానికి వీలులేని పిడివాదంగా మార్చడానికి సంకల్పించలేదు. వాళ్లు మార్క్సియన్ సిద్ధాంతాన్ని జీవించారు. ఏ సిద్ధాంతమైతే శాశ్వతమో, ఏ సిద్ధాంతమైతే జర్మన్ ఇటాలియన్ భావవాదానికి కొనసాగింపుగా వచ్చి మార్క్స్ ప్రత్యక్ష, స్వాభావిక వాదాల చేత పూత పూయబడిందో లేదా పెచ్చు కట్టిందో దాన్ని వారు లోపలికి తీసుకున్నారు. ఈ ఆలోచన ఎంతో బలియమైంది. కేవలం ఆర్థికాంశాలను కాదు. మనిషిని, చుట్టూ సమాజం ఉన్న మనిషిని, మరొకరితో సంబంధాలున్న మనిషిని , మనిషితోనే ఒప్పందాలు కుదుర్చుకునే మనిషిని చూశారు. వీటన్నిటి ద్వారా అతను ఒక నాగరికతను ఒక సామూహికతను ఒక సామాజిక ఇచ్ఛను సృష్టించడాన్ని చూశారు. అది ఆర్థిక వాస్తవాలను అర్థం చేసుకుని గుణదోష నిర్ధారణ చేసుకుని వాటిని చోదక శక్తిగా నిరపేక్ష సత్యంగా పొందుపరచుకునే సామాజిక ఇచ్ఛ. అది సజీవంగా కదులుతూ లావాలా ఉబుకుతూ ఎక్కడ ఎలా క్రమబద్ధీకరింపబడాలో అలా క్రమబద్ధీకరింపబడే సామాజిక ఇచ్ఛ.

మార్క్స్ ముందుకు చూడగలిగినంత మేర చూశాడు. కానీ యూరోపియన్ యుద్ధాన్ని (మొదటి ప్రపంచ యుద్ధాన్ని -అను) చూడలేకపోయాడు. లేదా ఆ యుద్ధం ఎంత కాలం ప్రభావం చూపగల శక్తి కలిగి ఉందో అంత కాలం చూపగలదని గుర్తించలేకపోయాడు. మూడు సంవత్సరాల వ్యవధిలో యుద్ధం సృష్టించగల – మాటల్లో చెప్పలేని వేదననీ, బాధలనూ అది రష్యాలో కలిగించిన సామూహిక ప్రజేచ్ఛనూ చూడలేకపోయాడు. సాధారణ పరిస్థితుల్లో అటువంటి సామూహిక చేతన కలగడానికీ వ్యాపించడానికి చాలా కాలం పడుతుంది. అందుకు విస్తృతంగా వర్గ అనుభవం అవసరమౌతుంది. మామూలుగా మనుషులు సోమరులుగా ఉంటారు. వాళ్లు మొదట బాహ్యంగా సంఘాలుగా సమితులుగా సమీకరింపబడాలి. తర్వాత అంతర్గతంగా తమ ఆలోచనలతో కాంక్షలతో నిరంతరాయంగా జ్వలించగలగాలి. ఈ బహిరంతర ప్రపంచాలు వొకదానినొకటి ఉద్దీపింప చేసుకోవాలి. అందువల్లనే 'సాధారణ పరిస్థితుల్లో' మార్క్సిస్టు చారిత్రక వాద సూత్ర విమర్శ – వాస్తవాలను గ్రహించి

వాటిని పట్టుకుని విశదీకరిస్తుంది. 'సాధారణ పరిస్థితుల్లో' పెట్టుబడిదారీ వ్యవస్థలోని రెండు వర్గాలు ముమ్మరమైన వర్గ సంఘర్షణ ద్వారా చరిత్రను సృష్టిస్తాయి. శ్రామిక వర్గం తన పేదరికం పట్ల నిరంతర అసౌకర్యాల పట్ల నిశితమైన దృక్పథం కలిగి జీవన ప్రమాణాలను మెరుగుపరచవలసినదిగా బూర్జువా వర్గం మీద వొత్తిడి తెస్తుంది. అది బూర్జువా వర్గంతో సంఘర్షణకు దిగి ఉత్పత్తి నైపుణ్యాలను పెంచి శ్రామిక వర్గ తక్షణ అవసరాలకు అనుగుణంగా వాటిని పొందుపరచవలసినదిగా బలవంతపెడుతుంది. ఫలితంగా అభివృద్ధిలో దుడుకుతనం ప్రవేశిస్తుంది. ఉత్పత్తిలో వేగం పెరుగుతుంది. ఆగకుండా జరిగే వస్తూత్పత్తి సమాజానికి కొంత మేలు చేస్తుంది. అయితే ఈ ఉధృతిలో అనేక మంది ప్రక్కకు నెట్టివేయబడతారు. వారి అవసరాలు నిర్లక్ష్యం చేయబడతాయి. ప్రజలు నిరంతర సంక్షోభంలో కూరుకుపోతారు. ఈ కల్లోల పరిస్థితుల్లో వారి ఆలోచనలు ఒక క్రమాన్ని వెదుక్కుంటాయి. వారు తమ శక్తి పట్ల, సామాజిక బాధ్యత పట్ల తమ భవిష్యత్తుకు తామే నిర్దేశకులుగా మారడం పట్ల ముందెన్నడూ లేని చైతన్యాన్ని పొందుతారు.

సాధారణంగా అయితే ఇట్లానే జరుగుతుంది. ఒక పద్ధతిగా సంఘటనలు పునరావృతం అయినపుడూ, ఇంచు మించు ఒక లాగానే దశలుగా చరిత్ర విప్పారుతున్నపుడు దాని ప్రాధాన్యత, విలువల్లో సంక్లిష్టత పెరిగినపుడు కూడా ఇట్లానే జరుగుతుంది. కానీ రష్యాలో యుద్ధం ప్రజల ఇచ్ఛని పరుగులు పెట్టించింది. మూడు సంవత్సరాలుగా గుది గుచ్చబడిన వారి బాధలు తెల్లారే సరికల్లా బలీయమైన శక్తిగా పరిణమించాయి. భీకర క్షామం ఆసన్నమై ఉంది. పొంచి ఉన్న ఆకలి ఎవరినైనా బలి తీసుకోవచ్చు. ఒక్క దెబ్బతో లక్షల్లో మట్టుబెట్టవచ్చు. ఈ నేపథ్యంలో తొలివిప్లవం (1905 విప్లవం – అను ) తర్వాత ఇప్పుడు మొదట యాంత్రికంగా తర్వాత చైతన్యంతో ప్రజలు ఒకటయ్యారు.

సామ్యవాద ప్రచారం రష్యాలో ప్రజల్ని ఇతర శ్రామిక వర్గ అనుభవంతో సంధానపరచింది. సామ్యవాద ప్రచారం హఠాత్తుగా నాటకీయంగా శ్రామిక వర్గ చరిత్రను ప్రాణవంతం చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సేవకత్వం నుంచి విముక్తి కోసం, మరో ప్రపంచ అవిష్కరణ కోసం ఒక నూతన చైతన్యాన్ని నిలపడానికి అది అనేక పోరాటాలు, ధారావాహిక ప్రయత్నాలూ చెయ్యవలసి వచ్చింది. ఈ సామ్యవాద ప్రచారమే రష్యా ప్రజల సంకల్పానికి రూపమిచ్చింది. వాళ్లెందుకు ఇంగ్లండ్ చరిత్ర పునరావృతమయ్యే వరకు వేచిచూడాలి ? అక్కడ జరిగినట్లు బూర్జువా వర్గం ఆవిర్భవించి, వర్గ సంఘర్షణ మొదలై, చూట్టూరా వర్గ చైతన్యం వ్యాపించి పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే విధ్వంసం వారిని తాకే వరకు ఎందుకు ఎదురు చూడాలి ? రష్యా ప్రజలు – వారిలో కొంత శాతమైనా ఈ అనుభవాన్ని తమ ఆలోచనల్లో చవిచూశారు. ప్రస్తుత సంఘటన వారి అనుభవాన్ని దాటిపోయింది. అది వారు పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పడం లో పాశ్చాత్య అనుభవాన్ని వాడుకున్నట్లే పాశ్చాత్య ప్రపంచంతో సమానంగా ఉత్పత్తి చేసే దశను వేగంగా చేరుకోవడానికి ఈ అనుభవం ఉపయోగపడుతుంది. పెట్టుబడిదారీ పరిభాషలోనైతే ఉత్తర అమెరికా ఇంగ్లండ్ కంటే అభివృద్ధి చెందింది. ఎందుకంటే ఉత్తర అమెరికాలోని ఆంగ్లో– సాక్షన్‌లు సుదీర్ఘ పరిణామం తర్వాత మాత్రమే ఇంగ్లండ్ చేరుకోగలిగిన స్థితిని ఒక్క సారిగా పొంది అక్కణ్నుంచి పైకి లేచారు. ఇప్పుడు సామ్యవాద సహిత విద్యను పొందిన రష్యా శ్రామిక వర్గం తమ చరిత్రను ప్రస్తుతం ఇంగ్లండ్ ఏ దశను చేరుకుని వుందో అక్కడి నుంచి ప్రారంభిస్తుంది. చిల్లర దశ నుంచి మొదలు కావలసినది వేరొక చోట సాధించిన పరిణతిని అందిపుచ్చుకుని మొదలౌతుంది. అందువల్ల మార్క్స్ ఆశించిన సామూహికత్వానికి అవసరమైన ఆర్థిక పరిపక్వతను అందుకుంటుంది. విప్లవకారులే తమ లక్ష్య సాధన సంపూర్ణం కావడానికి అవసరమైన పరిస్థితుల్ని సృష్టించుకుంటారు. పైగా వాటిని వారు పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే దానికన్నా వేగంగా రూపొందించుకుంటారు. బూర్జువా వ్యవస్థ చేత రూపొందించ బడిన సామ్యవాదులు దాని అపరిపక్వతనీ ఆర్థిక దుర్వ్యయ లక్షణాన్ని కలిగి ఉంటారనే విమర్శని ఇప్పుడు విప్లవకారులు అధిగమించడానికి అవకాశం ఏర్పడింది. అది ఇప్పుడు పేదరికంలో బాధలలో ఉన్న సామూహికతకు ప్రాధాన్యత నిస్తుంది. అదే బూర్జువా పరిపాలనైతే వాటిని వారసత్వంగా అంది పుచ్చుకుంటుంది. రష్యాలో సామూహికత్వాన్ని మించి పెట్టుబడిదారీ వ్యవస్థ వెంటనే చెయ్యగలిగేదేమీలేదు. నిజానికి ఈ రోజు అది తీవ్ర అసంతృప్తితో చెలరేగుతున్న శ్రామికవర్గాన్ని ఎదుర్కొంటూ ఇంతకంటే చాలా తక్కువ మాత్రమే చెయ్యగలుగు తుంది. కాబట్టి మానవీయ కోణం నుంచి ఇప్పుడు రష్యాలో సామ్యవాదాన్ని నిర్దిష్టంగా అంగీకరించవచ్చు. శాంతి తర్వాత చుట్టుముట్టబోయే సమస్యల్ని శ్రామికులు – పరిస్థితులన్నీ పూర్తిగా తమ అధీనంలోనే ఉన్నాయనీ, ప్రయత్నిస్తే తక్కువ వ్యవధిలోనే వాటిని తగ్గించగలుగుతామనీ భావించినపుడే ఎదుర్కొనగలుగుతారు.

ఒక దారుణ విధ్వంసానికి రష్యా ప్రజలు గురి కాకూడ దనుకునే ఎవరికైనా బోల్షివిక్‌లు అధికారం కైవసం చేసుకోవడం ఒక అనివార్య జీవావసరమనే భావన కలుగుతుంది. రష్యా ప్రజలు తమ పునరుజ్జీవనానికి అంతులేని శ్రమకు తమను తాము గురిచేసుకోవలసివస్తే అది ఆకలి తోడేలు కోరలలో చిక్కుకోవడం కన్నా తక్కువ బాధనే కలిగిస్తుందనీ, శవాలను చింపుకుని పీక్కుతినే అనాగరిక పశువుల మధ్యకు విసరివేయబడడం కన్న మేలైనదేననీ గుర్తించాలి. *(అవాంతీ!, 24, డిసెంబరు 1917)* ❑

గ్రాంసీ స్వీయ రచనలు

# నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం



నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం! బతికి వుండడమంటే, అటోఇటో నిలబడడమేనన్నది నా నమ్మకం. నిజంగా సజీవులుగా వున్నవాళ్ళు పౌరులుగానూ, పక్షపాతులుగా ఉండక తప్పదన్నది నా మరో విశ్వాసం. నిర్లిప్తత, నిరాసక్తత అనేవి - పరాన్నభుక్కులుగానూ, పెడబుద్ధులుగానూ మనుగడ సాగించడమే తప్ప జీవలక్షణాలు కావు! అందుకే, నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం!!

నిర్లిప్తత అనేది చరిత్ర మెడలో వేలాడే గుదిబండ! అది చరిత్రను బలంగా కుంగదీస్తుంది. చాలా మెల్లిగా పని చేస్తుంది కానీ, నిరంతరాయంగా పని చేస్తూనే వుంటుంది! నిర్లిప్తత నమ్మడానికి వీల్లేని దుర్విధి లాంటిది. మన కార్యక్రమ ప్రణాళికను నాశనం చేస్తుంది; లోతుగా ఆలోచించి రూపొందించిన పథకాలను తలకిందులు చేస్తుంది. మన మేధస్సును శిథిలం చేసే పదార్థం నిర్లిప్తత. మనందరికీ దాపురించే కీడు వాస్తవరూపం తీసుకోవడానికి మూలకారణమేమిటంటే, జనసమూహాలు పట్టుదల వదిలిపెట్టి నిర్లిప్తులుగా వ్యవహరించడమే! మొదట్లోనే తిరగబడి వుంటే, ఉప్పున ఎగిరి పోయే శాసనాలు, చట్టసభల్లో ఆమోదం పొంది ఏకు మేకవడానికి అవకాశమిచ్చేది ఈ నిర్లిప్తతే! నియంతల నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి పెద్ద ఎత్తున సైనిక పితూరీ లేవదీస్తే తప్ప గత్యంతరం లేని పరిస్థితిని తెచ్చిపెట్టేది కూడా ఈ నిర్లిప్తతే!

జనం నిర్లక్ష్యం వల్ల దేన్నీ పట్టించుకోరు. అటు తర్వాత దుర్విధి ఫలితంగా, అన్నింటినీ - అందరినీ అదే విధి అణగదొక్కుకుంటూ పోయినట్లు అనిపిస్తుంది. జరిగిపోతున్న దాన్ని ఆమోదించినవాడికీ అదే గతి - ఎదురొడ్డి నిలబడిన వాడికీ అదే గతి పడుతుంది! తెలిసినవాడికీ అదేగతి - తెలియనివాడికీ అదే గతి; క్రియాశీలకంగా వ్యవహరించేవాడికీ అదే గతి- ఉదాసీనుడికీ అదే గతి పడుతుంది! కొందరు దీనంగా గొణుక్కుంటారు, మరి కొందరు బూతుల పంచాంగం విప్పి తిట్టుకుంటారు.

కానీ, ఒకరో ఇద్దరో తప్పిస్తే ఏ ఒక్కరూ "నా బుద్ధికి తోచిన విధంగా నేను గట్టిగా నిలబడి వుంటే ఇది ఇలా జరిగి వుండేదా?" అని ప్రశ్నించుకోరు. అందుకు కూడా నాకు ఈ నిర్లిప్తులంటే తగని అసహ్యం!

ఈ హద్దుమాలిన అమాయకుల గొణుగుడు నన్నెంతో బాధపెడుతుంది- నిజమే! కానీ, వాళ్ళలో ప్రతి ఒక్కరినీ జరిగిన దానికి బాధ్యులుగానే పరిగణిస్తాను. ప్రతి రోజూ, జీవితం తమ ముందు నిలబెట్టిన కర్తవ్యాన్ని ఈ అమాయక చక్రవర్తులు ఎలా నిర్వర్తించారు? వాళ్ళేం చేశారు?? ముఖ్యంగా, ఏం చెయ్యకుండా నిష్క్రియాపరులుగా నిలుచుండిపోయారు?? దానికి వాళ్ళదే బాధ్యత అంటాను! నా కరుణనూ, వెచ్చని నా కన్నీటినీ అనర్హులపై ఖర్చు పెట్టకుండా, ఈ విషయంలో నిక్కచ్చిగా నిలబడే అధికారం నాకుందనే నేను నమ్ముతున్నాను. నేను పక్షపాతిని, సజీవుణ్ణి!! మా పక్షాన ఉన్న వాళ్లు తమ అంతరాంతరాల్లో నిర్మించనున్న భవిష్యత్ మహానగరం తాలూకు జీవనాడీ స్పందనలను నేను గ్రహించగలుగుతున్నాను. ఆ మహానగరంలో సామాజిక సంబంధాలను ఏ కొద్దిమంది భుజాల పైనో వదిలెయ్యడం జరగదు! అక్కడ ఏదీ, కేవలం అదృష్టం కారణంగానో, దురదృష్టం ఫలితంగానో సంభవించదు!! ప్రతి ఒక్క పరిణామమూ తెలివయిన పౌరుల చైతన్యవంతమయిన కార్యాచరణ ఫలితంగానే జరుగుతుంది. ఆ మహానగరంలో ఏ ఒక్కరూ, ఎవరో కొద్దిమంది ప్రదర్శించే త్యాగశీలత- కొందరి కాయకష్టం లాంటి దొడ్డిదారుల వంక చూడరు!! నేను సజీవుణ్ణి, పక్షపాతిని!!

అందుకే, అటో ఇటో నిలబడలేనివాళ్ళను అసహ్యించుకుంటాను - నిర్లిప్తులంటే నిలువెల్లా అసహ్యం నాకు!!

వాస్తవానికి చరిత్రలో అనేక పరిణామాల వెనుక ఉండిన మూలకారకం ఈ నిర్లిప్తతే! అయితే, సానుకూలమయిన అర్థంలో కాదు సుమా! ప్రతి ఒక్కరి పాలబడిన కీడుకు గానీ, అసాధారణ సాహసకృత్యం ఫలితంగా సంభవించిన మేలుకు గానీ, క్రియాశీలులయిన కొద్దిమంది చూపించిన చొరవ కారణం కాదు! అంతకు మించి, అత్యధికులు ప్రదర్శించిన నిర్లిప్తత, నిష్కారణంగా కర్తవ్య పాలనకు దూరంగా నిలబడిపోవడమే ఈ పరిణామాలకు ఎక్కువ కారణం.

చరిత్రలో జరిగిపోయిన పరిణామాలు కొద్దిమంది కోరుకున్నందు వల్ల సంభవించలేదు. అత్యధిక సంఖ్యాకులు నిష్క్రియాపరులు కావడం వల్లనో, జరిగేదాన్ని జరగనివ్వడం వల్లనో మాత్రమే ఈ సంఘటనలు జరిగాయి. చిక్కుముడులు,

పీటముడులు బిగిసిపోనివ్వడాన్ని వాళ్ళు అనుమతిస్తూ పోయారు; ఫలితంగా, దరిమిలా కత్తులో కత్తెరలో ఉపయోగిస్తే తప్ప వాటిని కత్తిరించడం సాధ్యంకాని పరిస్థితి ఎదురయింది. ఈ నిర్లిప్తులు, పెత్తనం చేజిక్కించుకునేందుకు కొందరిని అనుమతించారు – ఇప్పుడు సైనిక పితూరీ ద్వారా మాత్రమే వారిని పదవీభ్రష్టులు చెయ్యడం సాధ్యమయ్యే పరిస్థితి ఏర్పడింది! చరిత్రలో కొట్టొచ్చినట్లు కనిపించే ఘోరమయిన నష్టాలన్నీ ఈ నిర్లిప్తతా, నిష్క్రియాపరత్వాల పర్యవసానంగా జరిగినవే. చీకటిమాటున, తెరచాటు వ్యవహారాలెన్నో జరిగిపోయాయి; సమష్టి జీవన రంగాన్ని నిర్ణయిస్తున్న శక్తులెవరనే విషయమే ఎవరికీ పట్టకుండా పోయింది; చివరికి, అసలేం జరిగిపోయిందో జనానికి తెలియకుండానే అంత – అయిపోయింది!

తదనంతర కాలంలో, జరిగిన కుట్రలన్నీ వెలుగులోకి వచ్చాయి. చీకటిమాటున మొదలుపెట్టిన సాలెగూటి అల్లకం నెమ్మదిగా పూర్తయింది! ప్రతి ఒక్క రంగాన్నీ, ప్రతి ఒక్క వ్యక్తినీ ప్రమాదం కమ్ముకుపోయింది. చివరికి తీవ్రమయిన ప్రకృతి వైపరీత్యంగా – ఓ అగ్నిపర్వతం బద్దలవడమో, ఓ భూకంపమో మాదిరిగా మిగిలిపోయింది చరిత్ర. మనమందరం ఆ వైపరీత్య బాధితులుగా మిగిలాం!! ఈ పరిణామం సంభవించాలని కోరుకున్న వాళ్ళూ వద్దని వాంఛించినవాళ్ళూ ఇది ఇలా జరుగుతుందని తెలిసిన వాళ్ళు ఆ జాడే అంతుబట్టనివాళ్ళూ క్రియాశీలులూ, నిర్లిప్తులూ అందరూ బాధితులే ఇవాళ! అంతా అయిపోయిన తర్వాత, ఈ నిర్లిప్తులకు పౌరుషం పొడుచుకొస్తోందిప్పుడు– జరిగిపోయిన పరిణామాల తాలూకు పర్యవసానాలతో తమకే సంబంధం లేదని వాళ్ళంటున్నారు; ఈ పరిణామాలు ఇలా సంభవించాలని తాము కోరుకోలేదంటున్నారు; అంచేత, జరిగినదానికి తాము బాధ్యులం కామనీ అంటున్నారు.

వాళ్ళలో కొందరు దీనంగా గొణుక్కుంటారు, మరి కొందరు బూతుల దండకాలు విడేస్తారు. కొద్ది మందైనా, " నా కర్తవ్యం నేను నిర్వర్తించి వుంటే, నా గొంతు స్పష్టంగా వినిపించాలనుకుని వుంటే, నేను ఏం చెయ్యాలనుకున్నానో అదే చేసి వుంటే ఇలా జరిగి వుండేదా??" అనే ప్రశ్న వేసుకుని వుండరు! తమ నిర్లిప్తతే, తమ అవిశ్వాసమే, ఈ దుష్పరిణామాలను నిరోధించేందుకు, మంచిని సాధించేందుకు పోరాడుతున్న ఆర్థిక–రాజకీయ బృందాలకు నైతిక, భౌతిక మద్దతు ప్రకటించడంలో తాము విఫలం కావడమే తమ లోపమని ఒకరయినా భావించి వుండరు! పైపెచ్చు. ఇలాంటి వ్యక్తులు ఫలానా భావన విఫలం చెందడం గురించీ, ఫలానా కార్యక్రమ ప్రణాళిక విఫలం కావడం గురించి మాట్లాడాలని చూస్తారు. తమ నిర్లిప్తతనూ, విశ్వాసరాహిత్యాన్ని కొనసాగిస్తారు!! (1916, ఆగస్ట్) ❑

---

## మన మార్క్స్

**(9వ పేజీ తరువాయి)**

చేసుకోగలిగిన ఉక్కు తర్కపు వాదనలను తయారుచేశాడు. ఆ తర్కం ప్రజల మనసులో చొరబడుతుంది. ఆ మనసుల్లో పేరుకుపోయి ఉన్న దురభిప్రాయాల, స్థిరాభిప్రాయాల మేటలను కూల్చివేస్తుంది. నైతిక స్వభావాన్ని బలోపేతం చేస్తుంది.

మనకు కార్ల్ మార్క్స్ అంటే కూనిరాగాలతో ఏడుస్తున్న శిశువు కాదు. పూజారులను బెదరగొట్టే గడ్డపు మనిషి కాదు. ఆయన జీవిత చరిత్రలోని అనేక గాథలలో ఏ ఒక్క దానికీ చెందినవాడు కాదాయన. బైటికి కనబడే ఆ మానవ జంతువుకు చెందిన ఎంత ప్రతిభా లేదా ఎంత మొరటుదనమూ ఆయనవి కావు. ఆయన ఒక విశాల గంభీరమైన ఆలోచనాత్మక మేధ. తన అస్తిత్వమేమిటో, తన పర్యవసానమేమిటో, తానేమిటో ఏమి కానున్నదో అనే చైతన్యాన్ని గ్రహించడానికి మానవజాతి వందల సంవత్సరాలుగా సాగిస్తున్న ఉద్వేగపూరిత అన్వేషణలో ఒకానొక వ్యక్తిగత సందర్భం ఆయన. నిగూఢమైన చరిత్ర లయను గ్రహించడానికి, ఆ గుట్టు విప్పి చెప్పడానికి, తన ఆలోచనలో మరింత శక్తిమంతంగా ఉండడానికి, మరింత మెరుగ్గా ఆచరణ సాగించడానికి మానవ జాతి చేస్తున్న అన్వేషణలో ఒక సందర్భం ఆయన.

ఆయన ఒక మనసులో ఒక అత్యవసరమైన, అంతర్గర్భితమైన భాగం. ఆయననేవాడు జీవించి ఉండకపోతే, ఆలోచించి ఉండకపోతే, తన ఉద్వేగాలకూ భావాలకూ మధ్య, అనుభవించిన కడగండ్లకూ పెట్టుకున్న ఆదర్శాలకూ మధ్య రాపిడిలో నిప్పురవ్వలు రగిలించి వెలుగులు వెదజల్లి ఉండకపోతే మన మానసిక స్ఫూర్తే ఉండేది కాదు.

శతజయంతి సందర్భంగా కార్ల్‌మార్క్స్‌ను కీర్తించడంలో అంతర్జాతీయ కార్మికవర్గం తనను తాను కీర్తించుకుంటున్నది. తన చైతన్య పూర్వకమైన శక్తినీ, తన విజయావేశపు భావోద్వేగాన్ని కీర్తించుకుంటున్నది. ఆ విజయం ఆధిపత్యవర్గాల పాలనను కూలదోస్తుంది. తన ప్రయత్నాలకూ, త్యాగాలకూ శిఖరామానమైన అంతిమ పోరాటానికి సన్నద్ధం చేస్తుంది. ❑

**– వీక్షణం మాసపత్రిక సౌజన్యంతో...**

గ్రాంసీ స్వీయ రచనలు


# బూర్జువా వార్తాపత్రికలు కార్మికవర్గానికి శత్రువులు



“ఇవి వార్తాపత్రికల సర్క్యులేషన్ పెంచటం కోసం క్యాంపెయిన్ జరుగుతున్న రోజులు. బూర్జువా వార్తాపత్రికల యజమానులు, నిర్వాహకులు దారిన పోయేవారిని (అంటే పాఠకులను ఆకర్షించే విధంగా తమ షాపులలో పత్రికను ప్రదర్శించే కిటికీలకు వార్నిష్ రాసి, చక్కగా అలంకరిస్తారు. ప్రతిరోజూ ఉదయం లేక సాయంత్రం నాలుగు, ఆరు పేజీలతో వార్తాపత్రికలు వస్తాయి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను వార్తాపత్రికల యజమానులు, నిర్వాహకుల ప్రయోజనాలకు అనుకూలంగా వ్యాఖ్యానిస్తాయి. వాటిని పాఠకుల మెదళ్ళలోకి ఎక్కించి, వారి ప్రయోజనాలకు అనుగుణంగా అర్థం చేసుకొని, వ్యాఖ్యానింపజేసే విధంగా ఉంటాయి.

మీరు చందాదారులుగా చేరే వార్తాపత్రికను ఎంచుకోవటం గురించి, మీరు అమాయకంగా చేసే ఈ పని ఎంత ముఖ్యమైనదో, ఎంత ప్రాధాన్యత కలదో మీతో, కార్మికులతో ప్రత్యేకంగా చర్చించాల్సి ఉంది. మిమ్మల్ని ఉచ్చులోకి, ప్రమాదంలోకి లాగే పరిస్థితులలో చైతన్యవంతంగా, పరిణితితో యోచించి, తగిన కొలబద్దను వినియోగించి పత్రికను ఎంపిక చేసుకోవాలి.

“ఏ విషయంలో అయినా పెట్టుబడిదారీ పత్రికలతో ఏకాభిప్రాయంతో ఉండటాన్ని కార్మికులు తక్షణమే విడనాడాలి. పెట్టుబడిదారీ వర్గపు వార్తాపత్రికలు (అవి వారిలో ఏ తరగతికి చెందినవైనప్పటికీ) తన ప్రయోజనాలకు, భావాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించే సాధనాలని అతడు ఎల్లప్పుడు, ఎల్లప్పుడు, ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. పత్రికలో ప్రచురించే ప్రతి విషయం ఒకే అభిప్రాయం తో ప్రభావితమై ఉంటుంది. ఆధిపత్యంలో ఉన్న వర్గానికి అనివార్యంగా సేవ చేసేలా, దాన్ని వాస్తవంలోకి మార్చి కార్మికవర్గంతో పోరాటం చేసేలా ఉంటాయి. వాస్తవంగా పెట్టుబడిదారీ పత్రికలలో మొదటి వాక్యం నుండి చివరి వాక్యం వరకు ఈ లక్ష్యాలను నెరవేర్చే విధంగానే ఉంటాయి.




వందలు, వేలాది మంది కార్మికులు ప్రతిరోజూ, క్రమబద్ధంగా తమ ధనాన్ని బూర్జువా పత్రికలకు ఇస్తూ వాటి శక్తిని పెంచుకోవటానికి తోడ్పాటునందిస్తున్నారు. ఎందుకు? తన ముందు బూర్జువా వార్తాపత్రికను పెట్టుకొని రోడ్డు మీదనో, ట్రామ్ లోనే ప్రయాణం చేస్తున్న వారిని దీనిని గురించి మీరు అడిగితే “ఏం జరుగుతున్నదో తెలుసుకోవటానికి నాకు అవసరం” అని చెబుతాడు. అందులోని వార్తలు విషయాలను కళాత్మకంగా మలిచి, అతని ఆలోచనలను, మేధను తమకు కావలసిన వైపుకు మలచుకోవటానికి ఉద్దేశించినవనే విషయం ఎప్పటికీ అతని బుర్రలోకి ప్రవేశించదు. ఈ వార్తాపత్రిక అవకాశవాదంతో ఉన్నదని, ఒకటి ధనికుల కోసమని, మూడు, నాలుగు, ఐదు తన ప్రయోజనాలకు పూర్తి విరుద్ధమైన బూర్జువా రాజకీయ పార్టీలతో లంకె వేసుకొని ఉన్నాయని అతను తెలుసుకోవలసి ఉంది.

“పెట్టుబడిదారీ వార్తాపత్రికలు చిన్న విషయాలను కూడా పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా, కార్మిక వర్గానికి, వారి రాజకీయాలకు వ్యతిరేకంగా చెప్పటాన్ని ప్రతి కార్మికుడు, ప్రతిరోజూ వ్యక్తిగతంగా చూస్తున్నాడు. ఒక సమ్మె ప్రారంభమైతే ఏం జరుగుతుంది? పెట్టుబడిదారీ వార్తాపత్రికలకు సంబంధించి నంత వరకు కార్మికులు ఎల్లప్పుడూ తప్పుడు దారిలోనే ఉంటారు. ఒక ప్రదర్శన జరిగితే ఏమౌతుంది? ప్రదర్శనలో పాల్గొన్నవాళ్ళు తప్పుడు దారిలో ఉన్నారని ఎప్పుడూ చెబుతారు. కేవలం వారు కార్మికులు కాబట్టి తల పొగరు కలవారని, గొడవలు సృష్టించే వాళ్ళని, గూండాలని ప్రచారం చేస్తాయి. ప్రభుత్వం ఒక చట్టం చేస్తే ఏమి చెబుతాయి? ఆ చట్టం న్యాయమైనది, ఉపయోగ కరమైనది కాకపోయినా అది మంచిదని, న్యాయమైనదని, ఉపయోగకరమైనదని చెబుతాయి. ఎన్నికలు రాజకీయ, అధికార పోరాటం జరుగుతుంటే ఏమి చెబుతాయి? అన్నింటికన్నా మంచి కార్యక్రమం, అందరి కన్నా మంచివారు బూర్జువా పార్టీల అభ్యర్థులేనని చెబుతాయి.

కార్మికులను దారి తప్పించటానికి బూర్జువా వార్తాపత్రికలు మౌనంగా ఉండే, వక్రీకరించే అసత్యాలను సత్యాలుగా చెబుతూ వారిని అజ్ఞానంలో ఉంచటానికి చెప్పే అన్ని

☞ మిగతా 16వ పేజీలో




# గ్రామ్ సీ : ఆందోళన - ప్రచారం

గ్రాంసీ స్వీయ రచనలు

ఇటాలియన్ పునరుజ్జీవన ఉద్యమం – రిసార్జిమెంటో– తర్వాతి కాలంలో, ఈ దేశపు రాజకీయ పార్టీల ఆందోళన–ప్రచార కార్యకలాపాల మధ్య తూకం తప్పిందనిపిస్తుంది. ఈ సామాన్య సూత్రానికి ఇటాలియన్ నేషనలిస్ట్ పార్టీని మినహాయింపుగా చెప్పొచ్చు. సూత్రబద్ధంకాని రాజకీయ ఆచరణ, అవకాశవాద ధోరణి, సహజ–సజీవ కార్యాచరణ కొనసాగక పోవడం, ఎత్తుగడలకూ–వ్యూహానికీ మధ్య తూకం తప్పడం లాంటివి ఈ పరిణామానికి కారణాలనలేం. చిత్తడిచిత్తడిగా మారిపోయిన దేశ సామాజికార్థిక వ్యవస్థలో వివిధ ఆర్థిక వర్గాలు కరిగిపోవడం ఈ పార్టీలు ఇలా వుండడానికి ప్రధాన కారణం. ఈ వివరణ ఏదో కర్మసిద్ధాంతంలా కనిపించవచ్చు. రాజకీయ పార్టీలు నిర్దిష్ట వర్గాలకు ప్రతినిధులనే మాట ఎంత నిజమో, ఆయా పార్టీలు ఆయా వర్గాల తాలూకు నిష్క్రియాశీల మయిన, కేవల యాంత్రిక ప్రతినిధులు కావనే మాట కూడా అంతే నిజం. రాజకీయ పార్టీలు తాము ప్రాతినిధ్యం వహించే వర్గాలను పటిష్టపరచి, సార్వజనిక నిర్మాణాలుగా రూపొందించే దిశగా క్రియాశీలకంగా ప్రభావితం చేస్తాయి కూడా. ఇటలీలో జరగనిది అక్షరాలా ఇదే! అలా జరగకపోవడం పర్యవసానంగానే, ఆయా పార్టీల ఆందోళన–ప్రచార కార్యకలాపాల మధ్య తూకం తప్పడమనే లోపం ఏర్పడింది. ఈ పరిణామాన్ని లోపం అనకపోతే ఏమంటారు ఎవరయినా?

ఇలాంటి పరిస్థితి తలెత్తడంలో, రాజ్యానికి లేదా ప్రభుత్వానికి నిర్దిష్ట పాత్ర ఉంది. ప్రభుత్వం బలపడకుండా చూడడంలోనూ, అది జాతికంతటికీ సొంతమయిన విషయం కాదని రుజువు చేయడంలోనూ రాజ్యానికి కచ్చితమయిన పాత్ర వుంది!




గ్రాంసీ స్వీయ రాతప్రతులు

వాస్తవానికి, ఈ క్రమంలో రాజ్యం ఒకానొక కారకంగానూ ప్రేరకంగానూ మాత్రమే వ్యవహరించింది. రాజకీయపార్టీలకు అతీతంగా తనను తాను నిలబెట్టుకుంది రాజ్యం. ఒకానొక శాశ్వత చట్రంలో భాగంగా వుండే ఆయా పార్టీల ప్రయోజనాలూ కార్యకలాపాల మధ్య సయోధ్య నెలకొల్పడానికి అది అలా చెయ్యలేదు– వాటి మధ్య విభేదాలు తలెత్తే రీతిలో రాజ్యం అలా వ్యవహరించింది. ఆయా పార్టీలు విస్తృత జనశ్రేణులకు దూరమయ్యేలా చేసేందుకే అలా వ్యవహరించింది. "పార్టీలతో సంబంధం లేని వ్యక్తులను కలుపుకుని, బోనపార్టిస్ట్–సీజరిస్ట్ తరహా పెత్తందారీ పెదరాయుడిలా వ్యవహరించే శక్తిగా ఆవిర్భవించేందుకే" ప్రభుత్వం అలా ప్రవర్తించింది. డిప్రెటిస్, క్రిస్పీ, గియోలిట్టీ* తదితరుల నియంతృత్వాల వ్యవహార సరళినీ, వారు అనుసరించిన రాజ్యాంగ సంస్కరణవాదం –ట్రాన్స్‌ఫార్మిజ్మో– అనే పరిణామాన్నీ అచ్చం ఇలాగే విశ్లేషించ వలసి వుంటుంది.

వర్గాలే పార్టీలకు జన్మనిస్తాయనే మాట నిజమే. రాజ్యం యొక్క, ప్రభుత్వం యొక్క భాగస్వాములకు మాత్రం పార్టీలు జన్మనిస్తాయి. పౌర–రాజకీయ సమాజాల నేతలను కూడా ఈ పార్టీలే మలుస్తాయి. ఈ వ్యవస్థల మధ్యా వాటి విధుల మధ్యా సఫలమయిన, సార్థకమయిన సంబంధాలుండాలి. రాజకీయ పార్టీలు సిద్ధాంతపరమయిన కృషి చెయ్యని పక్షంలో నాయకులను తీర్చిదిద్దే క్రమం సాగదు. ఆయా పార్టీలు ఏయే వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయో వాటి ప్రవృత్తికి సంబంధించిన కారణాలను ఆవిష్కరించి, అధ్యయనం చేసే లక్ష్యంతో పద్ధతి ప్రకారం కృషి జరగకపోతే నాయకులను తీర్చిదిద్దడం సాధ్యం కాదు. ఈ పరిణామం, రాజ్య విధులు – ప్రభుత్వ బాధ్యతలు నిర్వహించగల వ్యక్తుల కొరతకు దారితీస్తుంది. పార్లమెంటరీ వ్యవహారవేత్తల దారిద్ర్యానికి దారితీస్తుంది. పార్టీల మనుగడకు తప్పనిసరిగా అవసరమయ్యే, కొద్దిమంది వ్యక్తులు అవినీతికి పాల్పడేందుకూ, తద్వారా పార్టీలను కబ్జా చేసుకోడానికీ, పర్యవసానంగా ఆయా పార్టీలు ముక్కలుచెక్కలయిపోవడానికి మార్గం సుగమమవుతుంది! అది, జాతి సాంస్కృతిక జీవితం దరిద్రంగా తయారయ్యేందుకు దారి తీస్తుంది. ఉత్కృష్ట సాంస్కృతిక ప్రమాణాలు కనుమరుగయ్యే నికృష్ట పరిస్థితి ఏర్పడుతుంది. రాజకీయచరిత్ర స్థానంలో జీవం లేని పాండిత్య ప్రకర్ష స్థిరపడ్డానికీ– మతం స్థానంలో మూఢవిశ్వాసం స్థిరపడ్డానికీ – ఉత్తమ గ్రంథాలనూ, గొప్ప సమీక్షల స్థానంలో దినపత్రికలు

స్థిరపడ్డానికీ– సీరియస్ రాజకీయాల స్థానంలో చిల్లర తగాదాలూ వ్యక్తిగత సిగపట్లూ స్థిరపడ్డానికి ఈ పరిణామం దారితీస్తుంది. విశ్వవిద్యాలయాల్లో, మేధావులనూ సాంకేతిక నిపుణులనూ తీర్చిదిద్దే సంస్థల్లో రాజకీయ పార్టీల జీవనసరళి తాలూకు ప్రభావం వ్యాప్తి చెందజాలవు; జాతీయ జీవన వాస్తవాలు ప్రతిఫలించ జాలవు. ఫలితంగా, దారుణాలు జరిగిపోతాయి. ఈ ఉన్నత విద్యాలయాలు రాజకీయ వాసనే లేని జాతీయ కార్యకర్తలను ఉత్పత్తిచేస్తాయి; వాళ్ళలో ఊకదంపుడు ఉపన్యాస ధోరణినీ, జాతీయేతర మానసికతనూ నింపి పెడతాయి. పర్యవసానంగా అధికార వర్గం దేశానికి దూరమయిపోతుంది; పాలనాపరమయిన అధికారాల ద్వారా, ఈ అధికారవర్గమే సిసలయిన రాజకీయ పార్టీ అవతారమెత్తుతుంది! అన్నింటికన్నా ఘోరమయిన విషయమేమిటంటే, రాజకీయ–మేధోపరమయిన సోపానం స్థానంలో అధికారవర్గంలోని నిచ్చెన మెట్ల వ్యవస్థ వచ్చి చతికిలబడుతుంది! పర్యవసానంగా, అధికారవర్గమే, రాజ్యాధికార పక్షంగా – బోనపార్టిస్ట్ పార్టీగా అవతరిస్తుంది!!**


Primo quaderno (8 febbraio 1929)

Note e appunti.

Argomenti principali: –

1) Teoria della storia e della storiografia.
2) Sviluppo della borghesia italiana fino al 1870.
3) Formazione dei gruppi intellettuali italiani: svolgimento, atteggiamenti.
4) La letteratura popolare dei « romanzi d'appendice » e le ragioni della sua persistente fortuna.
5) Cavalcante Cavalcanti: la sua posizione nella struttura e nell'arte della Divina Commedia.
6) Origini e svolgimento dell'Azione Cattolica in Italia e in Europa.
7) Il concetto di folklore.
8) Esperienze della vita in carcere.
9) La « quistione meridionale » e la quistione delle isole.
10) Osservazioni sulla popolazione italiana: sua composizione, funzione dell'emigrazione.
11) Americanismo e fordismo.
12) La quistione della lingua in Italia: Manzoni e G. I. Ascoli.

తొలి స్వీయ రాతప్రతి

*ఇక్కడ గ్రామ్‌సీ ప్రస్తావిస్తున్న ముగ్గురు నేతలు 19–20 శతాబ్దాల్లోని ఇటలీ పాలకులు. ఆగస్తినో డిప్రెటిస్(1813–87) పదతొండేళ్ళపాటు –ఆమరణాంతం– ఇటలీని ఏలుకున్నాడు. ఫ్రాన్సెస్కో క్రిస్పీ (1818–1901) మాజినీ, గాలీబాల్టీలకు సన్నిహిత మిత్రుడు. ఆరేళ్ల పాటు ఇటలీ ప్రధానిగా ఉండిన క్రిస్పీ మొదట్లో ఉదారవాది, అధికారం చేతికొచ్చాకా, పెత్తందారుగా వ్యవహరించాడు. ఇక, 1892–1921 సంవత్సరాల మధ్య కాలంలో అయిదుసార్లు ఇటలీకి ప్రధానమంత్రిగా వుండిన గియోవాన్నీ గియోలిట్టీ (1842–1928) పేరుకు వామపక్షీయు డయినా పేరుమోసిన పెత్తందారు; పార్లమెంటరీ నియత! వీళ్ళు ముగ్గురూ ప్రవేశపెట్టి అనుసరించిన ట్రాన్స్‌ఫార్మిజ్మో” అనే పరిణామం గురించి వివరించుకుంటే తప్ప గ్రామ్‌సీ చెప్పేది అర్థం కాదు. ఇటలీ పార్లమెంటు వ్యవహారసరళికి సంబంధించిన రాజ్యాంగపరమయిన ఒప్పందం ఒకటి 1861లో సభ ఆమోదం పొందింది. జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలపై విధాన నిర్ణయాలు తీసుకునే క్రమంలో ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రులు పరస్పరం సంప్రదించుకుని నిర్ణయం చేసేయవచ్చని ఈ ఒప్పందం చెప్పింది. ఫలితంగా, జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాల పై విధాన నిర్ణయాలు తీసుకునే క్రమం నుంచి ప్రభుత్వాలు పార్లమెంటును తప్పించగలిగాయి. అది ఎన్నో వివాదాస్పదమయిన నిర్ణయాలు చేసేందుకు అవకాశమిచ్చింది. అన్నిటికీ మించి, విధాన నిర్ణయ క్రమంలో రాజకీయ పార్టీలకు స్థానం లేకుండా పోయింది.

** “ప్రష్యా రాజు”, జెర్మనీ చక్రవర్తి అయిన రెండో విల్ హెల్మ్‌నే కైజర్ అనీ అంటారు. 1888 నుంచి 1918 వరకూ జెర్మనీని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన ఈ కైజర్ బలవంతంగా పదవీ త్యాగం' చేయవలసి వచ్చింది. ఆ పరిణామాల గురించి 1919 తర్వాత, అంటే మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో వెలువడిన పుస్తకాలు – ఉదాహరణకు మ్యాక్స్ వెబెర్ రాసిన “పార్లమెంట్ అండ్ గవర్న్‌మెంట్ ఇన్ జెర్మనీస్ న్యూ ఆర్డర్ : ఎ పొలిటికల్ క్రిటిక్ ఆఫ్ బ్యూరాక్రసీ అండ్ పార్టీ లైఫ్” – చదివితే ఇక్కడ గ్రామ్‌సీ వివరించిన పరిణామాల గురించి మరింత స్పష్టత ఏర్పడుతుంది. ❑

## బూర్జువా వార్తాపత్రికలు కార్మికవర్గానికి శత్రువులు

(14వ పేజీ తరువాయి)

విషయాలకు సంబంధించిన వాస్తవాలను గురించి మనం కనీసం మాట్లాడం. కాబట్టి బూర్జువా వార్తాపత్రికల మోసాన్ని కార్మికులు అంగీకరించ టానికి అవధులు లేకుండా ఉన్నాయి. దీనికి వ్యతిరేకంగా మనం స్పందించాలి. వాస్తవాన్ని సక్రమంగా అర్థం చేసుకొనే విధంగా కార్మికులకు మనం తోడ్పడాలి. లక్ష్యం లేకుండా వార్తాపత్రికలు అందించే యువకుల చేతుల్లో పెట్టే డబ్బులు బూర్జువా వార్తాపత్రికలకు ఇచ్చే ఆయుధాలు తగిన సమయం చూసి వాటిని కార్మికవర్గానికి వ్యతిరేకంగా ప్రయోగిస్తారు.

“కార్మికులు అత్యంత ప్రాథమికమైన ఈ వాస్తవాలను తెలుసుకొని, బూర్జువా వర్గం ఎంత ఐక్యతతో, క్రమశిక్షణతో కార్మికవర్గ వార్తాపత్రికలను, అంటే సోషలిస్టు పత్రికలను బాయికాట్ చేస్తున్నారో అంత ఐక్యంగా, క్రమశిక్షణతో బూర్జువా పత్రికలను బాయికాట్ చేయటానికి కార్మిక వర్గాన్ని ఒప్పించాలి. ఏ విషయంలో అయినా మీ శత్రువైన బూర్జువా పత్రికా రంగానికి ఆర్థిక సహాయం అందించవద్దు. అన్ని బూర్జువా వర్గ పత్రికలు చందాదారులను పెంచుకోవటానికి క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఈ సందర్భంలో, వాటిని బాయికాట్ చెయ్యండి, వాటిని బాయికాట్ చెయ్యండి, వాటిని బాయికాట్ చెయ్యండి అనేది మన యుద్ధ నినాదంగా ఉండాలి”.

(ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు అంటోనియో గ్రాంసీ 1916లో రాసిన వార్తాపత్రికలు కార్మికులు వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది) ❑


మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక సౌజన్యంతో...



# 'మనిషి' అంటే ఎవరు?

గ్రాంసీ స్వీయ రచనలు

తత్వశాస్త్రం మన ముందు నిలబెట్టే ప్రాథమికమయిన, ప్రధానమయిన ప్రశ్న ఇదే! ఈ ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పుకోవాలి? మనిషికి నిర్వచనం, మనుషుల్లో మాత్రమే దొరుకుతుంది. ప్రతి వ్యక్తిలోనూ మనిషికి నిర్వచనం దొరుకుతుంది! ఈ సమాధానం సరయిందేనా? వ్యక్తుల్లో మనకి "వ్యక్తి"కి నిర్వచనం దొరుకుతుందే తప్ప, మనిషికి నిర్వచనం దొరకదు కదా! ఆయా స్థలకాలాల్లో ఆయా వ్యక్తులు ఎలా వుంటారనే ప్రశ్నకు మాత్రమే ఈ నిర్వచనం సమాధానం చెప్పగలదు. మరి మన ముందున్న ప్రశ్న "మనిషికి నిర్వచనం ఏమి"టనేది కదా! ఈ ప్రశ్న వేసుకోవడం ద్వారా మన ఉద్దేశమేమిటి? మనిషి ఎలా ఉండగలిగే అవకాశముందో తెలుసుకోవడమే! మనిషి తన భవిష్యత్తును తాను నియంత్రించుకోగలడా? తనను తాను "స్వయంగా మలచుకోగలడా?" తన జీవితాన్ని తానే చక్కదిద్దుకోగలడా? ఈ ప్రశ్నలు వేసుకోవడం ద్వారా, "మనిషి" అంటే ఓ పరిణామ క్రమం –మరింత సూటిగా చెప్తే తాను చేసే కార్యకలాపాల పరిణామమే మనిషి– అని మనం పరోక్షంగా అంగీకరిస్తున్నామన్నమాట! ఆలోచించి చూస్తే, "మనిషికి నిర్వచనం ఏమి"టనే ప్రశ్న మరీ అంత అనిర్దిష్టమయిన, నైరూప్య ప్రశ్నేమీ కాదని తేలిపోతుంది. మన గురించిన – ఇతరుల గురించిన – మన భావాల నుంచే, ఈ ప్రశ్నలన్నీ పుట్టుకొచ్చాయి! మనం చూసిన, ఆలోచించుకున్న విషయాల గురించి తెలుసుకునే క్రమంలోనే ఈ ప్రశ్నలన్నీ పుట్టుకొచ్చాయి! మనమేమిటి? మనం ఏం కాగలం అనే భావనలనుంచే ఈ ప్రశ్నలన్నీ పుట్టుకొచ్చాయి! మనల్ని, మన జీవితాల్ని, మన భవిష్యత్తును నిర్మించి – నియంత్రించుకునేది, నిజంగా, మనమేనా? మనమే అయితే, ఈ నియంత్రణ పరిధి ఏ మేరకు? ఈ విషయం తెలుసుకోవాలని మనకి వుంటుంది. ఈ ప్రశ్నలకు సమాధానం, ఇవాళే, ఇప్పుడే, ఇక్కడే తెలుసుకోవాలనే మనకి వుంటుంది! మన నిత్య జీవితాన్ని గురించి తెలుసుకోవాలనే మనకి వుంటుంది! అంతే తప్ప, మరెవరి గురించో, అతగాడి జీవితం గురించో తెలుసుకోవాలని మనకుండదు!!




జీవితాన్ని గురించీ, మనిషి గురించీ, నిర్దిష్టంగానూ – విశిష్టంగానూ పరిశీలించే క్రమంలోనే "మనిషికి నిర్వచనం ఏమి"టనే ప్రశ్న పుట్టుకొస్తుంది. ఈ చింతన నుంచే ఈ ప్రశ్నకు జవజీవాలు సంక్రమిస్తాయి!! ఈ చింతనల్లో కెల్లా ముఖ్యమయింది మతం. అందులో క్రైస్తవ మతం. అందునా, క్యాథలిక్కు మతం!! (1) నిజానికి, "మనిషికి నిర్వచనం ఏమి"టనే ప్రశ్న వేసుకోవడం ద్వారా, మనిషి కోరికలకూ, అతగాడి నిర్దిష్ట కార్యకలాపాలకూ ఉన్న ప్రాముఖ్యం ఏమిటనే మనం అడుగుతున్నాం! లోకం గురించీ, లోకుల జీవితం గురించీ, క్యాథలిక్కు మతం చెప్పే భావనలు సరయినవా కావా ? అనే మనం అడుగుతున్నామన్న మాట. క్యాథలిక్కు మతాన్ని అవలంబించేవారిగా, మనం సరయిన పనే చేస్తున్నామా? లేక, తప్పులో కాలేస్తున్నామా? మనలో ప్రతి ఒక్కరికీ, క్యాథలిక్కు మతాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటు చేస్తున్నామనే అస్పష్ట భావన, అంతరాంతరాల్లో, తలెత్తుతూనే వుంటుంది. ఈ అపరాధ భావన ఎంత బలంగా ఎదురవుతూ ఉంటుందంటే, క్యాథలిక్కులమని చెప్పుకునే మనలో ఎవరూ ఆ మతాన్ని జీవనవిధానంగా అవలంబించం! తన జీవితంలోని ప్రతి కార్యకలాపానికీ, క్యాథలిక్కు నియమనిబంధనలను అనువర్తింప చేసుకునే శ్రోత్రియ మతస్థుడు మన కళ్ళకు క్రూరమయిన దెయ్యంలా కనిపిస్తాడు! నిజానికి అది, ఆ మతం పట్ల మనం ఏర్పర్చుకున్న తిరుగులేని, తీవ్రమయిన విమర్శనాత్మక దృష్టి!

క్యాథలిక్ మతంలో తప్పితే, మరే మతంలోనూ సంప్రదాయాన్ని తూచా తప్పకుండా అనుసరించరని, ఆ మతస్థులు అంటూ వుంటారు; అది నిజమే కూడా! అయితే, క్యాథలిక్ మతంలో మనుషులందరినీ సమానంగా పరిగణించడమనే ఆచారం చరిత్రలో ఎప్పుడూ కానరాదు! ఈ అసమానత

ప్రాతిపదికగానే, శతాబ్దాల తరబడి క్యాథలిక్ మత దర్శనమూ, కార్యాచరణా కొనసాగుతూ వచ్చాయి. ఇది, క్యాథలిక్ మతంలోని సానుకూల అంశగా మాత్రం పరిగణనకు రాదు. దాదాపుగా ఇవే మూలాలపై నిర్మితమయి, ఇంతే క్రమబద్ధమయిన స్ఫూర్తితో కూడుకుని వుండి, ఇంతే దీర్ఘకాలంగానూ, ఇంతే కేంద్రీకృతం గానూ కొనసాగుతూ వచ్చిన వేరే మతాల విషయంలో అలా చెప్పలేం మరి! ఇక, "తాత్విక" కోణం నుంచి చూస్తే, క్యాథలిక్ మతభావనలో అసంతృప్తికరమయిన విషయం ఒకటుంది. మనుషులలోని 'చెడ్డ' లక్షణాలన్నింటికీ మూలం వ్యక్తుల లోనే ఉందని ఈ మత భావన స్పష్టంగా నొక్కి చెప్తుంది. మరోలా చెప్తే, మనిషిని ఈ మతభావన నిర్దిష్టమయిన, పరిమితమయిన వ్యక్తిగా మాత్రమే పరిగణిస్తుంది. ఇంతవరకూ మనకు తెలిసిన తత్వశాస్త్రాలన్నీ, ఈ మత భావనలోని ఈ అంశనే ప్రతిఫలిస్తూ వచ్చాయి. మనిషిని, అతగాడి వ్యక్తిత్వానికే –వ్యక్తితత్వానికే– పరిమితం చేసి చూశా యీ తాత్విక ధోరణులన్నీ, మానవ స్ఫూర్తి అనేది ఈ వ్యక్తితత్వమే అన్నట్లు పరిగణించాయవి.

ఈ అంశం ప్రాతిపదికగానే, మానవ భావనను మనం పునర్నిర్వచించుకోవలసి వుంది!

నేననేదేమిటంటే, మనిషిని అనేక క్రియాశీలక సంబంధాల పరంపరగా, (పరిణామ క్రమంగా) భావించాలి మనం. ఈ పరంపరలో, బహుశా, వ్యక్తిత్వం అనేది అత్యంత కీలకమయిన మూలకం అయి వుండొచ్చు, కానీ అదే మనం పరిగణించాల్సిన ఏకైక ధాతువు మాత్రం కాదు! ప్రతి వ్యక్తిలోనూ ప్రతిఫలించే మూలకాల్లో 1. వ్యక్తిత్వం, 2. వేరే మనుషులు, 3. ప్రాకృతిక ప్రపంచం లాంటి అనేక ధాతువులుంటాయి. వీటిల్లో రెండు, మూడు స్థానాల్లో వున్న మూలకాలు – పైకి కనిపించేంత– సరళమయిన విషయాలేం కావు! వ్యక్తులు ఇతరులతో పరస్పర సంబంధాలు కలిగి వుండడమనేది అంత ఆషామాషీగా జరిగిపోయేది కాదు. అది సజీవ సంబంధాలుగా మాత్రమే ఏర్పడతాయి. ప్రతి మనిషిలోనూ అత్యంత సామాన్యమయినది మొదలుకుని – అత్యంత సంక్లిష్టమయినవాటి వరకూ ఎన్నెన్నో జీవసంబంధమయిన అంశాలు ఉంటాయి; ఇతరులతో వ్యక్తి సంబంధాల్లో అవన్నీ ప్రతిఫలిస్తాయి.


అలాగే, మనిషి ప్రాకృతిక ప్రపంచంలో భాగమే కనుక ఆ ప్రకృతితో సహజ సంబంధం ఏర్పర్చుకోడు. శ్రమ, శిల్పం, నేర్పు తదితర అనేక అంశాల సహాయంతో మనిషి ప్రకృతితో క్రియాశీలకమయిన సంబంధాలు ఏర్పర్చుకుంటాడు. ఇవి, యాంత్రికంగా ఏర్పడేవి కావు సుమా! ఈ సంబంధాలన్నీ క్రియాశీలకమయినవీ, చైతన్యవంతమయినవీను. వాటి గురించి ప్రతి మనిషికీ కొద్దీ గొప్పో అవగాహన వుంటుంది. దానికి తగిన రీతిలోనే ఈ సంబంధాలు వుంటాయి. అంటే, మనలో ప్రతి ఒక్కరూ –వ్యక్తులు కేంద్రకంగా ఉండే సంక్లిష్ట సంబంధాలలో వచ్చిన మార్పుల మేరకు– తామూ మారతారు. మనలో ప్రతి ఒక్కరూ భాగస్తులమయి వుండే పరిసరాలను, పరస్పర సంబంధాల సముచ్చయాన్ని, క్షుణ్ణంగా అర్థం చేసుకుని వాటిని క్రియాశీలకంగా ప్రభావితం చేసి మార్పులు తీసుకువచ్చే వాళ్లు రాజకీయవేత్తలు. ఈ అర్థంలో చూస్తే , రాజకీయవేత్తలే నిజమయిన తత్వవేత్తలు; వేరెవ్వరూ ఈ అవతారం ఎత్తలేరు! (2) ఈ సంబంధాల సముచ్చయం నుంచే మన వ్యక్తిత్వం రూపుదిద్దుకునే పక్షంలో, వ్యక్తిత్వం రూపొందించుకోవడమంటే ఆ సంబంధాల పట్ల చైతన్యం పెంచుకోవడమే కదా! ఇక, మన వ్యక్తిత్వాన్ని పరిసరాలకు తగినట్లు మార్చుకోవడమంటే, ఆ సంబంధాల సముచ్చయంలో మార్పు తీసుకురావడమే కదా!!

ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా, ఈ సంబంధాలు అంత సరళమయినవేం కావు! వాటిల్లో కొన్ని తప్పనిసరిగా అవసర మయ్యేవయితే, మరి కొన్ని మన ఇష్టానిష్టాల ఆధారంగా ఏర్పర్చుకునేవి. ఏదో ఒక మేరకు ఈ సంబంధాల గురించి చైతన్యం పెంచుకోవడమంటే, క్రియలో అది వాటిని ప్రభావితం చేసి మార్చడమే అవుతుంది. మనం చెప్పుకున్న సంబంధాల్లో అత్యవసరమయినవి కొన్ని వున్నాయనుకున్నాం కదా– వాటిల్లో భిన్న కోణాలు ప్రదర్శితమవుతూ ఉంటాయి; విభిన్న స్థాయిల్లో అవి ప్రాముఖ్యం సంతరించుకుంటూ వుంటాయి. ఇలాంటి సందరాల్లో జ్ఞానమే బలం అవుతుంది! అయితే, వేరే విధంగా ఈ సమస్య సంక్లిష్టంగా మారుతూంటుంది. నిర్దిష్ట స్థలకాలాల్లో నిర్దిష్ట సంబంధాల సముచ్చయం గురించి తెలుసుకుని వుండడంతో సరిపోదు. ఆయా సంబంధాల మూలాలేమిటో, అది ఎలా రూపుదిద్దుకుని పరిణమిస్తూ వచ్చాయో కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే, ప్రతి వ్యక్తి అస్తిత్వంలో వున్న సంబంధాల సంయోగం మాత్రమే కాదు– ఆయా సంబంధాల చారిత్రిక లక్షణాల సమన్వయ స్వరూపం కూడా! అతగాడి వ్యక్తిత్వం వర్తమానానికే పరిమితం కాదు– అది మొత్తం గతం తాలూకు సంక్షిప్త రూపం కూడా! మనుషుల శక్తి సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే, వ్యక్తులు తీసుకురాగల మార్పులు బహు పరిమితమనే చెప్పాలి. కానీ, అలాంటి మార్పులను కోరుకునే ఇతరులతో ఆ వ్యక్తి కలిస్తే, ఆ మార్పులు హేతుబద్ధమయినవే అయిన పక్షంలో, ఒకానొక వ్యక్తి శక్తి రెట్లకు రెట్లు పెరుగుతూ పోతుంది. దాంతో, మొదట్లో కష్ట సాధ్యమవు తుందని అనుకున్నదానికి అనేక రెట్లు మెరుగయిన మార్పు సులభ సాధ్యమవుతుంది!

మనుషులు పాలుపంచుకునే "సామాజిక పొరలు" అనేకంగా వుంటాయి; ఒక సమాజం లోపల ఎన్నో సమాజాలు –పైకి కనిపించే దానికి మించినన్ని– నిక్షిప్తంగా వుంటాయి. ఈ "సామాజిక పొరల" ద్వారానే వ్యక్తి మానవాళిలో భాగం కాగలుగుతాడు. ఆ విధంగా మనిషి ప్రకృతిలో భాగమయ్యే మార్గాలు అనేకంగానూ, సంక్లిష్టంగానూ వుంటాయి. ఈ సాంకేతిక ప్రక్రియ ఎలా జరుగుతుందో పరిశీలనగా గమనించాలి. (సాంకేతిక ప్రక్రియ అనే పారిభాషిక పదానికి వైజ్ఞానిక భావాలు, పారిశ్రామిక ప్రక్రియలోకి ఎలా అనువాదమవడమనేదే సామాన్యార్థం.) "మానసిక" పరికరాలూ, తాత్విక పరిజ్ఞానం ఈ ప్రక్రియలో ఎలా భాగం పంచుకుంటున్నాయో కూడా పరిశీలించాలి.

మనిషిని సంఘజీవిగా తప్ప ఇతరత్రా భావించలేమనేది సుప్రసిద్ధ భావన. (3) అయితే, ఈ భావనలోంచి తదనంతర పరిణామాలన్నింటినీ – కనీసం వ్యక్తిగత స్థాయిలో– రూపొందించారని చెప్పలేం. నిర్దిష్ట మానవ సమాజం అనే భావనతో ఏర్పడాలంటే, నిర్దిష్ట ప్రాకృతిక ప్రపంచం అనే భావన కూడా రూపుదిద్దుకుని ఉండాలి. ఎందుకంటే, ప్రాకృతిక ప్రపంచం అనే అస్తిత్వం ఉంటేనే మానవ సమాజం అనేది రూపొందడం సాధ్యమవుతుంది మరి. ఇది కూడా సర్వ విదితమయిన విషయమే. ఇవి రెండూ –ప్రాకృతిక ప్రపంచం, మానవ సమాజం అనే రెండూ – వ్యక్తికి అతీతమయిన అస్తి త్వాలు. వాటికి ఆపాదిస్తూ వచ్చిన ప్రాధాన్యం యాంత్రికమయినదీ, నిర్ధారణాంధత్వంతో కూడినదీ అనే మాట వాస్తవం. అందుకే దానికి అలాంటి వ్యతిరేకత ఎదురయింది. ఈ సంబంధాలను క్రియాశీలకమయినవి గానూ, గతిశీలకమయినవి గానూ వివరించే సైద్ధాంతిక భావన రూపొందించాల్సిన ఆవశ్యకత తలెత్తింది. జ్ఞానం, ఆకాంక్ష అభినందన, సృజన చేతనయిన వ్యక్తి యొక్క చైతన్యమే, ఇక్కడ చెప్పుకున్న క్రియాశీలక, గతిశీలతకు మూలం అని ఈ సైద్ధాంతిక భావన స్పష్టంగా తేల్చి చెప్పవలసి వుంది. అతగాణ్ణి, ఒంటరి ద్వీపంగా కాక ఇతర మానవులు – ప్రాకృతిక ప్రపంచం కల్పించిన అవకాశాలచేత సుసంపన్నుడయిన వ్యక్తిగా భావించవలసివుంది. ఈ పరిణామాలు అతగాడికి నిర్దిష్ట పరిజ్ఞానం కలిగివున్న వ్యక్తిగా తీర్చిదిద్దుతాయి. ప్రతి మనిషి ఏదో మేరకు తత్వవేత్త అయినట్లు గానే, ఒక మేరకు శాస్త్రజ్ఞుడు కూడా అయి వుంటాడు మరి!

"ఆహారమే మనిషి అస్తిత్వం" అనే మాటకు విధవిధాలుగా భాష్యం చెప్పుకోవచ్చు. (4) అత్యంత మోటు, మొరటు పద్ధతిలో భాష్యం చెప్తే అది ఇలా వుంటుంది: "ఏ చారిత్రిక దశలోనయినా, మనిషి కడుపుకు తినే కూడే అతని ఉనికి; అతని ఆలోచన ధోరణిని అతను ఆ పూట తిన్న తిండే ప్రభావితం చేస్తుంది." అమేడియో బార్డిగా చేసిన వ్యాఖ్యను ఒక్కసారి గుర్తు చేసుకుందాం– (5) "సభకి ముందర ఫలానా వక్త ఏం తిన్నాడో తెలిస్తే, అతని వుపన్యాసాన్ని అన్వయించుకోవడం తేలికయిపోతుంది!" ఇలా మాట్లాడడం కేవలం పిల్లకాయతనం! పైపెచ్చు. దీన్ని బలపరిచే, కచ్చితమయిన వైజ్ఞానిక సమాచారమేదీ లేదు! కూరగాయలూ, కందమూలాలపై ఆధారపడి మెదడు పనిచేయదు. ఆహార పదార్థాలను ముందుగా, జీర్ణం చేసుకోవడానికి యోగ్యమయిన అణువులుగా మార్చుకుంటుంది శరీరం. అప్పుడు మాత్రమే సదరు ఆహార కణాలు, మెదడులో ఉండే అణువులకు "సజాతీయ స్వభావం" సంతరించుకుంటాయి. బార్డిగా చెప్పిందే నిజమయ్యే పక్షంలో చరిత్రకు సంబంధించిన నిర్ణయాత్మక ప్రణాళికలన్నీ వంటిళ్ళలోనే తయారయి వుండాలి! సామాన్య ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగానే విప్లవాలన్నీ సంభవించి వుండాలి! కానీ, చరిత్ర ఇందుకు విరుద్ధ సమాచారం మన ముందుంచు తోంది. విప్లవాలూ, సంక్లిష్ట చారిత్రిక అభివృద్ధి క్రమాలూ ఆహార పదార్థాల రూపురేఖలను మారుస్తూ వచ్చాయి; ఆహారానికి సంబంధించిన అభిరుచులను సైతం అవే ప్రభావితం చేస్తూ వచ్చాయి. ప్రణాళికాబద్ధమయిన గోధుమ సేద్యం వలన సంచార జీవనం ముగిసిపోలేదు– అందుకు పూర్తి భిన్నంగా జరిగింది. సంచార జీవనానికి ప్రతికూల పరిస్థితులు ఎదురయిన నేపథ్యంలో, క్రమబద్ధమయిన గోధుమ సేద్యం మొదలయింది! (6)




మరో వైపున, ఫ్యుయెర్‌బాఖ్ చెప్పిన మాట కూడా నిజమే మరి! మొత్తం మీద చూస్తే, ఆహారపు అలవాట్లు కూడా సామాజిక సంబంధాల్లో భాగమే కదా! ప్రతి సామాజిక బృందానికీ, ఒక్కో రకం ఆహారపు అలవాట్లు వుంటూనే వుంటాయి. అంచేత, 'మనిషి అంటే వస్త్రధారణే!' అని మరొకరు అనొచ్చు: 'మనిషి అంటే గృహనిర్మాణమే!' అని వేరొకరు చెప్పొచ్చు: 'మనిషి అంటే కుటుంబ జీవనమే!'

అని ఇంకొకరు సూత్రీకరించొచ్చు. ఎందుకంటే, కూడు–గుడ్డ–గూడు–కుటుంబ జీవనం – ఇవన్నీ సామాజిక జీవనానికి సంబంధించిన ప్రాథమిక లక్షణాలే కదా! ఈ సామాజిక జీవనమంతా సామాజిక సంబంధాల ద్వారానే కదా –విస్తృత స్థాయిలో– వ్యక్తమయ్యేది!

అంచేత, మనిషి అంటే నిర్వచనం ఏమిటనే ప్రశ్న సారాంశం, "మానవ ప్రవృత్తి ఏమి"టో తెలుసుకోవడమే; అది కూడా "మనుషుల సార్వజనీన ప్రవృత్తి ఏమి"టో తెలుసుకోవడమే! మన ప్రయత్నం అంతా, మానవ శాస్త్రం లేదా మానవ తత్వం ఏమిటో తెలుసుకోవాలనేదే. మనిషికి సంబంధించిన మొత్తం అన్ని అంశాలనూ తనలో ఇముడ్చుకోగలిగే ఒక అనిర్దిష్ట, "ఏకకేంద్రక" భావనను కనుక్కోవడంతోనే ఈ ప్రయత్నం మొదలవుతుంది. ఇంతకీ, మానవతత్వం అనేది –నిర్దిష్ట "ఏకకేంద్రక" అనిర్దిష్ట భావనను– కనుక్కునే ప్రయత్నానికి ఆరంభమా? అంతమా?? ఈ చర్చకు మానవుడే ఆరంభం అయ్యే పక్షంలో, ఇది సారాంశంలో దైవజ్ఞానంగానో లేదా ఆధ్యాత్మిక జ్ఞానంగానో మిగిలే ప్రయత్నం కాదు కదా? ఎందుకంటే, మానుష శాస్త్రం లాంటి ప్రాకృతిక అధ్యయన రంగాల స్థాయికి తత్వశాస్త్రాన్ని కుదించడం అసాధ్యం. మనిషికి సంబంధించిన జీవ శాస్త్ర సంబంధమయిన "తత్వం" మానవ జాతి ప్రవృత్తిని పట్టివ్వలేదు!!

మానవచరిత్రలో ప్రాధాన్యం కలిగివుండే వైవిధ్యాలు, వైశిష్ట్యాలు – జాతి లక్షణాలు, పుర్రె పరిమాణం, చర్మం రంగు లాంటి– జీవశాస్త్ర సంబంధమయిన వాస్తవాలు కావు! కానీ, ఆహారమే మనిషి అస్తిత్వం అనే సూత్రీకరణ చివరికి మనల్ని ఈ వివరాలకే పరిమితం చేస్తుంది. యూరప్‌లో అత్యధికుల ఆహారం గోధుమలు కాగా, ఆసియా – ఆఫ్రికా దేశాల్లో బియ్యం ప్రధాన ఆహారం. చాలా మట్టుకు, నివాస ప్రాంతాలను బట్టే ఆహారపు అలవాట్లు ఉంటాయి కనుక చివరికి ఓ 'దేశమే మనిషి అస్తిత్వం" అని నిర్ధరించవలసి వస్తుంది! పోతే, చరిత్రలో జీవ సంబంధ మయిన సామ్యత పెద్ద ప్రాముఖ్యం సంతరించుకోలేదు. సహజ – ప్రాకృతిక– స్థితికి దగ్గరగా ఉన్న రోజుల్లో, మనిషి ప్రకృతి సిద్ధమయిన పదార్థాలను కృత్రిమ పద్ధతుల ద్వారా పెంచుకోలేక పోయాడు. ఆ దశలో, మృగప్రాయుడయిన మనిషి నరమాంసమే తిన్నాడంటారు. హేతుబద్ధంగా ఆలోచించగలిగే సామర్థ్యం వల్ల గానీ, చైతన్యం వల్ల గానీ జీవసంబంధమయిన సామ్యత రూపుదిద్దుకోలేదు! ఆ లక్షణాలు రెండూ కేవలం నిరపేక్ష సార్వత్రిక భావనలకే (7) ప్రాతినిధ్యం వహిస్తాయి. చింతనలూ, భావనలే మనుషుల్లో సామ్య వైషమ్యాలను కలిగించేవని జనం అనుకోరు.

"సామాజిక సంబంధాల సంక్లిష్ట సంగమమే మానవ ప్రవృత్తి" అనే నిర్వచనం ఉన్నవాటిల్లోకెల్లా సంతృప్తికరమయిన సమాధానంగా కనిపిస్తుంది. ఎందుకంటే, ఈ నిర్వచనం మనుషుల మధ్య సంబంధాల పరిణామ క్రమాన్ని తనలో ఇముడ్చుకుంది; మనిషి గురించి సామాన్యీకరించి చెప్పడాన్ని ఈ నిర్వచనం తిరస్కరిస్తోంది కూడా! సామాజిక సంబంధాలు మారే కొద్దీ, వాటికి అనుగుణంగా నిరంతరం పరిణామం చెందుతూ వస్తాడు మనిషి. సామాజిక సంబంధాలు కొన్ని సమూహాల ద్వారా వ్యక్తమవుతూ వుండే మాట నిజం. ఈ సమూహాలు, భాగస్వామ్య సమూహాల గురించి సైతం సూచిస్తాయి. వాటి మధ్య భాగస్వామ్యం నిరపేక్షమయింది కాదనీ, గతితార్కికమయిందనీ మనకు దర్శనమిస్తుంది. కులీన మానవుడి గురించిన ప్రస్తావన, వెట్టిచాకిరీ చేసే కూలీని పరోక్షంగా ప్రస్తావిస్తూనే వుంది! (8) అసలు చారిత్రికతే మానవ ప్రవృత్తి అని కూడా చెప్పుకోవచ్చు. అసలు చరిత్ర అంటే, పరిణామం చెందడమే అనే అర్థం చెప్పుకునే పక్షంలో, చారిత్రిక స్ఫూర్తే మానవ ప్రవృత్తి సారమని నిర్వచించనూ వచ్చు! పరిణామం చెందడం తాలూకు ప్రాధాన్యం, వైమనస్యాల సామరస్యంగానో లేదా భిన్నత్వాల ఏకత్వంగానో భావించిన సందర్భంలో ఇది మరింత భావ్యంగా అనిపిస్తుంది. చరిత్ర అనే పరిణామం ఐక్యతతోనే మొదలు కాకపోవచ్చు. కానీ, ఐక్యత సాధ్యమయ్యేందుకు దారితీసే కారణమేదో దానిలో ఇమిడివుంటుంది. మానవ ప్రవృత్తి అనేది ఒక్క వ్యక్తిలో కనిపించేది కాదనీ, మానవజాతి చరిత్ర మొత్తంలో గోచరించేదనీ, ఈ కారణం చేతనే, తీర్మానించి చెప్పొచ్చు. ఇక్కడ మానవ 'జాతి' అనే మాట సార్థకంగానే వాడడం జరిగింది; జాతి అనేది ప్రకృతికి సంబంధించిన పారిభాషిక పదం కావడం ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకుందిక్కడ. ప్రతి ఒక్క వ్యక్తిలోనూ, ఇతర వ్యక్తుల్లో కనిపించే లక్షణాలకు భిన్నమయిన కొన్ని విశిష్ట లక్షణాలు కనిపిస్తుంటాయి.

సాంప్రదాయిక తత్వశాస్త్రంలో కనిపించే "ఆత్మ" అనేది– జీవశాస్త్రంలో వినిపించే "మానవ ప్రవృత్తి" అనేది కూడా శాస్త్రీయమయిన మిథ్యాకల్పనలుగా వివరించవలసివుంది. ఈ మిథ్యే మహోన్నత ప్రమాణాలకు చేరి దేవుడనే కల్పనకూ, మనుషులంతా దేవుడి బిడ్డలనే కల్పనకూ దారితీసింది. మానవ చరిత్రక్రమంలో ఎదురయిన ప్రయాసలన్నింటినీ హేతువు ప్రాతిపదికగానో, విభిన్న మనోభావాల ప్రాతిపదికగానో రూపొందించుకున్న ఆకాంక్షలుగా చిత్రిస్తాయి ఈ కల్పనలు! మనుషుల్ని దేవుని బిడ్డలుగా చిత్రిస్తాయి మతాలు; హేతువాద క్రమంలో వారందరినీ సమాన భాగస్వాములుగా చిత్రిస్తాయి తాత్విక ధోరణులు. వాస్తవానికి, వాటికీ వీటికీ కూడా రూపరేఖలు దిద్దింది, సంక్లిష్ట విప్లవాత్మక ఉద్యమాలే!! ఆదిమ యుగం, మధ్యయుగాలలో వచ్చిన పరివర్తనలకు ఈ పరిణామాలు

ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇవి, చరిత్ర అభివృద్ధి క్రమంలో బలమయిన లంకెలుగా నిలిచాయి.

ఈ మహత్తర చారిత్రిక అంతస్సంబంధాలకు తుట్టతుది ప్రతిఫలనం హెగెల్ గతితర్కంలోనే కనిపిస్తుందనేది ఓ అభిప్రాయం. సామాజిక వైరుధ్యాల వ్యక్తీకరణగా ఉన్నది ఈ గతితర్కం. అయితే, ఈ వైరుధ్యాలు అదృశ్యమయిపోయిన నేపథ్యంలో, వాటి ప్రతిఫలనంగా ఉండడానికి బదులు, గతితర్కం కేవల భావనాత్మక గతితర్కంగా పరిణమించాలన్నది మరో ఆలోచన. క్రోషే లాంటి ఆదర్శ – భావవాదులు ఇటీవలి కాలంలో రూపొందించిన తాత్విక ధోరణులకు (9) ఈ ఆలోచనే మూలకందంగా ఉందనిపిస్తుంది.

రాజ్యంలో, ప్రపంచ రాజకీయ వ్యవస్థలో వ్యష్టి – సమష్టి ప్రయోజనాలు ముడిపడివున్నాయి; కొట్టొచ్చినట్లు కనిపించేది– కనిపించనివి కొన్ని ప్రయోజనాలు రాజ్యంలో, ప్రపంచ రాజకీయ వ్యవస్థలో పొందికగా ముడిపడి వున్నాయి. వాటిని, చరిత్రలో రూపుదిద్దుకున్న నిజమయిన "సామ్యతలు"గానూ, చారిత్రిక పరిణామ క్రమంలో మానవ ప్రవృత్తి సాధించిన "స్ఫూర్తి"గానూ గ్రహించవలసి వుంటుంది. అంటే, ఒకే పొందికలో కనిపించే సామ్యాలనూ అనేక పొందికల మధ్య కనిపించే వైషమ్యాలను ఈ సందర్భంగా మనం ప్రస్తావించుకుంటున్నాం.

ప్రజలు వ్యక్తులుగా గానీ సమూహాలుగా గానీ – గుర్తించి, గ్రహించిన సామ్య వైషమ్యాలకే వర్తించే ప్రస్తావన ఇది. ఆ విధంగా మనం తత్వశాస్త్రం–రాజకీయాలు, ఆలోచన–ఆచరణల మధ్య సామ్యతగా, లేదా సమీకరణగా దీన్ని గ్రహిస్తున్నాం. ఇదే మరో మాటల్లో చెప్పుకుంటే ఆచరణాత్మక తత్వశాస్త్రం అవుతుంది.

అంచేత, మనం చర్చించే విషయాలన్నీ రాజకీయాంశాలే; అవి తత్వశాస్త్రంలో –విభిన్న తాత్విక ధోరణుల్లో భాగంగా వుండేవే! (10) ఈ ప్రపంచంలో చివరికి మిగిలేది, ఆచరణలో ఉన్న తత్వశాస్త్రం మాత్రమే – అనగా సాక్షాత్తూ జీవితమే! సాంప్రదాయిక జెర్మన్ తత్వశాస్త్రానికి జెర్మన్ కార్మికవర్గమే వారసురాలనే వ్యాఖ్యానాన్ని ఈ అర్థంలోనే గ్రహించాలి. ఆధిపత్యం అనే భావనను సిద్ధాంతీకరించి, ఆచరణరూపంలో సాధించే క్రమంలో వ్లాదిమిర్ ఇల్యీచ్ లెనిన్ చేసిన కృషి కూడా ఈ అర్థంలో "తత్వ మీమాంసే!" ❑

---

1 గ్రామ్‌సీ స్వస్థలం ఇటలీ, అక్కడి మతం ప్రధానంగా రోమన్ క్యాథలిక్ మతం. అందుకే ఈ ఉదాహరణ తీసుకున్నాడు. అంతే తప్ప ఇది క్యాథలిక్కులకే పరిమితమయిన చర్చగా భావించకూడదు!

2 "మానవసారం ప్రతి ఒక్క వ్యక్తిలోనూ అంతర్నిహితంగా వుండే అనిర్దిష్టత కాదు. వాస్తవానికి మానవసారం, సామాజిక సంబంధాల సముచ్చయం...." – ఫ్యూయర్‌బాఖ్‌పై కార్ల్ మార్క్స్ థీసెజ్ – 6

3 క్రీస్తుకు పూర్వం నాలుగో శతాబ్దికి చెందిన గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ చేసిన సూత్రీకరణ ఇది. క్రీస్తు శకం 15–16 శతాబ్దాల నాటి యూరపియన్ పునరుజ్జీవనోద్యమ కాలంలో ఇది పునఃప్రాచుర్యానికి నోచుకుంది. ఇటాలియన్ తాత్విక సంస్కృతిపై ఇది గాఢంగా ముద్రితమయిందనిపిస్తుంది.

4 పందొమ్మిదో శతాబ్దపు జెర్మన్ తత్వవేత్త ఫ్యుయెర్ బాఖ్ చెప్పిన మాట ఇది. గతితర్కంతో సంబంధం లేని ఇలాంటి సూత్రీకరణలతో నిండిన ఫుయెర్‌బాఖ్ 'భౌతికవాదం' పట్ల గ్రామ్‌సీ వ్యతిరేకత సుస్పష్టం.

5 అమేడియో బార్డిగా (1889–1970) ఇటాలియన్ కమ్యూనిస్ట్ పార్టీ (వామపక్ష బృందానికి) నాయకుడు. 1920లో లెనిన్ రాసిన 'వామపక్ష కమ్యూనిజం – ఓ అతివాద బాలారిష్టం' అనే కరపత్రం బార్డిగా గురించీ, అతని అనుచరగణం గురించి రాసిందే. మొదట్లో అతనికీ, గ్రాంసీకీ సైద్ధాంతికంగా పడేది కాదు. అయితే, ఫాసిస్టుల నిర్బంధంలో, వాళ్ళిద్దరూ ఎన్నో విషయాలను స్నేహపూర్వకంగా చర్చించుకునేవారు. గ్రాంసీని జైలునుంచి తప్పించేందుకు కూడా బార్డిగా ప్రయత్నించాడంటారు. ఈ సందర్భంలో బార్డిగా మీద గ్రామ్‌సీ విసురు ఇది!

6 'ఆహారమే మనిషి అస్తిత్వం' అనే ఫ్యుయెర్‌బాఖ్ నిర్ధారణ తెలిసిందే. మధ్యయుగాల్లో జెర్మన్ శ్వాగెటీ (గోధుమ పిండితో చేసే సేమ్యా లాంటి వంటకం) తినడం అలవాటు చేసుకున్నందువల్లనే తమ జాతి నిర్వీర్యం అయిపోయిందని ఇటాలియన్ 'ఫ్యూచరిస్టు ప్రవక్త' ఎఫ్.టి. మారినెటీ (1876–1944) చేసిన ప్రకటనలతో, ఫ్యుయెర్‌బాఖ్ నిర్ధారణను పోల్చి చూడండి. ఆర్థికమాంద్యంలో పడి ప్రపంచం కొట్టుమిట్టాడుతున్న సంక్షుభిత పరిస్థితుల్లో – బీదాబిక్కీ తినడానికి తిండిలేక అలమటిస్తున్న నేపథ్యంలో– మారినెటీ, మరో రచయిత మాసిమో బాంటమ్ లీ (1878–1960) శ్వాగెటీ గురించి వాదప్రతివాదాల్లో మునిగితేలారు.

7 చారిత్రక, గతితార్కిక స్వభావం లేని భావననే 'నిరపేక్ష సార్వత్రిక' (క్యాటగారికల్) భావన అనే మాట ద్వారా సూచిస్తున్నాడు గ్రామ్‌సీ.

8 విరుద్ధాంశాల ఐక్యత అనే గతితార్కిక నియమం గురించి గ్రామ్‌సీ చెప్తున్నాడిక్కడ. కులీనత అనేది దానికి విరుద్ధాంశంగా ఉండే వెట్టి కూలీ వ్యవస్థ లేదా అర్ధబానిస వ్యవస్థ గురించి చెప్పకనే చెప్తోంది.

9 బెనెడిటో క్రోషే (1866–1952) సుప్రసిద్ధ ఇటాలియన్ భావవాది. తత్వశాస్త్రం, చరిత్ర అధ్యయనం, చరిత్ర రచన, సౌందర్య శాస్త్రం తదితర రంగాల్లో లోతుగా కృషిచేసిన క్రోషే ప్రభావం సువిస్తృతం. గ్రామ్‌సీ లాంటి మార్క్సిస్టులు మొదలుకొని, జ్యోవనీ జెంటిల్ లాంటి ఫాసిస్టుల వరకూ ఎందరినో ప్రభావితం చేశాడు క్రోషే.

10 గ్రామ్ సీ జైలు రచనల్లో భావజాలం గురించి...' అనే భాగం ఈ సందర్భంగా చదువుకోండి!

# సమకాలీన ప్రపంచంలో ప్రముఖ మేధావి


## "గ్రాంసీ జైలురాతలు" పుస్తక పరిచయం

డా॥ యలమంచలి రాధాకృష్ణమూర్తి



మానవ సమాజ పరిణామక్రమాన్ని దానికి కారణ భూతమైన చోదక శక్తుల్ని 'చారిత్రిక భౌతికవాదం' వివరిస్తుంది. ఒక సామాజిక దశలోని ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెంది, దానికి అనుగుణంగా ఉత్పత్తి సంబంధాలు కూడా మార్పు చెందనప్పుడు కలిగే వైరుధ్యం – వర్గ సంఘర్షణకు దారి తీస్తుందనీ, ఫలితంగా నూతన దశ ఆవిర్భవిస్తుందనేది– సూత్రీకరణ.

భౌతిక జీవనావసరాల ఉత్పత్తి, ఉత్పత్తి శక్తులు – అంటే 'ఆర్థికాంశం' ప్రతి సామాజిక దశకూ పునాది. ఈ పునాదికి అనుగుణమైన 'ఉపరినిర్మాణం' (Super Structure) ఏర్పడుతుంది. ఆ దశలోని సాహిత్యం , కళలూ, Aesthetics, విద్య, నీతిశాస్త్రం, రాజకీయం, మతం, తత్త్వశాస్త్రం 'ఉపరి నిర్మాణం'గా భావిస్తాం.




సమాజ పరిణామానికి చోదక శక్తి ఆ దశలోని పునాది. అంటే 'ఆర్థికాంశం'లో వచ్చే మార్పు మాత్రమేనన్నది మౌలిక ప్రతిపాదన. 'ఉపరినిర్మాణం' యొక్క పాత్ర పరిమితమేనన్నది అవగాహన.

విప్లవంలో ఈ పునాది, ఉపరినిర్మాణాల సాపేక్ష ప్రాముఖ్యత పై చర్చ వుంది. మౌలిక ప్రతిపాదన స్థూలంగా సరైందే అయినా – 'భావ విప్లవం' యొక్క అవసరం లేకపోలేదని – తాము దాన్ని పూర్తిగా తోసిపుచ్చలేదని ఏంగిల్స్ చెప్పారు. అయితే వాటిని అంచనా కట్టడంలో ఇబ్బంది వుంటుంది.

కమ్యూనిస్టు ప్రణాళిక రాసిన కొద్ది సంవత్సరాలకు మార్క్స్ 1859లో "ఏ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి" అనే గ్రంథం రాశారు. ఆ గ్రంథం యొక్క ముందు మాటలో మార్క్స్ ఇలా రాశారు. "ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల నైశిత్యంపై ఆధారపడి నిర్ధారితమయ్యే ఉత్పత్తి యొక్క ఆర్థిక పరిస్థితుల పాదార్థిక మార్పుకూ మరియు మానవులు వారి పోరాటాల పట్ల చైతన్యవంతులై విజయం సాధించే భావజాల రూపాలైన రాజకీయ, మత, న్యాయ, కళా, తాత్విక భావాలకు మధ్య తేడాను తప్పక చూడాలి.

దీనిలో భాగంగానే లేక దీనితోపాటు సామాజిక విప్లవంలో మేధావుల పాత్రపై కూడా చర్చ ఉంది. మార్క్స్, ఏంగిల్స్‌లు మేధావుల్ని పెటీ బూర్జువాలని ఒక వర్గంగా పరిగణించలేదు. వారిని ఒక 'సెక్షన్'గా మాత్రమే గుర్తించారు. విప్లవశక్తులు, ప్రతీప శక్తులకు మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు వీరు ఎటు నిలబడతారన్న ప్రశ్నకు ఈ సెక్షన్ సాధారణంగా ఊగిసలాట ధోరణిలో వుంటుందనీ – విప్లవ శక్తులదే పై చేయి అయిన కొద్దీ వీరు ఇటువైపు మొగ్గుతారనీ భావించబడింది.

"చివరి అంశం ఏమిటంటే వర్గపోరాటం అటో ఇటో తేలిపోయే ఘడియ సమీపించినప్పుడు, పాలకవర్గంలో సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ నిజానికి పాత సమాజం అంతటా సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ. అది ఎంత స్పష్టమైన ప్రచండమైన రూపం ధరిస్తుందంటే పాలకవర్గంలోనే కొద్ది మంది తమ వర్గంతో సంబంధాలు తెంచుకొని వచ్చి విప్లవ వర్గంతో కలుస్తారు. భవిష్యత్తును శాసించే విప్లవ వర్గంలో అనగా గతంలో యే విధంగా ఫ్యూడల్ ప్రభువర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి వచ్చి బూర్జువా వర్గంతో కలిసిందో అదే విధంగా యిప్పుడు బూర్జువా వర్గానికి చెందిన భాగం విడిపోయి వచ్చి కార్మిక వర్గంతో కలుస్తుంది. ముఖ్యంగా చారిత్రిక గతినంతటినీ సిద్ధాంతరీత్యా అవగాహన చేసుకోగల స్థాయిని చేరుకున్న బూర్జువా సిద్ధాంత వేత్తలలోని భాగమే ఈనాటి బూర్జువా సిద్ధాంతవేత్తలలోని ఒక భాగం.

ఈనాడు బూర్జువా వర్గానికి ముఖాముఖిగా నిలబడిన వర్గాలన్నిటికి కార్మిక వర్గం ఒక్కటే నిజమైన విప్లవ వర్గం. తక్కిన

వర్గాలు ఆధునిక పరిశ్రమల ప్రభావం వల్ల క్షీణించి చివరకు అదృశ్యమవుతాయి. కార్మిక వర్గం ఆధునిక పరిశ్రమల ప్రత్యేకమైన ముఖ్యమైన సృష్టి.

మధ్యతరగతిలో క్రింది వాళ్ళు, చిన్న చిన్న పరిశ్రమల యజమానులు, దుకాణదారులు, చేతిపనివాళ్ళు, రైతులు - వీళ్ళందరూ బూర్జువా వర్గంతో పోరాడతారు. కాని వీళ్ళ పోరాటమంతా మధ్యతరగతిలో భాగాలుగా వుంటూ తమ వునికిని కాపాడుకోవడం కోసమే. కనుక, వీళ్ళు విప్లవకారులు కాదు, యధాస్థితివాదులు. అంతే కాదు ప్రగతి వ్యతిరేకులు. ఒకవేళ, వీళ్ళు ఎపుడైనా విప్లవకరంగా వున్నారంటే త్వరలో తాము కార్మిక వర్గంలో కలిసిపోనున్న దృష్ట్యానే అలా వుంటారు. అనగా వీళ్ళు తమ ప్రస్తుత ప్రయోజనాల కొరకు గాక భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యానే పోరాడతారు. తమ సొంత దృక్పధం వదిలి పెట్టి కార్మిక దృక్పధం స్వీకరిస్తారు." (మానిఫెస్టో).

కమ్యూనిస్టు పార్టీ రాజకీయ పాఠశాలల ప్రాథమిక తరగతులలో ఈ అవగాహన యధాతథంగా బోధిస్తూ వచ్చారు. వర్గ సంఘర్షణా సమయంలో ఊగిసలాడే సెక్షన్ స్వభావానికి, విప్లవ చైతన్యంతో, జనక వర్గంనుండి విడగొట్టుకొని - కార్మిక వర్గం వైపు వచ్చిన మేధో కార్యకర్తలకూ మధ్య తేడాని గమనించడంలో గందరగోళం ఏర్పడింది.

సంపన్న కుటుంబాల నుండి వచ్చిన వారూ, ఉన్నత విద్యార్హతలు గలవారు కూడా. తమ వర్గం నుండి విడివడి కార్మిక వర్గ చైతన్యంతో పనిచేసే అవకాశాన్ని గుర్తించాలని 'మావో' చెబుతూ వచ్చారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక ఉదాహరణలూ వున్నాయి. భావ విప్లవ సూత్రధారులుగా వారి పాత్ర విస్మరించతగినది కాదు. అందుకే కార్మిక వర్గం తన వర్గ మేధావుల్ని తయారు చేసుకోవాలి. ఆకర్షించాలి. ప్రోత్సాహించాలి. ఈ నేపథ్యంలో ఆంటోనియో గ్రాంసి రచనల్ని పరిశీలించవలసి వుంటుంది.

ఇటలీ కమ్యూనిస్టు పార్టీలో ముప్పై, నలభై దశకాల్లో ఒక ప్రముఖ వ్యక్తి అంటోనియో గ్రాంసీ. చిరకాలం ఆ పార్టీ నాయకుడు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ కీలక పాత్రధారిగా వున్న టోగ్లియాటికి సహచరుడు. సమకాలీన ప్రపంచంలో ప్రముఖ మేధావిగా గుర్తింపు పొందినవాడు.

జన్మతః వచ్చిన శారీరక రుగ్మతల్ని అధిగమించి- పార్టీలో అతి చురుకైన పాత్ర నిర్వహిస్తూనే విప్లవ సాహిత్య సాగరాన్ని ఔపోసన పట్టినవాడు. ఫాసిస్టు ముస్సోలిని పాలనలో జైలు పాలై, అందులో నుండే రచించిన "ప్రిజన్ నోట్స్" ప్రపంచ మేధావుల దృష్టిని ఆకర్షించింది. దానిపై విశ్లేషణా పరంపరలూ విమర్శలు అసంఖ్యాకంగా వచ్చాయి.

ఆయన కంట్రీబ్యూషన్‌పై ప్రముఖ మార్క్సిస్టు మేధావి ప్రొ. అయిజాజ్ అహ్మద్ యిలా రాశారు.

"జర్మన్ ఐడియాలజీ చదివితే మరింత సుసంపన్నవంతమైన అవగాహనకు తోడ్పడతాయి. వర్గ సమాజంలోనే చైతన్యం రూపు దిద్దుకుంటుంది అనే అర్థంలో అన్ని రకాల చైతన్యాలు అనుశ్రుతంగానే వర్గ చైతన్యమనే మౌలిక అంశాన్ని మార్క్సు ఆ గ్రంథంలో రూపు దిద్దారు. అలా చైతన్యం రూపొందటం పుట్టిన మరు క్షణంలోనే ప్రారంభమవుతుంది. ఆ విధంగా తాను పుట్టిన వర్గ చైతన్యాన్నే పుణికి పుచ్చుకుంటాడు. లేదా మరొక వర్గం యొక్క చైతన్యాన్ని అలవరుచుకుంటాడు. (ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానం ప్రచారం చేసిన చైతన్యాన్ని కార్మిక వర్గం వంటబట్టించుకోవచ్చు.) అంతే తప్ప వర్గ రహిత చైతన్యం అనేది లేనే లేదు అనే అవగాహన కలిగిస్తుంది. ఎంతో లోతైన ఈ భావాన్ని ఆంటోనియో గ్రాంసీ ఎంతో బాగా ఉపయోగించారు. సమాజంలో విభిన్నమైన, ఘర్షణాయుత భాగాల నుండి ఒకానొకరు తమ చైతన్యాన్ని సంతరించుకుంటారు. కనుక అలాంటి వైరుధ్యాలతో స్పష్టత లేని చైతన్యంగానే ఆయా వ్యక్తుల చైతన్యం వుండి తీరాలి. వారిని విజ్ఞానవంతులను చేసే మహత్తర కృషి అనుభవాల నుండి ఉత్పన్నమయ్యే ఆలోచనలు ఒకే పోరాటంలో సహా కామ్రేడ్స్‌లో ఆచరణమూలంగా ఏర్పడే సంబంధాల ద్వారానే అస్పష్ట చైతన్యం స్పష్టత సంతరించు కుంటుంది." (జయించేందుకు ఒక ప్రపంచం వుంది. పేరా 19.) కార్మిక వర్గ విప్లవంలో. మేధావుల పాత్ర-గ్రాంసీ రచనల్లో అత్యంత ఆసక్తి రేకెత్తించే భాగం అంటే అతిశయోక్తి కాదు.

తన చివరి రోజుల్లో ఇ.యం.యస్. నంబూద్రిపాద్, గ్రాంసీపై నాలుగు ధారావాహిక వ్యాసాలు 'ఫ్రంట్ లైన్' పక్షపత్రికలో రాశారు.

గ్రాంసీ, 'మేధావుల' పై రాసిన భాగాన్ని పొట్లూరి వెంకటేశ్వరరావు అనువదించి తెలుగు పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు.

☞ మిగతా 40వ పేజీలో

# గ్రాంసీ సిద్ధాంతం సార్వత్రికమైనది


## "ఆంటోనియో గ్రాంసీ జీవితం-కృషి" పుస్తక పరిచయం



సుశీ తారు

### పరిచయం

యూరప్, లాటిన్ అమెరికా ఖండాల్లో, ఇండియా తదితర దేశాల్లో మార్క్సిస్టు సిద్ధాంతం, కార్యాచరణలపై ఆంటోనియో గ్రాంసీ రచనలు ఎనలేని ప్రభావం నెరపుతున్నాయి. సోషలిస్టు కార్యక్రమానికి గ్రాంసీ మరింత లోతును, రాడికల్ స్వభావాన్ని కల్పించారని చెప్పవచ్చు. దీనివల్ల సోషలిస్టు కార్యక్రమం వర్తమాన కాలంలో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ వాస్తవికతకు మరింత చేరువ కాగలదు. బూర్జువా వర్గానికి ఈ ఒడిదుడుకులను తట్టుకొనే స్వభావం (resilience), మన్నిక (durability) ఎలా అబ్బినవో అర్థం చేసుకోడానికి తగిన భావనలను గ్రాంసీ అభివృద్ధి చేశారు. అంతే కాదు. సాంప్రదాయిక మార్క్సిస్టు పరిభాషలో సంతృప్తికరమైన విశ్లేషణ సాధ్యం కాని మహిళల, దళితుల, మైనారిటీల బాధలూ, ఆకాంక్షలూ నిజానికి రాజకీయమైనవేనని గ్రాంసీ ఆలోచనలను అధ్యయనం చేస్తే విశదమౌతుంది. సాంప్రదాయిక మార్క్సిజం వీటిని ఆర్థిక దోపిడీకి, రాజ్య అణచివేతకు సంబంధించినవిగానే చూస్తుంది. అంతేగాక, ఈ పోరాటాలలో వాస్తవికమైన ఆధిపత్య వ్యతిరేకత ఉంటుందనీ, ఆ వ్యతిరేకత స్వరూప స్వభావాలను ఇంతవరకు సోషలిస్టు కార్యక్రమం గుర్తించలేదని ఆయన రచనలు సూచిస్తాయి.




ఈనాడు మనకు గ్రాంసీ భావాల ప్రాముఖ్యతకు మరికొన్ని కారణాలూ ఉన్నాయి. అవి ఆయన కాలపు ప్రత్యేక చారిత్రక, జాతీయ నేపథ్యానికి సంబంధించినవి. యూరప్‌లో పెట్టుబడిదారీ సంక్షోభాలే విప్లవ పరిణామాలకు దారితీస్తాయని మార్క్సు, లెనిన్‌ల ప్రామాణిక రచనలు సూచిస్తాయి. ఉదాహరణకు మొదటి ప్రపంచ యుద్ధానంతరం విప్లవాత్మక పరిణామాలు ఊపందుకుంటాయని 1916లో లెనిన్ వాదించారు. 1920 ప్రాంతాల్లో ఇటలీలో లెనిన్ చెప్పినట్లుగానే జరుగుతున్నట్లనిపించింది. ఆర్థిక సంక్షోభం, కార్మిక వర్గ పోరాటాలు కలిసి సోషలిస్టు విప్లవానికి బాట వేస్తున్నట్టే అనిపించింది. కానీ ఇటలీ, స్పెయిన్, జర్మనీ తదితర యురోపియన్ దేశాల్లో పరిస్థితులు ఒక్కసారిగా ఊహించనిరీతిలో మలుపు తిరిగాయి. మితవాదం (right-wing) తన శక్తులను కూడదీసుకుంది. 1926 నాటికి వామపక్ష ఉదారవాద సోషల్ డెమోక్రటిక్ శక్తుల సఖ్యత (consensus) విచ్చిన్నమయింది. ప్రజలు ఎన్నికల్లో ఇటాలియన్ సోషలిస్టు పార్టీ (పి.ఎస్.ఐ)ని తొలగించి ఫాసిస్టు పార్టీకి అధికారం కట్టబెట్టారు. ప్రజల్లో దానికి చాలా బలం ఉన్నట్లనిపించింది. తాము ఇన్నాళ్లుగా ఊహించిన రాజకీయ ప్రపంచం ఒక్కసారిగా కుప్పకూలేసరికి వామపక్షం స్థైర్యం కోల్పోయి కకావికలయింది. పెట్టుబడిదారీ చరిత్రలో సంభవించిన తీవ్ర ఆర్థికమాంద్యం కార్మికవర్గాన్ని విప్లవం వేపు నెట్టలేక పోయింది.

గ్రాంసీ 1929-1936 మధ్యకాలంలో రాసిన జైలు రచనలు (Prison Note Books) ఈ పరిణామాలను తీవ్రతతో పట్టించుకొని, విశ్లేషించడానికి ప్రయత్నమని చెప్పవచ్చు, మితవాదం పునరావిర్భావాన్ని, దాని శక్తి మూలాలను అర్థం చేసుకుని, తన కాలంలో పెట్టుబడిదారీ విధానాన్ని ఫలప్రదంగా కూలదోయగల వ్యూహాన్ని రూపొందించడానికి చేసిన ప్రయత్నమిది. బూర్జువా వర్గానికున్న ఒడిదుడుకులను తట్టుకునే స్వభావాన్ని ఎలా వివరించగలం? దాని కొనసాగింపుకు, శక్తికి మూలాధారమేమిటి? ఫాసిజం తలెత్తడాన్ని అర్థం చేసుకోవడమెలా? వర్గపోరాటానికి ఇతర ప్రజాతంత్ర పోరాటాలకు మధ్య సంబంధం ఎలాంటిది? కార్మిక వర్గ ప్రయత్నాలు ఎందుకలా విఫలమయ్యాయి? పెట్టుబడిదారీ వాదానికి (thesis) నిజమైన, శక్తివంతమైన ప్రతివాదం (anti thesis) గా మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణలు ఎలా ఉండాలి, వాటిలో ఉండాల్సిన అంశాలేవి? ఇవి గ్రాంసీ లేవనెత్తిన కొన్ని ప్రశ్నలు.

తన విశ్లేషణలో గ్రాంసీ ఇటాలియన్ చరిత్ర మీద ఆధార పడ్డారు. ఇటలీలో అందరూ రిసార్జిమెంటో[1] (resorgimento) అని వ్యవహరించే 19వ శతాబ్ది మధ్యకాలపు బూర్జువా విప్లవాన్ని ఆయన ప్రత్యేకించి విశ్లేషించారు. ఈ క్రమంలో ఆయన ఇటాలియన్ జాతీయవాదాన్ని ఇటాలియన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధునికత స్వభావాన్ని కూడా విశ్లేషించారు. ఆ ఆధునికత్వంలో పరస్పరం పోటీపడిన రెండు ధోరణుల మధ్య వ్యత్యాసాలను ఎత్తిచూపారు. అందులో ఒకటి సాంప్రదాయువాద (conservative), నిష్క్రియాపరత్వ (passive) ధోరణి. చివరికి ఇదే ఆధిక్యం సంపాదించింది. మరొకటి, మరింత సమవాదం, రాడికల్ ఆధునికత్వాలకు ప్రాతినిధ్యం వహించే ధోరణి. చివరికిది ఓడిపోయి, అణచివేయబడింది. బూర్జువా వర్గంలోని సాంప్రదాయిక శక్తులు తిరిగి చాలా త్వరగా భూస్వామ్య వర్గాలతో చేతులు కలిపాయి. ఇటలీ ఉత్తరాది పెట్టుబడిదారులతో, దక్షిణాది భూస్వాములతో కూడిన ఆధిపత్యకూటమి ఆర్థిక రంగంలోనే కాకుండా 'పౌరసమాజం' (civil society) లోని విస్తృతమైన దైనందిన, సాంఘిక, వ్యక్తిగత, మేధోపర సంస్థలన్నింటిలోనూ వేళ్లూనుకుంది. సాధారణంగా మనం వ్యక్తిగతమని, 'సాంఘిక'మని వ్యవహరించే సామాజిక సంస్థలనుద్దేశించి గ్రాంసీ 'పౌరసమాజ' మనే పదాన్ని ఉపయోగించారు. అవేంటంటే–కుటుంబం, పాఠశాల, లైంగికత, వైద్య సంరక్షణ వ్యవస్థ, ఉనికి (identities), జ్ఞానవ్యవస్థలు, భావజాలాలు, తత్వాలు, రూపాల వంటి రంగాలకు కూడా పౌరసమాజ భావన వర్తిస్తుంది. సాంప్రదాయిక వాదులు ఈ వ్యవస్థలన్నిటినీ – సొంతం చేసుకున్నారు. తమ పరిపాలనకు సమ్మతి (consent) సంపాదించి పెట్టే సంక్లిష్ట సైద్ధాంతిక యంత్రాంగాన్ని నెలకొల్పుకొన్నారు. పౌరసమాజానికి చెందిన ఈ నైతిక రాజకీయ యంత్రాంగం అణచివేత, బల ప్రయోగాల (పోలీసులు, సైన్యం)తో కూడిన రాజ్య యంత్రాంగానికి సైదోడుగా పనిచేస్తుంది. విభిన్నరంగాల్లో బూర్జువా అధికారం ఎంతలోతుగా వేరూనిందంటే ఈ 'సాంప్రదాయిక' భావాలు, ఆలోచనా ప్రవర్తనా విధానాలు ఆధునికతను సంతరించుకుంటున్న మేధావుల మీద, సోషలిస్టు కార్యాచరణ మీద కూడా బలమైన ప్రభావం చూపాయి. రిసార్జిమెంట్‌లోని రాడికల్ శక్తులు రాజ్యాయంత్ర సాంప్రదాయిక రూపాలపై పోరాటానికే–అంటే, ప్రత్యక్ష పోరాటానికే – పరిమితమయ్యాయి. అదేవిధంగా ఈ శతాబ్దపు ఇటలీ వామపక్ష పోరాటాలు ట్రేడ్ యూనియనిజానికి, తక్కువ స్థాయి ఆందోళన ప్రచార కార్యక్రమాలకు పరిమితమయ్యాయి.

ఆ అనుభవాల నుంచి గ్రాంసీ తీసే పాఠాలేమిటి? అవి ఫాసిజం ఆవిర్భావాన్ని ఎలా వివరించగలుగుతాయి? 'కూటమి' (alliance) మీద బూర్జువా అధికారం ఆధారపడి ఉంది. అందుకే బూర్జువా వర్గం కొన్ని చిట్టి పొట్టి రాయితీలు సైతం ఇచ్చి ఇతరులను తన కూటమిలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తుంది. తన ఆర్థిక ప్రయోజనాలకూ, రాజకీయ అధికారానికి నిజంగా ముప్పు ఏర్పడిన మరుక్షణం రాజ్యయంత్రశక్తిని ప్రయోగిస్తుంది. ఇటువంటి స్థితిలోనూ దానికి మద్దతుగా ఒక సైద్ధాంతిక శక్తి అందుబాటులో ఉంటుంది. ఈ శక్తి అప్పటికే వేరూని ఉండడమే కాదు, వామపక్షీయుల మనసులోనూ చొచ్చుకుపోయి ఉంటుంది. ఆ శక్తినే బూర్జువావర్గ అధీనంలోని లోకజ్ఞాన జాతీయనిధి (national bank of commonsense) అని (సీయులలో ముఖ్యుడైన స్టూవర్ట్ హాల్ అభివర్ణించారు. సోషలిస్టు ఉద్యమం దాదాపు ఎలాంటి పోరాటమూ చేయకుండా బూర్జువావర్గానికి వదిలేసుకున్న ఆస్తి ఇది. రాజకీయరంగాన్ని రాడికల్‌గా తిరిగి సిద్ధాంతీకరించాల్సిన అవసరం ఉందని గ్రాంసీ విశ్లేషణ నొక్కి చెప్తుంది. గ్రాంసీ రచనలలో కేంద్రబిందువైన 'ఆధిపత్య భావన' ఉపరితలాన్ని విశ్లేషించే సిద్ధాంతంగా చెప్తారు. ఇది మార్క్స్ ఆర్థిక విశ్లేషణకు సరిపోల్చదగినదనీ, రాజకీయ కార్యాచరణపై లెనిన్ భావనలకు ఇది మరింత విస్తృతినీ, లోతునూ కలిగిస్తుందని చెప్తారు. గ్రాంసీ రచనలు ఆయన కాలపు ఇటలీలోని ఆధిపత్యానికి సంబంధించినవి. అయినప్పటికీ అవి నేడు భారతదేశంలో మనకు సైతం వర్తిస్తాయి. ఈనాడు అసమానంగా అభివృద్ధి చెంది, సంక్లిష్టంగా రూపొందిన వివిధ దేశాల మీద తన పాలనను విస్తరింప చేసుకోవాలన్న బహుళజాతి పెట్టుబడి ఆకాంక్షలు పెచ్చరిల్లుతున్న నేటి సందర్భంలో గ్రాంసీ ఆధిపత్యభావన మరింత ప్రాధాన్యత సంతరించుకొంది. బహుళజాతి పెట్టుబడి మొదట పౌరసమాజం మీద తన పెత్తనం నెలకొల్పుకుంటుంది. ఆ పెత్తనాన్ని సవాలు చేసినప్పుడు ఆంక్షలు, సైన్యాలూ రంగప్రవేశం చేస్తాయి.

ఈ రకం మార్క్సిస్టు సిద్ధాంతం ప్రధానంగా పౌరసామాజిక అధికారం మీద దృష్టి కేంద్రీకరిస్తుంది. రాజకీయాలు స్వతంత్రంగా ఉండవని గుర్తిస్తూ వాటి ప్రాథమికతను నొక్కి చెప్తుంది. అందువల్ల, చిరకాలంగా బూర్జువా వర్గం వేరూనుకున్న పశ్చిమదేశాలకే ఇది వర్తిస్తుందని కొందరు వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. ఇతరులు – ముఖ్యంగా లాటిన్ అమెరికన్లు అలా అనుకోవడం లేదు. విదేశీ పెత్తనం కింద నలిగిన చరిత్ర, గట్టిపట్టు కలిగిన మతం, స్థానిక భాషలతో సంబంధంలేని జాతీయ భాష, అత్యంత

అసమాన అభివృద్ధి, పలు విధాలుగా విభజితమైన జాతి వంటి లక్షణాలున్న ఇటలీ తరహాదేశాలకు గ్రాంసియన్ సిద్ధాంతం మరింత బాగా నప్పుతుందని వీరి అభిప్రాయం. అంతేకాదు నేడు పెట్టుబడిదారీ విధానం సరిగ్గా అటువంటి 'అసమ' పరిస్థితులలోనే ప్రపంచాధిపత్యం నెరపడానికి ప్రయత్నిస్తుందని వీరు గుర్తిస్తున్నారు.

నేడు భారతదేశంలో మార్క్సిజం ఎదుర్కొంటున్న సమస్యలకు గ్రాంసీ, ఆ మాటకొస్తే మరెవరైనా అంతిమ పరిష్కారం చూపగలరని భావించలేం. గ్రాంసీ దేవదూత కాదు. కానీ, గ్రాంసీ అధ్యయనం చేసిన పరిస్థితికీ నేటి పరిస్థితికీ మధ్య చాలా పోలికలున్నాయి. నేటి పెత్తందారీ వ్యవస్థలో పితృస్వామిక, బ్రాహ్మణవాద, జాత్యహంకార, సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ లక్షణాలు కలగలిసి ఉంటున్నాయి. ఈ పెత్తందారీ చట్రాన్ని అర్థం చేసుకోడానికి అధికారాన్ని గ్రాంసీ నిర్వచించిన తీరు ఎంతయినా ఉపయోగపడుతుంది. బూర్జువావర్గ పెత్తనాన్ని సవాలుచేసి, పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోయగల రాడికల్ కూటమిని రూపొందించుకోడానికి, దానికి ఉన్న అవకాశాలేమిటో తరచి చూడడానికి గ్రాంసీ ఆలోచనలు ఉపయోగపడతాయి. బలాబలాల మోహరింపును ఇలా సరికొత్తగా అర్థం చేసుకోవడంతో ఇన్నాళ్లూ రాజకీయంగా ముఖ్యం కావనుకున్న పలురంగాలు ఒక్కసారిగా ప్రాముఖ్యం సంతరించుకుని సవాళ్ళుగా నిలుస్తాయి. ఇంతవరకు మనం ఊహించని పలు అంశాలలో ఇమిడి వున్న పీడన యంత్రాంగాలను గుర్తించాల్సివస్తుంది. అలా గుర్తించడానికి తగిన పరిశోధన సాధనాల్ని రూపొందించుకోగలుగుతాం అధికారాన్ని సవాలు చేసే ప్రజా వర్గాలు మరెన్నో మనకు స్పష్టమవుతాయి. కొత్త రాజకీయ పాత్రధారులెందరో రంగప్రవేశం చేస్తారు. సమవాద (egalitarian) రాడికల్ ప్రజాతంత్ర రాజకీయాల పరిధి బాగా విస్తరిస్తుంది.

భారతదేశంలో 1970వ దశకం మధ్యభాగం నుంచి గ్రాంసీ ప్రభావం కనిపిస్తుంది. కొందరు క్రియాశీల మేధావులు గ్రాంసీ సిద్ధాంత స్ఫూర్తితో ఇక్కడి జాతీయ బూర్జువా వర్గ స్వభావాన్ని విశ్లేషించారు. అసంఖ్యాకంగా వచ్చిన ఉపశ్రేణి (subalterm) ఉద్యమాల గతిని వివరించడానికి, బూర్జువా వర్గం, దాని మిత్రులు తమ చారిత్రక ఆరోహణ క్రమంలోను, నేడు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ఈ ఉద్యమాలను ఎలా అణచివేశారో, వాటి జనామోదాన్ని ఎలా తగ్గించారో ఈ క్రియాశీల మేధావులు వివరించారు. ఆర్.ఎస్.ఎస్/బి.జె.పి/వి. హెచ్.పి. ముఠా వంటి మితవాద, ఫాసిస్టు అనుకూల భావజాలం ఒక్కసారిగా ఎలా తలెత్తగలిగిందో, ప్రజల మద్దతు ఎలా సంపాదించగలిగిందో గ్రాంసీ భావాల ఆధారంగా వివరించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. స్త్రీలకు సంబంధించినంత వరకు శుద్ధ ఆర్థిక పోరాటాల పరిమితిని, ప్రభుత్వ కేంద్రక రాజకీయాల పరిమితిని చిరకాలంగా గుర్తిస్తున్న స్త్రీవాదులు పితృస్వామిక అణచివేతను అర్థం చేసుకోడానికి కూడా గ్రాంసీ పౌరసమాజ భావన ఉపయోగపడింది. ఇటీవలి కాలంలో స్త్రీ ఉద్యమాలు, వర్గ-కుల పోరాటాలు, మతవాద సమస్యల మధ్య సంబంధం గురించిన రాజకీయ ప్రశ్నకు కూడా గ్రాంసీ ఆధిపత్యభావన బలం చేకూర్చింది. వామపక్ష, స్త్రీవాద వేదికలపై దళితులు దళిత సమస్యను లేవనెత్తడానికి సజీవ మేధావుల (organic intellectuals)కు, నాయకులకు సంబంధించిన గ్రాంసీ భావనలను ఉపయోగించుకున్నారు. కులపీడన నిర్మూలనోద్యమాలూ, మతవాద వ్యతిరేకోద్యమాలూ ఎదుర్కొంటున్న మరెన్నో సమస్యల మీద గ్రాంసీ సిద్ధాంతం నూతన వెలుగును ప్రసరింపజేసింది.

గ్రాంసీ కేవలం ఇటలీ వంటి దేశాలకు వర్తించే వెనుకబాటుతనం, అసమానాభివృద్ధి సిద్ధాంతకర్త మాత్రమేనా? అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు ఆయన ఆలోచనలు వర్తించవా? లేక ఐరోపా, అమెరికా సాంఘిక రాజకీయ సంక్లిష్టతకు అనుగుణంగా రాజకీయ వ్యూహాన్ని రూపొందించిన పశ్చిమ ఐరోపా లెనిన్‌గా ఆయనను అభివర్ణించవచ్చా? లియోనార్డో పగ్గీ చెప్పినట్లు ఇది పైకి కనిపించే వైరుధ్యమేగాని, నిజం కాదు. గ్రాంసీ సిద్ధాంతం మరింత సార్వత్రికమైనది. అలా సార్వత్రిక స్థాయిలో చూస్తే ఆయన ఆలోచనలను రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. గ్రాంసీ 'లెనినిజంలో కొత్త అధ్యాయం' రచించారని పగ్గీవాదం. గ్రాంసీ ఆలోచనలు ఆర్థికవాదం మీద, దరిమిలా రష్యా విప్లవంలోని సాంప్రదాయిక చారిత్రక భౌతికవాదం మీద విమర్శనాత్మక వైఖరిని అవలంభించాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోనూ, పెట్టుబడిదారీ విధానపు అంచునున్న దేశాల్లోనూ రాజకీయ పోరాట పరిస్థితులు రానురాను సాంప్రదాయిక చారిత్రక భౌతికవాద దశల సిద్ధాంతం ఊహించిన పరిస్థితులకు భిన్నంగా తయారవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రాంసీ విశ్లేషణ ప్రాముఖ్యం సంతరించుకుంది.

### పగ్గీ ఇలా రాశారు :

జారిస్టు రష్యాతో పోల్చినప్పుడు పశ్చిమ ఐరోపా పరిస్థితుల ప్రత్యేకతను వివరించడంపై 1924 నుండి గ్రాంసీ ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. కాని, ఆయన కృషిని ఆ ప్రత్యేక పరిస్థితుల గుర్తింపుకు

పరిమితం చేయలేం. పెట్టుబడిదారీ విధానం, పారిశ్రామికవాదం శిఖరాగ్రానికి చేరిన దేశాల్లోనే కార్మిక వర్గానికి అత్యంత అనుకూల పరిస్థితులు ఉంటాయనుకోవడం సరికాదు. ఇలా ఇతర అవకాశాల్ని సూచిస్తూ సిద్ధాంతీకరించడం పెట్టుబడిదారీ విధానం పరిపక్వం కాని దేశాల్లో కూడా విప్లవకర పరిస్థితులుంటాయని చెప్పడానికి మాత్రమే కాదు. అంతకన్న ముఖ్యంగా విశ్లేషణ సాధనాలను మొత్తంగా మార్చడానికి ఈ సిద్ధాంతం ఉపకరిస్తుంది. దీని అర్థం చారిత్రక భౌతికవాదానికి సాంప్రదాయిక భాష్యాన్ని వదిలేసుకోవడమే. ఈ సాంప్రదాయిక భాష్యం వాస్తవ పరిస్థితులకు సరిపోదని తూర్పు, పశ్చిమాలు రెండూ నిరూపించాయి. ఆ భాష్యంతో అక్టోబర్ విప్లవాన్ని అర్థం చేసుకోలేకపోయాం. అంతేగాక, పరిస్థితులు బాగా పరిపక్వమయ్యాయనిపించిన పెట్టుబడిదారీ దేశాలలోనూ తగిన రాజకీయ వ్యూహాన్ని రూపొందించడంలో సాంప్రదాయిక అవగాహన విఫలమైంది[2]

ఈ సమస్య పై కృషి చేసేకొద్దీ వరుసగా మరెన్నో సైద్ధాంతిక భావనలు రూపొందాయి. ఆధునిక యుగంలో అధికారం పునాదులను తాజాగా సిద్ధాంతీకరించడానికి ఈ కృషి దారి తీసింది. ఇది రాజకీయ కార్యాచరణలో అనేక మౌలిక మార్పులకు దారి తీసింది.

గ్రాంసీ మీద వచ్చిన వ్యాసాలను చూస్తే గ్రాంసీని ఎలా వ్యాఖ్యానించాలనే విషయమై ఎంత తర్జన భర్జన జరిగిందో తెలుస్తుంది. ఈ వ్యాసంతో సహా మరే వ్యాసమయినా మరొక వ్యాఖ్యానం మాత్రమే అవుతుంది. ఇలా అనడమంటే గ్రాంసీ మార్క్సిజంలోని మార్గదర్శక భావనలమీద, ఈనాటి విభిన్న రాజకీయ కార్యాచరణల్లో ఆయా భావనల ప్రాముఖ్యం మీద వ్యాఖ్యానించడం అసాధ్యమని కాదు. ❑

*విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సౌజన్యంతో...*

---

1. **రిసార్జిమెంటో :** ఇటలీ రాజకీయ ఐక్యత కొరకు 19వ శతాబ్దంలో వచ్చిన ఉద్యమం. ఇటలీ భాషలో దాని మూలార్థం పునరావిర్భావం. ఈ ఉద్యమంలో అనేక ధోరణులున్నాయి. ఒక ధోరణి ప్రకారం రాచరిక వ్యవస్థ కింద ఇటలీ ఐక్యత జరగాలి. మరొక ధోరణిననుసరించి గణతంత్ర వ్యవస్థ నాయకత్వాన ఐక్యత జరగాలి.
2. లియోనార్డ్ పగ్గీ రచన గ్రాంసీస్ జెనరల్ థియరీ ఆఫ్ మార్క్సిజం, పేజీలు 152-153 16
   ఆంటోనియో గ్రాంసీ : జీవితం - కృషి
3. **ఆర్డినోనోవో (L'Ordino Nuovo)** : 1919, మే మాసంలో స్థాపించబడిన ఒక వారపత్రిక, ఆర్డినోనోవో అంటే 'కొత్త వ్యవస్థ' అని అర్థం. టురిన్ నగరంలో ఉండే గ్రాంసీ, అతని సహచరులు దీనిని ప్రారంభించారు. ఈ వారపత్రిక ఇరవై మాసాలపాటే కొనసాగినప్పటికి, టురిన్ నగరంలోని కార్మికవర్గ ఉద్యమంపై తీవ్రమైన ప్రభావాన్ని నెరపింది.
4. **కొమింటర్న్ (1919-1943) :** మూడవ ఇంటర్నేషనల్ లేక కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ హ్రస్వ రూపమే కొమింటర్న్. 1917 రష్యాలో అక్టోబర్ విప్లవం విజయవంతమైన తరువాత బోల్షివి చొరవ మేరకు 1919 మార్చిలో కొమింటర్న్‌ను నెలకొల్పడం జరిగింది. ఎంతో విస్తృతమైన అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం భిన్న పరిస్థితులలో ఒక అంతర్జాతీయ కేంద్రం నుండి పనిచేయడం సాధ్యం కాదన్న కారణంతో కొమింటర్న్‌ను 1943 జూన్‌లో రద్దు చేశారు. స్టాలిన్ పశ్చిమ దేశాల స్నేహితులను తృప్తి పరచడానికి తీసుకొన్న చర్యగా కొమింటర్న్ రద్దు విమర్శల పాలయింది.
5. **అమడియో బోర్డిగా (1889-1970) :** 1912-18 సంవత్సరాల మధ్య కాలంలో ఇటలీ ప్రముఖ సోషలిస్టు నాయకులలో బోర్డిగా ఒకరు. డిసెంబర్ 1918లో ఇటలీ సోషలిస్టు పార్టీలోని తీవ్రవాదపక్ష ధోరణికి నాయకుడయ్యారు. సోషలిస్టు పార్టీని విప్లవాత్మక పార్టీగా మార్చడానికి బోర్డిగా పోరాటాన్ని సాగించారు. 1921లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన దగ్గర నుండి 1923 వరకు బోర్డిగా ఆ పార్టీ ప్రధాన నేతగా వ్యవహరించారు. 'ఐక్యసంఘటన' ఎత్తుగడలు, నూతన ఆర్థిక విధానం, ఫాసిజాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్న సమస్యల మీద బోర్డిగాకు మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కు మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. 1926 లో జరిగిన కొమింటర్న్ ఆరవ విస్తృత కార్యనిర్వాహక వర్గ సమావేశంలో స్టాలిన్ వ్యతిరేక గ్రూపుకు బోర్డిగా ప్రధాన ప్రతినిధి. 1926లో లయన్ (Lyons) లో జరిగిన మహాసభలో బోర్డిగాను ఏకాకిని చేశారు. 1930వ సంవత్సరంలో బోర్డిగాను పార్టీ నుండి బహిష్కరించారు. తరువాత కాలంలో ఆయన ఎక్కువగా తీవ్రవాదపక్ష రాజకీయ కార్యకలాపాలకే పరిమితమయ్యారు.

# గ్రాంసీ భావనలు - సంక్షిప్త పరిచయం

## 1. ఆధిపత్యం

ఆధిపత్యం (hegemony) అనేది గ్రాంసీ మలిరచనలలో కీలక భావన. మార్క్సిస్టు రచనలలో ఈ పదాన్ని కొన్నిసార్లు పెత్తనం (dominance) అనే అర్థంలో ఉపయోగించారు. ఉదాహరణకు 'కార్మిక వర్గ ఆధిపత్యం' (hegemony of the proletariat) అనే లెనినిస్టు పదబంధాన్ని 'కార్మికవర్గ నియంతృత్వం' (dictatorship of the proletariat) అని అనువదించారు. కాని స్వయంగా లెనిన్ ఆధిపత్యమనే మాటను, వర్గ సంఘటనకు నాయకత్వం అనే అర్థంలో వాడారు. ఉదాహరణకు రష్యాలో 1905 బూర్జువా–ప్రజాతంత్ర విప్లవానికి కార్మికవర్గ నాయకత్వం; 1917 తరువాత రైతాంగం తదితర భూస్వామ్య వ్యతిరేక బృందాలతో కూడిన అలయన్స్‌కు కార్మికవర్గ నాయకత్వం. గ్రాంసీ రచనల్లో ఈ పదం మొదట దక్షిణ ప్రాంత సమస్యలపై నోట్సులో కనిపిస్తుంది. అక్కడ ఇది దాదాపుగా లెనిన్ ఉపయోగించిన అర్థంలోనే కనిపిస్తుంది. జైలు రచనల్లోని ఇతర కోణాలతోనూ దీన్ని అనుసంధించారు. గ్రాంసీ కాలం నాటికి మార్క్సిజం ఆర్థిక సంక్షోభాలకు రాజకీయ పరిణామానికి మధ్యగల సంబంధాన్ని సునిశితంగా విశ్లేషించింది. కాని నిర్దిష్ట జాతీయ, స్థానిక రూపాలను, రాజ్యాధికార రీతులను, నిర్దిష్ట చారిత్రక నేపథ్యంలో ఆర్థిక వర్గాలకు, ఇతర విశాల ప్రజాతంత్ర సమూహాలకు మధ్య గల ప్రత్యేక సంబంధాలను, వాస్తవంలో సామాజిక వైషమ్యాలు సంఘర్షించడం, క్రమబద్ధీకరణ, సమసిపోవడం అనేవి తీసుకొనే సాంస్కృతిక, సైద్ధాంతిక రూపాలను విశ్లేషించడంలో బలహీనంగా ఉంది. అధికారాన్ని సిద్ధాంతీకరించడంలో, బూర్జువా పెత్తనానికి తోడ్పడే రాజకీయ, న్యాయ, సాంస్కృతిక, మనస్తత్వాది సంక్లిష్ట ఉపరితల అంశాలను సాంప్రదాయిక మార్క్సిజం సైద్ధాంతికంగా వివరించలేకపోయింది. గ్రాంసీ ఆధిపత్య భావన ఈ సమస్యలను లేవనెత్తింది.

### బూర్జువా వర్గ ఆధిపత్యం

గ్రాంసీ తన చారిత్రక అధ్యయనాల్లో బూర్జువా పెత్తన మూలాలను అది దీర్ఘకాలం అధికారం నిలబెట్టుకోడానికి ఉపయోగపడిన పునాదిని అర్థం చేసుకోవడం కోసం ఐరోపా బూర్జువా విప్లవాలను పరిశీలించారు. రాజకీయ పోరాటమంటే శత్రువర్గాల మధ్య సంఘర్షణ మాత్రమే కాదు. దానిలో మరింత సంక్లిష్టమైన శక్తి సంబంధాలు ఇమిడి ఉన్నాయి. దానికి తోడు, బూర్జువావర్గం సమ్మతి లేక మద్దతు సంపాదించాల్సి వచ్చింది. బూర్జువావర్గం తనకు జాతీయ ప్రజా సమ్మతి సృష్టించి పెట్టగల సైద్ధాంతిక యంత్రాంగాన్ని తయారు చేసుకుంది. నిజానికి, ఇదే దాని ప్రధానమైన బలం.

అభివృద్ధి నిరోధకం అయినప్పటికీ ఆనాటి ఇటాలియన్ రాజ్యం కూడా సమర్థమైన వర్గ సంఘటన (class alliance) ద్వారానే పనిచేస్తున్నదని గ్రాంసీ పేర్కొన్నారు.

ఉత్తరాది ఇటలీకి చెందిన పారిశ్రామిక పెట్టుబడి పలు సవాళ్ల నెదుర్కొని పెత్తనం నిలబెట్టుకోడానికి దక్షిణాది భూస్వాములతో తిరిగి తిరిగి ఎన్ని రాజీ బేరాలు కుదుర్చుకుందో గ్రాంసీ గుర్తు చేశారు.

ఇటలీ బూర్జువా వర్గాన్ని సవాలు చేయాలంటే కమ్యూనిస్టులు దక్షిణాది రైతాంగం, ఉత్తరాది పారిశ్రామిక కార్మికుల మధ్య అలయన్స్ సాధించడం అవసరమని గ్రాంసీ వాదించారు.

పెట్టుబడిదారీ విధానానికి, బూర్జువా రాజ్యానికి వ్యతిరేకంగా మెజారిటీ శ్రామిక ప్రజానీకాన్ని సమీకరించడానికి తగిన అలయన్స్ వ్యవస్థకు కార్మికవర్గం ఏ మేరకు సృష్టించగలదో ఆ మేరకు అది నాయకత్వ, ఆధిక్యవర్గం కాగలుగుతుంది. ఇటలీలో, అక్కడ ఉన్న నిజమైన వర్గ సంబంధాల నేపథ్యంలో చెప్పాలంటే రైతాంగ ప్రజల సమ్మతిని సాధించడం మీద కార్మికవర్గం విజయం ఆధారపడుతుంది.

ఇది జరగాలంటే కార్మికవర్గం తన సొంత ఆర్థిక ప్రయోజనాలను అధిగమించి ఆలోచించాల్సి ఉంటుంది. ఈ ప్రయోజనాలనే గ్రాంసీ 'కార్పొరేటిజం' అన్నారు. రాజకీయాల్లో ట్రేడ్‌యూనియన్ మనస్తత్వం విఫలం కావడానికి ఇదే ముఖ్య కారణమని భావించారు. అవసరమైతే రైతాంగంతో, దక్షిణాది మేధావులతో అలయన్స్‌ను సంఘటితం చేసుకోవడం కోసం కార్మికవర్గం తన ప్రయోజనాలు కొన్నిటిని త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు.

### జాతీయ ప్రజా స్వభావం

చారిత్రిక అలయన్స్‌లోని నాయకత్వవర్గం తన స్వీయ ఆర్థిక ప్రయోజనాలను అధిగమించి ఇతర ప్రజల ప్రజాతంత్ర ఆకాంక్షలనూ పోరాటాలను పరిగణనలోనికి తీసుకున్నప్పుడే అది

తన ఆధిపత్య చొరవను నిలబెట్టుకోగలుగుతుందని గ్రాంసీ నొక్కి చెప్పారు. నిజానికి ఆధిపత్యం సాధించదలచుకున్న వర్గం "మొత్తం జాతీయ శక్తి సామర్థ్యాల అభివృద్ధికి, సార్వత్రిక విస్తరణకు చలన (motor) శక్తిగా రూపొందాలి." కార్మికవర్గం ఆధిపత్యం సాధించడం కోసం తనను తాను "జాతీయం చేసుకోవాలి" అని ఆయనే మరో చోట రాశారు. ఈ భావన నేడు మనకు చాలా ముఖ్యమైన మరో ప్రశ్నకు దారితీస్తుంది. విభిన్న రకాల పోరాటాల మధ్య సంబంధానికి, జాతీయవాదానికి సంబంధించిన ప్రశ్న ఇది.

## జాతీయ - ప్రజామోద "సమిష్టేచ్ఛ" ను రూపొందించడం

బడుగు ప్రజలందరి సముద్ధరణ కోసమే సోషలిజం అనే భావనకు ఒక చారిత్రక రూపం కల్పించే ప్రయత్నమే ఆధిపత్యం గురించిన గ్రాంసీ భావన. సోషలిస్టులు కార్మికవర్గ ఆర్థిక ప్రయోజనాలు అనే సంకుచిత దృష్టితో కాకుండా, జాతీయ మెజారిటీ దృక్పథంతో ఆధిపత్య ధ్యేయంతో ఆలోచించాలని గ్రాంసీ వాదించారు.

జైలు రచనలలో ఈ ఆధిపత్య భావన గుణాత్మకంగా కొత్త కోణాలు సంతరించుకొంది. 'వర్గ సంఘటన నాయకత్వం'గా లెనిన్ అభివర్ణించడాన్ని అధిగమించి ఆధిపత్య భావాన్ని గ్రాంసీ అభివృద్ధి చేశారు. నైతిక, సైద్ధాంతిక నాయకత్వం ఆవశ్యకతను నొక్కి చెబుతూ గ్రాంసీ ఈ పదాన్ని విరివిగా వాడడం మొదలెట్టారు. దాన్ని సరికొత్త పౌరసమాజం భావనతో అనుసంధించారు. ఆ విధంగా 'ఆదిమ ఆర్థిక చలన' (primitive economic moment) దశలో ఆయా బృందాల వృత్తి సంబంధ ప్రయోజనాలే ప్రాముఖ్యం వహిస్తాయి. తదనంతరం 'రాజకీయ ఆర్థిక చలన' దశలో వర్గ ప్రయోజనాల గురించిన స్పృహ ఉంటుంది. కాని, ఇది ఆర్థిక స్థాయిలోనే ఉంటుంది. మూడవది ఆధిపత్య దశ. ఇందులో ఆర్థిక, రాజకీయ, మేధాపర ధ్యేయాల మధ్య ఐక్యత సాధించే సైద్ధాంతిక పోరాటం ప్రాముఖ్యం వహిస్తుంది.

ఇక్కడ నాయకవర్గం ఇతర సాంఘిక బృందాల ప్రయోజనాలతో తన స్వీయ ప్రయోజనాల్ని సమన్వయం చేసుకోవలసి ఉంటుంది. ఇక "అన్ని పోరాట సమస్యలను స్వీయ ప్రయోజనాల ప్రాతిపదికపై కాకుండా 'విశ్వజనీనం' ప్రాతిపదికపై" దర్శిస్తుంది. ఆ విధంగా "పలు అధీన శ్రేణుల మీద ప్రాథమిక సామాజిక బృందం ఆధిపత్యాన్ని నెలకొల్పుతుంది." ఇలా సంబంధిత అంశాలన్నిటి మధ్య ఉన్నత స్థాయి సమన్వయం సాధించి, వాటిని ఒక 'సమిష్టేచ్ఛ' (collective will)గా రూపొందించడమే ఆధిపత్య భావన సారాంశమనవచ్చు. ఈ ఐక్యతను గట్టిపరిచి నిలబెట్టగల సజీవ బంధంగా సైద్ధాంతిక సమైక్యత పనిచేస్తుంది. రాజకీయపార్టీ అతి ముఖ్య కర్తవ్యాల్లో ఇది ఒకటి.

ఈ రూపంలో, ఆధిపత్యం భావనకు రాజకీయ సమాజంతో కాకుండా పౌరసమాజంతో బలప్రయోగంతో కాకుండా సమ్మతితో, పెత్తనం లేక 'నియంతృత్వం'తో కాకుండా నిర్దేశకత్వంతో ఎక్కువ సంబంధం ఉంటుంది. కేవలం రాజ్యాన్ని కూలదోయడంతో కాకుండా "జాతీయ-ప్రజా" నాయకత్వ సమస్యతో ఇది ఎక్కువగా ముడిపడి ఉంటుంది.

ఆధిపత్యం లేక నాయకత్వం అనేది ఆర్థికంగా ఆధిక్యంలో ఉన్న లేక ఆధిక్యం సాధించబోతున్న ఉత్పత్తి విధానంలో వేరూని ఉంటుందని, అందువల్ల చారిత్రకంగా పుట్టుకొచ్చిన నూతన వర్గంలో వేరూని ఉంటుందన్నదే గ్రాంసీ అభిప్రాయం. ఆధిపత్య భావనలో పునాది (ఆర్థిక) కోణం, ఉపరితల (నైతిక – రాజకీయ) కోణం రెండూ ఉన్నాయని గ్రాంసీ పదేపదే ప్రకటించారు. రాజకీయాల్ని ఆర్థికం స్థాయికి కుంచింపచేయలేం. అలాగని, రాజకీయం స్వతంత్ర రంగమూ కాదు. రాజకీయం అనేది ఆర్థిక పునాదిపై అప్పటికే గుర్తింపు (identities) సంతరించుకున్న సాంఘిక బృందాలు సంఘర్షణకు దిగే రంగభూమి మాత్రమే కాదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతికశక్తులు సంబంధాలూ క్రియాశీలంగా, సృజనాత్మకంగా వ్యక్తమయి, నూతన నాయకత్వ రూపాలకు, నూతన అధికార రూపాలకు దారితీసే వేదిక రాజకీయరంగం.

ఆధిపత్యం అనేది నిరంతర చలనశీలమని కూడా గుర్తించాల్సి ఉంది. చలనశీలమనే మాటను రెండు విధాలుగా అర్థం చేసుకోవచ్చు. మొదటిది, ఆధిపత్యసరళి నాయకత్వంలో అలయన్స్ బృందాలు సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా జరిగే కృషిలో నిరంతరం పాలుపంచుకోవాలి. అంటే ఆయా బృందాల ప్రయోజనాలు అలయన్స్‌లో నిరంతరం వ్యక్తం కావాలి. ఈ స్థితిని అప్రమత్తంగా కాపాడుకోవాలి. రెండవది, ఆధిపత్య సాధన అంటే "అస్థిరాంశాలను రూపొందిస్తూ, వాటినధిగమిస్తూ పోయే ఒక నిరంతర క్రమం" అని గుర్తుంచుకోవాలి. వివరంగా చెప్పాలంటే, ఆధిపత్యయుత పరివర్తనను సాధించాల్సిన కొత్త వర్గం పుట్టుకొచ్చే క్రమంలో ఒక నాగరికత విచ్ఛిన్నమయి మరొక ప్రగతిశీల నాగరికత నిర్మాణమవుతుంటుంది. ఈ విధంగా పరివర్తనకు అనుకూలుర, వ్యతిరేకుల గుర్తింపులు పరస్పర సంబంధీకులుగా ఉండటమేగాక, నిరంతరం మార్పులకు లోనవుతుంటాయి. బూర్జువా వర్గం గాని కార్మికవర్గంలోని స్థిరమైన, శాశ్వతమైన స్వభావాన్ని కలిగి ఉండవు. పరస్పర పోరాట క్రమంలో వాటి మధ్య సంబంధాలు మారిపోతుంటాయి.

పోరాటంలో కార్మికవర్గం తన చొరవను కాపాడుకోవాలంటే బూర్జువావర్గం స్వభావంలో వచ్చే మార్పులను అప్రమత్తంగా గమనిస్తుండాలి. ఇది చాల ముఖ్యం. చారిత్రక నిర్దిష్ట దశను

పరిగణనలోనికి తీసుకోవడం ద్వారానే అప్రమత్తత సాధ్యమని గ్రాంసీ పదేపదే నొక్కి చెప్పారు. సిద్ధాంతాలు, వ్యూహాలు నేలమీద వాస్తవ జీవనరూపాలను విస్మరించకూడదు. వాస్తవ, జాతీయ పరిస్థితులను కేవలం విశ్వజనీన సూత్రాలకు ఉదాహరణలుగా పరిగణించకూడదు.

పౌరసమాజంలో ప్రవర్ధిల్లే అధికారం గురించి మరే మార్క్సిస్టు మేధావి కన్న ఎక్కువగా గ్రాంసీ ఆలోచించాడని చెప్పవచ్చు. సంస్కృతి/భావజాలం సమస్యలను ఆయన లోతుగా తరచి చూశారు.

సమర్ధ రాజకీయ కార్యాచరణ ఏదైనా ఆయా పరిస్థితుల నిర్దిష్టతను పట్టించుకొని తీరాలి. సారాంశంలో గ్రాంసీ అభివృద్ధి చేసిన ఆధిపత్యం భావనలో కొన్ని ముఖ్యాంశాలను గుర్తించవచ్చు. ఒకటి, చారిత్రక శిబిరంలో అలయన్స్ నాయకత్వ సమస్య; రెండు, చారిత్రక శిబిరంలో బలాబలాల పొందికల్ని అప్రమత్తంగా కాపాడుకోవాలనీ, నాయక బృందం జాతీయ ప్రజా సైద్ధాంతిక, రాజకీయ శక్తిగా కూడా ఉండాలనే అభిప్రాయం; మూడు, ఈనాటి పరిస్థితుల్లో అధికారం అనేది (పూర్తిగా కాకపోయినా) ప్రాథమికంగా సమ్మతి ద్వారానే పని చేస్తుందనీ, అది ప్రధానంగా (ఆర్థికం, రాజ్యాలలో గాక) పౌరసమాజ రంగంలో మరింత ఎక్కువగా పనిచేస్తుందనేది.

## 2. పౌరసమాజం

ఆధిపత్యం గురించిన గ్రాంసీ ఆలోచనల్లో పౌరసమాజం ఒక కీలకాంశం. మార్క్సు ఇలా రాశారు:

"ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలోని ఒక నిర్దిష్ట దశలో వ్యక్తులందరి మధ్య భౌతిక సంపర్కం (material intercourse) పౌరసమాజం అవుతుంది. సమస్త చరిత్రకు ఇదే మూలవనరు, రంగభూమి. ఇప్పటివరకు చరిత్ర గురించి ఉన్న అవగాహన ఎంత హాస్యాస్పదం! ఈ అవగాహన వాస్తవ సంబంధాల్ని నిర్లక్ష్యం చేసి, రాజులు రాజ్యాల వంటి ఆడంబర నాటకాలకు పరిమితమయింది."

రాజ్యం పాలకవర్గం చేతి పనిముట్టు, పౌరసమాజం చరిత్ర చోదక శక్తి అన్న మార్క్సు అభిప్రాయంతో గ్రాంసీ ఏకీభవించారు. అయితే, గ్రాంసీ పౌరసమాజాన్ని ఆర్థికంతో సమానం చేయలేదు. పౌరసమాజం కేవలం ఆర్థిక సంబంధాల వల్ల నిర్ణయమవుతుందని భావించలేదు.

గ్రాంసీ మాటల్లో –

ఉపరితలంలో రెండు ప్రధాన స్థాయిలను మనం గుర్తించవచ్చు. ఒకటి పౌరసమాజం. ఇది మామూలుగా మనం 'వ్యక్తిగతం' (ప్రైవేట్) అని వ్యవహరించే సజీవ అంశాల సమాహారం. రెండవది, 'రాజకీయ సమాజం' లేక రాజ్యం . ఈ రెండు స్థాయిలకు ఒక పక్క మొత్తం సమాజం మీద ఆధిక్య బృందం అమలు జరిపే 'ఆధిపత్యం' విధితోనూ, మరో పక్క రాజ్యం ద్వారా 'చట్టబద్ధ' ప్రభుత్వం ద్వారా అమలు జరిగే 'ప్రత్యక్ష పెత్తనం' లేక కమాండ్‌తోనూ సంబంధం ఉంటుంది.

గ్రాంసీ పౌరసమాజ భావన రాజ్యం. రాజకీయ రంగాలపై మరింత పరిపుష్టమైన అవగాహనకు దారితీసింది. మార్క్సువలెనే గ్రాంసీ కూడా బూర్జువా, స్వేచ్ఛా వాణిజ్య ఆర్థిక సంబంధాలు విస్తృత రూపం ధరించే రంగభూమిగా పౌరసమాజాన్ని గుర్తించారు. అయితే, అది అధికార (power) సంబంధాలకూ రంగభూమి అవుతుందనేది గ్రాంసీ సూత్రీకరణలో విప్లవాత్మకం.

"రాజ్యం" రెండు విధాలుగా పనిచేస్తుందని గ్రాంసీ సూచించారు. ఒకటి పెత్తనం. అంటే దమన నీతి, భౌతికంగా బలవంత పెట్టడం. రెండు సమ్మతి. ఇది వ్యక్తిగత జీవితాన్ని క్రమబద్ధీకరించే సంస్థల ద్వారా, భావజాలం ద్వారా పనిచేస్తుంది. విస్తృత వైవిధ్యం కలిగిన సంస్థలు, ఇన్నాళ్లూ రాజకీయాలతో సంబంధం లేనివని అనుకుంటున్న సంస్థలు కలిసి పౌరసమాజం అవుతుంది. పాఠశాల, కుటుంబం, మతం, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, ప్రసార సాధనాలు – అటువంటి సంస్థలకు మంచి ఉదాహరణలు. నిత్య జీవిత సంఘటనలను అర్థం చేసుకోడానికి, విశ్లేషించుకోడానికి ఉపయోగించే లోకోక్తులు, దైనందిన 'తర్కం' పౌరసమాజంలో భాగం. దీన్నే గ్రాంసీ 'లోకజ్ఞానం' (common sense) అనే పదంతో సూచించారు. విజ్ఞాన వ్యవస్థలు లేక విద్వేక శాస్త్రాలు (సైన్సు, కళలు, తత్వశాస్త్రం), వృత్తిపర కార్యాచరణలు (వైద్యం, న్యాయశాస్త్రం, మేనేజ్ మెంట్) సౌందర్య (aesthetic) రూపాలు (కథా కథన కాల్పనిక సాహిత్యం, వాస్తవికవాద సినిమా, శాస్త్రీయ నృత్యం) మొదలయినవన్నీ ఇందులో చేరిపోతాయి. అంటే ఈ రంగాలు అన్నీ రాజకీయ జోక్యానికి అనువైన రంగాలే అవుతాయి. –

ఈ రకం సంస్థలు రాజ్యం పరిధికి బయట ఉన్నట్లు కనిపిస్తాయి. స్వయం ప్రతిపత్తితో రూపొంది పనిచేస్తున్నట్లు, వాటిలో 'స్వేచ్ఛాయుత' పౌరులు 'స్వేచ్ఛగా' సమ్మతించి పని చేస్తున్నట్లు, సంస్థలను పునరుత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తాయి. నిజానికి ఇవన్నీ కలిసి పౌరసమాజం అవుతాయి. ప్రధానంగా ఈ పౌరసమాజ సంస్థలలోనే ఆధిపత్యవర్గం నాయకత్వం నెరపుతుంది. తన అధికారానికి సమ్మతిని సాధిస్తుంది. దీనికి భిన్నమైనవి దమన రాజ్య సాధనాలు (repressive state apparatuses). ఈ నియంత్రణ సాధనాలకు ప్రాముఖ్యం

ఇవ్వడంలో ప్రభుత్వాల మధ్య తేడాలుంటాయి గాని, ఏ ప్రభుత్వ మయినా – చివరికి అత్యంత నిరంకుశ ప్రభుత్వం కూడా – ఏదో మేరకు సమ్మతి సాధించి న్యాయబద్ధత నెలకొల్పుకోకుండా మనజాలదు.

అధికారం నిరంతర బేరసారాలతో మార్పులు చేసుకోవలసిన అలయన్స్ అయినప్పుడు, రాజ్యాన్ని కేవలం ఆర్థిక లేక ఉత్పత్తి సంబంధాల వ్యక్తీకరణగా పరిగణించలేం. అది మరింత సంక్లిష్టమైనది. సాపేక్షికంగా స్వయం ప్రతిపత్తి కలిగినటు వంటిది. మొత్తం మీద గ్రాంసీ రాజ్యాన్ని ప్రభుత్వంగా చూడడంతో పాటు పౌరసమాజంలో పని చేస్తూ అది చలాయించే అధికారాన్ని కూడ పట్టించుకొన్నట్టు విదితమవుతుంది.

తొలగించడం అసాధ్యం అనిపించే విధంగా గట్టిగా వేరూనుకున్న బూర్జువా అధికార రూపాలు అణచివేత సాధ్యమైన రాజ్యంలోనే కేంద్రీకృతమయి ఉండవు. అవి దైనందిన జీవితాన్ని, యాదృచ్ఛిక 'లోకజ్ఞానాన్ని' నియంత్రించే అన్ని సంస్థలూ సంప్రదాయాలలో వ్యాపించి ఉంటాయి. పౌరసమాజంలోని సాంఘిక సంబంధాలు ఉత్పత్తి సంబంధాలను ప్రభావితం చేస్తాయి. ఉపరితలాంశాల వల్ల ప్రభావితం కాని 'పునాది' ఏది వాస్తవానికి లేదు. అంతేకాదు. పెట్టుబడి–శ్రమల మధ్య సంబంధం కేవలం రెండు వర్గాలకు చెందిన సూటి సంబంధం కాదు. ఇతర బృందాలు వర్గాలు కూడా కలిసిన సంక్లిష్ట సంబంధమిది. కార్మికులు బూర్జువా సంస్థలతో, భావజాలంతో వాస్తవంగా తలపడాల్సిన అంశాలివి. ఆధిపత్య వ్యతిరేక (counter hegemonic) పోరాటానికి ఇవే వ్యూహాత్మకంగా సరైన రంగభూమి అవుతాయి. అందువల్ల ఈ అంశాలను సవివరంగా అతి సూక్ష్మ (molecular) స్థాయిలో పట్టించుకోవాలి.

మొత్తం మీద, ఉన్న ఆధిపత్యాన్ని సవాలు చేయడమైనా కొత్తదాన్ని నెలకొల్పడమైనా పౌరసమాజంలోనే జరగాల్సి ఉంది. ఈ రంగంలో నిరంతరాయంగా పోరాటాలు జరుగుతుంటాయి. మిత్రవర్గాల మధ్యనా, ఆధిక్య అధీన వర్గాల మధ్య సంబంధాలలో సమతూకం నిత్యం మారుతూ ఉంటుంది. ఈ రంగానికి 'సాంఘిక'మని ముద్రపడిపోవడం వల్ల దీని రాజకీయ ప్రాముఖ్యం అస్పష్టమౌతున్నదని గ్రాంసీ వివరించారు. "రాజకీయ శాస్త్రమంటే రాజ్యసంబంధ శాస్త్రం అయినట్లయితే, రాజ్యమంటే పాలకవర్గం తన పెత్తనాన్ని సమర్థించుకుని నిర్వహించుకోవడానికి, పాలితుల నుంచి సమ్మతి సాధించడానికీ ఉపయోగించే ఆచరణాత్మక, సైద్ధాంతిక చర్యల చట్రం అయినట్లయితే అప్పుడు సాంఘిక శాస్త్ర ముఖ్య సమస్యలన్నీ రాజకీయ శాస్త్ర సమస్యలే అవుతాయి." అని గ్రాంసీ రాశారు.

## 3. భావజాలం, లోకజ్ఞానం

భావజాలానికి సంబంధించిన గ్రాంసీ భావన నేడు మనం 'సంస్కృతి' అంటున్న దానికి సన్నిహితమైనది. ప్రపంచం, వస్తుజాలం చారిత్రకంగా, నిర్దిష్ట అర్థాలు సంతరించుకునే రంగమే సాంస్కృతిక రంగం. ఏ అర్థాలతో వ్యవహరించే సాంఘిక బృందం చాలా చిన్నది కావచ్చు (ఉదా : కుటుంబం లేక మత శాఖ) చాలా పెద్దది కావచ్చు (ఉదా: శాస్త్రజ్ఞులు, ప్రసార సాధనాల ప్రేక్షకులూ – చదువరులు, జాతి, పితృస్వామికం, బ్రాహ్మణవాదం, మొ॥) ఈ అర్థంలోనే భావజాలాన్ని కళలు, న్యాయశాస్త్రం, ఆర్థిక కార్యకలాపాల వంటి వ్యష్టి, సమిష్టి జీవన రూపాలన్నిటిలో కనిపించే ప్రాపంచిక అవగాహన (conception of the world) అని గ్రాంసీ నిర్వచించారు.

### లోకజ్ఞానం

పౌరసమాజంలో ఆధిపత్యం 'లోకజ్ఞానం' మీద ఆధారపడి ఉంటుందని, లోకజ్ఞానం ద్వారా పునరుత్పత్తి చెందుతుంటుందని గ్రాంసీ భావించారు. అందువల్ల ఈ పదం గురించి మరింత వివరంగా చర్చించడం అవసరం. ఇది కొంతవరకు భావజాలం లేక సిద్ధాంతం స్థానాన్ని ఆక్రమిస్తుంటుంది. తత్వశాస్త్రమనేది కేవలం వృత్తితత్వవేత్తలు ఆచరించే మేధోవిభాగం మాత్రమే కాదని గ్రాంసీ వాదం. ప్రజలు ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమంలో అనుసరించే యాదృచ్ఛిక తత్వశాస్త్రంలో "విభిన్న సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులలో ప్రజలు నిర్విమర్శకంగా స్వీకరించి జీర్ణించుకునే ప్రాపంచిక అవగాహన ఉంటుంది. దీనినుంచే సగటు మానవుని నైతికవ్యక్తిత్వం రూపొందుతుంది." మరో మాటలో చెప్పాలంటే ప్రపంచాన్ని చూసి, అర్థం చేసుకుని, భాష్యం చెప్పుకోడానికి లోకజ్ఞానం దారి చూపుతుంది. మన గురించీ, వ్యక్తులుగా మన కార్యకలాపాల గురించి అవగాహన అందిస్తుంది. ఈ విధంగా నిర్దిష్ట యుగంలోని లోకజ్ఞానాన్ని ప్రభావితం చేయడం ద్వారానే – మార్క్స్ మాటల్లో చెప్పాలంటే – తత్వశాస్త్రం నిజమైన భౌతిక శక్తిగా మారుతుంది. మరి ఈ తత్వశాస్త్రాలను గ్రాంసీ యాదృచ్ఛికమని అనడానికి కారణమేమిటి? దీనికి జనాలు ఆయన మాటల్లోనే చెప్పాలంటే "అవి అప్పటికే చైతన్యయుతమైన నాయకత్వ వర్గానికి క్రమబద్ధ విద్యా కార్యక్రమాల ద్వారా కాకుండా (ఉదా : పాఠశాల, రాజకీయ పార్టీల ద్వారా కాకుండా) 'లోక జ్ఞానం' వెలుగులో దైనందిన అనుభవాల ద్వారా రూపొందుతాయి. అంటే ప్రాచుర్యంలో ఉన్న సాంప్రదాయక ప్రపంచావగాహన ద్వారా రూపొందుతాయి. ఈ ప్రపంచావగాహననే – అనాలోచితంగా – సహజాతం (instinct) అని భావిస్తుంటారు.

కాని ఇది కూడా ప్రాథమికంగా మొదట్లో మానవుడు చారిత్రక క్రమంలో సంతరించుకొన్నదే."

ఈ అర్థంలోనే మనిషి ప్రతి మాటలోనూ ఒక ప్రపంచావగాహన ఉంటుందనీ, ప్రతి మనిషీ తత్వవేత్తేనని గ్రాంసీ అన్నారు. ఇది 'తత్వ శాస్త్రజ్ఞులు కాని వారి తత్వశాస్త్రం." విభిన్న భావాల్ని, ఊహల్ని స్థిరీకరించుకున్న నుడికారం; భాషా సంప్రదాయాలలో; దైనందిన సాంఘిక జీవితం నుంచి, పరస్పర సంబంధాలలోంచి నేర్చుకున్న విషయాలలో; ప్రజల మత భావనల్లో ఈ 'తాత్వికేతరుల తత్వశాస్త్రం' ఉంటుంది. "అందువల్ల నమ్మకాల్లో, మూఢ నమ్మకాల్లో, అభిప్రాయాల్లో, విషయాల్ని అర్థం చేసుకోడానికీ ఆచరించడానికి అనుసరించే మార్గాలలో ప్రజల దైనందిన నైతిక ప్రవర్తనలో, ప్రపంచంలో 'హేతుబద్ధంగా' జీవించే ప్రయత్నంలో ఈ తత్వశాస్త్రం ఉంటుంది. ఈనాడు మనం ఈ జాబితాకు ప్రసార సాధనాలను (టెలివిజన్, సినిమా, పత్రికలు) కూడా చేర్చుకోవలసి ఉంటుంది.

ఈ లోకజ్ఞానానికి, తాత్వికుల తత్వశాస్త్రానికి మధ్య తేడా స్పష్టం. రెండవది ఒక మేధావి రూపొందించిన కొన్ని భావనల వ్యవస్థీకృత చట్రం. మొదటిది చారిత్రకమయినది. సజీవమైనది. ఒక సాంఘిక వ్యవస్థలో భాగం. అది సంఘంలోని సంస్థలూ సంప్రదాయాల నిర్మాణాన్ని పనులను నియంత్రిస్తుంది. మానవుల దైనందిన కార్యకలాపాలను నిర్దేశిస్తుంది.

లోకజ్ఞానాన్ని అధిక్య సాంఘిక చట్రాలూ విలువలు నియంత్రిస్తాయనేది స్పష్టం. అందువల్ల దానిలో జోక్యం చేసుకుని, దానికొక విమర్శనాత్మకతను కలుగచేయాలి. లేక గ్రాంసీ మాటల్లో చెప్పాలంటే దాన్ని 'మంచి వివేచన' (good sense) గా మార్చాలి. ఇది విద్య చేయాల్సిన పని. ఇది సోషలిస్టు రాజకీయాల్లో కీలకాంశం. రాజకీయ పార్టీ నిర్వహించాల్సిన అతి ముఖ్య పాత్ర.

లోకజ్ఞానం మంచి (మార్క్సిస్టు) వివేచనగా మారే స్వీయాత్మక పరివర్తనకు తగిన వంతెనను నిర్మించడం అవసరం. ఇది మేధావుల – ముఖ్యంగా శ్రామిక వర్గ సజీవ మేధావుల – ముఖ్య కర్తవ్యం. సాంప్రదాయక/తిరోగామి ఉద్యమాలలో కన్న ప్రగతిశీల ఉద్యమాల్లో ఈ కర్తవ్యం ఎక్కువ క్లిష్టమైనది. ఎందుకంటే సాంప్రదాయకవాదులు అప్పటికే ఉన్న లోకజ్ఞానపు 'జాతీయ నిధి"ని ఉపయోగించుకోగలుగుతారు. అంతేకాదు "లోకజ్ఞానం లోని పలు మూలవిషయాలు మతం నుంచి ఉత్పన్నమయినవే" అందువల్ల "మేధావుల తాత్విక వ్యవస్థలకు (ఉదా : మార్క్సిజానికి), లోకజ్ఞానానికి మధ్యన ఉండే సంబంధం కన్న మతం, లోకజ్ఞానాల మధ్య సంబంధం ఎక్కువ సన్నిహితంగా ఉంటుంది."

కొన్ని లోకజ్ఞాన అంశాలను నిర్విమర్శకంగా పునరుపయోగించడంలో తప్పు అని, మార్క్సిజాన్ని పాజిటివిస్టు సైన్సుగా పరిగణించడం వల్ల ఈ తప్పు జరుగుతుంటుందని ఆయన అన్నారు. "లోకజ్ఞానంలో వాస్తవిక, భౌతిక విషయంగా, ఇంద్రియాత్మక (sensation) ఉత్పత్తుల వలె కనిపిస్తాయి." అని అయన రాశారు. కాని ఇవి భౌతిక విషయంగా, ఇంద్రియాత్మక (sensuous) వాస్తవికతగా కనిపించే దానికి "మతంతో ఎలాంటి వైరుధ్యం లేదు. నిజానికి, లోకజ్ఞానంలోని ఈ 'భౌతిక' అంశాలే మూఢనమ్మకాలూ, అవిమర్శిత విశేషాలు, బుఖారిన్ వ్రాసిన పాపులర్ మాన్యువల్ ఆఫ్ సోషియాలజీ వంటి పుస్తకాలతో ఇదే ప్రమాదం. "లోకజ్ఞానం టాలెమీ (భూ కేంద్రక విశ్వం) ఆలోచనల వద్ద, అన్నిటినీ మానవరూపాలుగా పరిగణించే మానవ కేంద్రక యోచనల వద్ద నిలిచిపోవడానికి దోహదం చేసిన ఈ అవిమర్శిత విషయాన్ని శాస్త్రీయంగా విమర్శించాల్సింది పోయి, (బుఖారిన్) తరచు వాటిని బలపరిచారు."

ఇప్పుడిక, మేధావుల గురించి గ్రాంసీ ఆలోచనను, ఆయన 'సజీవ మేధావుల' సిద్ధాంతాన్ని పరిశీలిద్దాం.

## 4. మేధావులు

మేధావుల విషయమై, సాధారణ లోకాభిప్రాయాన్ని ప్రశ్నించడం ద్వారా గ్రాంసీ దానిపై చర్చను ప్రారంభిస్తారు. మేధావులంటే ఆలోచించే మనుషులని సాధారణంగా అనుకునేది. అందుకే తాత్వికులను, రచయితలను, శాస్త్రజ్ఞులను మాత్రమే మేధావులుగా పరిగణిస్తుంటారు. కానీ మేధావులను ఇతర్ల నుంచి వేరు చేసే అంశం వారు ఆలోచించటమనేది కాదు. ఆలోచన అనేది మనుషులందరూ చేసే పనే, చేయగలిగే పనే. సంఘంలో, వారు నిర్వర్తించే విధులను బట్టే మేధావులను ప్రత్యేకంగా గుర్తించాలి. ప్రతి ఒక్కరూ ఆలోచించగలిగినప్పటికి సంఘంలో అందరూ మేధో విధులు నిర్వర్తించలేరు.

ఈ విధంగా పరిశీలించినప్పుడు మేధావులు సమాజంలోని సకల రంగాలలో సమీకర్తల (ఆర్గనైజర్ల) పాత్ర నిర్వహించేవారని వెల్లడవుతుంది. మేధావులు ఒక సాంఘిక బృందానికి విద్యా చైతన్యాన్ని అందించే వారుగా, పాలనా నిర్వాహకులుగా, నిర్దేశకులుగా, నాయకులుగా వ్యవహరిస్తుంటారు.

'పౌరసమాజం' మీద గ్రాంసీయన్ అభిప్రాయాల నేపథ్యంలో చూపినప్పుడు మేధావుల గురించిన ఈ ఆలోచనల ప్రాముఖ్యం విస్పష్టమవుతుంది. అధికారం ప్రధానంగా బల ప్రయోగం ద్వారా కాకుండా, సమ్మతిని సమీకరించి పెట్టే రాజకీయ, సాంస్కృతిక మధ్యవర్తుల ద్వారా అమలు జరుగుతుంటుందని భావించేట్లయితే, ఆధిపత్య వ్యవస్థ నిర్వహణలో, దాని పునరుత్పత్తిలో, ఈ మధ్యవర్తుల/సమీకర్తల కీలక పాత్రను గుర్తించక తప్పదు. మేధావులు సమీకర్తల పాత్ర నిర్వహిస్తారని అనడం ఈ అర్థంలోనే.

చరిత్రలో ప్రాథమిక సాంఘికవర్గం ఆవిర్భవించిన ప్రతిసారీ కొత్త సమీకర్తల/మేధావుల బృందాలూ రూపొందుతుంటాయని గ్రాంసీ గుర్తు చేశారు. "తమ వృత్తిని, ఉద్యోగాన్ని బట్టి కాకుండా (అంతకు మించి) తాము సజీవ సంబంధం కలిగి వున్న వర్గం భావాలకు, ఆశయాలకు వారు అందించే నిర్దేశకత్వాన్ని బట్టి వారు సజీవ మేధావులుగా గుర్తింపు పొందుతారు" ఆ వర్గానికి ఏకీకృత రూపం, న్యాయబద్ధత, తన పాత్ర గురించిన చైతన్యం అందించేది సజీవ మేధావులే. ఉదాహరణకు పెట్టుబడిదారులు తమతో పాటు తమకు సంబంధించిన మేధావులను – పారిశ్రామిక సాంకేతికులను, మేనేజర్లను, రాజకీయార్థశాస్త్ర నిపుణులను, నూతన సంస్కృతీ, శాసన వ్యవస్థ, విద్యా విజ్ఞానశాస్త్ర సమీకర్తలను – కూడా ముందుకు తెస్తారు. విద్వైక, సాహిత్య, శాస్త్ర, వృత్తి నైపుణ్యాది రంగాలలో మునుపటి నుంచి ఉండే సాంప్రదాయిక మేధావుల నుంచి వేరుచేసి చూపడానికే సజీవ మేధావులు అనే పదాన్ని గ్రాంసీ ఉపయోగించారు.

భావవాద, పాజిటివిస్టు ఆలోచనల పరిధిలో ఈ సాంప్రదాయిక మేధావులు చాలా 'శాస్త్రీయం'గా, స్వయంప్రతిపత్తి కలిగి ఉన్నట్లుగా కనిపిస్తారు. తమ గురించి తాము అలా అనుకుంటారు కూడా. వారి విజ్ఞానానికి కొంత 'బాహ్యవర్గ ప్రతిష్ఠ' (inter-class aura) ఉన్నట్లు, అది చరిత్రకు నిరంతరత్వాన్ని కల్పిస్తున్నట్లు కనిపిస్తుంది. అయినా సంఘంలో వారి స్థానం వర్గసంబంధాల నుంచి వచ్చిందే.

1867లో క్రైస్తవ రాజ్యాలకు వ్యతిరేకంగా జరిగిన చివరి దండయాత్రలో గాయపడిన గారిబాల్డీ – ఇటలీకి రోమ్ రాజధాని అయిన తరువాత – సార్డీనియాకు సమీపంలోని కాప్రీ ద్వీపంలో శేషజీవితాన్ని గడిపారు.

మేధా కార్యకలాపాలతో ఏ మాత్రం సంబంధంలేని మానవ కార్యాచరణ అంటూ ఏదీ లేదంటారు గ్రాంసీ. "వస్తూత్పాదక మానవుడి (homo faber) నుంచి ఆలోచించే మానవుడి (homo sapiens)ని వేరు చేయలేం" అంటారాయన. ఈ అర్థంలో ప్రతి ఒక్కరూ 'తత్వవేత్తే' ఎందుకంటే మనుషులు తాము చేసే పనికి తోడుగా కళాకారులు, అభిరుచులు కలిగినవారు కూడా అయి వుంటారు. వారు "ఒక ప్రాపంచిక అవగాహనలో పాలు పంచుకుంటారు. ఒక నైతిక పంథా కలిగి ఉంటారు. ఆ విధంగా ఒక ప్రాపంచిక అవగాహనను కాపాడే పనికి లేదా దాన్ని మార్చే పనికి – అంటే నూతన ఆలోచనా విధానాల ఆవిర్భావానికి – దోహదం చేస్తుంటారు. నూతన జ్ఞానరూపాలు, సంఘ సమీకరణకు కొత్త అవకాశాలు ఎక్కడి నుంచి వస్తాయి? అప్పటికే ఉన్న జ్ఞాన, సంఘ సమీకరణ రూపాల పట్ల విమర్శనాత్మకంగా స్పందించే క్రమంలోనే కొత్త జ్ఞాన రూపాలు ప్రభవిస్తాయని, పునాది నుంచి పైకి ప్రసరిస్తాయని గ్రాంసీ భావించారు.

మేధావి సమీకర్తలు పార్టీల్లోనో, యూనివర్సిటీల్లోనో మాత్రమే ఉంటారనుకోవడం పొరపాటు. ప్రతి జీవనరంగంలోనూ వారు పనిచేస్తుంటారు. మనం ప్రతి జీవన రంగంలోనూ పోటీపడి గెలవాల్సి ఉంటుంది. "అందువల్ల నూతన మేధావులను సృష్టించాలంటే, ప్రతి ఒక్కరిలోనూ ఏదో మేరకు ఉండే మేధాశక్తిని విమర్శనాత్మకంగా అభివృద్ధి చేయాలి. వారిలోని మేధాశక్తికీ శారీరక శక్తికీ మధ్య సంబంధాన్ని మార్చి సరికొత్త సమతూకాన్ని సాధించాలి." ఈ విమర్శనాత్మక అభివృద్ధికి నిర్దిష్ట వర్గపు రోజువారీ పని, దైనందిన జీవితానుభవాలే పునాది కాగలుగుతాయి.

అలాంటి సజీవ మేధావులు నిర్దిష్ట వర్గ సాంఘిక జీవితంలో దైనందిన జీవితానుభవాలలో పాలుపంచుకుంటూ ఉంటారు. అందువల్ల పీడన (subjugation)ను పూర్తిగా నిర్దిష్ట చారిత్రక నేపథ్యంలో అర్థం చేసుకోగలుగుతారు. మరింత ముఖ్యంగా ఆ వర్గపు లోకజ్ఞానంతో వారికి నిత్యసంబంధాలుంటాయి. "తాము అధ్యయనం చేసి పరిష్కరించదలచుకొన్న సమస్యల మూలాలను ఈ సంబంధాల ఆధారంగా" వారు కనిపెట్టగలుగుతారు. ప్రజల జీవితంలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టడమనేది కాదిక్కడ. ప్రజలకు తమ తమ కార్యకలాపాలలో ఎదురయ్యే సమస్యలకు, వారు లేవనెత్తే సూత్రాలకు ఒక సమన్వయమేర్పరచే విమర్శనాత్మక తాత్వికత ఈ మేధావులు పెంపొందిస్తారు. సిద్ధాంతం, ఆచరణల సమైక్యరూపమైన ఇటువంటి తత్వశాస్త్రంతో ప్రజలకు అప్పటికే కొంత పరిచయం ఉంటుంది కాబట్టి, అది వారిని ప్రభావితం చేయగలుగుతుంది. అప్పటికే ప్రజల 'మనసు' (feelings)లో ఉండి వారికి తెలియకుండా ఉన్నదాన్నే, ప్రజానీకంలో బీజరూపంలో ఉండి ఇతరేతర భావనల వైరుధ్యాల వల్ల బయటపడనిదాన్నే ఈ తత్వశాస్త్రం వెలికితీసి, అభివృద్ధి చేస్తుంది. ఇలా 'సామాన్య', 'విమర్శనాత్మక' రూపం పొందడం ద్వారానే ఒక తత్వశాస్త్రం చారిత్రకం అవుతుందని, వైయక్తిక మేధావాద అంశాన్ని వదిలించుకుని 'జీవితం' కాగలుగుతుందని గ్రాంసీ నొక్కి చెప్పారు. –

ఒక విషయాన్ని అవగాహన చేసుకోకుండానే, దాన్నుంచి మానసిక అనుభూతి, ఉద్వేగం పొందకుండానే, దాన్ని తెలుసుకో గలమనుకోవడం మేధావులు చేసే తప్పు... మరో మాటలో ప్రజల ప్రాథమిక ఉద్వేగాలను మనసుకు పట్టించుకోకుండా, అర్థం చేసుకోకుండా, నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో వాటి హేతుబద్ధతను నిరూపించి వివరించకుండా, గతితార్కికంగా వాటిని చరిత్ర సూత్రాలతో ఉన్నత ప్రాపంచిక అవగాహనతో అనుసంధానించ

కుండా, శాస్త్రీయంగా, సంబద్ధంగా వివరించకుండా ప్రజల నుంచి, జాతి నుంచి వేరుగా, భిన్నంగా ఉంటేనే మేధావులుగా మనగలరని (లేకుంటే అపండితులు అవుతారని) అనుకోవడం తప్పు..

అంతేకాదు. మేధావి పని అంటే భాషణ చాతుర్యం కాదు. అది కేవలం పైతొడుగు. అప్పటికప్పుడు ఉద్వేగ, ఉద్రేకం కలిగిస్తుంది, అంతే. నూతన మేధావి వాస్తవ జీవితంలో – నిర్మాతగా సమీకర్తగా, శాశ్వత ప్రేరకుడిగా – క్రియాశీలంగా పాల్గొనాలి. ఆవిధంగా టెక్నిక్ ఒక పని అనే స్థాయి నుండి టెక్నిక్ ఒక శాస్త్రం స్థాయికి ఎదుగుతుంది. చరిత్రపట్ల మానవవాద అవగాహన వృద్ధి చెందుతుంది. అలాంటి అవగాహన లేకపోతే ఆ మేధావి 'నిపుణుడి' గా మాత్రమే ఉండిపోతాడు. 'నిర్దేశకుడు' (నిపుణుడు, రాజకీయుడు రెండున్నూ) కాజాలడు.

మేధావులను అభివృద్ధి చేసుకోవడం చాలా కష్టమైన పని. దానిలో చాలా ఇబ్బందులున్నాయి. కాని, ఒక ఆధిపత్య విధానం స్థానంలో కొత్తది వచ్చి నిలబడాలంటే ఈ పని తప్పనిసరి. ఇది నూతనవర్గం లోంచి పుట్టుకొచ్చే మేధావుల / సమీకర్తల సమస్యను అర్థం చేసుకోవడమనేది ఆర్డినోనోవో, ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ ఉద్యమం సాధించిన ముఖ్య విజయాలలో ఒకటని గ్రాంసీ పేర్కొన్నారు. ఉన్న వ్యవస్థను సవాలు చేసి తన ఆధిపత్యం నిలపాలనుకునే వర్గం సాంప్రదాయిక మేధావులలో కొన్ని బృందాలను "సైద్ధాంతికంగా గెలుచుకుని, తనలో ఇముడ్చుకోవాలి కూడా." ఆ వర్గం తన సొంత సజీవ మేధావులను ఎంత సమర్థంగా అభివృద్ధి చేసుకోగలిగితే అంత సమర్థంగా సాంప్రదాయిక మేధావులను తనలో ఇముడ్చుకోగలుగుతుంది.

## 5. నిష్క్రియా విప్లవం

ఇటలీలో 1920 ప్రాంతంలో ఫాసిజం ఆవిర్భావాన్ని అర్థం చేసుకునే క్రమంలో గ్రాంసీ 'నిష్క్రియా విప్లవం' (passive revolution) అనే భావనను రూపొందించారు. 1860-61 కాలంలో ఇటలీ ఏకీకరణకు దారితీసిన బూర్జువా ఉద్యమం రిసార్జిమెంటో. ఈ ఉద్యమ వైఫల్యానికీ ఇటాలియన్ ఫాసిజానికీ సంబంధం ఉందని గ్రాంసీ వాదించారు.

కులీన వర్గాన్ని తోసిరాజని బూర్జువా వర్గం ముందుకు వచ్చే విప్లవ ప్రక్రియ ఫ్రాన్సులో జాకోబిన్ల (1792-94) నాయకత్వంలో అత్యున్నత స్థాయికి చేరింది. ఫ్రెంచి విప్లవంలో బూర్జువా వర్గపు పరిమిత ఆర్థిక ప్రయోజనాలను విస్తరించి, రైతుల, కార్మికుల డిమాండ్లనూ చేర్చుకోవలసి వచ్చింది. దీనికోసం బూర్జువా వర్గం తన ఆర్థిక కార్పొరేట్ ప్రయోజనాలలో కొన్నిటిని త్యాగం చేయాల్సి వచ్చినా, తన నాయకత్వంలో జాతీయ – ప్రజా విప్లవాన్ని సాధించగలిగింది. ఈ విధంగా నాయకత్వ వర్గంతో సజీవ అనుబంధం కలిగిన ఉపశ్రేణి (subaltern) బృందాలతో జాతీయ – ప్రజా సంఘటనను రూపొందించాలన్న అర్థంలోనే గ్రాంసీ జాకోబినిజం గురించి పదేపదే ప్రస్తావించారు.

తద్భిన్నంగా ఇటలీలో మాజినీ, గారిబాల్డీల నాయకత్వంలోని యాక్షన్ పార్టీ రైతాంగ ప్రజానీకాన్ని తన వెంట తీసుకెళ్ళ లేకపోవడం వల్లనే, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను నిర్మించలేక పోయింది. ఫలితంగా కవూర్ నేతృత్వంలోని మితవాదులు తమ ఉదార – సాంప్రదాయిక పరిష్కారాన్ని దేశం మీద రుద్దగలిగారు. దక్షిణ ప్రాంతాన్ని పీడ్ మాంట్ రాచరికం ఆక్రమించుకోవడం, కేంద్రీకృత ప్రభుత్వాన్ని నెలకొల్పడం, పరిమిత ఓటుహక్కు పునాదిపై పాలనా యంత్రాంగం – ఇవే ఆ పరిష్కారం సారాంశం. దరిమిలా, ఈ బూర్జువా 'విప్లవం' లో సాంప్రదాయిక (conservative) బూర్జువా, బడాభూస్వామ్య వర్గాల సంఘటన రూపుదాల్చింది.

గ్రాంసీ అభిప్రాయం ప్రకారం విప్లవరహిత విప్లవానికి మితవాదులు మంచి ఉదాహరణ. దీన్నే విప్లవం లేకుండా విప్లవం అని, 'విప్లవం – పునఃప్రతిష్ట' అని కూడా అంటారు. దీనిలో వాస్తవంగా సాంఘిక చట్రాన్ని భగ్నం చేయకుండానే కొత్తవర్గం అధికారంలోకి వస్తుంది. తరువాత క్రమేణ, సూక్ష్మరూపంలో ఆ చట్రాన్ని మార్చుకుంటూ తన ప్రయోజనాలను కాపాడుకుంటుంది.

దీని ఫలితమే పరిమిత, ప్రాతినిధ్య రహిత ఉదార – ప్రజాతంత్ర నిర్మాణాలు (అప్పటికి ఉన్న పార్టీలు, పార్లమెంట్); స్వయంప్రతిపత్తితో పనిచేసే నిరంకుశోద్యోగ వర్గం (bureaucracy) 'పరివర్తన వాదం' (transformism) అంటే ప్రతిపక్షాన్ని వ్యవస్థలోనికి ఇముడ్చుకునే క్రమం. ఇలా ఇముడ్చు కోవడం వ్యక్తులుగా జరగవచ్చు, బృందాలుగానూ జరగొచ్చు. ఇందులో భాగంగానే 'చోటాసీజర్లు' లేక 'పార్లమెంటరీ నియంతలు' పుట్టుకొచ్చి జానపద హీరోలు అవుతుంటారు.

ఇటలీలోని ఈ విప్లవరహిత విప్లవం విశ్లేషణను గ్రాంసీ పందొమ్మిదో శతాబ్దపు ఇతర యూరోపియన్ ఉదారవాద ఉద్యమాలకూ విస్తరించారు. "పందొమ్మిదో శతాబ్దపు విప్లవరహిత విప్లవం ఉదారవాదంకాగా, ఇరవయ్యో శతాబ్దికి తగిన విప్లవ రహితవిప్లవం ఫాసిజమని" గ్రాంసీ వివరించారు. మరొక మాటలో చెప్పాలంటే, కార్మిక వర్గ ఉద్యమం స్వీయ ప్రయోజనాలను అధిగమించి మిత్రబృందాల ప్రయోజనాలను పరిగణనలోనికి తీసుకుని ఆధిపత్య వైఖరితో ఆలోచించలేకపోవడం వల్లనే ఫాసిజానికి అవకాశం ఏర్పడుతుంది. ఆధిపత్య వైఖరి కలిగిన కార్మిక వర్గం – గ్రాంసీ మాటల్లో, తనను తాను జాతీయం

చేసుకున్న కార్మిక వర్గం – నాయకత్వంలో మౌలికంగా ప్రజాతంత్ర యుతమైన, ప్రగతిశీలమైన ఆధునికత రూపొందాల్సి ఉండగా, ఫాసిజం ఆ అవకాశాన్ని పూర్తిగా మూసేస్తుంది. ఆర్థిక రంగాన్ని పై నుంచి ఆధునీకరించే 'విప్లవం – పునఃప్రతిష్ఠ'కు దారి తీస్తుంది. కార్మిక, కర్షకుల స్వతంత్ర సంస్థలను అణిచివేయడం ద్వారా వారిని బలవంతంగా (వారి సమ్మతి లేకుండా) బూర్జువా రాజ్యం లో, బూర్జువా ఆర్థికవ్యవస్థలో కలిపేసుకుంటుంది. 'ఊపిరాడ నివ్వని నిర్మాణాల్ని' విచ్ఛిన్నం చేసి అదే సమయంలో వామపక్షాన్ని బలహీనపరచి ఫాసిజం ఒక నూతన సమతౌల్యస్థితిని సృష్టిస్తుందని గ్రాంసీ రాశారు. ఫాసిజం "జాతీయ జీవనంలోనికి, సాంఘిక కార్యాచరణలోనికి మరింత ఎక్కువగా విభిన్నమైన ఉద్యోగ సిబ్బందిని ప్రవేశ పెడుతుంద"ని, ఉపశ్రేణి (subaltern) బృందాలతో సహా మధ్యతరగతి వర్గాలను రైటిస్టు వైఖరితో సమీకరించడం ద్వారా తన స్థానాన్ని స్థిరపరుచుకుంటుందని గ్రాంసీ పేర్కొన్నారు. దైనందిన జీవితంలో జనం నిర్విమర్శకంగా స్వీకరించే విషయాలకు లేదా లోకజ్ఞానానికి, వామపక్షం సవాలు చేయకుండా వదిలేసిన దైనందిన 'హేతుచింతన'లకు ఫాసిజంతో సన్నిహిత సంబంధం ఉందన్న అభిప్రాయం జైలు రచనల్లో బలంగా కనిపిస్తుంది.

ఈ విధంగా చూస్తే, ఫాసిజానికి శుద్ధ ఆర్థిక వివరణగాని, చట్టవిరుద్ధంగా రాజ్యాధికారం చలాయించడమనే వివరణగాని కుదరదు. పౌరసమాజపు నిర్మాణాల్లోనే దాని వేళ్ళు, దానిబలం ఉన్నాయి. అది తరచు సమ్మతి ద్వారా పనిచేస్తుంది. అందువల్ల తరచు దానికి ప్రజల మద్దతు ఉంటుంది. పలు ఆధునిక సమాజాలలో దీనికి అవకాశాలు ఎల్లప్పుడు ఉంటాయి. ఇదొక రకం 'విప్లవం – పునరుద్ధరణ' కాబట్టి, పౌర సమాజంలో ప్రచ్ఛన్న పోరాటం నిర్వహిస్తుంది. కాబట్టి ఇరవయ్యో శతాబ్ది విప్లవ రహిత విప్లవానికి ఫాసిజం ఒక రూపమని గ్రాంసీ అభిప్రాయం.

ఈ విశ్లేషణ బోర్డిగాకు, మూడో ఇంటర్నేషనల్ (లెనిన్)కు భిన్నమైనది. అంతేగాక, ఫాసిజం వారు ఊహించిన దాని కన్న ఎక్కువ తీవ్రమైన, చిరకాలం ఉండగలిగిన ప్రమాదమని ఈ విశ్లేషణ వల్ల స్పష్టమవుతుంది. ఉదాహరణకు, బోర్డిగా ఫాసిజం అనే దాన్ని కార్మికవర్గ అధికారం పెరుగుదల మీద పెట్టుబడిదారీ ప్రతీఘాత దాడిగానే చూశారు. 'సాంప్రదాయిక బూర్జువా రాజకీయాలలో, భావజాలంలో ఫాసిజం కొత్తగా ప్రవేశపెట్టిన అంశాలేవీ లేవ"ని అందువల్ల సోషలిస్టు సిద్ధాంతం, ఆచరణలలో మార్పులు అవసరం లేదని బోర్డిగా భావించారు. ఇక మూడో ఇంటర్నేషనల్ ఫాసిజాన్ని పెట్టుబడిదారీ ప్రతిష్టంభన, సంక్షోభాలకు సంబంధించిన ఆర్థిక పరిణామంగానే పరిగణించింది. ఫాసిజం విషయమై గ్రాంసీ విశ్లేషణలో వ్యాఖ్యాతలు కొన్ని లోపాల్ని చూపించినప్పటికీ, ఆయన దాన్ని పెట్టుబడిదారీ ప్రతిక్రియగానో, సంక్షోభంగానే కాకుండా, దాన్నొక గతిశీలమైన నూతన రాజకీయ పరిణామంగా అర్థం చేసుకున్నారనేది ముఖ్య విషయం. ఇది తరువాత మరింత విశ్లేషణలకు బాట వేసింది.

ఇక్కడ విప్లవరహిత విప్లవానికి సంబంధించి గ్రాంసీ అవగాహనలోని మరి రెండు భావనలను – 'ప్రత్యక్షపోరాటం', 'ప్రచ్ఛన్నపోరాటం' – అనే వాటిని ప్రస్తావించాలి. అధికారం చేజిక్కించుకోడానికి జరిగే ముఖాముఖి దాడిని ఆయన ప్రత్యక్ష పోరాటం ఆ తరువాత ప్రచ్ఛన్న పోరాటం నిర్వహించాల్సిన ప్రత్యేకావసరం ఉండింది. రష్యా మాదిరిగా కాకుండా, పశ్చిమ దేశాలలో "ఒక సామాజికవర్గం ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించు కోడానికి ముందే నాయకత్వం నెరపగలుగుతుంది. అలా నెరపాలి" అని గ్రాంసీ వాదం. "1917లో తూర్పున విజయవంతమైన ప్రత్యక్ష పోరాటం నుంచి ప్రచ్ఛన్న పోరాటానికి మారాల్సిన అవసరం ఉందని, పశ్చిమాన ఆ పోరాటమే సాధ్యమని ఇల్యీచ్ (లెనిన్) భావించినట్లు నాకు అనిపిస్తుంది."

ప్రచ్ఛన్న పోరాటం ఆధిపత్య భావనతో ముడిపడి ఉంది. అందువల్ల దానిలో వర్గ సంఘటనలు పౌరసమాజంలో అణువణువున జరగాల్సిన సాంస్కృతిక, రాజకీయ కృషి, ప్రజా సమ్మతి సాధన వంటి అంశాలు ఉంటాయి. ఇది చాలా కీలకమైన విషయం. ఎందుకంటే, పౌరసమాజం చాలా సంక్లిష్టంగా తయారయింది. తక్షణ ఆర్థిక అంచనాల వలన తలెత్తే విపత్తులను అది తట్టుకోగలుగుతుంది. 'పౌరసమాజంలోని ఉపరితల నిర్మాణాలు ఆధునిక యుద్ధతంత్రంలోని కందకాల (trenches) వంటివి. యుద్ధంలో నిరంతర శతఘ్ని దాడుల వల్ల శత్రువు రక్షణ వ్యవస్థ అంతా నాశనమయి పోయినట్లు అనిపించినా, నిజానికది కేవలం పైన కనిపించే మేరకే నాశనమై ఉంటుంది.

అందువల్ల, మొదట్లో బూర్జువా ఆధిపత్యానికి, విప్లవరహిత విప్లవాలకు సంబంధించి రూపొందిన రాజకీయ వ్యూహమే అయినప్పటికీ, ప్రచ్ఛన్న పోరాటం అనేది ఇప్పుడు ఆ ఆధిపత్యాన్ని సమర్థంగా సవాలు చేయడానికి 'క్రియాశీల'మైన, స్థిరమైన కార్మికవర్గ ఆధిపత్యాన్ని విజయవంతంగా నెలకొల్పడానికి అవసరమవుతున్నది. ❑

**సుశీ తారు రాసిన గ్రాంసీ జీవితము – కృషి అన్న పుస్తకంలో ఇవి కొన్ని శకలాలు మాత్రమే. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన 100 పేజీల పుస్తకం వారి అన్ని పుస్తకాల షాపులలోనూ లభిస్తుంది.**

# గ్రాంసీ జీవన చిత్రాలు - జ్ఞాపికలు






రోమ్‌లో ప్రొటెస్టంట్ శ్మశానవాటికలో
గ్రాంసీ సమాధి



గ్రాంసీ చిన్ననాట నివసించిన గిలార్జాలోని
మ్యూజియంలోని శిల్పం

## గ్రాంసీ విగ్రహాలు










# ఉద్యమాలకు ఉజ్వలభావావిష్కర్త గ్రామ్‌స్కీ

**తెలకపల్లి రవి**
'సాహిత్య ప్రస్థానం' సంపాదకులు



ఆంటోనియో గ్రామ్‌స్కీ ప్రత్యామ్నాయ ఉద్యమాలకు ఉజ్వల భావావిష్కర్త. ఆయన మార్క్సిస్టు మూల సూత్రాలకు లేదా పార్టీ పాత్రకు తేడాగా ఏదో చెప్పినట్టు తరచూ మాట్లాడుతుంటారు. సంప్రదాయ మార్క్సిస్టు అనే పదం ఒకటి ఇలాటి వారు సృజించిందే. నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట అన్వయం అన్న మార్క్సిజంలో సంప్రదాయ ముద్ర వెతకడమే పొరబాటు. శ్రమశక్తిని గౌరవించడం దోపిడీని పీడనను అంతమొందించడం, సమసమాజాన్ని సంస్కృతిని నెలకొల్పడం అనే ఆశయాలను మౌలిక సూత్రాలుగా చూడాలే గాని సంప్రదాయ మార్క్సిజం అనడంలో అర్థం లేదు. వేల సంవత్సరాల మానవ సమాజ చరిత్రలోని అసంఖ్యాక అశాస్త్రీయ సంప్రదాయాలన్నీ అంతిమంగా ఆధిపత్య వర్గాలకు సేవ చేసినవే. వాటిని ఛేదించాలన్న మాట అన్నప్పుడే సంప్రదాయ ధిక్కారం మొదలవుతుంది. నూతన సమాజ నిర్మాణ అంకురార్పణ జరుగుతుంది. ఇందుకోసం పనిచేసే కమ్యూనిస్టుల కర్తవ్యాలు కమ్యూనిస్టు పార్టీలను ఎదుర్కొనే సవాళ్లను వాస్తవిక కోణంలో పరిశీలించిన వ్యక్తి గ్రామ్‌స్కీ. ప్రపంచ చరిత్రలోనే నాటికీ నేటికీ అతిపెద్దదైన రోమన్ సామ్రాజ్య కేంద్రమైన ఇటలీలో పుట్టిన గ్రామ్‌స్కీ ఆధునిక ప్రపంచంలో తొలి ఫాసిస్టు రాజ్యంగా పుట్టుకొచ్చిన ముస్సోలిని నియంతృత్వం విధించిన ఖైదులో రచనలు చేశాడు. కనుక ఇందులో వూహాలకు వూకదంపుడుకూ పెద్దగా అవకాశం వుండదు. ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయక బృందంలో ఒకడైన గ్రామ్‌స్కీ పార్లమెంటు సభ్యుడు కూడా. ఎం.పి.గా వున్నప్పటికీ తనను కారాగారంలో పదేళ్లు మగ్గేలా చేసిన ఫాసిజం నిజ స్వరూపం తొలిదశలోనే చూసిన వ్యక్తి కూడా ఆయన. ఇన్నిటి మధ్యనా అంతులేని విశ్వాసంతో అధ్యయనంతో స్వీయ పరిశీలనతో విస్మరించబడిన ఉద్యమ సమస్యలు చెప్పడంలో మేధస్సుతో పాటు అంకిత భావం అచంచల విశ్వాసం గమనించాల్సి వుంటుంది. గ్రామ్‌స్కీ రాసిన వాటిలో మేధావులు, ఆధునిక యువరాజు, రాజ్యం పౌర సమాజం, తత్వశాస్త్ర అధ్యయనం, మార్క్సిజం సమస్యలు అనే రచనలతో పాటు ఇటాలియన్ విద్యావిధానంలో ముస్సోలిని మార్పులు తెచ్చినప్పుడు చేసిన పరిశీలన, తత్వశాస్త్ర అధ్యయనం, ఇటలీ కమ్యూనిస్టు ఉద్యమ క్రమంలో అనుభవాలు వంటివి కూడా లోతుగా సాగాయి. నేడు వివిధ రూపాల్లో ముందుకు వచ్చిన అస్తిత్వ వాదాల మూలాలు కూడా ఆయనే స్పృశించాడు, రాజ్యం మతం నిరంకుశాధికార బృందాలు, విస్తార జన సమూహాలు, నాయక బృందాలు, కార్యకర్తలు, అంతర్గత పోరాటాలు, యాదృచ్ఛికత అనివార్యత వంటి సైద్ధాంతిక కోణాలు, రాజకీయ ప్రచార ప్రక్రియలు, సైనిక సమస్యలు వంటి వాటిని అధ్యయనం చేశాడు. ప్రధానంగా ఇటలీని, యూరప్‌ను ఉదహరించినా, భారత స్వతంత్ర పోరాటంతో సహా ఇతర దేశాలలో అనుభవాలను కూడా పరిశీలించాడు.




## పార్టీలూ మేధావులు

తెలుగునాట గ్రామ్‌స్కీ చర్చలో మేధావుల పాత్ర, పౌర సమాజం అన్న భాగాలు ఎక్కువగా చర్చకు వస్తున్నాయి గనక వాటినే తీసుకుందాం.

సమాజ గమనంలో ఆవిర్భవించే ప్రతి వర్గమూ తనదైన మేధావులను సృష్టించుకుంటుంది. ఉదాహరణకు ప్రాచీన కాలంలో అన్ని దేశాలలోనూ పూజారులు పండితులు మతాధిపతులు మేధావులుగా పరిగణించబడ్డారు. ఇలాటివారు ప్రాచీన బృందాలలోనే గాక ఆధునిక వర్గాలలోనూ కూడా మేధావులుగా గుర్తించబడుతున్నారు. వీరే వ్యవస్థీకృత మేధావులు. వీరు ఉపరితలానికి సంబంధించి ప్రజల ఆలోచనలను, స్పందనలను ప్రభావితం చేయడంలో విశేష పాత్ర వహిస్తారు. మరోవైపున ఉత్పత్తి క్రమాన్ని బట్టి పాలకవర్గాల అప్పటి అవసరాల మేరకు మేధావులు పెంపొందుతుంటారు.

ఉదాహరణకు వ్యాపారవర్గానికి మేధాశక్తి చాలా అవసరం. లేకపోతే తన సరుకు వైపుగా జనులను ఆకర్షించలేడు. పెట్టుబడులు రప్పించుకోలేడు. సామ్రాజ్యవాదం జాతి దురహంకార భావనలు వ్యాప్తిచేసే మేధావులూ తయారవుతారు. కొత్తగా ప్రభవించేవర్గాలకు తగినట్టుగా సమాజంలోని మేధా స్రవంతిలో ఒక భాగం మలచబడటం జరుగుతూనే వుంటుంది. భౌతిక జీవితంలో ప్రొఫెసర్లు సాంకేతిక నిపుణులు వంటివారిని మేధావులుగానే చూస్తుంటారు. వీరు వృత్తిగత మేధావులు. ఒక చిత్రకారుడు, గాయకుడు, కళాకారుడు మేధావిగా పరిగణించబడవచ్చు. నిజానికి మనుషులందరూ మేధావులే. కాని మేధావులగానే పనిచేసే అవకాశం అందరికీ వుండదు. ఇండియాలాటి చోటనైతే కింది కులాల వారిని చదువుకోవడానికే లేకుండా చేశారు. మరికొన్ని దేశాలలో నల్లజాతీయులను బానిసలుగా చేశారు. ఇక్కడ ప్రశ్న మేధాకృషికి అవకాశం లేకుండా చేయడం తప్ప మేధావులు కాని వారు అనడానికి లేదు. నిజమైన మేధావులు తయారు కావడం మాత్రం నిరంత భౌతిక మేధా శ్రమ చేయడంపై ఆధారపడి వుంటుంది. పని పఠనం పరిశీలన కలిసి ఇలాటి వారిని తయారు చేస్తాయి. మధ్య యుగాలలో పెంపొందిన మేధా ప్రక్రియ తర్వాతి కాలంలో విస్తారమైన విద్యా వ్యవస్థ ద్వారా విస్తరించింది. ఆధునిక కాలంలో దీనికి సాంకేతిక సమర్థత కూడా ఒక పునాది అవుతుంది. అయితే కేవలం ప్రతిభా విశేషాలు, ఉపన్యాస పటిమ వాగ్ధాటి సంపూర్ణ మేధావులను చేయవు. వృత్తి నైపుణ్యం కాస్తా భావాలను నిర్దేశించగలిగినదిగా మారాలి. వాటి ద్వారా అవతలి వారిని ఆచరణకు ఆలోచనకు ప్రేరేపించగలిగితే అప్పుడు మేధస్సు సార్థమవుతుంది. ఈ మేధా ప్రక్రియ ఒక నిర్దిష్టమైన చారిత్రిక మార్పులలోనే సాధ్యపడుతుంది.

ఈ మేధా ప్రక్రియ దేశదేశాలలో రకరకాలుగా జరిగింది. రోమన్ సామ్రాజ్య కేంద్రమైన ఇటలీలో, నవనాగరికమూ వివిధ ప్రజావెల్లువలకు నిలయమూ అయిన ఫ్రాన్స్‌లో, రవి అస్తమించ దనిపించుకున్న సామ్రాజ్యవాద బ్రిటన్‌లో, మార్క్సిజానికి జన్మనిచ్చిన జర్మనీలో దాని అంతర్భాగమైన ప్రష్యాలో, తొలి శ్రామిక రాజ్యం స్థాపించబడిన రష్యాలో వివిధ దశల్లో వివిధ రీతుల్లో మేధా వికాసం జరిగిన తీరు గ్రామ్‌స్కీ వివరిస్తాడు. రష్యాతో ఒక విధంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలను పోల్చవచ్చు నంటూ అక్కడ ఆంగ్లో శాక్సన్ సంప్రదాయమేధావులు వృత్తి నిపుణులు ప్రధానంగా జతకూడిన సంగతి ప్రత్యేకంగా చెబుతాడు. అక్కడ నల్లజాతి మేధావులు కూడా అమెరికన్ భావజాలాన్నే అందిపుచ్చుకోవడం ఎలా జరిగిందో వివరిస్తాడు. అదే పోర్చుగల్ స్పెయిన్ వంటి చోట్లకు వస్తే ప్రతీఘాత భావజాలం, సైనిక తత్వం ఎలా మేధావులను ప్రభావితంచేశాయో నొక్కి చెబుతాడు. ఆసక్తికరమైన విషయమేమంటే ఇక్కడే గ్రామ్‌స్కీ తూర్పు దేశాలైన ఇండియా చైనాలనూ ప్రత్యేకంగా పరిశీలిస్తాడు, జపాన్‌లో ఎక్కువగా జర్మనీ బ్రిటిష్ తరహాల మిశ్రమంగా సాంకేతికత భూస్వామ్య సైనిక సంస్కృతి మేధావులను ప్రభావితం చేసింది. అదే చైనాలోనూ ఇండియాలోనూ లిఖిత భాష వల్ల జన బాహుళ్యానికి మేధావులకూ మధ్య ఎడం ఎక్కువగా వుండి పోయిందని మరీ ముఖ్యంగా మతపరమైన దూరం పెరిగి పోయిందనీ విశ్లేషిస్తాడు, యూరప్,లాటిన్ అమెరికాలతో పోలిస్తే తూర్పు ఏసియాలో మత పరమైన భాషలో మూడు దొంతరులు వుండిపోయాయి. మతాధిపతులు, లౌకిక స్పృహ కలిగిన మతాలవంబకులు, సామూహికంగా మతాన్ని అనుసరించేవారు. ఈ క్రమంలో మతగ్రంథాలలో ఏమున్నదో దాన్ని పాటించే విశాల జనావళికి తెలియకుండానే వుండిపోయింది. ఇప్పుడు ఆరెస్సెస్ బిజెపి మతతత్వ రాజకీయాల కోసం ఏమి చెప్పినా వినేవారు దొరుకుతున్నారంటే కారణం వారికి అసలైన విషయాలు తెలియకపోవడం అసలు కారణం.

## భావజాల ప్రభావం, రాజకీయ పార్టీలు

మేధాపరమైన పాత్రను రెండుగా చూడొచ్చు. ఒకటి పౌర సమాజం లేదా అనధికార ప్రభావం. రెండవది రాజకీయ శక్తి లేదా రాజ్యం. మొదటి తరహాకు చెందిన భావజాలం ప్రబలంగా సమాజాన్ని నిర్దేశిస్తూ ప్రశ్నిస్తుంది. రెండవది రాజ్యాధికారం ద్వారా ప్రాబల్యం వహిస్తుంది. మొదటి తరహాకు చెందిన మేధావుల ప్రాబల్యం వారి ప్రతిష్ట వల్ల సామాజిక నిబద్ధత వల్ల సిద్ధిస్తుంది. రెండవది రాజ్యం నిబంధనలు నిర్బంధ యంత్రాంగం వల్ల కలుగుతుంది. భారత దేశంలో ఇప్పుడు మోడీ పరిపాలనలో ఈ సమస్య తేలిగ్గా అర్థమవుతుంది. కమ్యూనిస్టులు ప్రగతిశీల మేధావుల ప్రభావం ప్రేరణ సంఘపరివారకు బొత్తిగా మింగుడు పడక వారు కాంగ్రెస్ అండతో అన్ని చోట్ల తిష్ట వేశారని ఆరోపిస్తున్నారు. అనేక మందిపై దేశద్రోహం ఆరోపణలు చేసి వేటాడుతున్నారు. (ఇదే పని ముస్సోలిని కూడా చేయడం వల్లనే గ్రామ్‌స్కీ జైలు పాలయ్యారు.) మేధావులలోనూ పట్టణ పల్లె ప్రాంతాల మధ్య తేడా వుంటుంది. పట్టణాల్లో నగరాల్లో బుద్ధి జీవులు యాంత్రికతతో అధికారుల్లా తయారై వుంటారు. పల్లె ప్రాంతాలలో మేధావుల స్థానం హోదా ఎక్కువగా వుంటాయి. అందుకే పల్లె ప్రజలు తమ పిల్లల్లో ఒకరైనా మేధావి, అధికారి కావాలని కోరుకుంటారని గ్రామ్‌స్కీ రాస్తాడు. ఇది ఇప్పటికీ వర్తించే సత్యమే. వలసపాలన ప్రభావం కూడా. అయితే పల్లె ప్రజలలో మేధావుల కృషి వల్ల పెరిగే చైతన్యం, వచ్చే మార్పు

పైనుంచి దిగే అధికారులపై ఆగ్రహంగా వైముఖ్యంగా కూడా మారవచ్చు (రైతాంగ తిరుగుబాట్ల నుంచి ఇప్పుడు అధికారులను కట్టేశారని బంధించారని మనం వినే వార్తలకు ఇదే కారణమవు తుంటుంది) ఇదే పట్టణ ప్రాంతాలలో వృత్తిగత మేధావులను లేదా సాంకేతిక నిపుణులను తీసుకుంటే వారు శ్రామిక జన బాహుళ్యంపై అంతటి ప్రత్యక్ష ప్రభావం చూపించలేరు. ఆ జనబాహుళ్యంలోంచి చైతన్యంతో వచ్చే స్వాభావిక మేధావులే అలాటి ప్రభావం చూపించగలరు. రాజకీయ పార్టీలు చేసే పని అదే. రాజ్యం చట్టంతో చేసే పని రాజకీయ పార్టీ తన శ్రేణులతో చేస్తుంది. వారంతా ఆ భావజాలంతో ప్రభావితులై పనిచేయడం మొదలెడతారు. ఆ విధంగా చూస్తే రాజకీయ పార్టీల తరపున పనిచేసే వారందరినీ మేధావులుగానే చూడాల్సి వుంటుంది. అంటే వారిలో వ్యక్తిగతంగా తరతమ తేడాలు వుండవని కాదు కాని వారు ప్రధానంగా భావాలతో ప్రేరితులై పనిచేస్తారు. ఇతరులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఉదాహరణకు ఒక వ్యాపారి లేదా రైతు పార్టీలో చేరితే వ్యాపారం కోసం చేరకపోవచ్చు అలాగే ఇతర వృత్తులు పనులు చేసుకునేవారు కూడా. వారి అంతిమ లక్ష్యం ఉమ్మడి ప్రణాళిక ఒకే విధంగా వుండాలి.

## నవీన యువరాజు- పార్టీ నిర్మాణం

ఒక కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం గురించి గ్రామ్‌స్కీ తన మోడ్రన్ ప్రిన్స్ (నవీన యువరాజు)లో వివరంగా రాస్తాడు. ఇటాలియన్ రాజనీతిజ్ఞుడైన మాకియవెల్లి రాసిన ప్రిన్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ పేరు పెట్టాడు, జైలులో ఆయన మార్క్సిజం, కమ్యూనిస్టు పార్టీ వంటి పదాలు వాడటానికి వీలు లేదు గనక ఈ పద్ధతి ఎంచుకున్నారు. మార్క్సిజం అనే బదులు థియరీ ఆఫ్ ప్రాక్సిస్ (ఆచరణాత్మక సిద్ధాంతం) అన్నాడు. మార్క్సిజాన్ని చోదక శక్తులు ఆచరణలో పెట్టాల్సి వుంటుంది గనక అది సంకేత నామంగానే గాక సార్థకమైన అర్థంగానూ చూడాలి. పాతకాలంలో అన్ని పనులు చేసే రాజులు యువరాజులు అవతార పురుషుల గురించి చెప్పుకుని వుండొచ్చు గాని ఆధునిక కాలంలో ఆ పని సంఘటిత పార్టీలు మాత్రమే చేయగలవన్నది ఆయన సూత్రీకరణ. (పార్ట్ అనే పదం నుంచే పార్టీ అన్న మాట పుట్టింది) సక్రమంగా లేనిదాన్ని నిర్మూలించి సరైన నిర్మాణం చేయాలంటే రాజకీయ పార్టీ వుండాలి తప్ప వూహాజనితమైన వ్యక్తి వల్ల కాదని చెబుతాడు. పాలనా వ్యవస్థల పరిణామ క్రమంలో ఆర్థిక కార్పొరేట్ వ్యవస్థ అన్నది అత్యంత ఘోరమైంది. సంప్రదాయ పాలకవర్గాలు విచ్ఛిన్నమయ్యే కొద్ది పరాన్నభుక్కు లక్షణాలతో అణచివేత స్వభావం పెరుగుతాయి. ఈ సమయంలో అందుకు విరుగుడుగా రాగలిగింది. పారిశ్రామికీకరణ క్రమంలో పెరిగిన ఆధునిక ప్రజారాశులు మాత్రమే. మతపరమైన పాలకవర్గాలు విశాలజాతి భావనను చిన్నాభిన్నం చేస్తే అంతర్జాతీయతతో కూడిన జాతీయ దృక్కోణాన్ని మళ్లీ రూపొందించి మేధాపరమైన నైతిక రాజకీయ సంస్కరణ చేయాల్సిన బాధ్యత పార్టీపై వుంటుంది. ప్రపంచం పట్ల దృక్పథాన్ని మార్చాల్సి వుంటుంది. అయితే సాంస్కృతిక నైతిక సంస్కరణ ఏదైనా సరే ఆర్థిక కార్యక్రమంతో ముడిపడి వుంటుంది. కాబట్టి ఈ రెంటినీ మేళవించి నడిపించాలి. గ్రామ్‌స్కీ మాటల్లో వర్తమాన భారతంలోనూ ప్రపంచంలోనూ కూడా చూస్తున్న రకరకాల పరిణామాలు మనం గమనించవచ్చు. అంటే ఆయన జోస్యం చెప్పారని కాదు. వ్యవస్థాగతమైన మార్పులు ఎంత సంక్లిష్టమైనవో చెప్పడం తన గొప్పతనం.

మార్క్సిజం మానవ ప్రవర్తనను సమాజాన్ని స్థిరభూతమైందిగా చూడదు. మంచి చెడ్డలు శాశ్వతంగా నిర్ణయిం చేయదు. వారివారి సామాజిక ఆర్థిక నేపథ్యాలనుబట్టి మనుషుల చైతన్యం రూపొందుతుంది. కొన్ని కొలబద్దలతో విమర్శ తాత్వికతల ద్వారా చరిత్ర గమనాన్ని అంచనా కట్టవచ్చు. ఆవిధంగా చూసినప్పుడు రాజకీయ శాస్త్రం అనేది నిరంతరం రూపొందుతూ మలచబడుతూ వుంటుంది. దానికి సంబంధించిన తర్కాన్ని గాని రూపాలను గాని పరిణామ దశలో వున్నవిగానే చూడాలి, మనుషుల కార్యాచరణ. కార్యాచరణకు ఉద్యుక్తం చేయడం, దానికి పురికొల్పే ప్రణాళిక ఇవే రాజకీయ పార్టీలు చేయవలసింది. రాజకీయాలు నడపాలనుకున్న వారెవరైనా సరే ఉపరితల కట్టడం (అంటే మతం చైతన్యం వంటి అంశాలు) స్థాయిని దృష్టిలో పెట్టుకుని అందుకు గతితర్కపరంగా సరిపడే కార్యక్రమాన్ని రూపొందించుకోవలసి వుంటుంది.

## పౌర సమాజం సాంస్కృతిక కృషి

గ్రామ్‌స్కీ బోధనల్లో అత్యంత కీలకమైన అంశం ఇక్కడే వుంది. పునాది ఉపరితల కట్టడం గురించి మార్క్సిజం అనుసరించే వారు ఎప్పుడూ చెప్పుకుంటారు. కాని ఈ రెండూ ఒకే స్థాయిలో వుండబోవు. రాజకీయ కార్యాచరణ గురించిన ఆలోచన మొదటి దశలో మొదటి అడుగు మాత్రమే. దాన్ని ఉపరితల కట్టడంతో అనుసంధానం చేయడం రెండవది. కాని ఉపరితల కట్టడం ఇంకా ఎలాటి అనుసంధానం లేని ఆకాంక్షలకే పరిమితమైన గందరగోళ వ్యవహారంగానూ ప్రాథమిక దశలోనూ వుంటుంది. మరి అలాటప్పుడు రాజకీయాలనూ చరిత్రనూ గుర్తించడం మొత్తం జీవితాన్ని రాజకీయాలతో ముడివేయడం ఎలా సాధ్యపడుతుంది? ఉపరితల కట్టడంలో ప్రత్యేకతలను ఎలా అర్థం చేసుకోవడం? ఈ రెంటినీ కలిపి ఒక చారిత్రిక దశను ఎలా అంచనా వేయడం? ఉపరితల కట్టడంలోలానే పునాదిలోనూ ప్రత్యేకతలను

చూడగలమా? ఇదే సిద్ధాంత అధ్యయనానికి తాత్విక సూత్రీకరణలకు సంబంధించిన అంశమవుతుంది. భౌతిక ఉత్పత్తిలో ఆర్థిక సంబంధాలలో వచ్చే మార్పులను ప్రకృతిశాస్త్రాన్ని అంచనా కట్టినంత ఖచ్చితంగా అంచనా కట్టొచ్చునని మార్క్స్ అంటాడు. అదే సైద్ధాంతిక రంగంలో అంటే న్యాయం రాజకీయం మతం అలంకార శాస్త్రం తత్వశాస్త్రం వంటివాటిని అర్థం చేసుకోవడానికి తేడా వుంటుంది. ప్రతి సిద్ధాంతం దానికి సంబంధించిన వ్యవస్థలకు ఒక చారిత్రిక నేపథ్యం వుంటుంది. చరిత్ర క్రమంలో ఎవరికైనా మహా వ్యక్తులుగా అహంభావాలు తపనలూ వున్నా కూలిపోవలసిందే. రాజకీయ పార్టీలు నిర్దిష్ట పరిస్థితిని బట్టి రూపొందించుకునే కార్యాచరణలతో నడుస్తాయి. నిలుస్తాయి. ఇక్కడే రాజకీయ వ్యూహాలను యుద్ధరంగంతో పోల్చవచ్చు. యుద్ధంలో పాల్గొంటున్నా ఎప్పుడు ఎలాటి అడుగు వేయాలన్నది రణభూమిలోనే నిర్ణయమవుతుంది తప్ప సైనికశాస్త్రం చెప్పిందని శాశ్వత నిర్ణయాలు జరగవు. ఇది రాజకీయ వ్యూహాలకూ వర్తిస్తుంది. రాజకీయాలలో ప్రాథమిక శక్తులేమిటి? పాలితులూ పాలకులూ నాయకులు అనుసరించే శ్రేణులూ. రాజ్యం పాలక వర్గాలు వాటి పాత్ర చరిత్రలో స్పష్టంగా కనిపిస్తాయి. కాని రాజకీయ పార్టీ అందునా నూతన సమాజం కోసం పనిచేసే పార్టీ నూతన నిర్మాణం గురించిన విషయాలు సరైన చైతన్యంతోనే నిర్ణయించుకోవాలి. సవ్యంగా అనుసరించాలి. గత చరిత్రలో పాలకవర్గాల పద్ధతులు ఇక్కడ సరిపోవు. ఒక లక్ష్యం సాధించాలి గనక నిర్ణయించుకోవడం వేరు. నాయకుడు నిర్ణయించాడు గనక చేయాలనుకోవడం వేరు. బాగా జరిగితే నాయకుల గొప్ప కావచ్చు తప్పు జరిగితే చేసిన వారిది అనవచ్చు. ఈ కారణంగానే చరిత్రలో అనేక త్యాగాలు వృథాగా పోవడం చూస్తాం, సైన్యంలో ఒక పటాలం బలైపోవచ్చు. ఉదాహరణకు ఒక దళం రోజుల తరబడి సరైన తిండి లేకపోయినా తట్టుకుని పోరాడుతుంది. అదే దళం నాయకుడి తప్పు వల్ల ఒకపూట తిండి పొందలేకపోయినా ఆమోదించలేకపోవచ్చు. ఇవే సైద్ధాంతిక తప్పిదాలు. ఇలా జరగకూడదంటే విస్తారమైన అధ్యయనం వాస్తవాలతో అనుసంధానం వుండాలి. విశాల జనరాశుల పాత్రనూ పౌరసమాజంపై నైతిక ప్రభావం నింపే మేధావుల మద్దతునూ చూరగొనాలనేది గ్రామ్స్కీ మాట. ఆయన ఆ మాటలు చెప్పేనాటికి సోవియట్‌లో స్టాలిన్‌కూ ట్రాట్స్కీ వంటివారికి మధ్య జరుగుతున్న అంతర్గత పోరాటం గురించి కూడా ప్రస్తావించాడు. అంతర్జాతీయత అనేదాన్ని నిర్దిష్టంగా అన్వయించడంలోనే బొల్షివిక్స్ మౌలికత వుందని చెప్పాడు. నిర్మాణాత్మకంగా ముందుకు సాగే శక్తుల చేతికి చొరవ వచ్చే వరకూ కూడా ప్రపంచ దేశాల చరిత్ర గమనం అప్పటి ఆవశ్యకతను బట్టి సాగుతుంటుంది. అంతర్జాతీయ స్వభావం గల ఒక వర్గం అచ్చంగా తమవైన సంకుచిత పరిమిత సీమలలో ఇంకా చెప్పాలంటే జాతీయ హద్దుల కన్నా సంకుచితమైన స్థానికతలో చిక్కుకుపోయిన మేధావుల ప్రభావాన్ని అధిగమించాల్సి వుంటుంది. మోడీ పరిపాలనలో ఇప్పుడు శ్రుతిమించిన దేశభక్తి సిద్ధాంతాలను చూస్తున్న నేపథ్యంలో దీన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు.

## విస్తృత ప్రేరణ, కదలిక

చొరవను చేతిలోకి తీసుకోకుండా పరిస్థితులు అనుకూలంగా లేవని కాలయాపన చేస్తూ వుండటం కూడా పొరబాటవుతుంది. ఉద్యమాలు వాటికవే ఉప్పొంగి వచ్చే (స్పాంటేనిటీ) పరిస్థితి ఏర్పడిందంటేనే పార్టీ జోక్యం లోపించిందని అర్థం చేసుకోవాల్సి వుంటుంది. అయితే ఈ జోక్యం ఏదో పైనుంచి రుద్దితే సాధ్యమయ్యేది కాదు. ఈ భాగాన్ని గ్రామ్స్కీ విస్తారంగా చర్చించాడు. కేవలం ఆర్థికాంశాలకే పరిమితమయ్యే ఆర్థికవాద ధోరణి కార్మిక సంఘాలలోనూ పర్యవసానాలు పట్టించుకోకుండా గుత్తాధిపతులు ప్రయోజనాల కోసం పాకులాడే కార్పొరేట్ ధోరణి పాలకులలోనూ వుండటాన్ని చర్చిస్తాడు. ఇది కూడా ఇప్పుడు మనం చూస్తున్నదే. విశృంఖల వాణిజ్య స్వేచ్ఛ అనేది వాస్తవంలో వారి తరపున రాజ్యం పాత్రను పెంచుతుంటుంది. దీంతో పోలిస్తే ఆర్థిక వాద ధోరణి అంత ప్రమాదకరం కాదు. అయితే జనరాశుల సైద్ధాంతిక సాంస్కృతిక చైతన్యం పెంచే పాత్ర పట్ల ఉపేక్ష నష్టం చేస్తుంది. శాశ్వత విప్లవం పేరిట దానికదే ఎలాగూ వస్తుందనే రీతిలో ఆలోచిస్తూ కూచోవడం అవకాశం లేదని నిరుత్సాహ పర్చడం తప్పు. జనబాహుళ్యం మార్పు అవసరమనే చైతన్యాన్ని పెంచుకోవడానికి భావజాలం విస్తరించడానికి పౌర సమాజంలో ప్రచారం ఆందోళన కొనసాగించాలి. చైతన్యం పెరుగుదలను ఉత్పత్తి చక్రంతో పాటు ఉపరితలం కూడా ప్రభావితం చేస్తుంది గనక భావజాల రంగంలో చైతన్యం పెంచడంపై కేంద్రీకరించాల్సి వుంటుంది. భావం ప్రజా బాహుళ్యాన్ని ఆవరించితే భౌతిక శక్తి అవుతుందన్న మార్క్స్ మాటలు నిజం కావడానికి చాలా దశలు అధిగమించాల్సి వుంటుంది. అంటే వ్యక్తులుగా అందులో పాల్గొనే వారు కూడా తమ వ్యక్తిగత పరిమితులకు అతీతంగా పరిస్థితులను మార్చవలసిన అగత్యాన్ని అవగాహన చేసుకోగలగాలి. సమస్యలపై పోరాడటంతో పాటు విస్తృతాంశాల అవగాహనను కూడా పెంచితే జనసామాన్యం ఒక శక్తిగా మారతారు. ఇది కేవలం వ్యక్తిగత చైతన్యానికి సంబంధించింది కాదు. ఈ రోజు ఓడిపోయినా రేపు తప్పక గెలుస్తామనే విశ్వాసం వుండటం ఎంత ముఖ్యమో దానికి తగిన సన్నద్ధత సమిష్టి కృషి లేకపోవడం అంతే పెద్దలోపం.

లేకపోతే ఇదో విధమైన కర్మ సిద్ధాంతంగా మారే ప్రమాద ముంటుంది. అనేక ఎదురుదెబ్బలు పరాజయాలతోనే మానవ సమాజ పురోగమనం పునర్నిర్మాణం జరుగుతాయి. ఉద్యమాల ముందు వెనకలు కూడా అలాటివే. గతాన్ని గురించి సరైన మదింపు వేసుకుని వర్తమానాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకుంటేనే పార్టీ తన కర్తవ్యాన్ని పూర్తి చేయగలుగుతుంది. ఈ క్రమంలో ఒంటెత్తు వాదులు అంతర్గత విషయాలలో తలమునకలవుతారని గ్రామ్‌స్కీ హెచ్చరిస్తాడు, బయట వున్న విశాల జనరాశులను ప్రభావితం చేయడంపై కేంద్రీకరించి నిర్దిష్ట కృషి నిరంతరం సాగిస్తేనే ఆశించిన మార్పులను సాధించగలమని ఉదాహరణలతో సహా చెబుతాడు. రాజ్యాంగం అంటూ ఏర్పడిన తర్వాత దానితో నిమిత్తం లేకుండా రాజకీయ పార్టీలు పని చేయడం సాధారణ పరిస్థితిలో జరిగేది కాదని స్పష్టం చేస్తాడు. కాని ఆ సమాజంలో మార్పు తీసుకురావడం, ఎన్నికలలో ఒక పార్టీ స్థానంలో మరో పార్టీ రావడం ఒకటి కాదని కూడా హెచ్చరిస్తాడు. ఎన్నికల తత్వం సూటిగా కనిపించకుండా పరోక్షంగా ఎలా పని చేస్తుంటుందో కూడా విశ్లేషిస్తాడు. పాలకవర్గాలు ఎన్నికల కోసం సృష్టించే మాయాజాలంలో కుహనా సిద్ధాంతాలు, వ్యక్తిగతమైన ఘనతలు, బూటకపు వీరత్వాలు, అసహజమైన పొందికలు ఏర్పడుతుంటాయి. వాటి తరపున ప్రవక్తలుగా వచ్చిన వారు ప్రచారం పొందుతుంటారు. ఈ పరిస్థితులను తట్టుకోవాలంటే ఆనాటి వర్గ సమాజ పరిస్థితినీ ఉపరితల ప్రభావాలను కూడా సరిగ్గా అంచనా వేసి అవసరమైన మార్పుల కోసం పోరాడగల చైతన్యం పెంచే కృషికి ప్రథమ ప్రాధాన్యత నివ్వాలి. వాస్తవాలతో నిమిత్తం లేని స్వకీయ పాక్షిక భావజాలాలు అతిశయాలు, అవాస్తవ పోకడలను అధిగమించి నిర్దిష్ట కార్యాచారణకు జనబాహుళ్యాన్ని సన్నద్ధం చేయవలసి వుంటుంది.

గ్రామ్ స్కీ భావాలుగా చర్చకు వస్తున్న వాటిలో అంతగా వినిపించని కొన్ని అంశాలు కూడా ఈ వ్యాసంలో ప్రస్తావించాను. ఇవన్నీ ఆయన రచనలలో వున్నవే. తను రాసిన వాటిలోనూ లోపాలు వుండవని కాదు. రాసిన కాలమే చాలా క్లిష్టమైనది. చాలా అంశాలపై ఎంతోలోతుగా చర్చ చేశాడు. మూలభాష ఇటాలియన్‌లో ఇటీవలి వరకూ ఆయన సమగ్ర రచనలే రాలేదు. జైలు అధికారులను తప్పించుకోవడానికి వాడిన భిన్నమైన పదాలు వాటి అనువాదాలు, జటిలంగానే వుంటాయి. ప్రచురించినవారు వాటి పరిమితులను కూడా చెప్పారు. నేను రాసినవాటికి కూడా ఆపరిమితులు తప్పవని మనవి. సమగ్రంగా సాధికారికంగా తెలుగులో గ్రామ్‌స్కీ రచనలు ప్రచురించవలసిన అవసరం మిగిలే వుంటుంది. రాబోయే కాలంలో ఆ ప్రయత్నం జరుగుతుందని ఆశించాలి ❑

---

## సమకాలీన ప్రపంచంలో ప్రముఖ మేధావి

**(23వ పేజీ తరువాయి)**

పొట్లూరి నాకు సోదర సమానుడు. యం.ఏ. పట్టభద్రుడు, ఉన్నత ప్రభుత్వ ఉద్యోగిగా రిటైరై జీతమే తప్ప – గీతం ముట్టని నిష్ఠాపరుడు. సంస్కారి. సున్నిత మనస్కుడు, కళా హృదయుడు. రాయగలడు, పాడగలడు, వాయిద్యాలను మ్రోయించగలడు. దేన్ని స్పృశించినా లోతు చూడకుండా వదలని స్వభావం.

పదవీ విరమణ తరువాత అక్షర యజ్ఞం చేపట్టి సాక్షరతా సమితిలో కీలకపాత్ర నిర్వహిస్తూ వచ్చాడు. సంప్రదాయ సాహిత్యం నుండి దృష్టి విప్లవ సాహిత్యం పైకి మళ్ళింది. ప్రధానంగా విప్లవ మేధావుల రచనలపై కేంద్రీకృతమై, సహజంగానే క్రిస్టఫర్ కాడ్వెల్, ఫాలో ఫ్రెయిరీ, గ్రాంసీ, బెర్నాల్ రచనల మధనం మొదలైంది. అధ్యయనం తరువాత, అనువాదం.......

ముఖ్యంగా చెప్పుకోతగింది. – బెర్నాల్ రచన "చరిత్రలో సైన్సు" అనే బృహత్ గ్రంథం.

గ్రాంసీ రచనలోని ముఖ్యభాగానికి అనువాదం మేధావులు. భావ ప్రాముఖ్యత దృష్ట్యా, విద్యావంతులు విప్లవకార్యకర్తలూ, కేవలం చదవడంకాక, అధ్యయనం చేసి విశ్లేషించదగ్గది.

మూల రచయిత యొక్క అపార పరిశోధనా పరిజ్ఞానం వలన, విషయ గాఢత వలన, మూలానికి పూర్తి న్యాయం చెయ్యాలనే అనువాదకుని నిష్ఠ వలన వ్యాసాన్ని ఒకటికి రెండు సార్లు చదవవలసి రావచ్చు. దాని వలన మరింత ఉపయోగం వుంటుందని నా విశ్వాసం.

రొటీన్‌గా వస్తున్న తక్షణ సమస్యలపై కరపత్ర రచనలకు మాత్రమే పరిమితమవుతున్న పాఠకులకు ఇదొక ఉపయుక్తమైన నూతన అనుభవం అవుతుందని ఆశిస్తున్నాను.

"ఈ ప్రభావంతో పోలిస్తే సిద్ధాంత విషయాలలో నిర్లక్ష్యం జరుగుతున్నది. సైద్ధాంతిక కార్యకలాపాలను శక్తివంతం చేసేందుకు ఉపయోగపడగల వనరులపట్ల తగినంత శ్రద్ధ లేదు. ఇంగ్లీషు ద్వారా తప్ప భారతీయ భాషలలోని మార్క్సిస్టు రచనల మధ్య అనుసంధానం సాధ్యం కావడం లేదు. ఇదొక పెద్ద బలహీనత. " ❑

ప్రజాశక్తి బుక్‌హౌస్ సౌజన్యంతో...




# ఇది క్రూర పాలకులు రాజ్యమేలే కాలం : గ్రాంసీ

**అశోక్ కుంబము**

ప్రపంచ చరిత్రలో ఒక పరిణామంగా వచ్చిన ఫాసిజం, ఇప్పుడు సరికొత్త రూపంలో హేతువు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా, సమానత్వం, లౌకిక, ఉదారవాద భావాల మీద దాడి మొదలుపెట్టింది. వర్తమాన ప్రపంచంలో అనేక దేశాలలో ఫాసిస్టు ధోరణులు వివిధ రూపాలలో కొనసాగుతున్నాయి. భారతదేశంలో హిందుత్వ ఫాసిజం ప్రజల జీవితాలను భయంతో, భక్తితో, భ్రమలతో పూర్తిగా నియంత్రించే పనిలో వుంది. దాని దుర్మార్గాలను వ్యతిరేకిస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామిక గొంతులను నిర్బంధిస్తుంది, హింసిస్తుంది. ఈ ఫాసిస్టు నిర్బంధాల, హింసల సందర్భంలో చరిత్ర నుండి మనకు అనివార్యంగా గుర్తుకొచ్చేది ఇటాలియన్ ఫాసిస్టు ముస్సోలిని, జెర్మనీ నాజి హిట్లర్. వీళ్ళే కాదు తన చివరి శ్వాస వరకు ఫాసిజంతో పోరాడుతూ, రాజ్య నిర్బంధంలో సహితం విప్లవ రాజకీయాల మీద, సోషలిస్టు వ్యవస్థల మీద గొప్ప విశ్వాసాన్ని ప్రకటించిన విప్లవ మేధావి, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు ఆంటోనియో గ్రాంసీ.

గ్రాంసీ జనవరి 22, 1891లో దక్షిణ ఇటలీలోని సార్డీనియా అనే ద్వీపంలో అలెస్ అనే చిన్న పట్టణంలో పుట్టాడు. తండ్రి ఫ్రాన్సెస్కో స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో ఒక చిన్న క్లర్క్‌గా పని చేసేవాడు. అయితే 1897లో ఒక అక్రమ లావాదేవీల కేసులో నేరం మోపబడి ఫ్రాన్సెస్కో 1898 నుండి 1904 వరకు జైలు జీవితం గడిపాడు. అప్పుడు గ్రాంసీ తల్లి పెప్పిన మార్సియాస్ తన ఏడుగురు బిడ్డలను పోషించడానికి ఎన్నో కష్టాలు పడింది. తన పిల్లలకు కడుపు నిండా తిండి పెట్టడానికి కుట్టుపని చేసింది, తమకున్న భూమిని అమ్మింది. తిండికి రోజులు గడుస్తే చాలు అనుకుంటున్న ఆ కాలంలోనే గ్రాంసీకి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. అది పాట్స్ వ్యాధి (టీబీ కారణంగా వెన్నుముక వంగిపోయి గూనిగా మారే స్థితి) అని వైద్యులు నిర్ధారణ చేశారు.




ఆ వ్యాధికి చికిత్సగా గ్రాంసీని తరచుగా కొన్ని గంటలపాటు సీలింగ్‌కు వేలాడదీసేవారు. అది అతనికి భరించలేనంత నొప్పిని కలిగించేది. దీనికి తోడు బడిలో తోటి పిల్లలు తన మీదికి రాళ్ళు విసురుతూ తన గూనిని ఎగతాళి చేయడం గ్రాంసీకి చాలా బాధ కలిగించేది. వీటికి తోడు ఇల్లు గడవడం కోసం తన తల్లికి తోడుగా ఉండాలని గ్రాంసీ తన ప్రాథమిక విద్య పూర్తి కాకముందే మున్సిపాలిటీ ఆఫీస్‌లో రికార్డ్స్ మోసే నౌకరీకి కుదిరాడు. తన ఆరోగ్య పరిస్థితి రీత్యా తాను పెద్ద పెద్ద రికార్డ్స్ మోయలేకపోయినా తప్పక మోసి ఎన్నో రాత్రులు ఒళ్ళు నొప్పులతో ఏడుస్తూ గడిపాడు. 1904లో తన తండ్రి జైలు నుండి బయటకు వచ్చిన తర్వాతే మళ్ళీ బడికి పోవడం మొదలుపెట్టాడు. అయితే తన బాల్యంలో తల్లి పడిన బాధలను స్వయంగా చూశాడు కనుక గ్రాంసీకి ఆమె అంటే జీవితమంతా ఎనలేని ప్రేమ, గౌరవం వున్నాయి. అంతే కాదు, సమస్యలు అన్ని దిక్కులను మూసివేసినా ముందడుగు ఎట్లా వేయాలని గ్రాంసీ తన తల్లి జీవితానుభవంలో నుండి నేర్చుకున్నాడు.

గ్రాంసీ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనకబాటుకు, వ్యవస్థీకృత అణిచివేతకు గురైనా సార్డీనియాలో పుట్టి పెరగడం మూలంగా అక్కడి పేదరికాన్ని, నిత్యజీవిత వెతలను తన అనుభవంలో నుండి, పరిశీలనలో నుండి అర్థం చేసుకున్నాడు. ఆ వెనుకబాటు ప్రాంతంలో ముఖ్యంగా రైతాంగం, ఇతర వృత్తిదారులు అనుభవించే కష్టాలను ప్రత్యక్షంగా చూశాడు. మొదటగా ఆ జీవిత అనుభవాలే అసమవ్యవస్థల గురించి, సామాజిక పరివర్తనల గురించి గ్రాంసీని ఆలోచింపచేసినవి. సమస్యలపై ప్రజలను చైతన్యపరిచే బాధ్యతతో తాను జర్నలిస్టుగా పని చేశాడు. అయితే తనను తానుగా ఎప్పటికి "ప్రొఫెషనల్ జర్నలిస్టు"గా భావించుకోనని చెప్పుకున్నాడు. ఎందుకంటే "డబ్బుకు తమ కలాన్ని అమ్ముకొని నిరంతరం అబద్ధాలు రాయడమే వృత్తిగా ఎంచుకున్న

చోట నా భావాలను దాచుకోకుండా ప్రకటించుకునే స్వతంత్ర జర్నలిస్టుగానే ఉంటానని" ప్రకటించాడు. మరో మాటలో చెప్పాలంటే ప్రొఫెషనలిజం ముసుగులో దోపిడీ వ్యవస్థల కొమ్ముకాయలేనని జీవిత తొలినాళ్ళలోనే నిర్ణయించుకున్నాడు.

జర్నలిస్టుగా పనిచేస్తున్న క్రమంలోనే యూనివర్సిటీ చదువుల కోసం తనకు స్కాలర్‌షిప్ రావడంతో దాని ఆధారంగా ఉత్తర ఇటలీలోని టురిన్ అనే నగరానికి 1911లో మారాడు. అక్కడ తత్వశాస్త్రం, భాషాశాస్త్రం చదువుకున్నాడు. అప్పుడు తన వయస్సు ఇరవై సంవత్సరాలు. టురిన్ గ్రాంసీకి ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఎందుకంటే టురిన్ ఇటలీకి పారిశ్రామిక కేంద్రం లాంటిది. అక్కడ ఫియట్ వంటి ఎన్నో ఆటోమొబైల్ సంస్థలతో పాటుగా అనేక మెటలర్జికల్ పరిశ్రమలు ఉన్నాయి. ఆ కాలంలో రోమ్ పరిపాలనా కేంద్రంగా వుంటే మిలాన్ వ్యాపార కేంద్రంగా వుండేది. బాగా చదువుకున్న వాళ్ళు రోమ్, మిలాన్ పోవాలని కుతూహలపడుతుంటే, కార్మికులకు టురిన్‌లో పనిచేయాలనేది ఒక కలగా వుండేది. అలాంటి టురిన్ గ్రాంసీకి కార్మికవర్గ జీవితాన్ని, సంఘటిత పోరాటాలను పరిచయం చేసింది. అలాగే ఒక అభివృద్ధి చెందిన ప్రాంతంలో ఉండే ప్రజలు (శ్రామికవర్గంతో సహా) వెనుకబడిన ప్రాంతాలను (దక్షిణ ఇటలీని), అక్కడి ప్రజల జీవన పద్ధతులను ఎలా ఎగతాళి చేస్తారో చూశాడు. ఈ తప్పుడు స్పృహ ఏ విధంగా పాలకవర్గాల ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందో గ్రహించగలిగాడు. ఆ క్రమంలోనే తాను మార్క్స్ నుండి నేర్చుకున్న పెట్టుబడి అభివృద్ధి రహస్యం, కార్మికవర్గ స్పృహకు సంబంధించిన ఆలోచనలను ఆచరణలో చూడగలిగాడు.

టురిన్‌లో గ్రాంసీ ఎంతోమంది యువ మిలిటెంట్లను, సోషలిస్టు నాయకులను కలిశాడు. 1912లోనే ఇటాలియన్ సోషలిస్టు పార్టీలో చేరి చాలా క్రియాశీలంగా పనిచేశాడు. అతికొద్ది కాలంలోనే (1914లో) "యంగ్ సోషలిస్ట్స్" విభాగం నిర్మాణంలో భాగమయ్యాడు. అంతేకాదు ఆ పార్టీలో ఉండే సంస్కరణవాద భావాలకు వ్యతిరేకంగా నిలబడినాడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో పార్టీ తీసుకోవాల్సిన స్టాండ్ గురించి జరిగిన చర్చల్లో కమ్యూనిస్టులకు "తటస్థత" ఉండకూడదని వాదించాడు. పార్టీలో మెజారిటీ సభ్యులు యుద్ధం విషయంలో తటస్థంగా వుందామనే అభిప్రాయంతో వున్నారు. అప్పటికే ఆ పార్టీలో ముస్సోలిని ప్రముఖ స్థానంలో ఉన్నాడు. సోషలిస్టు పార్టీ అధికార పత్రిక "అవంటి"కి (ఇటలీలో "ముందడుగు" అని అర్థం) ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. అంతకుముందే "వర్గ పోరాటం" అనే పత్రిక తానే స్వయంగా స్థాపించి అద్భుతంగా నడుపుతున్నాడు. తన రచనాశైలితో, మంత్రముగ్ధులను చేయగల వాగ్ధాటితో పార్టీలో ఎంతో ఆకర్షణ సంపాదించుకున్నాడు. అటువంటి సోషలిస్టు ముస్సోలిని యుద్ధంలో పాల్గొనాలని వాదించాడు. సామ్రాజ్యవాద యుద్ధం సృష్టించిన సంక్షోభ సందర్భాన్ని సోషలిస్టులు ఉపయోగించుకొని బూర్జువా ప్రభుత్వాలను కూలదోయాలనే లెనిన్ వాదనను కూడా పార్టీ సభ్యుల ముందు పెట్టాడు. ఆ వాదనను గ్రాంసీ సమర్థిస్తూ వ్యాసం కూడా రాశాడు. బతికుండడమంటే ఒక సంఘర్షణా, సంక్షోభ సందర్భంలో ఒక కచ్చితమైన వైఖరి తీసుకుని ఏదో ఒక వైపుకు నిలబడటం అని స్పష్టం చేసాడు. "నేను బతికే వున్నాను, నేను ఒక వైపుకు నిలబడుతాను" అని ప్రకటించాడు. విప్లవకర పరిస్థితులు ఉన్నప్పుడు విప్లవ రాజకీయాలు చేయకుండా పార్లమెంటులో బూర్జువాలతో కలిసి అధికారం పంచుకుంటే ప్రజలను మోసం చేసినట్లేనని ప్రకటించాడు. బూర్జువా రాజ్యవ్యవస్థలో అధికారం పంచుకునే కమ్యూనిస్టులు పార్లమెంటుకు లేని సాధికారతను అంటకడుతున్నారని అన్నాడు. అయితే ఇదే సందర్భంలో మెజారిటీ సభ్యులు "తటస్థ" విధానానికి కట్టుబడి వుండటంతో ముస్సోలిని సోషలిస్టు పార్టీ నుండి (నవంబర్ 14, 1914) బహిష్కరింపబడ్డాడు. అలాగే పత్రిక బాధ్యతలకు కూడా తాను రాజీనామా చేశాడు. అప్పుడే యూనివర్సిటీ చదువు పూర్తిచేసుకున్న గ్రాంసీ (డిసెంబర్ 1915లో) ఆ పత్రిక ఎడిటర్ బాధ్యతలు స్వీకరించాడు.

1917లో విజయవంతమైన రష్యా విప్లవం ఇటలీలో కార్మికవర్గానికి, సోషలిస్టులకు ఎంతో ఆశాభావాన్ని నింపింది. గ్రాంసీ "పెట్టుబడికి వ్యతిరేకంగా విప్లవం" అనే వ్యాసం రాశాడు. రష్యన్ విప్లవం ద్వారా మార్క్సిజం ఒక జడ పదార్థం కాదని, విప్లవకర పరిస్థితులున్న ఏ సమాజంలోనైనా విప్లవ స్పృహతో ఆయా పరిస్థితులకు అనుగుణంగా పనిచేస్తే విప్లవం సాధ్యమని, మార్క్స్ చెప్పిన చారిత్రక దశలన్నీ పరిపక్వంగా దాటి పోవాల్సిన అవసరం లేదని భావించాడు. గ్రాంసీ చేసిన ఈ ఆలోచనను కొందరు మేధావులు అతను మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాద సూత్రాలను వ్యతిరేకించాడని అర్థం చేసుకున్నారు. కాని ఒక బ్లూ ప్రింట్ చేతిలో పెట్టుకుని విప్లవాలు చేయడం కాకుండా ఆయా స్థల, కాలాల, భౌతిక పరిస్థితులకు అనుగుణంగా విప్లవ మార్గాన్ని నిర్దేశించుకోవడమే సరైన మార్క్సిస్టు అవగాహనని గ్రాంసీ భావించాడు.

అదే సంవత్సరం ఆగస్టు 29న టురిన్‌లో కార్మిక వర్గ తిరుగుబాటు జరిగింది. ఐదు రోజులు ఆ తిరుగుబాటు కొనసాగింది. కాని రాజ్యం పాశవికంగా అణిచివేసింది. కొన్ని డజన్ల మంది చనిపోయారు. వందల్లో గాయపడ్డారు. వేలాది సోషలిస్టు కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంలోనే గ్రాంసీ ఆ పార్టీ ప్రొవిన్సియల్ కమిటీ (టురిన్ అరియా) కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. తాను కార్యదర్శిగా పని మొదలుపెట్టిన తర్వాత రష్యన్ "సోవియట్ల" స్ఫూర్తితో ఫాక్టరీ కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ఫాక్టరీ కౌన్సిల్స్‌ను కార్మికులే ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ఈ కౌన్సిల్స్ కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం మాత్రమే కాకుండా బూర్జువా రాజ్యాన్ని ఎదురించగల "శ్రామికవర్గ ప్రజాస్వామ్యాన్ని" నిర్మాణం చేయాలని భావించారు. వీటితో సమాంతరంగా "సాంస్కృతిక విప్లవాన్ని" సాధించడం కోసం అనేక సంస్థలను కూడా స్థాపించారు.

ముందు పునాది (ఆర్థిక సంబంధాలు) మారిన తర్వాతే ఉపరితల (సాంస్కృతిక, నైతిక) అంశాలు ఆలోచిద్దామనే కొన్ని మార్క్సిస్టు పోకడలకు గ్రాంసీ వ్యతిరేకి. పునాది, ఉపరితలం సమాంతరంగా మారగలవని నమ్మాడు. అయితే ఇది కేవలం శ్రామికవర్గం (తన సహజ మిత్రపక్షమైన రైతాంగంతో కలిసి) రాజ్యాధికారాన్ని, సాధించే పోరాటాల ద్వారనే సాధ్యమవుతుందని భావించాడు. భావజాలరంగంలో ఇంకా చేయాల్సిన కృషిని దృష్టిలో పెట్టుకుని 1919లో L'Ordine Nuovo (దీనర్థం "కొత్త ఆజ్ఞ" లేదా "కొత్త పద్ధతి") అనే వారపత్రికను మరికొందరి సహచరులతో కలసి ఏర్పాటు చేశాడు. గ్రాంసీ ఆశించినట్లే ఈ పత్రిక భావజాలపరంగా సోషలిస్టు క్యాంప్‌లో అనేక చర్చలను లేవనెత్తింది.

1920 ఏప్రిల్‌లో కార్మికులు తమ పని గంటల తగ్గింపుకై నెల రోజుల పాటు చేసిన మహత్తర సమ్మెలో దాదాపు రెండు లక్షల టురిన్ కార్మికులు పాల్గొన్నారు. కాని సోషలిస్టు పార్టీలోని ఒక ట్రేడ్ యూనియన్ గ్రూపు వెనుకడుగు వేయడంతో, రాజ్యం వేలాది మంది సైన్యాన్ని మోహరించడంతో ఆ సమ్మెను జాతీయ స్థాయి సమ్మెగా మలచలేకపోయారు. అంతే కాదు అప్పటివరకు ఫాక్టరీ కౌన్సిల్స్ సాధించిన విజయాలన్నింటిని పెట్టుబడిదారులు తుడిచేశారు. అయితే అంతటి నిరుత్సాహ సందర్భంలో సహితం గ్రాంసీ ఆశయంలో ఎలాంటి మార్పు రాలేదు. అంతేకాదు పార్టీని మరింత పటిష్టంగా నిర్మాణం చేయడానికి సోషలిస్టు పార్టీని పెటీబూర్జువా పార్లమెంటరీ పంథా నుండి విప్లవ శ్రామికవర్గ పార్టీగా మార్చాలని నిర్ణయించుకున్నాడు. కమ్యూనిస్టు విప్లవ పోరాటంతో ఏకీభవించని వాళ్ళందరినీ పార్టీ నుండి బహిష్కరించారు. కొందరు సభ్యులను బయటకు పంపారు కాని మొత్తంగా పార్టీ విధానమే సంస్కరణవాదానికి కట్టుబడి ఉంటే రాడికల్‌గా మార్పులు చేయడం సాధ్యం కాదని గ్రాంసీ భావించాడు. అంతే కాదు కేవలం పునాది (ఆర్థిక) అంశాలలో విప్లవకర పరిస్థితులు వుంటే సరిపోవు, కార్మికులలో విప్లవ స్పృహ కూడా వుండాలి. భౌతిక పరిస్థితులకు భావాలు తోడయినప్పుడే విప్లవం సాధ్యమవుతుందని బలంగా నమ్మాడు. దానిని ఆచరణలో పెట్టడానికే పార్టీలో ప్రధానంగా మూడు అంశాల మీద గ్రాంసీ తన దృష్టిని కేంద్రీకరించాడు: శ్రామిక ప్రజాస్వామ్యం, నిరంతర విద్య, ప్రజలలో కమ్యూనిస్టు ప్రచారం.

జులై 19, 1920 మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ కాంగ్రెసుకు గ్రాంసీ హాజరై లెనిన్‌తో పార్టీ నిర్మాణం, పంథాకు సంబంధించిన అంశాలపై చర్చించాడు. గ్రాంసీ ప్రతిపాదనలకు తన అంగీకారాన్ని తెలుపుతూ లెనిన్ సోషలిస్ట్ పార్టీకి ఒక ఉత్తరం కూడా రాశాడు. అయితే సోషలిస్టు పార్టీ ముఖ్య నాయకత్వం ఇంకా మాస్కోలో ఉండగానే ఇటలీలో కార్మికులు వేతనాల పెంపు కోసం చేసిన డిమాండును యజమానులు అంగీకరించక పోవడంతో వాళ్ళు ఫాక్టరీలను ఆక్రమించుకుని ఉత్పత్తి మొదలుబెట్టారు. దాదాపు ఐదు లక్షల కార్మికులు ఒక నెల రోజులు ఆ ఆక్రమణ ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా తమకు చేతనైన ఆయుధాలతో రాజ్య సైన్యం నుండి తమను తాము రక్షించుకున్నారు. కాని ప్రభుత్వ సానుకూల జోక్యంతో కార్మిక సంఘాలు కూడా కొంత రాజీపడి తమ ఆధీనంలోకి తెచ్చుకున్న ఫాక్టరీలను తిరిగి యజమానుల వశం చేశారు. ఫాక్టరీ కౌన్సిల్స్ మళ్ళీ ఓడిపోయాయి. దీనికంతటికీ కేంద్రీకృత నిర్ణయాలు చేయలేని స్థితి, పోరాటాన్ని సమన్వయం చేయగలిగే నాయకత్వం సోషలిస్టు పార్టీలో లేకపోవడం ఒక పెద్ద కారణమని గ్రాంసీ విశ్లేషించాడు. సోషలిస్టు పార్టీలో విప్లవ మైనారిటీగా వుండి ఆ పార్టీ దిశ, దశ మార్చడం కష్టమని గ్రాంసీ అర్థం చేసుకున్నాడు. చివరికి జనవరి 1921లో లివోర్నోలో జరిగిన సోషలిస్టు పార్టీ సమావేశాల నుండి విప్లవ కమ్యూనిస్టులు బయటకు వచ్చి ఆ తర్వాతి రోజే ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీని ప్రకటించారు.

సోషలిస్టు పార్టీ నుండి బహిష్కరించబడిన ముస్సోలిని 1915లోనే సైన్యంలో చేరి మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొని, గాయపడి తిరిగొచ్చాడు. దానితో అతనికి ఒక "యుద్ధ వీరుడు" (వార్ హీరో) అనే ఇమేజ్ వచ్చింది. ఈ కొత్త ఇమేజ్ తనకు

రాడికల్‌గా వున్న పేరుతో జత కలిసి ముస్సోలినీకి ఒక సరికొత్త రూపాన్ని ఇచ్చింది. ఆ కొత్త రూపంతోనే ఫ్రెంచ్ ప్రభుత్వం, ఇటాలియన్ పారిశ్రామికవేత్తల సహాయంతో "ఇటాలియన్ ప్రజలు" అనే పత్రికకు ఎడిటర్ అయ్యాడు. ఇక అప్పటి నుండి ప్రపంచ విప్లవాల స్థానంలో "విప్లవ జాతీయవాదం" పేరుతో ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం మొదలుపెట్టాడు. "మనందరి గుండెల నుండి ఒక్కటే మాట వినిపించాలి. అది ఇటలీ జిందాబాద్!" అని మొదటిగా ప్రచారం చేశాడు. అయితే జాతినంతటిని ఒక్క తాటి మీదికి తేవాలంతే ఒక శక్తివంతమైన నాయకుడు కావాలని చెప్పి, మరో మూడు నెలల తర్వాత "ఆ నాయకుడ్ని నేనే అని నిరూపించుకుంటా'' అని కూడా ప్రకటించాడు. ఒకప్పుడు శ్రామికవర్గ నియంతృత్వం గురించి మాట్లాడిన ముస్సోలిని మొత్తం సమాజం మీద ఒక వ్యక్తి (తన) నియంతృత్వం కోసం పనిచేయడం మొదలు పెట్టాడు. ఆ పనిలో భాగంగా మార్చ్ 23, 1919న రెండు వందల మందితో కలిసి ఒక "పోరాడే మూక"ను (Italian Fasces of Combat అనే పేరుతో) ఏర్పాటు చేశాడు. ఆ సంస్థ సభ్యులు మృత్యువుతో సహితం తలపడగలరని వాళ్ళకు నల్లషర్ట్ ధరించడం ఒక సింబల్‌గా పెట్టుకున్నారు. ఈ నల్లషర్టు మూక అతి కొద్ది కాలంలోనే అనేక పట్టణాలకు పాకిపోయింది. ఆ సంస్థే 1921 నాటికి "జాతీయ ఫాసిస్టు పార్టీ" గా రూపాంతరం చెందింది. 1922 వేసవి కాలం వచ్చేసరికి దాదాపు ఐదు లక్షల మంది ఫాసిస్టు పార్టీ సభ్యులు తయారయ్యారు.

సమాజంలో సమానత్వం లేని స్వేచ్ఛ కేవలం మార్కెట్ స్వేచ్ఛే అవుతుంది తప్ప మనిషి స్వేచ్ఛ కాదనే ప్రాథమిక మార్క్సిస్టు అవగాహనను కూడా మరిచి ముస్సోలిని "స్వేచ్ఛ అరాచకత్వానికి తల్లి లాంటిదని" ప్రచారం చేశాడు. దానితో తన మూకలు స్వేచ్ఛా, సమానత్వం గురించి మాట్లాడే సోషలిస్టుల మీద తమ దృష్టిని కేంద్రీకరించారు. వాళ్ళ మీద దాడులు చేశారు, హత్యలు చేశారు. ఫాసిస్టులకు వ్యతిరేకంగా రాసే అన్ని పత్రికలను ధ్వంసం చేశారు. పరిశ్రమలలో ట్రేడ్ యూనియన్ల నుండి కార్మికులు బయటకు వచ్చేలా వాళ్ళ మీద ఒత్తిడి, హింస ప్రయోగించారు. సోషలిస్టులను పార్టీలకు రాజీనామా చేయించారు. మెల్లగా సైన్యంలో కూడా తమ ప్రభావాన్ని పెంచుకోవడమే కాకుండా, స్వయంగా అందులోకి చేరిపోయారు కూడా. అలాంటి పరిస్థితుల్లో ముస్సోలోనికి వ్యతిరేకంగా మాట్లాడడం అంటే కోరి ఆపదలను కొని తెచ్చుకోవడమే. ప్రమాదస్థాయికి చేరిన ఫాసిజానికి ఇటాలియన్ పారిశ్రామిక వర్గం తన పూర్తి సహకారాన్ని అందించింది. అతి కొద్ది కాలంలోనే ఫాసిజాన్ని ఒక విధ్వంస శక్తిగానే కాకుండా ఒక కొత్త సంస్కృతిగా అభివృద్ధి చేయడంతో అది ఒక బలమైన భావజాలంగా ప్రజల్లోకి (ముఖ్యంగా మధ్యతరగతిలోకి) పోగలిగింది. దానితో ఒక నూతన ఫాసిస్టు మానవుడిని నిర్మాణం చేయడమే తమ లక్ష్యమని ఫాసిజం ప్రకటించుకునే స్థాయికి చేరింది. అల్లకల్లోలంగా మారిన ఇటలీ పరిస్థితిని అదుపులోకి తేవాలంటే తనను ప్రధానమంత్రిని చెయ్యాలని ముస్సోలిని ప్రకటించాడు. తన ప్రజాబలాన్ని చూపించుకోవడం కోసం అక్టోబర్ 27–29, 1922న ముప్ఫైవేల మంది ఫాసిస్టు మూకతో రోమ్ మీదికి మార్చ్ (March on Rome) గా వెళ్ళాడు. అక్టోబర్ 29న ముస్సోలిని అధికారాన్ని చేపట్టాడు. ఇక అప్పటినుండి నిర్బంధం, హింస చట్టబద్ధమై పోయినవి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంస్థలు కూడా కూల్చబడినవి.

ఫాసిస్టుల పాలనలో బహిరంగంగా పనిచేయలేని పరిస్థితుల్లో కమ్యూనిస్టులు, సోషలిస్టులు అజ్ఞాతంలోకి పోవాల్సివచ్చింది. అదే సందర్భంలో కమ్యూనిస్టు ఇంటర్నేషల్‌కు తమ పార్టీ ప్రతినిధిగా ఎన్నుకోబడటంతో గ్రాంసీ మాస్కో వెళ్ళాడు. అక్కడ మే 1922 నుండి నవంబర్ 1923 వరకు ఉన్నాడు. అక్కడే తన సహచరి జూలియ స్ముచ్ట్‌తో పరిచయమయ్యి, పెండ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత మే 1924లో వియన్నా మీదుగా ఇటలీకి చేరుకున్నాడు. ఈ రెండు సంవత్సరాల కాలంలో గ్రాంసీ అతని సహచరులు ఫాసిజాన్ని చాలా తక్కువ అంచనా వేశారు. సంక్షోభ సందర్భంలో బూర్జువావర్గం కార్మికవర్గ పోరాటాలను నీరు కార్చడానికి, అణిచివేయడానికి సాధారణంగా సృష్టించే కల్లోలంగా మాత్రమే చూశారు. అది వెల్లువలా వచ్చే విప్లవ ప్రవాహంలో కొట్టుకు పోతుందనే ధీమాతో వున్నారు. అది రోమ్ ఆక్రమణ దిశగా నడిచి అధికారం కైవసం చేసుకుని మొత్తంగా కమ్యూనిస్టు, సోషలిస్టు, ఉదారవాద రాజకీయాలను నిర్మూలించే పని మొదలు పెట్టే వరకు వాళ్ళకు ఫాసిజం పూర్తిగా అర్థం కాలేదు. ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటన ఆలోచనలు చేసినప్పటికీ దాని నిర్మాణం కోసం తగిన కృషి చేయలేకపోయారు. ఎందుకంటే ఆ సందర్భంలో ఐక్యసంఘటన నిర్మాణం కంటే తమ పార్టీని పటిష్టం చేసుకోవడం ముఖ్యమని భావించారు. చివరికి (తమ పాత పార్టీ) సోషలిస్టులతో కలిసి పనిచేయమని మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సలహా ఇచ్చినప్పటికీ విప్లవ కార్మిక పోరాటాలకు తిలోదకాలిచ్చిన (లిక్విడేషనిస్టు), సంస్కరణవాద పార్టీతో కలసి పనిచేయలేమని చెప్పారు. అందుకే 1926లో గ్రాంసీని అరెస్ట్ చేసే వరకు కూడా

అందరూ (కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఉదారవాదులు) కలిసి ఒక ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనగా పెద్దగా పనిచేయలేక పోయారు.

ముస్సోలిని అధికారంలోకి రాగానే పౌరహక్కులను కాలరాసే అనేక నల్లచట్టాలను తెచ్చాడు. ముఖ్యంగా నవంబర్ 05, 1926న పదిహేనేండ్ల ఒక అబ్బాయి ముస్సోలినీని చంపే ప్రయత్నం చేశాడనే నెపంతో ఫాసిస్టు వ్యతిరేక కార్యక్రమాలను అరికట్టడానికి దుర్మార్గమైన చట్టాలు, సీక్రెట్ పోలీస్ వ్యవస్థను అమలులోకి తెచ్చారు. ఆ చట్టాల ప్రకారం ప్రజా గొంతుకులన్నీ దేశ భద్రతకు ముప్పే! అందులో భాగంగానే రాజ్యాన్ని కూలదోసే కుట్ర చేస్తున్నాడని, వర్గకసిని రగిల్చే రాతలు రాస్తున్నాడని గ్రాంసీని నవంబర్ 08, 1926న రోమ్ నగరంలో అరెస్ట్ చేశారు. ముందుగా కొన్ని వారాలు ఎలాంటి విచారణ లేకుండానే ఉస్టిక అనే ద్వీపంలో ఉన్న జైల్లో ఉంచారు. తర్వాత జనవరి 1927లో విచారణ కోసం మిలాన్ తీసుకొచ్చారు. కాని అరెస్ట్ చేసిన పద్దెనిమిది నెలల వరకు (మే 1928) విచారణ మొదలు కాలేదు. చివరికి విచారణ "పూర్తిచేసి" శిక్ష వేసిన రోజు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రాంసీని చూపిస్తూ "ఇరవై సంవత్సరాలు మనము ఆ మెదడు పని చేయకుండా చేయాలి" అని జడ్జిని డిమాండు చేశాడు. అది ముస్సోలిని కోరికగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు చెప్పాడు. ఇరవై సంవత్సరాల జైలు శిక్ష విధించారు.

గ్రాంసీని రోమ్ నుండి టోరీ జైలుకు తరలించారు. ఆ తరలింపులో కూడా గ్రాంసీ ఎంతో హింసను అనుభవించాడు. పశువులను సరఫరా చేసే ఒక వ్యాన్‌లో పూర్తిగా పడుకోవడానికి, నిలబడడానికి వీలులేని విధంగా తాళ్ళతో కట్టి రెండు వారాల పాటు సాగిన ప్రయాణం ఆయన ఆరోగ్యాన్ని పూర్తిగా క్షీణింప చేసింది. ఇక అంతంత మాత్రంగా వుండే గ్రాంసీ ఆరోగ్యాన్ని జైలు జీవితం మరింత దెబ్బతీసింది. సరిగ్గా ఉండని ఆహారం, అందుబాటులో లేని వైద్యంతో గ్రాంసీ కొద్ది నెలల్లోనే శారీరకంగా ఎంతో బలహీనపడిపోయాడు. ప్రతిరోజు కొన్ని స్పూన్ల ఆహారం మాత్రమే తీసుకునే స్థితికి చేరాడు. దానికి తోడు ఆరోగ్య సమస్యల మూలంగా గ్రాంసీ దంతాలన్నీ ఊడిపోవడంతో పరిస్థితి మరింత జటిలమయ్యింది. కడుపులో మెలికలు పెట్టే నొప్పితో నిద్రపోలేని స్థితి. అందులో రాత్రిపూట సెక్యూరిటీ కోసం మూడుసార్లు నిద్ర లేపడం, తన సెల్ సెక్యూరిటీ గార్డ్ గది పక్కనే ఉండటంతో నిద్రపోవడం అసాధ్యంగా మారిపోయింది. జైలు నుండి నవంబర్ 3, 1930లో రాసిన ఒక ఉత్తరంలో ఇలా రాశాడు: "అక్టోబర్ నెలకు నా లెక్కలు పూర్తిచేసాను. కేవలం రెండు రాత్రులు మాత్రమే ఐదు గంటలు పడుకున్నాను. తొమ్మిది రాత్రులు అస్సలు పడుకోలేదు. మిగతా రాత్రులు ఐదు గంటల కన్నా తక్కువే నిద్రపోయాను. నామీద నాకే ఆశ్చర్యంగా వుంది నేను పూర్తిగా కుప్పకూలిపోకుండా ఇంకా ప్రతిఘటిస్తున్నందుకు." దీనితో పాటు నిరంతరం జన సమూహంలో బతికిన అతనికి జైలు ఒంటరితనం మానసికంగా క్షోభ పెట్టింది. అయినా కూడా తానెప్పుడూ స్వీయసానుభూతికి గురికాలేదు, తనను తాను త్యాగం చేస్తున్నానని కీర్తించుకోలేదు. తన అరెస్టు, నిర్బంధం తాను నమ్మిన విప్లవ రాజకీయాలలో భాగంగానే భావించాడు. అదే విషయాన్ని తన అక్కకు రాసిన ఉత్తరంలో వివరంగా ప్రస్తావించాడు. ఈ పరిస్థితుల్లో గ్రాంసీ రెండు సార్లు (మే 1931, మార్చ్ 1933) మృత్యువు అంచుల దాకా వెళ్ళివచ్చాడు. ఈ స్థితికి యూరోప్ లో ఉన్న అనేక వామపక్ష, ప్రజాస్వామ్య మేధావులు తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. గ్రాంసీ ఆరోగ్యం మరింత దెబ్బతినడంతో చివరికి జనవరి 1936న ఫోర్మియాలో ఉన్న క్లినిక్, తర్వాత రోమ్‌లో మరో క్లినిక్‌కు మార్చారు. అది కూడా పోలీస్ పర్యవేక్షణలోనే. ప్రపంచవ్యాప్తంగా పెరిగిన నిరసనల మూలంగా ఫాసిస్టు రాజ్యం ఆయన శిక్షను ఇరవై సంవత్సరాల నుండి పది సంవత్సరాలకు తగ్గించింది. కాని ఆ పది సంవత్సరాల శిక్ష అయిపోయిన వారం రోజులకే గ్రాంసీ ఏప్రిల్ 27, 1937న మరణించాడు.

ఫాసిస్టులు గ్రాంసీ మెదడును ఇరవై ఏండ్లు పనిచేయకుండా నిలుపాలనుకున్నారు. కాని ఫాసిస్టుల కల నెరవేరలేదు. తాను బయట ఉన్నప్పుడు రాసిన దానికి (రాశిలోనూ, వాసిలోనూ) ఎన్నో రెట్లు జైల్లో రాయగలిగాడు. బయట వున్నప్పుడు సమస్యలకు, సందర్భానికి అనుగుణంగా ఒక కరపత్రమో లేక వ్యాసమో రాశాడే తప్ప ఒక భావనను పూర్తిగా అభివృద్ధి చేస్తూ రాసే అవకాశం అతనికి దొరకలేదు. అందుకే తన జైలు ముందు జీవితపు రచనలను ఒక పుస్తకంగా తేవడం కూడా గ్రాంసీకి పెద్దగా ఇష్టం లేదు. వాటిని నిలువచేయాల్సినవిగా అతను చూడలేదు. జైల్లో చాలా సీరియస్‌గా తన ఆలోచనలను ఒక క్రమ పద్ధతిలో రాయాలనుకున్నాడు. అయితే జైలు అధికారులు అతనికి అరెస్ట్ చేసిన తర్వాత ఇరవై ఆరు నెలల వరకు (జనవరి 1929 వరకు) రాసే అవకాశం ఇవ్వలేదు. కేవలం తన వదిన టాటియానాకు (గ్రాంసీ సహచరి అతని అరెస్ట్ తర్వాత రష్యాలోనే వుండిపోయింది. ఆమెకు డైరెక్ట్‌గా రాయలేదు కాబట్టి) రెండు వారాలకు ఒక ఉత్తరం మాత్రమే రాసే అనుమతినిచ్చారు. అయితే తన భావాలు రాసుకునే అనుమతి వచ్చిన తర్వాత 2848 పేజీల నోట్స్ (32 నోట్ పుస్తకాలలో) రాసుకున్నాడు.

గ్రాంసీకి సాధారణంగా ప్రజలకు అవసరం లేని విషయాలు రాయడం, రాసే విషయం ఆసక్తి కలిగించకుండా రాయడం అస్సలు ఇష్టముండని పని. కాని జైల్లో తాను రాసే ప్రతి అక్షరాన్ని అధికారులు చాలా జాగ్రత్తగా చదువుతారు. అందులో తన కోసమే కొంత మార్క్సిజంతో పరిచయం వున్న అధికారులను ఆ జైల్లో నియమించారు. ఒక్క వాక్యమైనా వర్గాల గురించో, వర్గపోరాటాల గురించో వుంటే తన రచనలు ముందుకు సాగనివ్వరు. రాసిన వాటిని బయటకు పోనివ్వరు. అందుకే గ్రాంసీ తనదైన జైలు భాషను అభివృద్ధి చేసుకుని కొంత నైరూప్యంగా, గాఢమైన పదాలతో (తనకు ఇష్టముండని, ఆసక్తి కలిగించని పద్ధతిలో) రాయడం మొదలు పెట్టాడు. మార్క్సిజం అనేచోట "ఆచరణాత్మక తత్వశాస్త్రమని," మార్క్స్ ఎంగెల్స్ అని చెప్పేచోట "ఆచరణాత్మక తత్వశాస్త్ర వ్యవస్థాపకులని" వాడాడు. అలాగే శ్రామిక, పీడిత వర్గాలకు బదులు సబాల్టర్న్ అనే పదం వాడాడు. మిలటరీ పరిభాషలో సబాల్టర్న్ అంటే కిందిస్థాయి ఉద్యోగి అని అర్థం. అన్ని అణగారిన, అణిచివేతకు గురవుతున్న వర్గాలను సబాల్టర్న్‌గా తన రచనలలో రాసుకున్నాడు. ఎన్నో గొప్ప విషయాలతో రాసుకున్న గ్రాంసీ మొత్తం నోట్స్ బయటి ప్రపంచానికి తెలువడానికి ఆయన మరణం తర్వాత నలభై ఏండ్లు పట్టింది. అయితే గ్రాంసీ రాసిన విధానం (కొన్ని విషయాలు పొడిపొడిగా, మరికొన్ని సార్లు అంతకుముందు రాసిన వాటికి కొనసాయింపుగా లేదా వాటికి కొత్త విషయాలు జత చేస్తూ రాయడం) మూలంగా అతని జైలు రాతలను విశ్లేషించిన వాళ్ళు వారివారి దృక్పధాలకు అనుగుణంగానే చూడడంతో అనేక రకాల గ్రాంసీలు ఆవిష్కరింపబడ్డారు. అయితే, ఈ పరిస్థితి కేవలం గ్రాంసీకి మాత్రమే పరిమితమైనది కాదు!

గ్రాంసీ తన నోట్‌బుక్స్‌లో ఎన్నో ముఖ్యమైన కొత్త భావనలు నిర్మాణం చేసి మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని, ఆచరణను ఇంకా అభివృద్ధి చేశాడు. విప్లవ చైతన్యం, పార్టీ కర్తవ్యం, ఆర్థికవాద పెడధోరణులు, ఇంకా అనేక అంశాలలో పూర్తి మార్క్సిస్టులెనినిస్టుగా కనిపిస్తాడు. అయితే రాజకీయాలకు ఆర్థిక అంశాలకు ఉండే సంబంధం, పౌరసమాజాన్ని అర్థం చేసుకునే పద్ధతి తనకున్న రాజకీయ ఆచరణ రీత్యా మార్క్సిజానికి కొత్త భావనలను జత చేయగలిగాడు. కాని మార్క్సిజం పరిపూర్ణంగా వుండాలి, ఖాళీలు లేని విధంగా వుండాలని అనుకునే మేధావులకు గ్రాంసీ ఆ ఖాళీలు పూడ్చే పనిచేశాడనో, మార్క్సిజాన్ని సరిచేశాడనో అనిపించవచ్చు. కాని గ్రాంసీ సరైన మార్క్సిస్టు స్ఫూర్తితో, గతితార్కిక పద్ధతిలో తన ఆలోచనలు చేశాడు. ఆర్థిక పునాదే తప్పనిసరిగా ఉపరితలంలో ఉండే భావాలను, సాంస్కృతిక, నైతిక అంశాలను నిర్ణయిస్తుంది అనే ఆర్థికవాద పిడివాదాన్ని వ్యతిరేకించాడు. పునాది, ఉపరితలం ఒకదాన్నొకటి పరస్పరం ప్రభావితం చేసుకుంటూ "గతితార్కిక ఐక్యతా" సంబంధంలో వుంటాయని సూత్రీకరించాడు. ఆ రెండు కలిసి వుండే చారిత్రక స్థితినే "హిస్టోరికల్ బ్లాక్" అని నిర్వచించాడు. సమాజం పరివర్తన చెందాలంటే, కార్మికవర్గ ఆధిపత్యం (proletariat hegemony) రావాలంటే కేవలం ఆర్థిక సంబంధాలలో (పునాదిలో) మాత్రమే మార్పు వస్తే సరిపోదు మొత్తంగా హిస్టోరికల్ బ్లాక్‌లో మార్పు రావాలి. ఆ మార్పు ఒక తలంలో (ఆర్థిక పునాదిలో) ముందు, మరో తలంలో (ఉపరితలంలో) తర్వాత జరగాలనే నియమం కాకుండా అవి రెండూ సమాంతరంగా జరగాలని అభిప్రాయపడ్డాడు. ఈ ప్రక్రియ స్థూలంగా సమాజ పరివర్తన కోసమే కాకుండా మనిషి ప్రవృత్తిని ప్రభావితం చేయడానికి కూడా తోడ్పడుతుందని గ్రాంసీ నమ్మాడు.

మనిషంటే సామాజిక సంబంధాల సమాహారమని మార్క్స్ నుండి నేర్చుకున్నాడు కాబట్టే "మనిషంటేనే ఒక హిస్టోరికల్ బ్లాక్" అని అంటాడు గ్రాంసీ. అంతేకాదు హిస్టోరికల్ బ్లాక్ అనేది కేవలం ఒక భావన మాత్రమే కాదు సమాజాన్ని సామ్యవాదం దిశగా నడపడానికి పనికొచ్చే ఒక వ్యూహం. సాంస్కృతిక విప్లవ నిర్మాణానికి, సామ్యవాదాన్ని నిలబెట్టుకోవడానికి ఒక మంచి సాధనమని గ్రాంసీ భావించాడు. అయితే రాజకీయాల మీద ఆర్థికరంగ ప్రభావం వుంటుందని చెబుతూనే రాజకీయాలను ఒక స్వయంప్రతిపత్తి కల్గిన వ్యవస్థగా గ్రాంసీ చూడడం కొంత గందరగోళాన్ని కలిగించే అంశం. ఈ విషయంలో గ్రాంసీ మీద మార్క్స్ ప్రభావం కంటే మాకియవెల్లి ప్రభావమే ఎక్కువగా కనిపిస్తుంది. ఏది ఏమైనా నూతన హిస్టోరికల్ బ్లాక్ నిర్మాణం కోసం చేసే అన్ని రకాల ప్రయత్నాలు వర్గపోరాట ఆవరణలోనే జరగాల్సినవి అనేది గ్రాంసీ కచ్చితమైన భావన. అదే దృష్టితోనే ఫాసిజాన్ని కూడా అర్థం చేసుకున్నాడు.

గ్రాంసీ తన నోట్ బుక్స్‌లో దాదాపు 250 పేజీలు ఫాసిజం గురించే రాశాడు. ఫాసిజాన్ని కేవలం ఒక ఆర్థిక సంక్షోభంలో బూర్జువావర్గం చేసే ప్రతిఘాతక చర్యగా గ్రాంసీ చూడలేదు. అంతేకాదు కేవలం ఒక్క వర్గ ప్రయోజనం అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఫాసిజాన్ని అర్థం చేసుకోలేదు. ఎందుకంటే ఫాసిజం మిశ్రవర్గాల కలయికగా అభివృద్ధి చెందింది. కాబట్టి ఫాసిజం సంస్కృతిని, ఆధిపత్య భావజాలాన్ని, అహేతుకతను, అతి జాతీయవాదాన్ని పెంచి పోషించి, మొత్తంగా సమాజాన్ని ఏ విధంగా నియంత్రిస్తుందో అర్థం చేసుకోవాలి. ముందు

చెప్పినట్లుగా గ్రాంసీ మొదట్లో (తన అరెస్ట్‌కు ముందు) ఫాసిజాన్ని ఒక రాజకీయ పార్టీగానే చూశాడు. ఆ సందర్భంలో తన దృష్టంతా ఆ ఫాసిస్టు పార్టీకి వున్న ప్రజా పునాది ఏంటి, దానిని ఏ విధంగా దెబ్బ తీయొచ్చు అనే విషయాల మీదనే కేంద్రీకరించాడు. కమ్యూనిస్టులు బలం పుంజుకుంటే ఫాసిస్టులు బలహీనపడి విచ్ఛిన్నమవుతారనుకున్నాడు. అంతే కాదు ఫాసిజం నిర్మాణంలో ఉన్న ఒక ప్రాజెక్ట్. అది పూర్తిగా నిలిచిపోవచ్చు లేదా పూర్తి కావడానికి ఆలస్యం కావచ్చు. అది కమ్యూనిస్టులు చేసే పని మీదనే ఆధారపడి వుంటుందని భావించాడు. అందుకే పార్టీ నిర్మాణాన్ని వేగవంతం చేసే పనిలో పడ్డాడు. అయితే అతి కొద్ది సమయంలోనే గ్రాంసీకి అర్థమయ్యిందేమంటే ఫాసిజం కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు. అది ఒక సామూహికోద్యమం (mass movement) అని. ఎందుకంటే ఆ ఉద్యమంలో ఇటాలియన్ సమాజానికి ఉండే సాధారణ లక్షణాలు, ఆ ప్రజల సంస్కృతి ప్రతిబింబిస్తున్నాయి. ఇది ప్రజల సమ్మతితో జరిగే ఆధిపత్య ప్రక్రియ అని గ్రాంసీకి అర్థమయ్యింది. అందుకే ఫాసిస్టులను రాజకీయంగా అధికారంలోంచి కూలదోయడం ఎంత ముఖ్యమో, సంస్కృతిని ఫాసిస్టు సాధనంగా ఉపయోగించుకునే పద్ధతిని ఓడించడం కూడా అంతే ప్రధానం అని భావించాడు.

ఫాసిజం ఒక చారిత్రక సందర్భంలో కొత్తగా తెరమీదికి వచ్చినప్పటికీ అది సమాజంలో నిద్రాణమై ఉంటూ లేదా సంస్కృతిలో భాగమై వుంటూ రాజకీయ సందర్భం కలిసొచ్చినప్పుడు బయటపడుతుంది. అలా బయటపడడానికి ఫాసిజం తనకు తానుగా ఒక ప్రగతిశీల లక్షణాన్ని ఆపాదించుకుంటుంది. దీని మూలంగా మధ్యతరగతి, కార్మికవర్గాలు కూడా ఆకర్షింపబడే అవకాశం వుంది. అదే సందర్భంలో తనలోని అహేతుకమైన ప్రతిఘాతక లక్షణాలను కూడా ప్రదర్శిస్తుంది. "గత వైభవాన్ని" కీర్తిస్తూ, దానికి ప్రతికూలంగా ఉండే వాళ్ళను ఒక "ఉమ్మడి" శత్రువుగా తయారుచేసి వారి బారి నుండి జాతిని కాపాడే "రక్షకుడి" పాత్రను పోషిస్తుంది. ఇవన్నీ ముఖ్యంగా మధ్యతరగతి కండ్లల్లో ఫాసిజానికి ఒక హీరో ఇమేజ్‌ను తెచ్చిపెడుతాయి. ఆ ఇమేజ్ నిర్మాణం కోసం ఒక వ్యక్తి లేదా కూటమిని హీరోగా ముందుకు పెట్టుకుంటుంది.

ఫాసిజం ఈ ఊసరవెల్లి విన్యాసలన్నింటిని భూస్వామ్య, పెట్టుబడిదారుల సంపూర్ణ మద్దతుతోనే చేస్తుంది. ఎందుకంటే ఆ వర్గాల ప్రయోజనమే ఫాసిజం ప్రయోజనం కాబట్టి. అంతేకాదు ఆర్థిక రంగంలో ఆధునిక అభివృద్ధి (పెట్టుబడిదారి మార్కెట్) నమూనాలనే కొనసాగిస్తుంది, కాని ఉత్పత్తి సంబంధాలలో ఎలాంటి వ్యవస్థాగత మార్పులు జరగకుండా జాగ్రత్త పడుతుంది. కాబట్టి ఫాసిజం సారాంశంలో కచ్చితంగా కార్మిక వర్గానికి, రైతాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. అందువలన చివరికి ఆ వర్గాలు ఫాసిజం గుప్పెట్లో నుండి బయటపడుతాయని గ్రాంసీ సూత్రీకరించాడు. అయితే అది జరగాలంటే కార్మికవర్గంలో విప్లవ స్పృహ పెంపొందాలని, దాని కోసం కమ్యూనిస్టు పార్టీ ఎంతో కృషి చేయాల్సివుంటుందని గ్రాంసీ భావించాడు. అంతకు మించి ఫాసిస్టు వ్యతిరేక శక్తులన్నీ ఐక్యసంఘటనగా పోరాడితేనే ఫాసిజం వెనుకడుగు వేస్తుందని అభిప్రాయపడ్డాడు.

గ్రాంసీ అన్నట్లు "పాత ప్రపంచం చనిపోతుంది. కొత్త ప్రపంచం పుట్టడానికి కష్టపడుతుంది. ఇప్పుడు ఇది క్రూర పాలకులు రాజ్యమేలే కాలం." గ్రాంసీ ఈ మాట అని దాదాపు వంద ఏండ్లు అవుతుంది కాని మనమింకా ఆ సంధికాలంలోనే ఉన్నాము. ప్రస్తుత ఫాసిస్టు సందర్భంలో గ్రాంసీని గుర్తు చేసుకోవడమంటే ఐక్యపోరాటాల అవసరాన్ని గుర్తించడమే. భయం, భ్రమలు లేకుండా బతికే ప్రయత్నం చేయడమే.

అన్ని స్థాయిల్లో ఎవ్వరు చేయదగిన ప్రతిఘటన పోరాటాలు వాళ్ళు చేయాల్సిన సమయం. ముఖ్యంగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగలిగే మేధావులు, ప్రజాస్వామికవాదులు, రచయితలు, కళాకారులు ముంచుకొస్తున్న ముప్పును ఇంకా లోతుగా అర్థం చేసుకోవాల్సి వుంది. గ్రాంసీ ఉద్దేశంలో "అర్థం చేసుకోవడమంటే ఆచరణకు సిద్ధపడటం.'' ఫాసిజం తాత్కాలికంగా భయపెట్టొచ్చు, నిరాశ కలిగించొచ్చు. కాని అదే ఫాసిజం ఓడిపోయి ప్రజల కేరింతల మధ్య నడిరోడ్డులో తలకిందులుగా వేలాడగట్టిన ముస్సోలిని శవాన్ని కూడా చరిత్ర నమోదు చేసింది. ఇప్పుడు మనం గుర్తు పెట్టుకోవాల్సింది ఫాసిజం తప్పక ఓడిపోతుందని! ❑

---

❖ **ఆధునిక మానవుడు భ్రమలతోనూ జీవించకూడదు- నిస్పృహ చెందనూ కూడదు; అదే ఆధునికత మన ముందుంచే సవాలు!! - గ్రాంసీ**

❖ **నూతన సంస్కృతి కోసం జరిగే పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాల్సిందే! నూతన జీవిత దర్శనంతో గాఢంగా ముడిపడివున్న నూతన నైతిక జీవనం కోసం జరిగే పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలి సందే! ఈ నూతన సంస్కృతి, ఈ నూతన నైతిక జీవనం వాస్తవాన్ని గ్రహించే - అనుభూతిగా మలచుకునే ప్రక్రియగా మారేంతవరకూ మనం ఆ పోరాటానికి మద్దతివ్వాల్సిందే!! - గ్రాంసీ**

# క్రాస్ రోడ్స్‌లో కమ్యూనిజం
# గ్రాంసీ ఒక దిక్సూచి

హెచ్చార్కె
'రస్తా' సంపాదకులు




"19వ శతాబ్ది విప్లవం తన కవిత్వాన్ని భవితవ్యం నుంచి తయారు చేసుకుంటుంది, గతం నుంచి కాదు. పాత మూఢనమ్మకాల కుబుసాన్ని పూర్తిగా వొదిలించుకోకుండా 19వ శతాబ్ది విప్లవం ముందడుగు వేయలేదు. మునుపటి విప్లవాలు తమ బరువు (కంటెంట్)ను తాము భరించడానికి గత ప్రపంచ విప్లవాల నెమరువేత అవసరమైంది. 19వ శతాబ్ది విప్లవం అలా కాదు. కొత్త విప్లవం తనను తాను కనుక్కోడానికి గతాన్ని పూడ్చిపెట్టాల్సి ఉంటుంది."

(కార్ల్ మార్క్స్, 'ఏయిటీన్త్ బ్రుమేర్ ఆఫ్ లూయీ బోనపార్టీ')

అప్పటి వరకున్న సమాజాలకు భవిష్యత్తు చింత లేదు. చింతించి ప్రయోజనం లేదు. ఏదీ తమ చేతిలో లేదు. అంతా విధి లీల అనేది గత మానవుని వైఖరి. అది మతం కావొచ్చు. ఆ విధమైన మరొక ఆధ్యాత్మిక చింతన కావొచ్చు. ఏ కష్టం కలిగినా, ఏ సుఖం కలిగినా; అది మత సదృశ భాషలో వ్యక్తం కావలసిందే. అదే... దేశ దేశాల కవిత్వాలలో, అంటే, పురాణాలలో వ్యక్తమయిన మానవ వైఖరి.

19వ శతాబ్ది తరువాత, అంటే, పారిశ్రామిక విప్లవం తరువాత వేరూనుకున్న 'ఆధుకత' (మోడర్నిజం) ప్రపంచ నిర్ణేతగా విధి, దేవుడి స్థానంలో మనిషిని, మానవ యత్నాన్ని ప్రతిష్ఠించింది. అంతా విధికి వదిలేయనక్కర్లేదని, తన కోసం తను చేయగలిగింది చాల ఉందనే స్పృహ మనిషిలో పుట్టి పెరిగింది.

అంతకు ముందు కూడా విప్లవాలు (మార్పు కోసం ప్రయత్నాలు) జరిగాయి. అయితే, అవి తమ కన్న ముందు జరిగిపోయిన జీవితాన్ని, పురాణాల్ని మార్గదర్శకం చేసుకున్నాయి. వాటిలాగే చేయబోయాయి. జరిగిన మార్పు చాల స్వల్పం. మౌలికం కాదు. (ఇండియాలో కుల వ్యతిరేక పోరాటాలు చివరికి కొన్ని కొత్త కులాలుగా కరిగిపోవడం ఒక ఉదాహరణ).




ఇక ముందు, పురాణాలు అవసరం లేదు. 'దేవుడు చనిపోయాడు'. మనిషి 'స్వతంత్రు'డయ్యాడు. భవిష్యత్తు గురించి వాస్తవికంగా కల గనడం కుదిరింది. ఊరక ప్రకృతి సంకీర్తన కాకుండా, మనిషి ప్రకృతిని/జీవితాన్ని మార్చగలడనే భరోసా దొరికింది.

అప్పుడిక; ఎందుకు మార్చాలి? ఎవరి కోసం మార్పు? ప్రజలకు కావలసిన మార్పును ప్రజలు ఎలా సాధించాలి? అనేవి కీలక ప్రశ్నలయ్యాయి.

భవితవ్యమే ఇప్పటి మానవుడి కవిత్వం. ఇప్పటి మానవుడి కల. ఇప్పటి మానవుడి కల గతంలోకి కాకుండా, భవిష్యత్తులోకి ప్రవహిస్తుంది.

అలాగని మానవులందరి భవితవ్యం ఒకటి కాదు. వర్గ సమాజంలో కొందరి సుందర భవితవ్యం ఇతరుల బానిసత్వం ఎలా అవుతుందో కార్ల్‌మార్క్స్ తేటతెల్లం చేశారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిభాషలో ఆ సంగతి విశదం చేశారు.

అందరూ ఒకే భవితవ్యాన్ని కోరుకోరు. రైతులు ఒకటి కోరుకుంటే ఫ్యూడల్ భూస్వాములు మరొకటి కోరుకుంటారు. కార్మికులు ఒకటి కోరుకుంటే పెట్టుబడిదారులు మరొకటి కోరుకుంటారు.

పేద రైతులు, కార్మికులు, వాళ్ల పక్షాన పని చేయదలిచిన 'మన' వంటి మేధావులు ఏం కోరుకుంటారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. వీళ్లు సోషలిజం కోరుకుంటారు. సోషలిజం కోసం కల గంటారు. సోషలిజం కలను నిజం చేసుకోడానికి పని చేస్తారు.

నిజమే గాని, ఆ పని ఎలా చేయాలి?

ఈ ప్రశ్న వద్దనే కమ్యూనిస్టు ఉద్యమం

బహుశా ఇంకా ఒక నిర్ధారణకు రాలేదు. దశాబ్దాలు గడిచాయి. శతాబ్దాలు గడిచాయి. ఇంకా క్రాస్‌రోడ్స్‌లోనే ఉన్నాం. రెండు మూడు బృహత్ ప్రయత్నాలు కూడా జరిగాయి. మహదాశలు పుట్టి పెరిగాయి. అవి కుదర్లేదు. ఇంకా, క్రాస్‌రోడ్స్‌లోనే ఉన్నాం. రెండు మూడు కాదు. నాలుగు రోడ్లు కూడా కాదు. చాల రోడ్లు మన కండ్ల ముందు. ఎటు వెళ్లాలో తెలియక బాధపడుతున్నాం. ఇది పడాల్సిన బాధ. ఇది పడాల్సిన తపన. ఇది మంచి బాధ. ఇది మంచి తపన.

అలా తపించిన వారిలో ఇటాలియన్ కమ్యూనిస్టు ఆంటోనియో గ్రాంసీ ఒకరు.

నాతో ఎందరు ఏకీభవిస్తారో తెలియదు. ఎందరు విభేదిస్తారో తెలియదు. కాని, సరి దారి కోసం తపించిన వారిలో ఆంటోనియో గ్రాంసీ ఒకడు కాదు. వారిలో ఆయన అగ్రగణ్యుడు. ఆయన ఆలోచనలు కనిపించినంత నిర్దిష్టంగా, నిర్దుష్టంగా, నిజాయితీగా, తక్షణం అనుసరించబడాల్సి ఉండి ఇంకా (సరిగ్గా) అనుసరించ బడని మార్గంగా నాకు మరెవరి ఆలోచనలూ కనిపించలేదు. ఆ కాలంలో రోజా లగ్జెంబర్గ్ ఒక్కరూ ఆయనలా కనిపిస్తారు. మిగిలిన నేతలు 'పని' మత్తులో పడి, 'ఆలోచించడం' మానేసినట్లు అనిపిస్తుంది. తాత్కాలిక ఓటములకు భయపడి, తాత్కాలిక ఓటముల నుంచి 'ఫూల్ ప్రూఫ్' మార్గం ఏదో ఉందనుకుని అసలుకు మోసం చేసినట్లు అనిపిస్తుంది. ('మోసం' వాళ్ల ఉద్దేశం కాదు, వారి తొందరపాటులో భాగం.)

అప్పుడు కాదు. పరిస్థితి ఇప్పటికీ అంతే. ఇప్పుడు మరి కాస్త పాడయిందేమో చెప్పలేం. ఇప్పటికీ చప్పన్నారు దారుల క్రాస్‌రోడ్స్‌లోనే మనం ఉన్నాం. మనలో కొందరు ఇది క్రాస్ రోడ్స్ అనే వాస్తవాన్ని కూడా మసి పూసి మారేడుకాయ చేయ జూస్తున్నారు. భిన్నస్వరం వినిపిస్తే, దానిలో మంచి సెబ్బరలు వివేచించడం మానేసి, 'అసింటా అసింటా' అంటో అసహనంలో ఓలలాడుతున్నారు.

క్రాస్ రోడ్స్‌లో ఒక ఆశ, ముందుకు దారి ఉందనే ఒక భరోసా ఆంటోనియో గ్రాంసీ, ఆయన ఆలోచనలు.

ఆంటోనియో గ్రాంసీ చూపిన మార్గం ఏమటి? గ్రాంసీ ఆలోచనల్లో రెండు ముఖ్యమైన ఆలోచనలను నేనీ రైటప్ లో.... నా యోపిన కొలది... వివరిస్తాను. దేశదేశాలలోని నా సహచరులు మనసు పెట్టి పరిశీలించాలని విన్నపం.

గ్రాంసీ ఆలోచనల్లో అతి ముఖ్యమైనది 'ప్రాక్సిస్'. ఈ మాటను ఈ వ్యాసం కోసం 'జీవనకార్యాచరణ' అని అనువదిస్తున్నాను. పని, ఆలోచన; ఆచరణ, సిద్ధాంతం; చర్య, చర్చ; వర్కర్, ఇంటలెక్చువల్; శూద్రుడు, బ్రాహ్మణుడు... అనే విభజన కృత్రిమం. ఈ విభజనను తెలిసి కొంతా తెలియక కొంతా కమ్యూనిస్టు పార్టీలు కూడా అనుసరిస్తుంటాయి. అలవాటైన పొరపాటు. కాని, చాల హానికరం. పార్టీ మిగతా వ్యాసంగాల లోనూ ఈ విభజన పద్ధతి కనిపిస్తుంది. దీన్ని వొదిలించుకోవడం అత్యవసరం అని గ్రాంసీ మాటల్లోని 'ప్రాక్సిస్' సారం.

### జీవనకార్యాచరణ (Praxis)

భారత దేశంలో 'వర్ణాశ్రమ ధర్మం' అనేది ఇటీవలి వరకు రాజ్యం చేసింది. రాజులు మారారు గాని, ఈ ధర్మం మారలేదు. ఇప్పటికైనా మారిందని చెప్పలేం.

వర్ణాశ్రమ ధర్మంలో అతి ముఖ్యమైనది... ఆలోచించే మనుషులు వేరు, పని చేసే మనుషులు వేరు అనే భావన. వీరివురి మధ్య వర్ణసంకరం జరక్కుండా చూడడమే వర్ణాశ్రమ ధర్మం సారం.

నిజానికి; ఈ ధర్మం పలు రూపాల్లో ప్రపంచవ్యాప్తం. ఆలోచించే వాళ్లు... బుద్ధి జీవులు లేక మేధావులు. పని చేసే వాళ్లు... రైతుకూలీలు, కార్మికులు ఎట్సెటరా. ఈ ఇరు వర్గాల మధ్య 'సాంకర్యం' జరక్కుండా ఎక్కడికక్కడ సిద్ధాంతాలున్నాయి. ఆలోచించే వర్ణస్థులే, ఆలోచించే వర్గస్థులే సిద్ధాంతాల్ని తయారు చేస్తారు. కాబట్టి వాళ్లకు వాళ్లు కల్పించుకున్న సౌకర్యాలకు కొదువ లేదు.

జీవితానికి ఆలోచనలు, సిద్ధాంతాలు (భావాల తయారీ) తప్పక అవసరం. వాటికి, పనికి మధ్య వ్యత్యాసం మాత్రం అవసరం కాదు. ఆలోచన, పని కలిసే ఉంటాయి. ఉండాలి. పని చేసే వాళ్లు ఆలోచిస్తారు. ఆలోచించే వాళ్లు పని చేస్తారు. చేయాలి.

అసలు ఆలోచనలు ఎక్కడి నుంచి పుడతాయి? సిద్ధాంతాలు లేక భావాలు ఎక్కడి నుంచి పుడతాయి? పువ్వులకు పువ్వులు పుట్టవు. ఆలోచనలకు ఆలోచనలు పుట్టవు. ఈ కనీస సత్యాన్ని విస్మరించడమే... ఆలోచనలకూ పనికి మధ్య వ్యత్యాసం ఏర్పడి, పెరగడానికి కారణం. ఇండియాలో బ్రాహ్మణ వాదానికి, ప్రపంచవ్యాప్తంగా 'బౌద్ధికవాదా'నికి ఇదే మూలం. ఇండియాలో కుల సమస్య వెర్రి తలలన్నీ ఈ బూటక విభజన పాము తలలే.

ఈ కశ్మలం కమ్యూనిస్టు పార్టీలలో కూడా ఉంది. అదే విషాదం. పార్టీ అనేది శ్రమ వర్గాలను బయటి నుంచి చూసి, విశ్లేషించి, సిద్ధాంతీకరించి, నడిపించే యంత్రాంగమని ఇప్పటి వరకు... మూడో ఇంటర్నేషనల్ వరకు... పని చేస్తున్న సూత్రం. ఇదెంత అబద్ధమో గ్రాంసీ మేడి పండు విప్పి చూపించారు.

ప్రాక్సిస్ (జీవన కార్యాచరణ) అంటే ఉద్యమాలే కానక్కర్లేదు. మహత్తర బృహత్తర సంఘటనలే కానక్కర్లేదు. అవి కూడా జీవనకార్యాచరణే. కాని అవి మాత్రమే కాదు. మనిషి నిత్య జీవితంలో చేసే చిన్న పెద్ద పనులన్నీ. మనుషులు అనుసరించే ఆచారాలు, వృత్తి పనులు, తరం నుంచి తరం నేర్చుకుని ఆచరించే నైపుణ్యాలు, గనిలో, వనిలో, కార్ఖానాలో శ్రమ, శ్రామిక కలయికలు, సమ్మెలు, విప్లవాలు, అలాంటి చిన్న పెద్ద సమయాల్లో సహజంగా (స్పాంటేనియస్‌గా) పుట్టే భావాలు, సంప్రదాయాలు, అభిప్రాయాలు, అన్నీ కలిస్తేనే జీవనకార్యాచరణ. తెలుసుకోడానికి, నేర్చుకోడానికి, మార్పులకై ప్రయత్నించే ఆలోచనలకు అన్నిటికీ మూలం జీవనకార్యాచరణ. దీన్నుంచే సిద్ధాంతాలు, తత్వశాస్త్రాలు పుడతాయి. అంతే గాని, ఆకాశం నుంచి ఊడిపడవు. మేధావుల బుర్రల్లోంచి ఊటగా ఊరవు. జీవనకార్యాచరణలో ఉన్న వారిలోంచే సజీవ మేధావులు (ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) తయారవుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలు పని చేస్తూ ఆలోచిస్తారు. ఆలోచిస్తూ పని చేస్తారు.

మెదడు శరీరంలో ఒక భాగం. అలాగే ఆలోచన కూడా మానవశ్రమలో ఒక భాగం.

"భావాలు భావాల నుంచి పుట్టవు. తత్వశాస్త్రాలు తత్వశాస్త్రాల నుంచి పుట్టవు. అవి నిజమైన చారిత్రక పరిణామాల నవనవోన్మేష వ్యక్తీకరణలు.... ప్రతి సత్యం, అది విశ్వజనీన మయినప్పటికీ, గణితం లాగ అనిర్దిష్ట సూత్రాలుగా చెప్పడానికి వీలైనదైనప్పటికీ... ప్రత్యేక, నిర్దిష్ట పరిస్థితుల పరిభాషలో మాత్రమే అది అర్థవంతమవుతుంది. ఫలప్రదమవుతుంది. లేకుంటే, వుట్టి పండిత చర్చ అవుతుంది. కాలక్షేపం కబుర్లు అవుతుంది." ('గ్రాంసీ రచనలు' [ఓపిఇఆర్ఇ డి ఆంటోనియో గ్రాంసీ], 7 వ వాల్యూం, 1952, పేజ్ 63.)

పార్టీ అనేది మెదడు వంటిది. అది శరీరంలో ఉన్నప్పుడే అర్థవంతం, ఫలప్రదం. దానికి వేరే 'సొతంత్ర' ప్రతిపత్తి ఉందనుకోడం మేధావుల పనికిమాలిన అహంకారం వినా మరేమీ కాదు. ఈ అహంకారం ప్రపంచ శ్రామికోద్యమానికి చేసిన హాని అంతా ఇంతా కాదు.

పార్టీ దగ్గర శాస్త్రీయ సోషలిజం అనే మంత్రం ఉంది. ఆ మంత్రానికి ద్రష్టలు పార్టీ నాయకులు. ఎవరి మంత్రం శక్తిమంతమో చెవుతూ నాయకులతో నాయకులు (మేధావులతో మేధావులు) కొట్టుకుంటూ ఉంటారు. అసలు అలాంటి మంత్రం ఏదీ సిద్ధాన్నమై ఉండదు. ఏం చేయాలి, ఎలా చేయాలి అనే ఆలోచన ఎప్పటికప్పుడు జన జీవితాల్లోంచి, దోపిడి నుంచి విముక్తికై జనం చేసే చిన్న పెద్ద ప్రయత్నాల్లోంచి పుట్టి పెరగ వలసిందే. ఎందుకంటే, అసలు శాస్త్రం (సైన్సు) అనేదే నిరంతరం జీవితంలోంచి పుట్టి పెరిగే సాంఘిక అవయవం. జీవితం నుంచి విడదీస్తే సైన్సు కూడా అర్థరహితమే. మెట్ట వేదాంతమే.

"పదార్థం దానికది ఏమిటి అని చూడడం సరి కాదు. ఉత్పత్తి క్రమంలో సామాజికంగా, చారిత్రకంగా అది ఎలా ఆర్గనైజ్ చేయబడి వుందో, ఆ రూపంలోనే పదార్థాన్ని చూడాలి. ప్రకృతిశాస్త్రాన్ని (సైన్సును) కూడా ఒక చారిత్రక అంశంగానే, మనిషికి సంబంధించిన ఒక సంబంధం (హ్యూమన్ రిలేషన్‌షిప్) గానే చూడాలి"

('గ్రాంసీ రచనలు' (ఓపిఇఆర్ఇ డి ఆంటోనియో గ్రాంసీ), వాల్యూం 2, పేజ్: 160)

కార్మికవర్గానికి మేధావుల అవసరం ఉంది. అయితే, వాళ్లు (ప్రజలకు) 'బయట' ఉండి జన జీవితాన్ని 'శాస్త్రీయంగా' వివరించే వాళ్లు కాగూడదు. వాళ్లు... ప్రజాసమూహాలు వ్యక్తం చేయలేని ప్రజల సొంత అనుభవాలను ప్రజల సాంస్కృతిక భాషలో 'వ్యక్తం' చేసే సజీవ మేధావులు (ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) కావాలని గ్రాంసీ అభిప్రాయం.

జనరల్‌గా శాస్త్రమే ప్రజా జీవితంతో నిరంతర సాపేక్షికం అయినప్పుడు, పార్టీ వద్ద ఉన్న శాస్త్రీయ సోషలిజం ఇంకెంత సాపేక్షికమో చెప్పనక్కర్లేదు.

కమ్యూనిస్టులు... పార్టీ సభ్యులు సాంప్రదాయిక మేధావులుగా ఉన్నంత కాలం ఈ తెలివిడి కలగదు. వారి వల్ల ప్రజలకు నిజమైన మేలూ జరగదు. కీడు కూడా జరుగుతుంది. కమ్యూనిస్టులు ముమ్మొదట సజీవ మేధావులు (ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) కావాలి. అంటే, శ్రామిక ప్రజల నుంచి విడివడి 'ఆశ్రమాల'లో కూర్చుని ఆలోచనల్ని తయారు చేసే 'సిద్ధాంతులు'గా వాళ్లు ఉండిపోకూడదు.

మరి శ్రామిక ప్రజల ఉద్యమాలు ఎలా ఉండాలి? ప్రజలు దోపిడి నుంచి తమ విముక్తిని ఎలా సాధిస్తారు?

దోపిడి నుంచి విముక్తిలో మొదటి మెట్టు కార్మిక రాజ్యం అనేది తెలిసిందే. మరి, ఆ 'రాజ్యం'లో రాజు ఎవరు?

కమ్యూనిస్టు పార్టీయా? పార్టీయే రాజు అయితే, కార్మికులు రాజు అయినట్లు ఎలా అవుతుంది? కార్మికవర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని ఎలా నెరవేరుస్తుంది? ఇది కుదరదు. పార్టీ రాజు కావాలనేది తిరిగి ఇంటలెక్చువలిజమే. భారతీయ పరిభాషలో చెప్పాలంటే, 'బ్రాహ్మణ వాద'మే. మరో ప్రపంచం అనే స్వర్గలోక ఆవాహనను పార్టీ అనే పూజారులకు అప్పగించి, కార్మికులు నైవేద్యాలు, దక్షిణలూ సంభావనలు అందించే భక్తులుగా మిగిలిపోవడమే.

'చరిత్ర నిర్మాతలు ప్రజలే'. ఈ నిబద్ధత మనకు ఉన్నట్లయితే, కార్మిక విప్లవాల పర్యవసానంగా ఏర్పడే రాజ్యం పార్టీ రాజ్యం కాగూడదు (ఎస్, అది కమ్యూనిస్టు రాజ్యం కాగూడదు) అనే స్పృహ కూడా ఉండాలి. కార్మిక విప్లవాల పర్యవసానంగా ఏర్పడే రాజ్యం కార్మిక-రాజ్యమే కావాలి. అలా జరిగితేనే కార్మిక విప్లవాలు విజయవంతమయినట్లు. ఆ పరిణామం మాత్రమే సోషలిజానికి నిజమైన తొలి మెట్టు.

ఈ స్పృహ గ్రాంసీకి కాకుండా వేరే కమ్యూనిస్టులకు లేదా?

ఉంది.

లెనిన్‌కు ఉంది. ఆయన తన 'స్టేట్ అండ్ రెవల్యూషన్' లో చెప్పిన 'సోవియెట్లకే అధికారం' అనే నినాదానికి అర్థం అదే. తరువాత్తరువాత... రష్యాలో 'విప్లవం' విజయవంతం అయిన తరువాత... దాన్ని మరిచిపోయారు. రోజా లగ్జెంబర్గ్ వంటి నిక్కమైన కమ్యూనిస్టులు రష్యాలో ఈ పరిణామాల గురించి హెచ్చరించే ప్రయత్నాలు చేశారు.

రష్యాలో కార్మిక రాజ్యం సమస్య అజెండా మీదికి రాక మునుపే, ఇటలీలో గ్రాంసీ... ఈ విషయమై ఆలోచించాడు. 'రేపటి' కార్మిక రాజ్యానికి, దానికి దారి తీసే 'ఇప్పటి' కార్మికోద్యమానికి... రెండింటికీ పునాదిరాళ్లుగా ఆయన 'ఫ్యాక్టరీ కౌన్సిళ్లు' అనే భావనను అభివృద్ధి చేశారు.

'ఫ్యాక్టరీ కౌన్సిళ్లు' భావనను ఇటలీలో ఉద్యమకారులు ప్రయత్నించారు. 'కౌన్సిళ్లు' ఏర్పడ్డాయి. తదనంతర నిర్బంధంలో అవి ఓడిపోయాయి. సాధారణ ట్రేడ్ యూనియన్లలో కలిసిపోయాయి.

కార్మిక కౌన్సిళ్లుగా సంఘటితం కావడానికి, నిలదొక్కుకోడానికి శ్రామికులు మరి మరి ప్రయత్నించాలి. ప్రయత్నిస్తారు.

ఇవాళ పెట్టుబడిదారీ విధానం లోపలే అక్కడక్కడ ఏర్పడి పని చేస్తున్న కార్మిక సహకార సంస్థలు (వర్కర్స్ కో ఆపరేటివ్స్)... ఆనాడు గ్రాంసీ చేసిన ఆలోచన దారిలోనే ఉన్నాయని రిచర్డ్ ఉల్ఫ్ వంటి వాళ్లు అంటున్నారు. వీటిలో కూడా లోపాలు ఉండొచ్చు. విమర్శ పెట్టడం ద్వారా, కౌన్సిళ్ల భావనను, కార్మిక సహకార సంస్థల భావనను, మేనేజర్ల నుంచి చివరాఖరి అనిపుణ (అన్ స్కిల్డ్) కార్మికుని వరకు కార్మికులందరికీ ఆ సంఘాలలో సమాన హక్కులు, సౌకర్యాలుండాలనే భావనను... ముందుకు తీసుకుపోవలసి వుంది. మునుపటి, ఇప్పటి, రేపటి గెలుపోటముల నుంచి నిరంతరం నేర్చుకోడమే గ్రాంసీ చెప్పిన 'ప్రాక్సిస్'.

గ్రాంసీ జీవితం, ఆలోచనల్లో చాల ముఖ్యమైన ఫ్యాక్టరీ కౌన్సిళ్ల గురించి ఇంకొంచెం వివరంగా...

## వర్కర్ కౌన్సిల్స్

కార్మికులు ఫ్యాక్టరీని పూర్తిగా తమ అధీనంలోనికి తీసుకుని, దాన్ని తామే నిర్వహించడం ఫ్యాక్టరీ కౌన్సిల్ భావన సారాంశం. కేవలం ఫ్యాక్టరీ ఉత్పత్తి, పంపిణీలనే కాదు, కమ్యూనిటీ బాగోగులను కూడా తామే చూసుకుంటారు. ఒకరకంగా, ఫ్యాక్టరీ కౌన్సిళ్లు స్థానికంగా 'రాజ్యం' పాత్ర నిర్వహిస్తాయి. వీటిని మినీ సోషలిస్టు రాజ్యాలు అనవచ్చు.

1919-1920లో ఇటలీ, ట్యురిన్ నగరంలో జరిగిన సమ్మెలలో శ్రామిక కౌన్సిళ్లు పుట్టుకొచ్చాయి. ఇవి చాలవరకు సహజంగా (స్పాంటేనియస్‌గా) ముందుకొచ్చినవే. ఆంటోనియో గ్రాంసీ సంపాదకత్వంలోని 'ఎల్ ఆర్డనో నువోవో' పత్రిక ప్రచారం వల్ల కూడా పలు కౌన్సిళ్లు రూపొందాయి.

ఇవి పూర్తిగా కొత్త తరహా సాంఘిక సంస్థలనీ, వీటిని పెట్టుబడిదారీ విధానం కింద కార్మికుల జీవితాల్ని కాస్త మెరుగుపరిచే ట్రేడ్ యూనియన్లుగా గందరగోళపరచగూడదనీ గ్రాంసీ భావించారు. అలాగే కేవలం పార్లమెంటరీ, సైద్ధాంతిక (మేధా) కృషికి సంబంధించిన పార్టీ సంస్థలుగా కూడా వీటిని గందరగోళపరచకూడదని గ్రాంసీ భావించారు.

"శ్రామికవర్గం (ప్రొలిటేరియట్)... శ్రామికసమూహాల సజీవ, సృజనాత్మక అనుభవాల్లోంచి నూతన సాంఘిక చైతన్యాన్ని అభివృద్ధి చేసుకోడానికి, శ్రామికులకు నేర్పిస్తూ తాను

నేర్చుకోడానికి చాల అనువైన సాధనం (ఫ్యాక్టరీ) కౌన్సిల్. పెట్టుబడిదారీవిధానానికి వ్యతిరేకంగా జరిగే కౌన్సిళ్ల పోరాటాల్లోంచి, వాటి కష్టాలూ త్యాగాల్లోంచి పుట్టుకొచ్చే శ్రామికవర్గ సంఘీభావం పూర్తిగా సకారాత్మకం (పాజిటివ్), శాశ్వతం. ఈ శ్రామికవర్గ సంఘీభావం... పారిశ్రామికోత్పత్తి క్రమంలో చిన్న చిన్న ఘటనల్లోంచి చీమూ నెత్తురు సంతరించుకుని సజీవమవుతుంది. తన సజీవ సమగ్రత (ఆర్గానిక్ హోల్) గురించి తాను సంపాదించుకున్న చైతన్యం ఈ శ్రామిక సంఘీభావానికి పునాదిగా ఉంటుంది. ఈ విధంగా, ఒక పకడ్బందీ, ఏకరూప వ్యవస్థ తయారవుతుంది. సొంత ప్రయోజనాల కన్న ఉన్నతమైన ఒక సాంఘిక సంపదను సృష్టించే ఈ క్రమంలోనే శ్రామికవర్గం తన సార్వభౌమత్వాన్ని ధ్రువీకరించుకుంటుంది. చరిత్ర సృష్టించడానికి తగిన శక్తిని, స్వేచ్ఛను సముపార్జించుకుంటుంది."

(ఎల్' ఆర్డినో నువోవో పత్రిక, 'యూనియన్లూ కౌన్సిళ్లు' వ్యాసం 1919)

ఫ్యాక్టరీ కౌన్సిల్ అనేది ట్రేడ్ యునియన్ కాదు. జీత భత్యాల పెంపుదల వంటి ఆర్థికవాద ఊబిలో కూరుకుపోదు. అసలు, జీత భత్యాలు ఒకరు ఇచ్చేవి తాము తీసుకునేవి అనే పాత భావనకే కౌన్సిల్ వ్యతిరేకం. శ్రమకాలపు అదనపువిలువ లోంచి తమ జీతభత్యాలు తామే తీసుకుంటారు. వాళ్లే పనివాళ్లు, వాళ్లే యజమానులు. తమతో సహా సమాజం (కమ్యూనిటీ) కోసం అదనపు విలువను వినియోగిస్తారు.

ఫ్యాక్టరీ కౌన్సిల్ ఒక సిద్ధాంతాల కర్మాగారం కూడా కాదు. జనం మీద బౌద్ధిక పెత్తనం చేయదు. కౌన్సిల్ సాంస్కృతికంగా, బౌద్ధికంగా తన చుట్టూరా సమాజంతో (కమ్యూనిటీతో) కలిసి పని చేస్తుంది. స్వీయచేతన పొందిన వర్గంగా ఇతర వర్గాలను తన దారిలో నడిపిస్తుంది.

ఒక్క మాటలో మెదడు, చేతులు, కాళ్లు, ప్రాణం ఉన్న ఒక సమగ్ర శరీరం ఫ్యాక్టరీ కౌన్సిల్.

పార్టీ ఆ శరీరంలోని ప్రాణం. ప్రాణం కనిపించదు. తెలుస్తుంది. అది కేవలం రాజకీయార్థికాల నియంత్రణ యంత్రం కాదు. సాంస్కృతికాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజా జీవితం మీద ఆధిపత్యం సంపాదిస్తుంది. అది నిరంకుశాధికారం కాదు. తన ప్రతిష్ఠ వల్ల జనానికి చెప్పి ఒప్పించగల శక్తి. దాన్నే గ్రాంసీ 'ఆధిపత్యం' (హెజ్మొనీ) అన్నారు.

"పార్టీ ప్రజల చారిత్రక చేతనలో కలగలిసి ఉంటుంది. ప్రజలలోంచి పుట్టుకొచ్చే, అనివార్య ఉద్యమాన్ని పార్టీ 'గవర్న్' చేస్తుంది. ఈ 'గవర్నమెంటు' ఒక శరీరం లేని ప్రాణి (డిసెంబడీడ్) వంటిది. అది కోట్లాది ఆత్మ-సదృశ బంధాలతో ప్రజలలో పని చేస్తుంది. మనిషి ముఖంలో ప్రతిఫలించే ఉద్వేగాల కాంతి వంటిది పార్టీ అధికారం ('ప్రిస్టేజియో'). ఏవో కొన్ని అత్యున్నత సమయాలలోనే పార్టీ నిజమైన గవర్నమెంటుగా ఉంటుంది. పార్టీ అనేది అనివార్య ప్రజా ఉద్యమంలోని పై దొంతర. ఇది నియంతృత్వాలలో కెల్ల అతి ప్రభావవంతమైన (మోస్ట్ ఎఫెక్టివ్) నియంతృత్వం. ఎందుకంటే ఈ నియంతృత్వం ప్రజలలో పార్టీకి ఉన్న ప్రతిష్ఠ మీద ఆధారపడి పని చేస్తుంది. ఇది ప్రజలలోంచి సహజంగా (స్పాంటేనియస్‌గా) పుట్టే అధికారం. ప్రజల సొంత చైతన్యంలోంచి పుట్టే ఒక అత్యావశ్యక అధికారం." (1919 డిసెంబర్ 27, ఎల్' ఆర్డినో నువోవో వ్యాసం)

ఇటలీలో తను స్వయంగా పని చేసిన కాలంలో గ్రాంసీ ఫ్యాక్టరీ కౌన్సిళ్ల భావనను రూపొందించారు. ప్రచారం చేశారు. ఫాసిజం కోరలు సాచి తనను జైలు పాలు చేశాక ఆయన రాసిన 'జైలు రచనల్లో' గ్రాంసీ మళ్లీ మళ్లీ ఫ్యాక్టరీ కౌన్సిళ్ల గురించి మాట్లాడినట్లు లేదు. దానికి కారణం ఆయన ఆనాడు తన ముందుండిన సోవియెట్ రష్యా 'ప్రజా ప్రభుత్వాన్ని' సమర్థించే పనిలో పడ్డారేమో. రష్యాలో అచ్చంగా ఏం జరుగుతున్నదో చూసి, విశ్లేషించే అవకాశం (జైలు క్రూర నిర్బంధంలో) ఆయనకు కుదరలేదు.

## పార్టీ

రష్యాలో మాదిరి అధికారం చేపట్టిన కమ్యూనిస్టు పార్టీ... ఒక విస్పష్టమైన చట్టబద్ధతతో పని చేయాలని మాత్రం గ్రాంసీ ప్రత్యేకించి అభిప్రాయపడ్డారు. ఆశపడ్డారు. ఉదాహరణకు, విప్లవం వల్ల ఆస్తులు కోల్పోయిన దోపిడి వర్గాలను పార్టీ అదుపు చేయాల్సి ఉంటుంది. అంటే 'పోలీసింగ్' పని చేయాల్సి ఉంటుంది. ఇది తప్పదు. కాని ఆ పని సరైన చట్టబద్ధతతో, ప్రజాతంత్రయుతంగా చేయాలని గ్రాంసీ భావించారు.

"పార్టీ యొక్క పోలీసు పని ప్రగతి-శీలంగా ఉండొచ్చు. ప్రగతి-వ్యతిరేకంగానూ ఉండొచ్చు. ఆస్తులు పోగొట్టుకున్న ప్రగతి-వ్యతిరేక శక్తులను... వాటి చట్టబద్ధ పరిమితుల్లో ఉండేలా నియంత్రించాలి. అప్పటి వరకు వెనుకబడివున్న శక్తులు కొత్తగా తమ చట్టబద్ధ ఉన్నతికి చేరడానికి ప్రోత్సహించాలి. అలా చేస్తేనే

ఆ పార్టీ ప్రగతి–శీలంగా పని చేస్తున్నట్టు లెక్క. కొత్త సజీవ చారిత్రక శక్తులను నిరోధించి, కాలం చెల్లిపోయి లోడొల్లగా మారిన పాత చరిత్ర–వ్యతిరేక చట్టబద్ధతను కాపాడుతున్నట్లయితే... ఆ పార్టీ ప్రగతి–వ్యతిరేకంగా పని చేస్తున్నట్టు లెక్క. పార్టీ ప్రగతి–శీలమైతే, అది 'ప్రజాస్వామ్యయుతంగా' (అంటే, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా) పని చేస్తుంది. పార్టీ ప్రగతి–వ్యతిరేకమైతే, అది 'నిరంకుశోద్యోగ స్వామ్యం'గా (అంటే, కేంద్రీకృత నిరంకుశోద్యోగ సూత్రాలకు అనుగుణంగా) పని చేస్తుంది. రెండో పద్ధతిలో పని చేసే పార్టీ సంప్రదింపులూ చర్చలతో పని చేసే సంస్థ కాదు, అదొక కార్యనిర్వాహక యంత్రం (ఎగ్జిక్యూటివ్) మాత్రమే. అదొక పోలీసింగ్ పాలనాంగం మాత్రమే. దాన్ని 'రాజకీయ పార్టీ' అనడం వుట్టి పుక్కిటి పురాణమే. ('గ్రాంసీ రచనలు' (ఓపిఇఆర్ఇ డి ఆంటోనియో గ్రాంసీ), 5 వ వాల్యూం. 76–77 పేజీలు)

ఇరవయ్యో శతాబ్దిలో జరిగిన మేజర్ విప్లవాలు... విజయవంతమైన, విఫలమైన విప్లవాలన్నీ... గ్రాంసీ ఏది వొద్దన్నాడో ఆ ఎగ్జిక్యూటివ్ పాత్రనే నిర్వహించాయి.

ఈ వైచిత్రికి కారణం... ఒకసారి విజయవంతమైన విప్లవాన్ని ప్రజలు నిలబెట్టుకోలేరనే 'మన' భయం. బయటి నుంచి 'మనం' (పార్టీ) ఆ పని చేసి పెట్టాలనే 'మన' కోరిక. ఈ భయంలో, ఈ కోరికలో నిజాయితీ ఉంది. కాని, గతితర్కం లేదు. ఓడిపోవడం పార్టీలకు కూడా చాతనవుతుంది. పార్టీ–రాజ్యాలు కూడా ఓడిపోతాయి. అప్పుడు కూడా కార్మికవర్గం నానా బాధలు పడుతుంది. తీవ్ర దుఃఖానికి లోనవుతుంది. పోగా, ఈ బాధల లోంచి, ఈ ఓటముల లోంచి కార్మిక వర్గం నేర్చుకునేదేమీ ఉండదు. ఎందుకంటే, ఆ విప్లవం, విప్లవానంతర ప్రభుత్వం, ఓటమి... కార్మికుల అనుభవాలు కాదు. అవి కార్మికులు స్వయంగా చేసిన పనులు కాదు. పెట్టుబడిదారీ నియంతృత్వం కింద త్యాగాలు, బాధలు మాత్రం ప్రధానంగా కార్మికులవే. ఆలోచనలు, ఆ ఆలోచనలను ఆచరించి నేర్చుకోడాలూ కార్మికులవి కావు. 'మన'వి. పార్టీవి. మేధావులవి.

అవి కార్మికులవి అయినప్పుడే వాటి అనుభవ పాఠాలు కార్మిక మానసాల్లో ఇంకిపోతాయి. కార్మికులు... దుఃఖాన్ని నిజంగా అనుభవిస్తున్న కార్మికులు... ఎప్పటికప్పుడు దోపిడి రహిత భవితకు ప్రణాళికలు వేస్తూ, ప్రణాళికల అమలుకు ప్రయత్నిస్తూ, ప్రయత్నాల సాఫల్య వైఫల్యాల బడిలో నేర్చుకుంటూ మాత్రమే... తమ విముక్తికి.... మనందరి విముక్తికి... నాయకులవుతారు. దీన్ని ఇకనైనా గ్రహిస్తామా? గ్రాంసీ నుంచి నేర్చుకుంటామా?

ఈ వ్యాసాన్ని చదువుతున్న వారిలో అత్యధికులు నా లాగే, చిన్న పెద్ద ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే మధ్యతరగతి వారై ఉంటారు. అదే సమయంలో కమ్యూనిజాన్ని ప్రేమించే భావుకులు అయి వుంటారు. జీవితానుభవం వల్ల మనకు ఒక విషయం తెలుసు, కార్మికులే సోషలిజం నిర్మాతలు. మనం కేటలిస్టులం మాత్రమే. కార్మికులు మన నాయకులు కావాలి. తీరిక వర్గం మనుషులుగా విద్యా గంధానికి నోచుకోడం వల్ల మనం సైద్ధాంతిక కృషిలో బాగా ముందుంటాం. 'పుటక మేధావులం' అయ్యుంటాం. కాని, మనకు చాల ఇష్టమని చెవుతున్న సోషలిజం కోసం జరిగే భౌతిక పోరాటాలకు నాయకత్వం వహించాల్సిన వాళ్లు, పోరు గెలిచే కొద్దీ ఏర్పడే శ్రామిక రాజ్యాన్ని నిర్వహించాల్సిన వాళ్లు శ్రామికులే. కమ్యూనిస్టులు రాజ్యశరీరం కాకుండా శ్రామిక రాజ్యానికి (కనిపించని) ప్రాణం కావాలి. ఆ తపన మనలో ఉండాలి.

చాల కాలం క్రితం, మనలాంటి వాడే ఒక తెలుగు కవి తన కవితా సంపుటికి ముందు రాసుకున్న కొన్ని ఆశావహ వాక్యాలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

"ఓ మనిషీ! మహనీయుడా! కార్మికుడా! కర్షకుడా! దోపిడిపై ధ్వజమెత్తిన విప్లవకారుడా! నిన్ను చేరుకోవాలని ఎంతగానో తపించీ, వేదన పడీ ఈ మజిలీ చేరుకున్నా.

నిన్ను చేరి, నీలో ఒకడిని కావడం చాల కష్టంగా వుంది. నాకు నేను అడ్డు రావడం యింకా వదలడం లేదు. కాని, నువ్వు అనివార్యమైన శక్తివి. ఇప్పుడు పొలాల దగ్గర, యంత్రాల దగ్గర నువ్వు బానిసవే. కాని, రేపు వాటికే కాదు, అక్షరాలకూ అన్నిటికీ నువ్వే అధికారివి. నాకు నమ్మకముంది. నన్ను నువ్వు మార్చుకుంటావు. నీలో ఒకడిని చేసుకుంటావు." ❑

**రాజ్యాధికారాన్ని గెల్చుకోవడానికి ముందే ప్రతి సామాజిక బృందమూ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని తీరాలి; వాస్తవానికి ఇది రాజ్యాధికారాన్ని గెల్చుకోవడానికి ఒక ప్రధానమయిన షరతు కూడాను! అధికారం చెలాయించే దశలో ఈ లక్షణమే ప్రాముఖ్యం వహిస్తుంది. అధికారాన్ని కట్టుదిట్టంగా చేత పట్టుకుంటూన్న దశలో సైతం ఈ బృందం మొత్తం సమాజానికి నాయకత్వం వహించి, ముందుకు నడిపించాలి!!**


# గ్రాంషీ - భావజాలం
## *(Gramsci and Ideology)*

రావు కృష్ణారావు



భావజాలం అనేది 18 వ శతాబ్దపు ఫ్రెంచి భౌతిక వాదానికి చెందిన సంవేదనావాదం (sensationalism) లో ఒక భాగంగా ఉండేది. అప్పట్లో దాని అసలు అర్థం 'భావాల శాస్త్రం' గా వుండేది. అయితే సైన్సు పద్ధతి అంటే విశ్లేషణే కాబట్టి దాని అర్థం 'భావాల విశ్లేషణ' అయ్యింది. అంటే 'భావాల పుట్టుక గురించి పరిశోధన'. అంటే భావాలను వాటి అసలు ఘటకాంశాలు (elements)గా విడగొట్టాలి. అలా విడగొడితే అవి సంవేదనలు తప్ప మరేమీ కాదు. భావాలు సంవేదనలనుండి రాబట్టినవి. కాలక్రమంలో భావజాలమంటే 'భావాల వ్యవస్థ' అనే అర్థం స్థిరపడింది.

మార్క్సిష్టు తత్వశాస్త్రంలో భావజాలం ప్రతికూల విలువను సంతరించుకుంది. మార్క్స్, ఎంగెల్సులు భావాలు సంవేదనల నుండి పుట్టుకొస్తాయనే వాదనను వదిలివేశారు. భావజాలాన్ని చారిత్రికంగా, ఒక ఉపరినిర్మాణంగా 'ఆచరణ తత్వశాస్త్ర' (philosophy of praxis) పరంగా విశ్లేషించాలి. మానవుల నిజ జీవిత సమస్యలు పొరపాటు భావాలు కావు. అవి నిజమైన సామాజిక వైరుధ్యాలు. ఆచరణలో మనుషులు ఆ వైరుధ్యాలను పరిష్కరించలేక భావజాల రూపాల్లో వాటిని ప్రదర్శిస్తారు. వాస్తవ జీవితంలో పరిష్కరించలేని వాటికి మానసిక ప్రపంచంలో పరిష్కారాలు వెతుకుతారు. ఈ మానసిక పరిష్కారాలు నిజ వైరుధ్యాలను మరుగు పరుస్తాయి. వైరుధ్యాలను మరుగు పరచడం వల్ల ఆ వైరుధ్యాల పరిష్కారానికి మనుషులు ప్రయత్నించరు. ఆ వైరుధ్యాలు పునరుత్పత్తి అయ్యి పాలక వర్గాల ప్రయోజనాలను కాపాడతాయి. అందుచేత భావజాలం ఒక ప్రతికూల పాత్ర పోషిస్తుందని భావించడం జరిగింది. భావజాల వక్రీకరణలను విమర్శతో సరిచెయ్యలేము. వాటికి జన్మనిచ్చిన వైరుధ్యాలను పరిష్కరించినప్పుడే అవి తొలగిపోతాయి. మార్క్స్ చింతనలో క్రమేణా భావజాల భావన మరింత సంక్లిష్టమూ, మరింత గంభీరమూ అయ్యింది. అయితే చివరి వరకూ దాని విమర్శనాత్మక, వ్యతిరేక సహజ అర్థం నిలిచే వుంది.




మార్క్స్ చనిపోయిన తర్వాత భావజాల భావనకు కొత్త అర్థాలు వచ్చాయి. వీటిలో ఒకటి 'సామాజిక చైతన్య రూపాల సమస్తం'. అంటే భావజాలాత్మక ఉపరినిర్మాణం. ఇక రెండో అర్థం ఒక వర్గం ప్రయోజనాలను కాపాడే రాజకీయ భావాలు. ఈ అర్థాలు మార్క్స్ చింతనలో భావజాలానికి వున్న 'సహజ ప్రతికూల' అర్థాన్ని తొలగించాయి. మార్క్స్, ఎంగెల్స్‌లు భావజాలాన్ని ప్రతికూల అర్థంలో వాడుతూ, శక్తివంతమైన వాదనలు చేసిన 'జర్మను భావజాలం' పుస్తకం ప్లెహనోవ్, లాబ్రియోల, లెనిన్, గ్రాంషీ, లూకాక్స్ మొదలైన వారికి అందుబాటులో లేదు. అది 1932 లో ప్రచురితం.

లెనిన్ భావజాల అర్థాన్ని విస్తరించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం భావజాలం వివిధ వర్గాల ప్రయోజనాలతో ముడి పడి వుంటుంది. అంటే పాలక వర్గ భావజాలమే కాక దాన్ని విమర్శించే విమర్శనాత్మక భావజాలం కూడా వుంటుంది. బూర్జువా, అలాగే సోషలిస్టు భావజాలాలు వుంటాయి. లెనిన్ వివరణతో భావజాలానికున్న ప్రతికూల అర్థం తొలగిపోయి అది ఒక తటస్థ భావనగా స్థిర పడింది.

లూకాక్స్ మరింత సమగ్రమైన అర్థం చెప్పాడు. పెట్టుబడి దారీ వ్యవస్థలో మూర్తీకరింపబడిన ప్రతిభాసల మధ్య జీవిస్తూ, పనిచేయడం వల్ల కార్మిక వర్గానికి ఆ వ్యవస్థ భావజాలం పట్ల విధేయత ఏర్పడుతుంది.

భావజాలం పట్ల లెనిన్ వైఖరి గ్రాంషీపై ప్రభావం చూపింది. మార్క్స్ భావజాలానికి కల్పించిన ప్రతికూల భావనను గ్రాంషీ స్పష్టంగా తిరస్కరించాడు. అయితే మార్క్స్

పదే పదే చెప్పిన 'ప్రజల దృఢ విశ్వాసం భౌతిక శక్తితో సమానమైన శక్తిని కలిగి ఉంటుంది' అనే విషయాన్ని గ్రాంషీ స్వీకరించాడు. ముఖ్యంగా రెండవ ఇంటర్నేషనల్ ప్రవచించే మార్క్సిజానికి ఎదురు తిరిగాడు. మార్క్సిజంలోని ఆర్థిక వాదాన్ని (economism) నిర్ద్వందంగా తిరస్కరించాడు.

గ్రాంషీ భావజాలాన్ని సానుకూల భావనగానే నిర్వచించాడు. భావజాలాన్ని భావ వ్యవస్థలతో గందర గోళం చేయకూడదన్నాడు. గ్రాంషీ అభిప్రాయంలో నియతి వాదం, ఆర్థిక వాదం, సంకుచిత ఆగమనవాదాలు (narrow inductionism) ఈ ప్రతికూల భావజాలాలకు ఉదాహరణలు. గ్రాంషీ ఉపరినిర్మాణాలను 'భావజాల రూపాలు'గా అర్థం చేసుకున్నాడు. భావజాల ఆధిపత్యాన్ని ప్రాధిపత్యం (hegemony) అన్నాడు.

భావజాలం అంటే తప్పుడు చైతన్యంగా, లేదా ఒక భావ వ్యవస్థగా చూడటాన్ని గ్రాంషీ తీవ్రంగా వ్యతిరేకించాడు. అలాగే భావజాలం కేవలం ఆభాసాలు/ప్రతిభాసలు (appearances) మాత్రమేనని దానికి ప్రభావశీలత ఉండదనే భావనలపై తిరుగుబాటు చేశాడు. గ్రాంషీ అభిప్రాయం ప్రకారం భావజాల పరిశోధనకు ఆరంభ స్థానం "మనుషులు తమ లక్ష్యాల గురించిన చైతన్యాన్ని ఉపరినిర్మాణాల భావజాల రంగం మీద పొందుతారు" అని మార్క్స్ 'ఉపోద్ఘాతం'లో చెప్పిన మాటలు. అందుచేత భావజాలానికి నిర్వహణా వాస్తవాలుగా ప్రభావశీలత ఉందని భావించాలని గ్రాంషీ వాదన. ఆయన మరింత ముందుకు వెళ్ళి "మనుషులు చలించేది, తమ స్థానం గురించి, పోరాటం గురించిన చైతన్యాన్ని సముపార్జించుకునేది భావజాల క్షేత్రంపైనే" అని తీర్మానించాడు. భావజాలాన్ని యుద్ధరంగంగా, నిరంతర పోరాటంగా చూసి తీరాలని ఉద్ఘాటించాడు. నిజానికి కర్తలు (subjects) వారంతట వారుగా ఉన్నవారు కాదు. సామాజికంగా నిర్ణయింపబడిన భావజాల రంగం ద్వారా భావజాలంచే ఉత్పత్తి చేయబడినవారు. అందుచేత స్వీయాత్మకత (subjectivity) అనేది ఎల్లప్పుడూ సామాజిక ఆచరణ నుండి పుట్టినదే! అంటే భావజాలం పాదార్థిక ఉనికి కలిగి వుంటుంది. అది ఆత్మిక (spiritual) వాస్తవికతల సముచ్ఛయంలో ఇమిడి ఉండదు. అది ఎల్లప్పుడూ ఆచరణల ద్వారా పాదార్థికమవుతుంది. ఆచరణే భావజాల స్వభావం అనే గ్రాంషీ భావనకు మూలాలు 'భావజాలం, మతం ఒక లాంటివే' అనే ఆయన భావనలో ఉన్నాయి. ఇక్కడ మతాన్ని క్రోస్ (Croce) చెప్పిన అర్థంలో, అంటే 'ప్రపంచ దృక్పథం, దానికి అనుగుణ్యమైన నియమబద్ధ చర్యలు' గా తీసుకున్నాడు. అంటే భావజాలం చర్యకు మార్గదర్శి, ప్రేరకం. తత్ఫలితంగా ప్రపంచ దృక్పథం అన్ని చర్యల్లోను వ్యక్తమౌతుందని గ్రాంషీ భావించాడు. అలా వ్యక్తమవ్వడం అనేది చాల విపులమైన రూపంలో, అత్యున్నత స్థాయి అమూర్తీకరణగా అంటే 'తత్వశాస్త్రం' గా, లేదా అతి సరళమైన రూపంలో 'లోకజ్ఞానం' (common sense) గా వ్యక్తం కావచ్చు. ఈ లోకజ్ఞానం వీధిలోని మనిషి యొక్క సద్యోజనిత తత్వశాస్త్రంగా దర్శనమిస్తుంది. కాని నిజానికిది ఉన్నత తత్వశాస్త్రాల ప్రజారంజక వ్యక్తీకరణ. ఈ ప్రపంచ దృక్పథాలు విడి సత్యాలు కావు. ఒక చారిత్రిక సంఘటనం యొక్క సామూహిక జీవిత వ్యక్తీకరణ. అందుకే గ్రాంషీ వీటిని సజీవ భావజాలాలు (Organic Ideologies) అన్నాడు. ఇవే ప్రజలను నడిపిస్తాయి. వీటి ద్వారానే మనుషులు వారి చైతన్య రూపాలను పొందుతారు. సజీవ భావజాలం ద్వారానే మనుషులు చైతన్య రూపాలను పొందేటట్లైతే, ఈ సజీవభావజాలాలే నిశ్చయాత్మక సామాజిక సంఘటనాల ప్రాపంచిక దృక్పథాలైతే, దానర్థం అన్ని రూపాల చైతన్యం ఆవశ్యకంగా రాజకీయమే అనే నిర్ధారణకు వచ్చాడు. దీన్నుండి గ్రాంషీ 'తత్వశాస్త్రం = భావజాలం = రాజకీయాలు' అనే సమీకరణం రూపొందించాడు.

ఈ సమీకరణం వివాదాస్పదం అయ్యింది. ఇది మార్క్సిజానికి హెగెలియన్ భాష్యమని కొందరి వాదన. దీన్ని అపార్థం చేసుకున్నారనే వాదన కూడా వుంది. గ్రాంషీ స్వీయాత్మకత పాత్ర గురించి ఆలోచించాడని, కాని చరిత్రలోకి పెల్లుబికి వచ్చినదిగా వైయక్తిక చైతన్యాన్ని ప్రతిపాదించకూడదని ప్రయత్నించాడని షంతాల్ మొఫే (Chantal Mouffe) వాదన. దీని కోసం గ్రాంషీ చైతన్యం స్వతహాగా పుట్టినది కాదని మనిషి వేటిలోకి చొప్పించబడతాడో ఆ భావజాల సంబంధాల వ్యవస్థ ఫలితమని ప్రతిపాదించాడు. ఆ విధంగా భావజాలమే కర్తలను సృష్టించి వారు పని చేసే విధంగా చేస్తుంది. గ్రాంషీ ఆలోచనలో ఇమిడి వున్న నిజమైన భావం ఏమంటే భావజాలం కర్తల నుత్పత్తి చేసే ఆచరణ. భావజాలం యొక్క ఈ క్రియాశీల స్వభావమే దాన్ని రాజకీయం చేస్తుంది. గ్రాంషీ యొక్క ఈ భావనలపై క్రోస్ చారిత్రికవాద ప్రభావం బలంగా వుందని మొఫే అభిప్రాయం.

భావజాలం గురించిన గ్రాంషీ భావనలో వినూత్న అంశం ఏమంటే, భావజాల ఆచరణకు ఆయన ఆపాదించిన పాదార్థిక, సంస్థాగత స్వభావం. ఆర్థిక విషయాలను ఎంతగా వస్తు గతమైనవిగా చూస్తామో, భావజాలాన్ని, పౌరసమాజ ఉపరినిర్మాణాన్ని అంతే వస్తుగతమైనవిగా చూడాలని గ్రాంషీ

తరచుగా వక్కాణించాడు. వర్గ సమాజపు సామాజిక సమస్తతలో ఉపరినిర్మాణాలకు, భావజాలానికి గొప్ప ప్రభావాన్ని, చివరకు వస్తుగతత్వాన్ని ఆపాదించడం అనేది భావజాలం గురించిన మార్క్స్ భావనలోనే వుందనే వాదన వుంది. అయితే భావజాలం గురించి రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన మార్క్సిష్టు సిద్ధాంతుల, స్టాలిన్ నేతృత్వంలోని బోల్షివిక్ పార్టీ యొక్క అభిప్రాయానికి ఇది విరుద్ధం. ఆర్థిక, రాజకీయ పోరాటాలతో కూడిన వర్గ పోరాటంలో భావజాల పోరాటం యొక్క ప్రాధాన్యతను గ్రాంషీ నొక్కి చెప్పాడు.

భావజాల ఆచరణ తన సొంత ప్రతినిధులైన మేధావులను కలిగి ఉంటుందని గ్రాంషీ వక్కాణిస్తాడు. సజీవ భావజాలాలను వివరించే, వ్యాప్తి చేసే బాధ్యత ఈ మేధావులదే. సజీవ భావజాలాన్ని వ్యాప్తి చేసే ప్రాధిపత్య, లేదా శక్యప్రాధిపత్య (potentialhegemonic) వర్గానికి చెందిన సామాజిక కార్యకర్తలను 'సజీవ మేధావులు' (Organic Intellectuals) అన్నాడు గ్రాంషీ. వీరే నైతిక, మేధో సంస్కరణను తేవాలి. అన్ని భావజాల అంశాలను ఐక్యం చేయడం ద్వారా సజీవ భావజాలాన్ని భావజాల వ్యవస్థగా ఈ సజీవ మేధావులు రూపొందిస్తారు. గ్రాంషీ మేధావులను ప్రధానంగా రెండు తరగతులుగా విభజించాడు. ఒక రకం సమాజ ప్రధాన వర్గాలు రెండింటిలో ఏదో ఒకదానితో ముడిపడి ఉంటారు. వీరిని 'సజీవ మేధావులు' అన్నాడు. ఇక రెండో రకం గత ఉత్పత్తి విధానాలతో ముడి పడినవారు. వీరు సాంప్రదాయ మేధావులు. మేధావుల పాత్రను నొక్కి చెప్పడంతోపాటు గ్రాంషీ భావజాలాన్ని విస్తరింప చేసే, వ్యాప్తి చేసే, సంస్థాగత నిర్మాణ ప్రాధాన్యతను ఉద్ఘాటించాడు. ఒకవేళ రెండు వర్గాలు, భిన్న వర్గాలకు చెందిన ఇరువురు సభ్యులు ఒకే భావజాల అంశానికి నిబద్ధులై వుంటే భావజాల శోషణ ప్రక్రియ ద్వారా పటిష్ట వర్గ మైత్రి ఏర్పడుతుంది. ఇది ఎప్పుడు సాధ్య పడుతుందంటే ఒక బృందం, లేదా వర్గం ఇతర వర్గాలను ప్రాధిపత్య వ్యవస్థలోకి భావజాలికంగా,ఆర్థికంగా, రాజకీయంగా, శోషించుకునే సామర్థ్యం కల సజీవ మేధావులను అభివృద్ధి చేసుకున్నప్పుడే సాధ్య పడుతుంది.

గ్రాంషీ భావనల్లో విశిష్టమైనది 'సజీవ భావజాలం' (organic ideology) భావన. భిన్న వర్గాలకు భిన్న భావజాలాలుంటాయనేదాన్ని గ్రాంషీ అంగీకరించలేదు. భావజాలాన్ని స్పష్టంగా వర్గ పాలన వ్యవస్థ పరంగా నిర్వచించడం జరిగింది. అంటే అన్ని భావజాల అంశాలు ఐక్య వ్యవస్థగా సజీవ అమరికలో వుండటం. అదే ప్రాధిపత్యం. ఈ సంక్లిష్ట ఏర్పాటు సజీవ భావజాలాన్ని నిర్మిస్తుంది. ఈ సజీవ భావజాలం ఒకానొక సామాజిక సంఘటనం (social bloc) యొక్క సామూహిక జీవితాన్ని వ్యక్తపరుస్తుంది. ఈ సామాజిక సంఘటనంలో ఒక వర్గం రాజ్యాధికారం, సామాజిక ప్రాధిపత్యం కలిగి ఉంటుంది. అందుచేత ఒకానొక ప్రాధిపత్య వ్యవస్థలో ప్రాధిపత్య వర్గం, తన ఆర్థిక ఆధిపత్యం ద్వారా రాజ్యాధికారం కలిగి వుంటుంది. ఆర్థిక ఆధిపత్యంతో పాటు పౌర సమాజంలోని అధీన వర్గాల భావజాల చర్చలలోని ముఖ్య అంశాలను పొందికైన ఒక ఐక్య తీరులో సమర్థంగా వ్యక్తం చేయగలుగుతుంది. దీన్ని బట్టి ఒక సజీవ భావజాలం పౌరసమాజమంతటా వ్యాపించి ఉంటుందని చెప్పవచ్చు. ఇక్కడ పౌర సమాజమంతా అంటే కుటుంబం, దేవాలయాలు, మీడియా, విద్యాలయాలు, చట్ట వ్యవస్థలు, ట్రేడ్ యూనియన్లు, వగైరా సామాజిక సంస్థలు, నిర్మాణాలు. విభిన్న వర్గ ప్రయోజనాలను, కార్యాచరణలను ఒక ఐక్య సామాజికార్థిక సంబంధాల వ్యవస్థగా సమగ్రం చేయడం ద్వారా ఇది సాధ్యపడుతుంది.

ఈ నిర్మాణమంతా ప్రాధిపత్య యంత్రాంగాలైన పాఠశాలలు, దేవాలయాలు, మీడియాలతో నిండి ఉంటుంది. గ్రాంషీ ఈ యంత్రాంగాలన్నిటినీ ఆధిపత్య వర్గ భావజాల నిర్మాణం అన్నాడు. ఒక ఆధిపత్య వర్గం యొక్క భావజాల నిర్మాణం ఎలా వ్యవస్థీకరింపబడుతుందో అధ్యయనం చేస్తే, అంటే భావజాల క్షేత్రం భౌతికంగా ఎలా వ్యక్తమవుతుందో చూస్తే, దానిలో అత్యంత ప్రముఖమైనది, క్రియాశీలమైనదీ ప్రెస్. ప్రెస్ అతిముఖ్యమైనదే అయినా అది ఒక్కటే సాధనం కాదు. ప్రజాభిప్రాయాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేసేవి అన్నీ భావజాలానికి భౌతిక సాధనాలే. ఇందులో మత వ్యవస్థ అతి ముఖ్య పాత్ర నిర్వహిస్తుంది. అలాగే భావజాలం ఉత్పత్తి అయ్యే వ్యాప్తి చెందే ఉపరినిర్మాణ స్థాయిని పౌర సమాజం అన్నాడు. ఇదంతా చూస్తే గ్రాంషీ భావజాలాన్ని ఆర్థిక విషయాల నుండి విడిగా భిన్న క్షేత్రంలో నిలిపాడని అర్థమవుతుంది. భావజాలం యొక్క పాదార్థిక స్వభావాన్ని గురించిన ఎరుక గ్రాంషీలోని ప్రత్యేకత. ఇది మొట్టమొదట ప్రతిపాదించిన వాడు ఆయనే! అలాగే భావజాలం సమాజాలన్నిటిలోను తప్పనిసరియైన సామాజిక ఆచరణను కలిగి ఉంటుంది, ఈ ఆచరణే కర్తలను తీర్చిదిద్దుతుంది అని చెప్పాడు. ఇదంతా అస్పష్టమైన, కాలం చెల్లిన వాదనని కొంత మంది వాదన. గ్రాంషీ తన భావజాల

సిద్ధాంతాన్ని ఒక క్రమ పద్ధతిలో వివరించలేదు. అయితే గ్రాంషీ ప్రతిపాదించిన భావజాల పాదార్ధిక స్వభావం, అన్ని సామాజిక వ్యవస్థల్లో ఆవశ్యక స్థాయిగా దాని ఉనికి, కర్తలనుత్పత్తి చేసే దాని విధి మొ. విషయాలను ఆల్తూజర్ చాల శక్తివంతంగా సూత్రీకరించాడు.

గ్రాంషీ భావజాల నిర్వచనంలో ప్రధానంగా మూడు ప్రతిపాదనలున్నాయి.

1. భావజాలం చరిత్ర నుండి సత్యాన్ని రాబట్టిన ఒక శాస్త్రీయ ప్రాక్కల్పన (scientific hypothesis). ఇక్కడ భావజాలం తప్పుడుది, పాక్షికం అనే సాంప్రదాయ మార్క్సిష్టు నిర్వచనంతో గ్రాంషీ విభేదిస్తున్నాడు. ఆయన అభిప్రాయం ప్రకారం చరిత్ర అంటే ఆవశ్యకత నుండి స్వేచ్ఛను బలాత్కారంగా లాక్కొనే పోరాట రంగం. భావజాలాలు ఈ పోరాటానికి ఒక చైతన్యాన్ని సమకూర్చుతాయి. తద్వారా ఈ పోరాటాన్ని ప్రతిబింబించి, చెల్లుబాటు కల్పిస్తాయి. కాబట్టి భావజాలాలు చారిత్రికంగా అవసరం.

2. భావజాలం ఒక జీవిత భావన. దాని మూలాలు సిద్ధాంతంలో (తత్వశాస్త్రంలో) ఉన్నాయి. అది ఆచరణాత్మక కార్యకలాపంలో అమలు చేయబడుతుంది. ఈ అర్థంలోనే మతాన్ని కూడా భావజాలంగా పరిగణించడం జరుగుతుంది. మార్క్స్, లూకాక్స్‌ల లాగానే గ్రాంషీ కూడా ప్రజలను సంఘటితం చెయ్యడంలో, వర్గ చైతన్యం కల్పించడంలో భావజాల ప్రాధాన్యతను గుర్తించాడు. భావజాలంలో సిద్ధాంతం, ఆచరణ మూర్తీభవించి వుంటాయని చెప్పడం ద్వారా గ్రాంషీ మేధావులు, సామాన్య ప్రజలను ఐక్యం చేసే సైద్ధాంతిక పునాదిని సృష్టించాడు. తన కాలం నాటి భావవాదం యొక్క ఒక గొప్ప బలహీనత ఏమంటే సమాజ స్థాయిలన్నిటి భావజాల ఐక్యతను సృష్టించలేక పోవడమని గ్రాంషీ వాదన.

3. సామాజిక సంఘటనాన్ని ఐక్యం చేసి గట్టి పరచడానికి భావజాలం ఉపయోగపడుతుంది. భావజాల ఉద్యమంలో ఈ ఐక్యం చేసే భావన ప్రాధాన్యాన్ని జార్జి లారెయిన్ సంగ్రహంగా చెప్పాడు. 'గ్రాంషీ అభిప్రాయంలో భావజాలం సంఘటితం చేసే ప్రభావ శీలి. ఈ ప్రభావానికి ఆధారం ప్రజల స్వేచ్ఛాయుత సమ్మతిని గెలుచుకునే సామర్థ్యమే. ఒక ప్రాపంచిక దృక్పథం యొక్క ఈ హెజమనిక్ గుణం 'ప్రజా విశ్వాసాల పటిష్టత'లో వ్యక్తమౌతుంది. ఈ విశ్వాసాలు భౌతిక శక్తికుండే అంత శక్తి కలిగి ఉంటాయి.'

ఇక్కడ సమస్య ఏమిటంటే భావజాలానికి, పాదార్ధిక పునాదికి ఉన్న సంబంధం. భావజాలం, భౌతిక శక్తులు ఒక చారిత్రిక సంఘటనంగా రూపొందేట్లయితే, దానర్థం భావజాలం నిర్మాణాత్మక పునాదికి దర్పణ ప్రతిబింబమా?

పునాది, ఉపరినిర్మాణాలు కలిసి ఒక చారిత్రిక యుగాన్ని / వ్యవస్థను రూపొందిస్తాయి. ఈ సంక్లిష్ట నిర్మాణం, లేదా వ్యవస్థ వైరుధ్య పూరితం. ఈ ప్రతికూల ఉపరి నిర్మాణాల సమాహారం 'ఉత్పత్తిలో సామాజిక సంబంధాలను' ప్రతిఫలిస్తుంది. ఈ సందర్భంలో భౌతిక శక్తులు సాంస్కృతిక వ్యవహారాల పని తీరుకు ఎలా పరిమితులు విధిస్తాయో గ్రాంషీ మనకు ఇంకా మెరుగైన అవగాహన కలిగిస్తాడు. ఆయన అభిప్రాయంలో ప్రతిఫలనం అంటే అనన్యత్వం (ఒకేలా వుండటం) కాదు. అలా కాకపోగా స్పష్టంగా భిన్నమైన, స్వయం ప్రతిపత్తి గల రెండు రంగాల ప్రాథమిక ఐక్యతను సూచిస్తుంది. పునాది-ఉపరి నిర్మాణం పని విధానాన్ని వివరించే సందర్భంలో గ్రాంషీ ఉపయోగించిన 'రూపం- సారం' రూపకానికి వివరణ లభిస్తుంది. భౌతిక శక్తులు, వాటి భావజాల-సాంస్కృతిక వ్యక్తీకరణలు ఒక విడదీయలేని 'రూప- సార' విధేయ సంబంధంలో ఉంటాయి.

పునాది-ఉపరినిర్మాణాల ప్రాథమిక ఐక్యతను తిరిగి నెలకొల్పడం ద్వారా, గ్రాంషీ 'నియతివాదంగా కారణత' భావనకున్న సైద్ధాంతిక చెల్లుబాటును రద్దు చేశాడు. ఎందుకంటే వ్యక్తులు ఏం చేస్తారో, ఏమి ఆలోచిస్తారో తప్పించుకోలేని శక్తుల ఆధిపత్యంలో నిర్ణయించబడవు. ప్రత్యేక నిర్మాణాల (వ్యవస్థ యొక్క) ఆదేశాల ప్రకారం జీవించాల్సిన అగత్యం వ్యక్తులకు లేదు. కాని అదే సమయంలో ఈ నిర్మాణాల నిర్దిష్ట చారిత్రిక అస్తిత్వం విధించే పరిమితులు, షరతులు అధిగమించి సంచరించే స్వేచ్ఛ వీరికి లేదు.

'తప్పుడు చైతన్యంగా భావజాలం' భావనకు, పునాది- ఉపరినిర్మాణాల ఐక్యతకు మరింత సన్నిహిత సంబంధం ఉంది. మరింత సాధారణంగా వర్గ విలువల క్రమబద్ధ వ్యక్తీకరణగా, చాల వరకు సానుకూలమైనదిగా, భావజాల భావనకు ఈ పునాది- ఉపరినిర్మాణ ఐక్యత ముడిపడి ఉంది. ఇటువంటి ఐక్యత నిజ సామాజిక జీవిత ప్రక్రియల్లో వ్యక్తమవుతుంది. మన దృష్టిని ఈ ప్రక్రియల వైపు మళ్ళించడం ద్వారా గ్రాంషీ "నిర్ణయం" భావనను అప్రధానమైనదిగా చేసేశాడు. పాదార్ధిక, బౌద్ధిక ఉత్పాదక కార్యకలాపాలకు చారిత్రిక రూపాలుంటాయని గ్రాంషీ

వాదన. బౌద్ధిక, పాదార్థిక ఉత్పత్తులు వాటికవిగా స్వయం ప్రతిపత్తి గల అస్తిత్వ రంగాలకే పరిమితమైన స్వయం సంపూర్ణ భావాభివర్గాలు కావు. వాటి మధ్య పరస్పర చర్యల ఫలితాలు.

భావజాలం గురించిన గ్రాంషీ భావన ఆయన పూర్వీకులు, సమకాలికుల భావన కంటే భిన్నమైనది, అభివృద్ధి చెందినది. అది ఉప వికారవాదాన్ని (epiphenomenalism), వర్గ కుదింపువాదాన్ని అధిగమించింది. భావజాల ఉపవికారవాదం ప్రకారం, ప్రధానంగా భావజాల ఉపరినిర్మాణం యాంత్రికంగా ఆర్థిక నిర్మాణంచే నిర్ణయింపబడుతుంది, కేవలం భ్రమాత్మకమైన భావజాలం సమాజ ఆర్థిక జీవితంలో గాని, ఆ మాటకొస్తే విప్లవాత్మక మార్పులో గాని ఎటువంటి పాత్ర నిర్వహించదనే వాదనుంది.

ఉత్పత్తి విధానంలో ఉండే ఆర్థిక వైరుధ్యాల ఉద్రిక్తతలు, చలనాల ఫలితంగా విప్లవాత్మక మార్పు వస్తుందని భావించడం జరిగింది. మరీ ప్రత్యేకంగా ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తుల మధ్య వైరుధ్యాలతో పాటు ఉత్పత్తిలో శత్రు వర్గాల మధ్య ఆర్థిక వైరుధ్యాలు విప్లవ మార్పును తెస్తాయి. అంతేగాక ఇవే సంక్షోభంలో వున్న సామాజిక వ్యవస్థలో ప్రతీ సంస్థాగతమైన గుణాత్మక రూపాంతరీకరణను, భావజాల రూపకల్పనను నిర్ణయిస్తాయి. ఈ ధోరణి వల్ల పెట్టుబడిదారీ విధానం దాని సొంత ఆర్థిక నియమాలు, వైరుధ్యాలవల్ల కూలిపోక తప్పదనే అభిప్రాయం ఏర్పడింది.

భావజాలానికి వర్గ లక్షణం ఉంటుందనీ, అందుచేత పెట్టుబడిదారీ వర్గానికి ఒక భావజాలం, శ్రామిక వర్గానికి ఒక భావజాలం ఉంటాయనీ, అవి శత్రుపూరితాలని, మొత్తంగా చూసినప్పుడు అవి పరస్పరం పూర్తిగా స్వతంత్రమైనవని నిర్వచించడం జరిగింది. అంటే భావాల పోరాటం జరగవలసిన ఉమ్మడి భావజాల రంగమంటూ ఏమీ ఉండదు. దానితో అసలు భావజాలమే అప్రధానమై పోతుంది. భావజాలాన్ని ఇలా వర్గానికి కుదించడాన్ని గ్రాంషీ వ్యతిరేకించాడు.

భావజాల వర్గ కుదింపు తత్వానికి వ్యతిరేకంగా గ్రాంషీ ఇంకా ఇలా చెబుతాడు. నిర్మాణం (పునాది) లో వుండే వర్గాలు తమ నకళ్ళుగా పూర్తిగా తమకే సొంతమైన భావజాల అంశాలతో ఉపరినిర్మాణంలో ఆవిర్భవించవు. అంటే భావజాల రంగంలో వర్గ సంకరం జరిగే అవకాశం ఎప్పుడూ వుంటుంది. ఏ మేరకైతే భావజాల అంశాలు ఆవశ్యకంగా వర్గ సంబంధితం కావో, ఆ మేరకు భావజాల వ్యవస్థలు వాటి భావజాల చర్చల చేత, తిరిగి ఈ చర్చలు భావజాల అంశముల చేత నిర్వచించబడతాయి. కనుక భావజాల అంశాలు ప్రాధిపత్యానికి పోటీ పడే భిన్న వర్గాల భావజాల చర్చల్లో ప్రకటితం కావచ్చు.

ఆచరణలు, సూత్రాలు, సిద్ధాంతాల రంగంగా భావజాలాన్ని గ్రాంషీ వివరించాడు. ఇది పాదార్థిక, సంస్థాగత స్వభావం కలిగి వుంటుంది. ఈ రంగం వైయక్తిక కర్తలతో కూడి ఉంటుంది. భావజాలం వ్యక్తులకు, సామాజిక ఏజెంట్‌లకు చెందినది. ఈ వ్యక్తులే ఉత్పత్తిలో ఆర్థిక పాత్రను నిర్వహిస్తారు కనుక భావజాల ఉత్పత్తిలోను, అలాగే మొత్తం సామాజిక నిర్మాణంలోను ప్రధానమైన విధిని నిర్వర్తిస్తారు. కనుక అధికారం కోసం జరిగే పోరాటంలో నిర్ణయాత్మక సమయంలో భావజాలానికి విశేష ప్రాధాన్యత ఉంది.

నికరమైన విప్లవ మార్క్సిజంలో భావజాలానికి తిరిగి స్థానం కల్పించిన ఘనత గ్రాంషీకే దక్కుతుంది. ❑

---

- **పెద్దమనిషి అంటే మర్యాదపూర్వకమయిన ప్రవర్తన తెలిసినవాడు మాత్రమే కాదు! తన ఆలోచనల తూకం తప్పకుండా నియంత్రించుకోగలిగినవాడూ, తను జీవించే సమాజం తాలూకు విస్తృత ప్రయోజనాలకోసం తన స్వార్థ ప్రయోజనాలను స్వచ్ఛందంగా వదులుకోగలిగేవాడూ మాత్రమే పెద్దమనిషి అనిపించుకోగలడు! అంచేత, పెద్దమనిషి అంటే అత్యున్నతుడయిన సంస్కారి అని అర్థం. సంస్కారం అంటే, అపార మేధోసంపద మాత్రమే కాదనీ, తన విధులను నిష్ఠగా నిర్వర్తించడం కూడాననీ మనం అనుకుంటేనే మనమీ అర్థం చెప్పుకోగలం. మనం ప్రబోధించే ప్రతి నీతి సూత్రాన్ని, నిబంధననూ, అభిప్రాయాన్నీ, నిబద్ధతనూ గౌరవించి, నిక్కచ్చిగా పాటించడం ద్వారా, సాటి మనిషిని అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే ఎవరైనా పెద్దమనిషి కాగలుగుతారు!!**

*- గ్రాంసీ*

- **జరిగిపోయే పరిణామాలన్నీ, ఏదో కొంతమంది కోరుకున్న దానికి అనుగుణంగా సంభవించినవి కావు- అత్యధిక సంఖ్యాకులయిన పౌరులు తమ విధులను నిర్వర్తించకుండా, నిర్లిప్తంగా వుండిపోయినందువల్లనే ఇవన్నీ సాధ్యమయ్యాయి!!**

*- గ్రాంసీ*




# గ్రామ్ సీ నోట్ బుక్స్

# లోకుల జ్ఞానం లోకుల తత్త్వం లోకుల సంస్కృతి

మందలపర్తి కిషోర్

ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులలో ఒకడిగానూ, ఆ పార్టీ సిద్ధాంతవేత్తగానూ, ఇరవయ్యో శతాబ్దంలో యూరపియన్ వామపక్షాలకు దారిదీపంగా నిలిచిన మార్క్సిస్ట్ మేధావిగానూ ఆంటోనియో గ్రామ్ సీ ప్రసిద్ధుడు. పదకొండేళ్ళ తన జైలు జీవితంలో ఆయన 30 నోట్‌బుక్స్‌లో తన భావాలను నమోదు చేశారు. ఆ క్రమంలో మార్క్సిస్టు భావజాలానికి సరికొత్త భావనలను పరిచయం చేశారు గ్రామ్‌సీ. గ్రామ్‌సీకి ముందూ, ఆయన తర్వాతా కూడా లెనిన్, రోజా లగ్జెంబుర్గ్ జార్జ్ లూకాష్ తదితర మేధావులు ఎందరో మార్క్సిజాన్ని సుసంపన్నం చేసే అనేక భావనలను ప్రతిపాదించారు. అయితే, మార్క్సిస్టు పరిభాషకు పూర్తిగా అపరిచితమయిన పదజాలం ఉపయోగించి గ్రామ్‌సీ ఈ భావనల గురించి వివరించడం విశేషం. "మార్క్సిస్టు భావజాలం"గా గుర్తింపు పొంది వున్న ఆలోచనక్రమంలో కొన్ని భావనలను గ్రామ్‌సీ తిరస్కరించారు. ఉదాహరణకి, "లెనినిజం" పేరిట స్తాలిన్ చేసిన ప్రతిపాదనలను గ్రామ్‌సీ 1920 దశకంలోనే విమర్శించారు; కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ దృష్టికి కూడా తన విమర్శలను తీసుకెళ్ళారు. అయితే, మార్క్స్ ఎంగెల్స్-లెనిన్‌ల మౌలిక సిద్ధాంత భావనలను ఆయన బలపరిచారన్నది వాస్తవం.

తన జైలు రచనల్లో గ్రామ్‌సీ ఈ పరిభాషను మొదటిసారి ప్రయోగించారు. క్రీస్తు పూర్వం నాలుగో శతాబ్దానికి చెందిన గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ మొదలుకొని, క్రీస్తు శకం ఇరవయ్యో శతాబ్దానికి చెందిన ఇటాలియన్ సాహిత్యవేత్త క్రోషే వరకూ ఉపయోగించిన తాత్త్విక పరిభాష నుంచి గ్రామ్‌సీ తన పారిభాషిక పదజాలం సేకరించడం మరో విశేషం. జైలు సెన్సార్ అధికారుల కన్నుగప్పే నిమిత్తమే గ్రామ్‌సీ ఈ "అపూర్వ పరిభాష"ను వాడి వుంటారన్నది కొందరు పరిశోధకుల భావన.




అయితే, తన ఆధునిక భావాలను బట్వాడా చేసేందుకు మార్క్సిస్టు పరిభాషలో సరైన పదజాలం లేనందువల్లనే, గ్రామ్‌సీ ఈ "అపూర్వ పరిభాష"ను ప్రవేశపెట్టి వుంటారన్నది మరికొందరి అభిప్రాయం. బహుశా, రెండూ నిజమే అయివుండొచ్చు! అయినా, ముందు భావాలు పుట్టి, తర్వాత వాటికి సంబంధించిన మాటలు పుట్టుకు రావడమన్నది సహజక్రమం. అంచేత, గ్రామ్‌సీ భావనలు ముందు పుట్టాయనీ, ఆయన పరిభాష ఆ భావనల నుంచే పుట్టిందని మనసులో పెట్టుకోవాలి. ఆ భావనల గురించి తెలుసుకునే క్రమంలోనే, గ్రామ్‌సీ పరిభాష మనకు పరిచయం కావాలి !

## గ్రామ్‌సీ - మూడు భావనలు

1926-37 సంవత్సరాల మధ్య కాలంలో, ఇటలీలోని ఫాసిస్టు నియంత ముసోలినీ గ్రామ్‌సీని జైల్లో పెట్టాడు. రెండు రోజుల్లో గ్రామ్‌సీ కన్ను మూస్తారనగా, ఆయన్ను జైలు నుంచి విడుదల చేశాడు. నిర్బంధంలో ఉన్న కాలంలో, గ్రామ్‌సీ మూడు వేల పేజీల తాత్త్విక చర్చను "నోట్ బుక్స్"లో నమోదు చేశారు. సమకాలీన చారిత్రిక, రాజకీయ, సాంస్కృతిక, తాత్త్విక భావనలను గ్రామ్‌సీ ఈ నోట్‌బుక్స్‌లో చర్చించారు. ఇవన్నీ వ్యాసశకలాల లాంటివి. గ్రామ్‌సీకి ముందు ఎందరో మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు -మార్క్స్, ఎంగెల్స్‌తో సహా ఇలా వ్యాస శకలాల రూపంలో తమ భావనలను నమోదు చేసి వున్నారు. ఈ పరిచయ వ్యాసంలో గ్రామ్‌సీ చర్చించిన కొన్ని భావనలను పరామర్శించాలన్నదే ప్రయత్నం. ప్రధానంగా, మూడు భావనలను - లోకుల జ్ఞానం (COMMON SENSE), లోకుల తత్త్వం (GOOD SENSE) లోకుల సంస్కృతి (FOLKLORE) గురించి క్లుప్తంగా ప్రస్తావించుకుందాం.

ఈ మాటలు మనం రోజూ వినేవే! వాటి అర్థాలు కూడా మరీ అంత క్లిష్టమయినవేం కాదు. కానీ, ఈ మాటల్ని గ్రామ్‌సీ వాడుక అర్థంలో ప్రయోగించలేదు.

లోకజ్ఞానం, సద్బుద్ధి జానపద విజ్ఞానం లాంటి మాటలకు ఇంగ్లీష్ సమానార్థకాలుగా మనం వాడే ఈ మాటల్ని నిర్దిష్ట తాత్విక భావనలను ప్రతిపాదించే క్రమంలో, కచ్చితమయిన అర్థంలో గ్రామ్‌సీ వాడారు. వాటిని అదే సందర్భంలో, అదే అర్థంలో వాడితేనే, గ్రామ్‌సీకి న్యాయం చేసినట్లవుతుంది. ఆ తేడా తెలియడానికి వేరే మాటలు వాడాం. గ్రామ్‌సీ ఉద్దేశించిన అర్థాలేమిటో –నిర్వచనప్రాయంగా– చెప్పుకుని ముందుకు పోదాం.

## లోకుల జ్ఞానం (COMMON SENSE)

లోకుల జ్ఞానం అనేది మన నిత్యవ్యహారంలోని 'లోకజ్ఞానం' కాదు. వివేకం, విజ్ఞత అనే అర్థాల్లో ఈ మాటను వాడుతూంటారు. అతివ్యాప్తి ప్రమాణంలో అర్థవ్యాప్తి జరిగిన కొన్ని పదాల్లో ఇదొకటి. లోకంలోని సామాన్య జనానికందరికీ, లోకజ్ఞానం ఉండదని మనకు బాగా తెలుసు. వాస్తవానికి, "కామన్ సెన్స్" ఎంతో అరుదయిన జ్ఞానం! ఆ విషయం అలా వుంచితే, గ్రామ్‌సీ పరిభాషలో కామన్‌సెన్స్‌కు ఎంతో ప్రాముఖ్యం వుంది. ఇది ఇటాలియన్ మాటకు చేసిన ఇంగ్లిష్ వినువాదం. ఇటాలియన్‌లో "senso-commune" అనే మాటే ఇంగ్లీష్‌లో కామన్‌సెన్స్‌గా వ్యాప్తిలోకి వచ్చింది. ఈ ఇటాలియన్ పదానికి "సామాన్య పరిజ్ఞానం" అన్నదే అర్థం. కానీ, గ్రామ్‌సీ ప్రయోగాన్ని అంత తేలిగ్గా నిర్వచించలేం. అందుకే దాన్ని లోకుల జ్ఞానం అందాం.

## లోకుల జ్ఞానం - స్థల, కాల పరిమితులు

గ్రామ్‌సీ చెప్పిన ఈ లోకుల జ్ఞానానికి స్థలకాలాల పరిమితులు ఎక్కువ. నిర్దిష్ట కాలంలో, నిర్దిష్ట పరిసరాల్లో నివసించే జన సమూహంలో విస్తృతంగా వ్యాప్తిలో ఉన్న భావాల సముదాయమే లోకుల జ్ఞానమని స్వయంగా గ్రామ్‌సీ నిర్వచించారు. ఈ భావాల మధ్య పటిష్టమయిన కట్టుబడిగానీ, సమన్వయం గానీ ఉండకపోవచ్చునన్నారాయన. 'లోకుల తత్వం'గా తను ప్రతిపాదించిన భావన (గుడ్ సెన్స్) తాలూకు "ఆరోగ్యకరమయిన కేంద్రకం" ఈ లోకుల జ్ఞానంలోనే ఉంటుందన్నారాయన. లోకుల జ్ఞానం –వ్యక్తుల మనసులలో కూడా– భావ శకలాల రూపంలోనే వుంటుందన్నారాయన. అదే దాని మౌలిక స్వరూపమని గ్రామ్‌సీ వివరించారు. ఈ భావ శకలాల మధ్య పొందికయిన నిర్మాణం, అర్థసంబద్ధత, హేతుబద్ధత, కార్యకారణ సంబంధం ఉండకపోవచ్చన్నారు గ్రామ్‌సీ. ఆయా వ్యక్తుల వర్గస్వభావాలకు తగిన రీతిలో ఈ భావ శకలాలు ఉండకపోవచ్చునన్నది మరో ప్రతిపాదన. అయితే, ఈ భావశకలాలు ఆయా వ్యక్తుల సామాజిక–సాంస్కృతిక–తాత్విక వైఖరులకు మాత్రం అనువైన రీతిలో ఉంటాయన్నది గ్రామ్‌సీయే చేసిన ఇంకో ప్రతిపాదన. సామాన్య లక్షణాలున్న నిర్దిష్ట సామాజిక సమూహం ఉనికిలోకి వచ్చినప్పుడు రూపుదిద్దుకునే లోకుల జ్ఞానానికి విరుద్ధమయిన రీతిలో, నిర్దిష్ట తాత్వికత కూడా ఉనికిలోకి వస్తుందన్నారు గ్రామ్‌సీ. ఈ తాత్వికత, పటిష్టమయిన అంతర్ నిర్మాణాన్నీ, అర్థ సంబద్ధతనూ కలిగి వుంటుందన్నారు గ్రామ్‌సీ.

## లోకుల జ్ఞానం - స్వరూప స్వభావాలు

లోకుల జ్ఞానం స్వరూప స్వభావాల గురించి గ్రామ్‌సీ వివరణాత్మకమయిన వర్ణన చేశారు. లోకుల జ్ఞానం 'సంక్షుభిత, పరస్పర విరుద్ధ' స్వభావం కలిగి వుంటుందని ఆయనే స్వయంగా చెప్పారు. ఈ లోకుల జ్ఞానం 'మౌలికంగా స్వతంత్ర భావనల సముచ్చయం'గా ఉంటుందన్నారు గ్రామ్‌సీ. 'ఈ సముచ్చయంలో, ఎవరికి ఏది కావాలంటే అది దొరుకుతుం'దని కూడా ఆయన చెప్పడం గమనార్హం. ఈ భావన 'అనిర్దిష్టమయినదీ, పరస్పర విరుద్ధమయినదీ, బహుళ రూపి కూడా అయినదని గ్రామ్‌సీ చెప్పడం విశేషం. లోకుల జ్ఞానం, ఆధునికత అంటే భయపడే, యథాతథవాద భావన కూడానని గ్రామ్‌సీ పేర్కొన్నారు. అయినప్పటికీ, లోకులజ్ఞానం వాస్తవాలతో నిండి వుంటుందని గ్రామ్‌సీ నొక్కి చెప్పారు. సిద్ధాంత ప్రతిపాదనలు చేసే మేధావులు అర్ధసత్యాలు చెప్పకూడదు! అప్రియమయినా సత్యం యొక్క స్వరూప స్వభావాలను సంపూర్ణంగా వెల్లడించాలి. అప్పుడే, ఆ ప్రతిపాదనకు విశ్వసనీయత సంక్రమిస్తుంది. గ్రామ్‌సీకి ఈ విషయం బాగా తెలుసు కనుకనే ఉన్నదున్నట్లుగా ధన–రుణ రాశులు రెండింటినీ మనముందుంచారు. అంతకు మించి, లోకుల జ్ఞానం పరిపూర్ణంగా వుంటుందనీ, వాళ్లు సర్వజ్ఞులనీ గ్రామ్ సీ ఎప్పుడూ బుకాయించలేదు. తనకన్నా మూడు దశాబ్దాలు ముందే పుట్టిన భారతీయ మహాకవి గురజాడ అప్పారావు వేసుకున్న ప్రశ్న– 'లోకమందలి మంచిచెడ్డలు లోకులెరుగుదురా?" అనేది గ్రామ్‌సీకి కూడా తట్టేవుండాలి. అందుకే, లోకులజ్ఞానాన్ని మరింత పటిష్టంగానూ, పొందికైన హేతుబద్ధతగానూ , క్రమేణా తీర్చిదిద్దుకోవలసి వుంటుందన్నారు గ్రామ్‌సీ. అది మనకు గ్రామ్‌సీ చేసిన కర్తవ్య బోధ!

## లోకుల తత్వం (GOOD SENSE)

'లోకుల జ్ఞానం' మాదిరిగానే లోకుల తత్వం అనేది కూడా స్థలకాలాల చారిత్రిక, సామాజిక– స్వభావం కలిగి వుంటుందని గ్రామ్‌సీ స్పష్టం చేశారు. "ప్రతి ఒక్క సామాజిక వర్గానికి సొంత

'లోకుల జ్ఞానం', సొంత 'లోకుల తత్వం' ఉంటా"యన్నారు గ్రామ్‌సీ. మానవుల గురించీ, వారి జీవనం గురించీ ఏర్పర్చుకున్న 'సామాన్య, విస్తృత భావనలతోనే' ఈ లోకుల జ్ఞానమయినా, లోకుల తత్వమయినా కూడుకుని వుంటాయన్నది గ్రామ్‌సీ ప్రతిపాదన. వాస్తవానికి లోకుల తత్వం అనే పదాన్ని 'ఆచరణాత్మక తాత్వికత' (PRAXIS) అనే అర్థంలో గ్రామ్‌సీ వాడారన్నది పరిశోధకుల అభిప్రాయం. కాగా, మార్క్సిజం అనే అర్థంలోనే ఈ మాటను వాడారన్నది ఒక వర్గం పరిశోధకుల అభిప్రాయం. నోట్‌బుక్స్‌లో గ్రామ్‌సీ ఎక్కడ గుడ్‌సెన్స్ అనే లోకుల తత్వం గురించి చెప్పినా దాన్ని మార్క్సిజం గురించి చెప్పిన అభిప్రాయం గానే పరిగణించాలన్నది ఈ వర్గం అభిప్రాయం. "మతంపైనా, లోకులజ్ఞానం పైనా చేసిన విమర్శగా రూపుదిద్దుకున్నదే తత్వ శాస్త్రం. ఆ రెండింటి స్థానంలో తనను తాను ఆవిష్కరించుకునేదే తత్వశాస్త్రం. ఈ అర్థంలో, ఇది లోకుల జ్ఞానంతో విభేదించి, లోకుల తత్వంతో ఏకీభవిస్తుం"దన్నారు గ్రామ్‌సీ. "లోకుల తత్వం మేధోపరమయిన ఏకీభావంగా రూపుదిద్దుకుంటుంది. వాస్తవ పరిస్థితుల పట్ల ఏర్పర్చుకున్న భావనకు తగిన రీతిలో నైతిక ధర్మంగా కూడా అది రూపుదిద్దుకుంటుంది. ఆ విధంగా, లోకుల తత్వం అనేది, లోకులజ్ఞానం పరిధిని మించిపోతుంది. పరిమితార్థంలో, ఇది విమర్శనాత్మక భావనగా రూపుదిద్దు కుంటుం"దని గ్రామ్‌సీ వివరించారు.

## లోకుల జ్ఞానం - లోకుల తత్వం

లోకుల జ్ఞానం, లోకుల తత్వంగా అభివృద్ధి చెందడమనేది వాస్తవానికి తర్వాతి దశలో మాత్రమే సాధ్యమవుతుందని గ్రామ్‌సీ రాసిన దాన్ని బట్టి అర్థం చేసుకోవాలి. అదికూడా, దానంతట అదే జరిగిపోయే క్రమం కాదని కూడా గ్రహించాలి. ఈ దశకి చేరాలంటే, అప్పటికే విస్తృతవ్యాప్తికి నోచుకున్న –లేదా, అలా జరగడానికి అవకాశమున్న– తాత్వికతతో ఈ క్రమం మొదలు కావలసి వుంటుంది. ఈ తాత్వికత వాస్తవ జీవితంతో గాఢంగా పెనవేసుకుని, దాన్ని మరింతగా విస్తరింపచేస్తూవుండే స్వభావాన్ని కలిగివుండాలి. విభిన్న తాత్విక దృక్పథాల మధ్య హేతుబద్ధమయిన సమన్వయంగానూ, వాటన్నిటి సముచ్చయంగానూ లోకుల తత్వం ఉండాలని కూడా గ్రామ్‌సీ వివరించారు. సామాన్య జనుల సరళ, సాంస్కృతిక అవసరాలను అలాంటి తాత్వికత నిరంతరం గ్రహించగలిగే అవకాశం వున్నప్పుడు మాత్రమే ఇది సాధ్యం కాగలదన్నది గ్రామ్‌సీ అభిప్రాయమని డయానా కాబెన్ లాంటి కొందరు పరిశోధకులు విశ్లేషించారు. చారిత్రిక, సామాజిక స్వభావాలతో పాటుగా స్పష్టమయిన రాజకీయ స్వభావం కూడా సంతరింపచెయ్యగలిగితేనే, లోకుల జ్ఞానం, లోకుల తత్వంగా 'అధిగమనం' చెందగలదు. సామాజిక, తాత్విక స్వభావాలు కలిగి వుండే దృక్పథానికి రాజకీయ స్వభావం లేకుండా వుండదు! అయితే, ఆ దృక్పథం స్పష్టంగానూ, నిర్దిష్టంగానూ రూపుదిద్దు కోవాలంటే చైతన్యవంతమయిన కృషి జరగవలసి వుంటుంది. గ్రామ్‌సీ రచనలను లోతుగా అధ్యయనం చేసిన ప్రతివారికి ఈ భావం కచ్చితంగా అందుతుంది. అందుకే, ఈ అంశంపై వ్యాఖ్యానిస్తూ, "చైతన్యం పెంచే మార్క్సిస్టు రాజకీయాల ద్వారా మాత్రమే లోకుల జ్ఞానం నుంచి లోకుల తత్వాన్ని అభివృద్ధి చెయ్యడం సాధ్య"మన్నదే గ్రామ్‌సీ అభిప్రాయం కావచ్చునని డయానా కాబెన్ సూటిగానే చెప్పారు. "ప్రతి ఒక్కరి వ్యక్తిగత జీవితంలోనూ శాస్త్రీయ ఆలోచనావిధానాన్ని ఓనమాల నుంచీ మొదలుపెట్టడం ఈ క్రమంలో భాగం కానవసరం లేదు; అప్పటికే అమల్లో వున్న కార్యకలాపాలను పునర్నవీకరించి, వాటికి కీలక ప్రాముఖ్యం సంతరింపచెయ్యడంతో ఈ క్రమం మొదలు పెట్టవచ్చు" నన్నదే గ్రామ్‌సీ అభిప్రాయమని కాబెన్ ఓ పత్రంలో పేర్కొన్నారు.

## లోకుల సంస్కృతి (FOLKLORE)

రాజకీయ వ్యవస్థలకు ఉండే భిన్న సాంస్కృతిక కోణాల పట్ల సమగ్ర అవగాహన ఏర్పర్చుకునే క్రమంలో గ్రామ్‌సీ తన జైలు రచనల్లో పేర్కొన్న భావనే "లోకుల సంస్కృతి." ప్రజా సామాన్యం వివిధ దశల్లో, విభిన్న రూపాల్లో వ్యక్తం చేసే "సృజనాత్మక స్ఫూర్తి"ని గుర్తించే క్రమంలో గ్రామ్‌సీ ఈ భావనను ప్రతిపాదించారు. లోకుల సంస్కృతిలో సామాన్య ప్రజల సాంస్కృతిక జీవన సరళి సంపూర్ణంగా ప్రతిఫలిస్తుందని గ్రామ్‌సీ చెప్పినప్పటికీ, ఈ రంగం పట్ల ఆయన విమర్శనాత్మకమయిన విశ్లేషణనే ప్రకటించడం గమనార్హం. లోకుల సంస్కృతిని సామాన్య ప్రజల మూఢవిశ్వాసాలూ, భిన్న ప్రజాసమూహాల పట్ల ప్రకటించే నిరాధారమయిన అభిప్రాయాలతో సహా, అన్ని సాంస్కృతికాంశాలతోనూ కూడిన "సంకుచిత, సాంస్కృతిక దృక్పథం"గా నిర్వచించారు గ్రామ్‌సీ. అయితే, ఈ లోకుల సంస్కృతిని ఏదో తలతిక్క వ్యవహార సరళిగా మాత్రం పరిగణించరాదని గ్రామ్‌సీ హెచ్చరించారు. ఇదో ప్రాంతీయ – కొండొకచో జాతీయ– ప్రవర్తన సరళిగా కూడా రూపు దిద్దుకుంటుంది. సహజంగానే అది రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవనరంగాలను ప్రభావితం చేస్తుంది.

☞ మిగతా 84వ పేజీలో


# మనిషికీ సత్యానికీ ఉన్న బంధమే సైన్సు : గ్రాంసి

**డాక్టర్ దేవరాజు మహారాజు**
సుప్రసిద్ధ సాహితీ వేత్త, బయాలజీ ప్రొఫెసర్



విషయమేదైనా అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి అని చెపుతారు. సమాజమే విభజింపబడి ఉంది. ఆర్థిక బలవంతులు, నిరుపేదలు, పెట్టుబడిదారులు , శ్రమజీవులైన వర్కర్లు, ప్రజాపక్షం వహించేవారు, ప్రభుత్వాలకు భజన చేసేవారు, ప్రగతిశీల భావాలు గలవారు, ప్రగతి నిరోధకులు, వైజానిక స్పృహ గలవారు – లేని వారు, మనుస్మృతి ప్రకారం ఉన్నతులు, నిమ్న వర్గాలు పుణ్యాత్ములు, పాపాత్ములు, వివిధ మతాలు అందులో శాఖలు వగైరా వగైరా' అలాంటప్పుడు విషయం ఏదైనా అందరికీ ఆమోదయోగ్యమైందిగా ఎలా ఉంటుందో నాకు అర్థమయ్యేది కాదు. మానసిక ఘర్షణలో సతమతమవుతూ ఉండేవాణ్ణి. అలాంటి సందర్భంలో నాకు ఇటలీ మార్క్సిస్టు మేధావి, రచయిత, జర్నలిస్టు, భాషా శాస్త్రవేత్త , రాజకీయ నాయకుడు గ్రాంసి చెప్పిన మాట గొప్ప ఊరటనిచ్చింది. "జీవించి ఉన్నామంటే, ఏదో పక్షం వహించాలి. నిజంగా జీవించి ఉన్నవారు పౌరులుగానూ, పక్షపాతులుగానూ ఉంటారు. తటస్థత, ఉదాసీనత, పరాన్న జీవనం, గతి తప్పడం జీవితం కాదు. అది పలాయన వాదం. అందుకే నాకు తటస్థం అంటే అసహ్యం!!" అని అన్నాడాయన. దాంతో నాకు ఒక స్పష్టత వచ్చింది. ఆయన పట్ల ఒక గౌరవ భావం ఏర్పడింది. పైగా ఆయన సైన్సు, భాషా శాస్త్రం , సామాజిక అంశాలపై చేసిన లోతైన విశ్లేషణలు నన్ను ఆకర్షించాయి. ఆంటోనియో ఫ్రాన్సిస్కో గ్రాంసి (22 జనవరి 1891–27 ఏప్రిల్ 1937) విజ్ఞాన శాస్త్రం గురించి ఏమన్నాడో ఇక్కడ టూకీగా చెప్పుకుందాం.

నిత్య జీవితంలో సైన్సు ఒక భాగం కావాలని గ్రాంసి కోరుకున్నాడు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చేయడానికి సైన్సు ఒక మార్గం కావాలన్నాడు. ఊహాత్మకమైన భ్రమల్ని నమ్ముతూ కూర్చోకుండా, ఒక విశాలమైన ప్రాపంచిక దృక్పథాన్ని అలవరుచుకోవడానికి తప్పకుండా సైన్సు ఉపయోగపడుతుందన్నాడు. మతతత్వ భావనతో సైన్సును ఎదుర్కోకూడదని చెప్పాడు. సమాజంలోని అంతర్గత సమస్యలను సైన్సు బయటి నుండే కొన్నింటిని అప్రయత్నంగా నివారిస్తుంది. అందువల్ల మనం, వైజ్ఞానిక విజయాల మీద ఎక్కువగానే ఆధారపడాల్సి ఉంటుంది. సామాజిక పరిస్థితులకు అనుగుణంగా సైన్సు తన ప్రాధాన్యతలు నిర్ధారించుకుంటుంది. సమాజంలో అంతర్భాగంగా ఉంటూనే, నిత్యజీవితంలోని విశ్వాసాల విశ్లేషణకు పూనుకుంటుంది. మార్పు కోసం చేయాల్సిన సంఘర్షణల్ని గుర్తు చేస్తూ, ఒక తాత్విక భూమికను ఏర్పరుస్తుంది.




చారిత్రిక కోణంలో గమనిస్తే ఒక్కోసారి మతాలు సైన్సులోని కొన్ని కొన్ని విషయాలను ఆహ్వానిస్తాయి. ఉదాహరణకు క్రైస్తవ చర్చ్ – అరబ్బుల గణితాన్ని స్వీకరించింది. మతంతో సఖ్యత కుదిరింది కదా అని, సైన్సు ఎప్పుడూ మతపరమైన మూఢ విశ్వాసాల్ని సమర్థించదు. ఈ చిన్న విషయం అవగతం చేసుకోకుండా కొందరు "సైన్సు కూడా ఒక మతమే" – అని తీర్మానిస్తారు. అది వారి విజ్ఞతకు వదిలేయాల్సిన విషయం. గ్రాంసి బతికి ఉన్న కాలంలో సైన్స్‌లో మెటాఫిజిక్స్‌కు చాలా ప్రాముఖ్యం ఉండేది. సైన్సులో అన్వేషించగలిగేవి, పరిశోధించగలిగేవి కొన్నే ఉంటాయి. అన్వేషించలేనివి, పరిశోధించలేనివి విడిగా మరికొన్ని కూడా ఉంటాయి' అని శాస్త్రవేత్త ఎడ్డింగ్టన్ వాదిస్తూ ఉండేవాడు. ఆ వాదనతో గ్రాంసి ఎంత మాత్రమూ ఏకీభవించేవాడు కాదు. సైన్సుకు పరిధులు, ఎల్లలూ ఉండవని – పరిశోధించే శాస్త్రవేత్తకు సరైన సాంకేతిక సామాగ్రి లేకనో.. సరైన అనుభవం లేకనో తాత్కాలికంగా అలా అనిపిస్తే అనిపించొచ్చు. కానీ, అది నిజం కాదు అని అనేవాడు.

కొన్ని వాస్తవాల్ని సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగతం చేసుకోగలరు. దాన్నే 'ఇంగిత జ్ఞానం' అంటూ ఉంటాం . ఇంతకూ

ఇంగిత జ్ఞానాన్ని ఎలా నిర్వచించుకుంటాం ? అంటే– మొత్తానికి మొత్తంగా సమాజంలో ఉన్న విశ్వాసాల ఏకత్వం .. మళ్ళీ మళ్ళీ పునరుజ్జీవింపబడడాన్ని– ఇంగిత జ్ఞానం అని అంటాం. ఈ విశ్వాసాలు మత పరంగా, మూఢనమ్మకాల పరంగా, దృక్పథాల పరంగా.. అలాగే, కొన్ని వైజ్ఞానిక సూత్రాల పరంగా కూడా ఏర్పడొచ్చు. ఇవి చాలా బలంగా ఉంటాయి. వీటినే 'నిజాలు' అని కూడా వ్యవహరిస్తూ ఉంటారు. వీటిని వైజ్ఞానిక వివరణల్లో లేదా మత వివరణల్లో ఉపయోగిస్తూ ఉంటారు. అందుకే ఒక్కోసారి, ఒక్కొక్కరి ఇంగిత జ్ఞానం ఒక్కో రకంగా ఉండడం మనం గమనిస్తాం. అయితే ఈ ఇంగిత జ్ఞానమే 'మంచి స్పృహ'గా రూపాంతరం చెందుతుంది. ఈ మంచి స్పృహ ఏమిటీ? అంటే– ఇది ఆరోగ్యకరమైన స్పృహ. ఇది అంధ విశ్వాసాల మీద గాని, భావోద్రేకాల మీద గానీ ఆధారపడకుండా స్వతంత్రంగా, స్వచ్ఛందంగా నిలబడగలిగేది. ఇది అన్యాయమైన కొన్ని సమూహాలను గాని, శ్రామిక వర్గాన్ని గాని, దెబ్బతిని ఉన్న కొందరు వ్యక్తులను గాని.. గుర్తించి, వారి మేలు కోసం కృషి చేసేది. వ్యవస్థల్ని పటిష్టం చేసేది. వెంటనే చేయలేకపోయినా, ఆ దిశలో పని చేసేది. ఇలాంటి మంచి స్పృహ సమాజానికి ఎప్పుడూ అవసరమే !

సమాజ భాగస్వామ్యం లేకుండా సైన్సు అభివృద్ధి కాదు. సామాజిక సంస్కృతితో పరిచయం లేకుండా, ప్రపంచ పరిజ్ఞానం సంపాదించుకోకుండా.. అసలు పరిశోధనలు ఎలా జరిగేవి? నూతన ఆవిష్కరణలు ఎలా బయటపడేవి? నిత్య జీవితంలోంచి ఎగిసి పడుతున్న ప్రశ్నల్ని సైన్సు ఎదుర్కోగలగాలి. చారిత్రికంగా గమనిస్తే ప్రతి కాలంలోనూ సైన్సుకు కొన్ని కొన్ని పరిధులు, పరిమితులూ ఉంటూనే వచ్చాయి. అవి ఇక ముందు రాగల కాలాలలో కూడా వేరే విధంగా ఉంటాయి. విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి వైజ్ఞానిక పరికరాలు ఎంతో అవసరం. నిజమే! కాని, అంత కన్నా ముఖ్యమైనవి మేధోపరమైన, తాత్త్వికపరమైన, రాజకీయపరమైన పరికరాలు. పరికరాలంటే ఇక్కడ అంశాలు, ఆలోచనలు! వైజ్ఞానికంగా రుజువైన నిజాల్ని 'సత్యం'గా స్వీకరించలేం. ఎందుకంటే రుజువైన నిజాలు మారిపోయే అవకాశం ఉంది. సైన్సు నిరంతరం మారుతూ ఉంటుంది. కానీ, సత్యం అనేది మారకుండా ఉండాలి కదా? అందుకే అసంపూర్ణమైన సత్యాలకు సైన్సు జవాబుదారీ కాదు.

సైన్సు సమాజంతో విడివడి ఉంటుందని గ్రాంసి ఎప్పుడూ భావించలేదు. ఎందుకంటే సైన్సు ఉద్దేశం సత్యాన్వేషణే అయినా, దాని తొలి ప్రాధాన్యత మాత్రం మనిషే. సైన్సు దానికదే అభివృద్ధి కాలేదు. మనిషి చొరవతో, అతను కనుగొన్న కొత్త కొత్త పద్ధతులతో, కొత్త కొత్త పరికరాలతో, కొత్త కొత్త సాంకేతిక నిపుణతలతో పాటు – అతని ఉత్సుకత, శ్రమల కలయికతో మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతూ వచ్చింది. అందువల్ల సైన్సు ధ్యేయం ఏమిటీ ? – అంటే.. సాంకేతికంగా మనిషికి, సత్యానికీ సత్సంబంధం నెలకొల్పడమే సైన్సు. మానవ జాతిని సైన్సు నుండి విడదీయలేం. ఎందుకంటే మానవ జాతి లేనిది సైన్సు లేదు. తత్త్వవేత్తలాగా వైజ్ఞానికుడు కేవలం ఆలోచనాపరుడు మాత్రమే కాదు. ఆలోచన చేయడంతో పాటు అతనొక కష్టజీవి కూడా !


ఇతర రంగాలలో వలెనే వైజ్ఞానిక రంగంలో కూడా వైజ్ఞానికులకు విరోధులుంటారు. విమర్శిస్తుంటారు. అలాంటప్పుడు వాదోపవాదాల్లో సత్య నిర్ధారణకు ప్రాధాన్యమివ్వాలే గాని, వాదనలో నెగ్గడం.. నెగ్గకపోవడం అనేది అక్కడ ప్రధానం కాకూడదు. విరోధులు చెప్పే విషయాల్లో బలహీనమైన అంశాలు పట్టుకుని వారిపై ఎదురు దాడికి దిగకుండా– వారి వాదనలో సార్వజనీనమైన అంశాలు ఏమున్నాయో గమనించాలి. వాదనల వల్ల భావోద్రేకాలు వెళ్ళగక్కుకోవడం కాకుండా, సమాజానికి కొత్త విషయాలు ఏమి అందించగలుగుతున్నామో బేరీజు వేసుకోవాలి. చెప్పినా, రాసినా విషయం సరళంగా, మంచి భాషలో, స్థాయి తగ్గించుకోకుండా చూసుకోవాలి. విరోధులలో సైతం ఆలోచనలు రేకెత్తించేట్లు చేయగలగాలి.

పారిశ్రామిక యుగం సమాజానికి కొత్త ద్వారాలు తెరిచింది. రకరకాల పనులు చేయగల వర్కర్లు, మేనేజర్లు– వారికి అనుగుణంగా ఉత్పత్తి వ్యవస్థ తయారైంది. వీటితో పాటు విద్యకు అనూహ్యంగా ప్రాముఖ్యత పెరిగింది. ఓ రకంగా సైన్సుకు మూలాలు విద్యలోనే ఉన్నాయి. గ్రాంసి కాలానికి రెండు రకాల విద్యా విధానాలు అమలులో ఉండేవి. ఒకటి – ఉన్నత వర్గానికి పనికొచ్చే విద్యా వ్యవస్థ. రెండు – ఆర్థికంగా అణగారిన వర్గాలకు పనికొచ్చే తక్కువ స్థాయి విద్యావ్యవస్థ. విద్యావంతుల కుటుంబాల నుండి వచ్చిన వారికి ఉన్నత ప్రమాణాలు గల విద్య అందుబాటులో ఉండేది. ఆర్థిక స్థోమత లేని నిరక్షరాస్యుల కుటుంబాల నుండి వచ్చే పిల్లలకు ప్రమాణాలు లేని, అతి తక్కువ స్థాయి విద్య అందుబాటులో ఉండేది. ముఖ్యంగా శారీరక శ్రమ అవసరమయ్యే సాంకేతిక శిక్షణ మాత్రమే లభిస్తూ ఉండేది. ఆ పరిస్థితి మారాలని

☞ మిగతా 65వ పేజీలో


# గ్రాంసీ మాటలలో శ్రామిక విద్య, సంస్కృతి

కొత్తపల్లి రవిబాబు
'ప్రజా సాహితీ' సంపాదకులు



విద్యారంగంపై గ్రాంసీ తొలి ఆలోచనలు ప్రధానంగా శ్రామికవర్గ ప్రజలు స్వతంత్ర మేధావులుగా రూపుదిద్దుకోవడంపై కేంద్రీకరించి వుండేవి. అలా వారు తయారైతే వారి ఉద్యమాలకు వారే నాయకత్వం వహించగల్గుతారు. అప్పుడు వృత్తి మేధావులకు నిర్ణయాలు తీసుకునే అవకాశం వారు ఇవ్వరు. తామే ఒక పాలకవర్గంగా పనిచేసే సామర్ధ్యం సంపాదిస్తారు.

గయొలెటి కాలంలో కొన్ని అభ్యుదయకర సంస్కరణలు చేసినా, ఇటలీలో ఈ శతాబ్దపు (19వ శతాబ్దం) మొదటి సంవత్సరాలో శ్రామికవర్గానికీ, రైతాంగానికీ చెందిన పిల్లలకు విద్యావకాశాలు మృగ్యం. ప్రభుత్వ విద్యా వ్యవస్థకు నిధులు, వనరులు లేవు. ఉపాధ్యాయుల జీతాలు అంతంత మాత్రమే. నిర్బంధ విద్య 9వ ఏడుతోనే పూర్తి అవుతుంది. ప్రాథమిక స్థాయి అనంతర విద్య మూడు ప్రధాన స్రవంతులుగా వుంది. 1. అమెరికన్ జూనియర్ హై మరియు హైస్కూలు లాంటిది 2. తక్కువ స్థాయి వృత్తుల వారికి, తెల్లచొక్కా ఉద్యోగులకు 3. ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణా సంస్థలు. మొదటి స్రవంతి వారికి ఎక్కువెక్కువ నిధులు కేటాయించి, శ్రామికవర్గ పిల్లల చదువు పట్ల వివక్ష చూపించారు. దీనికి తోడు యూరప్‌లో నిరక్షరాస్యత ఇటీవలనే అత్యధికం. 1911 జనాభా లెక్కల ప్రకారం ఆరేళ్ళ వయసు పైబడిన వారిలో నిరక్షరాస్యులు పీడ్మాంట్ (Piedmont) లో 11 శాతం, లాంబార్డీ (Lombardy) లో 13 శాతం, టస్కనీ (Tascany) లో 37 శాతం, సార్డీనియా (Sardinia) లో 58 శాతం, కాలబ్రియా (Calabaria) లో 70 శాతం వున్నారు.




ఈ పరిస్థితికి స్పందించి ఇటాలియన్ శ్రామిక ఉద్యమంలో భాగంగా పార్టీలోని సంస్కరణ విభాగం తన కార్యక్రమంగా ప్రధానంగా విద్యను చేర్చింది. వయోజనులకు, పిల్లలకు పగలు, సాయంత్రాలు పనిచేసే స్కూళ్ళను సోషలిస్టులు ప్రారంభించారు. పార్లమెంట్‌లోను, బయటా, నిరక్షరాస్యత నిర్మూలనా ప్రచారం చేశారు. నిర్బంధ ఉచిత సాధారణ విద్య అందించాలని ప్రచారం చేశారు. తద్వారా కేథలిక్ చర్చి వారి విద్యా సంస్థల ప్రభావాన్ని అదుపు చేయడం లక్ష్యంగా పని చేశారు. అయితే ఈ సంస్కరణ వాదుల సోషలిస్టు విద్య కేవలం విద్యా విహీనులైన ప్రజానీకానికి 'సమాచారాన్ని' మాత్రం ఇవ్వగల్గింది. చాలా సందర్భాల్లో ఈ స్కూళ్లలో నేర్పినది ఎక్కువగా సంప్రదాయక పాఠ్య ప్రణాళిక, అది తక్కువ సోషలిస్టు భావ ప్రచారం.

గ్రాంసీ ప్రకారం విద్య అంటే విద్యార్థికి విజ్ఞాన సర్వస్వాన్ని అందించడం కాదు. అప్పటికే విద్యార్థిలో వున్న విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం – దానిని ఒక క్రమంలో పెట్టుకోవడం. కనుకనే ఆయన 'ప్రజావిశ్వవిద్యాలయా'లను విమర్శిస్తూ "ఇవి శ్రామికవర్గ ప్రజలకు కావాల్సిన విభిన్న అవసరాలు, నేపథ్యం పట్టించుకోకుండా, "విజ్ఞానపు తునక మాత్రం అందిస్తున్నాయి" అన్నాడు. ఒక రాజకీయ పార్టీలో విద్య అనేది ఒక కీలకపాత్ర వహిస్తుంది. దాని ద్వారా శ్రామికవర్గ ప్రజలు తమ పరిస్థితి గురించి ఒక విమర్శనాత్మక అవగాహన పెంపొందించుకుంటారు. అంతేగాక విప్లవ ఆవశ్యకత తెలుసుకొని ఉన్నత స్థాయిలో వున్న మేధావులపై ఆధారపడకుండా తమకు తామే విముక్తి సాధించగల్గుతారు. ఈ ఉన్నతస్థాయి మేధావులు శ్రామికవర్గ ఆకాంక్షలను పలచ బారేట్లు చేసి సంస్కరణవాద పరిష్కారాలు చూపిస్తారు.

"సంస్కృతి అంటే విజ్ఞానసర్వస్వంగా పరిగణించే అలవాటు నుండి మనం బయటపడాలి. పరస్పర సంబంధం ముడి వాస్తవాలనూ, స్వీయానుభవం ద్వారా పొందిన సమాచారాన్నీ – డిక్షనరీలో పదాలను కుక్కినట్లు – మెదడులో కుక్కుకున్న మనుషుల సంస్కృతి నిజంగా అపాయకరమైనట్టిది.

ప్రత్యేకంగా శ్రామిక వర్గానికి ఇది ఎనలేని హాని చేస్తుంది. ఎన్నో విషయాలను తేదీలతో సహా బట్టీపట్టి, అవకాశం వచ్చిన ప్రతిసారీ, వాటిని అప్పచెప్పి తమకీ ఇతరులకు మధ్య గల అడ్డుగోడను ప్రదర్శిస్తూ, ఇతర మానవాళి కంటే తాము గొప్పవారమనే వికృత మానవులను ఇది తయారుచేస్తుంది. ఇది బలహీనమైన, అతి సాధారణమైన మేధావితనాన్ని సృష్టించడానికి ఉపయోగపడుతుంది. మానవుడి శరీర ఆరోగ్యానికి క్షయ, సిఫిలిస్ క్రిములు ఎంత హాని చేస్తాయో, ఈ గలగలా విషయాలను గుమ్మరించేవారు సామాజిక జీవితానికి, అంతకంటే ఎక్కువ హాని చేస్తారు.

"ప్రొఫెసర్ల సోమరిపోతుతనం వల్ల, అజాగ్రత్త వల్ల డిగ్రీ అనే ఓ కాగితం ముక్క సంపాదించడంలో విజయం సాధించిన యువ విద్యార్థి కానీ, యువ లాయరు కానీ, తమని తాము వృత్తిలో ఎంతో నైపుణ్యం సంపాదించిన శ్రామికుడి కన్నా గొప్ప వారమనీ, వారి కంటే భిన్నమైన వారమనీ తలుస్తారు. నిజానికి ఆ శ్రామికుడే ఒక ఖచ్చితమైన లక్ష్యాన్ని సాధిస్తాడు. కనుక అతడే ఈ డిగ్రీలు సంపాదించిన వారి కంటే వంద రెట్లు ఎక్కువ విలువ వున్నవాడిగా పరిగణించాలి. ఇది సంస్కృతి కాదు. ఇది డాంబిక పాండిత్య ప్రదర్శన మాత్రమే. ఇది తెలివితేటలు కాదు – మేధో ప్రదర్శన మాత్రమే. దీనికి వ్యతిరేకంగా స్పందించడం సరైన చర్య.

"సంస్కృతి అనేది దీనికి పూర్తిగా భిన్నమైనది. అది ఒక నిర్మాణ విధానం. తన అంతరంగాన్ని క్రమశిక్షణలో పెట్టుకోవడం, తన వ్యక్తిత్వంతో తాను సమాధానపడటం. అది ఒక ఉన్నత చైతన్యాన్ని పొందటం – దాని ద్వారా తన చారిత్రక విలువను అర్థం చేసుకోవడంలో విజయం సాధించడం. తన జీవిత లక్ష్యాన్ని, తన హక్కులను, బాధ్యతలనూ గుర్తు చేసుకోవడం.

"ఇంతెందుకు... మనిషి అంటే మెదడు (మనసు) మనిషి చరిత్ర చేత మలచబడ్డవాడు. ప్రకృతి చేత కాదు. ఎప్పటి నుంచో పీడకులూ, పీడితులూ వున్నారు. సంపద సృష్టికర్తలూ, వాటిని తమ స్వార్థానికి వినియోగించుకునేవారూ, వున్నారు కాని ఇప్పటి వరకూ సోషలిజం ఎందుకు రాలేదో ఎలా వివరించగలం ? క్రమక్రమంగా ఒకానొక దశలో మానవాళి చైతన్యవంతమై తనను బంధించి వున్న మైనారిటీలపై విజయం సాధించడం జరుగుతుంది. ఈ చైతన్యం బాధలనుభవిస్తున్న వారు తమ బాధల నుండి విముక్తి కావడానికి ఆలోచించడం ద్వారా వస్తుంది. మొదట్లో కొందరు మాత్రమే ఆలోచిస్తారు. ఆ తర్వాత వర్గం మొత్తం ఆలోచిస్తుంది. ఎందుకీ పరిస్థితులు ఉన్నాయో, బానిసత్వం నుండి తిరుగుబాటు సామాజిక పునర్నిర్మాణం ఎంతగా చేయగలమని ఆలోచిస్తుంది. ❑

## మనిషికీ సత్యానికీ ఉన్న బంధమే సైన్సు : గ్రాంసి

**(63వ పేజీ తరువాయి)**

గ్రాంసి కలలు గనేవాడు. మానవీయ విలువలు, సాంకేతిక శిక్షణ కలగలిపి తయారుచేసిన విద్యావిధానం అన్ని వర్గాల బాల బాలికలకు సమానంగా అందాలని గ్రాంసి అభిలషించేవాడు.

ఆంటోనియో ఫాన్సిస్కో గ్రాంసి, ఫాసిస్ట్ ముసోలిని కాలంలో జైలు జీవితం గడపాల్సి వచ్చింది. రచయితగా ఆయన ఆ కాలాన్ని కూడా సద్వినియోగం చేసుకున్నాడు. చరిత్ర, మార్క్సిస్టు తాత్వికత, సామాజిక శాస్త్రాలపై అనేక రచనలు చేశాడు. వాటిని మనం రెండు రకాలుగా విభజించుకోవచ్చు. 1. జైలుకు వెళ్ళక ముందు రచనలు. 2. జైలులో రాసిన ముప్పయి ప్రిజన్ నోట్ బుక్స్. ఈ ప్రిజన్ నోట్ బుక్స్ అత్యంత ఉన్నత ప్రమాణాలు గల రాజకీయ సిద్ధాంతాలని ప్రపంచం గుర్తించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబంలో పుట్టిన గ్రాంసి బాల్యంలో ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొన్నాడు. పాట్ వ్యాధి వల్ల వెన్నుపూస పెరగక పోవడం, దాని వల్ల శారీరక ఎదుగుదల లేకపోవడం జరిగాయి. అవరోధాలను అధిగమించి, ఒక గొప్ప దార్శనికుడిగా ఎదగగలగడం మామూలు విషయం కాదు. తల్లి దండ్రులు అన్నీ అమర్చినా, శారీరకంగా ధృఢంగా ఉన్నా– సరైన దృక్పథం ఏర్పరుచుకోకుండా ఉన్న నేటి తరం యువతీ యువకులు తప్పకుండా గ్రాంసి జీవితం నుండి ఎంతో నేర్చుకోవాలి. ఆయన ఆలోచనలతో స్ఫూర్తిని పొందాలి. సామాజిక స్పృహ, వైజ్ఞానిక స్పృహ గల వాళ్ళను గ్రాంసి తప్పకుండా పలకరిస్తాడు. ❑

**నిజం చెప్పడాన్ని మించిన విప్లవాత్మకత వేరేదీ లేదు!!**

**అన్నిటికీ మించి, మనిషి అంటే చైతన్యం, బుద్ధి.**
**అనగా, మనిషి ప్రకృతిసిద్ధంగా రూపొందిన వాడు కాదు-**
**చారిత్రిక పరిణామాల పర్యవసానంగా**
**రూపుదిద్దుకునేవాడన్న మాట!**


*- గ్రాంసీ*

# భావజాల పోరాటంలో వయోజన విద్య

డా॥ సి. కృష్ణమోహనరావు



నేను వయోజన విద్యా రంగంలో చాలా కాలం పని చేశాను. వయోజన విద్య పాఠ్య పుస్తకాలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు వారి వారి భాషల్లో తయారుచేస్తారు. వీటిలో వయోజనులకు వారి జీవితాలలో ఉపయోగపడతాయని ప్రభుత్వం భావించే అనేక అంశాలు, వాటిద్వారా చదవడం రాయడం నేర్పే విధంగా ఉంటాయి. ఉదాహరణకు మన రాష్ట్రంలో ఉపయోగించే వాచకం మొదటి పాఠం "అవసరాలు". ఈ పాఠంలో వయోజనుల అవసరాలు ఏమిటి వాటిని ఏ విధంగా తీర్చుకోవాలి అనే అంశాలు బొమ్మలు సాయంతో చర్చించాలి. ఈ చర్చ ద్వారా వయోజనులు కష్టపడి పని చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని వారి జీవిత అవసరాలు తీర్చుకోవచ్చని వారి నుండి సమాధానం రాబట్టాలి. నేను అనేకసార్లు వాలంటీర్లతోనూ నిరక్షరాస్యులైన అభ్యాసకులతోను చర్చలో పాల్గొనడం జరిగింది. ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే వారందరు కూడా మనుష్యుల అవసరాలు తీరకపోవడానికి కారణం వారికి చదువు, నైపుణ్యాలు లేకపోవడం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, స్థానిక రాజకీయాలు వంటి అంశాలను చెపుతుంటారు. చాలామంది మనుషులందరు సమానమని నమ్మరు. చేతి ఐదువేళ్ళు సమానం కానట్టే సమాజంలో కొందరు అదృష్టవంతులు ఉంటారని నమ్ముతారు. చాలా మంది వారి అవసరాలు తీరక పోవడానికి ప్రస్తుత వ్యవస్థ కారణమని కాని, అందరికి సమాన అవకాశాలు, ఆదాయాలు లేకపోవడం అని కానీ భావించారు. వారితో మాట్లాడుతున్నప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. వారి అభిప్రాయాలు ఆలోచనలు సమాజంలో ధనిక వర్గాల అభిప్రాయాలలాగే ఉంటాయి. వయోజన విద్య పుస్తకాలు పాఠ్యాంశాలను పరిశీలిస్తే అవన్నీ కూడా సమాజంలో పెట్టుబడిదారీ వర్గ అనుకూలతతో, వారి భావజాలంతో రూపొందాయని అర్థమవుతుంది.




సమాజంలో ఈ భావాలు విస్తృత ప్రచారంలో ఉండడానికి కారణం అర్థం చేసుకోవడానికి మార్క్సిస్ట్ దృక్పథంలో వచ్చిన రచనలు ఉపయోగపడతాయి. అయితే, వీటి గురించి మరింత స్పష్టమైన అవగాహన కలగాలంటే గ్రాంసీ దృక్పథం ఎంతో దోహదం చేస్తుంది. వయోజనవిద్య విషయంలో గ్రాంసీ ప్రాముఖ్యత అర్థం చేసుకోవాలంటే ఆయన ప్రయోగించిన భావాలను ఆకళింపు చేసుకోవాలి.

వయోజన విద్య నిర్వచనం చాలా విస్తృతమైనది. సమాజం వయోజనులుగా పరిగణించే వ్యక్తులు నియత (formal) అనియిత (non-formal) విధానాలలో నేర్చుకునే విద్య అంతా వయోజన విద్య. పిల్లల విద్య కన్నా ఇది కొంత భిన్నంగా ఉంటుంది. పిల్లల విద్య భవిష్యత్తు కోసం ఉపయోగపడితే వయోజన విద్య ప్రధానంగా ప్రస్తుత కాలానికి ఉపయోగపడే విధంగా ఉంటుంది. సాధారణంగా వ్యక్తులు ఈ క్రింది విధానాలలో నేర్చుకుంటారు.

**1. నియత విద్య :** సాధారణముగా స్కూల్లోనూ కాలేజీలోనూ పూర్తి కాలం నేర్చుకునే విద్య. దీనిలో స్పష్టమైన పాఠ్య ప్రణాళిక, విద్యా బోధన, పరీక్షలు ఉంటాయి.

**2. అనియత విద్య :** దీనిలో పూర్తికాలం కాకుండా రోజూ కొంత సమయం విద్యాభ్యాసం జరుగుతుంది దీనిలో కూడా పాఠ్య ప్రణాళిక, బోధన విధానం, పరీక్షలు ఉంటాయి అయితే ఇవన్నీ కూడా పాక్షికంగా అభ్యాసకునికి అనుకూల సమయంలో ఉంటాయి.

**3. ఇన్ ఫార్మల్ విద్య :** ఒక వ్యక్తి సొంత ఆసక్తితో నేర్చుకునే విద్య. దీనిలో ఒక పాఠ్య ప్రణాళిక అభ్యాసకుడు నిర్ణయించుకుని ఒకరు సాయంతో కానీ ఒకరి సాయం

లేకుండా గాని స్వచ్ఛందంగా నేర్చుకుంటాడు. ఉదాహరణకు ఒక క్రొత్త భాష నేర్చుకోవడం, కంప్యూటర్‌తో పని చేయడం నేర్చుకోవడం వంటి ఒక కొత్త విషయాన్ని కొంత సమయం కేటాయించి నేర్చుకోవడం దీని కింద వస్తాయి.

**4. యాదృచ్ఛిక విద్య :** నిత్యజీవితంలో వివిధ సంఘటనలు, వివిధ అనుభవాలు, టీవీ కార్యక్రమాలు, పేపర్ల వంటి వాటి ద్వారా యాదృచ్ఛికంగా నేర్చుకునే విద్య. దీనికి పాఠ్య ప్రణాళిక, విషయ స్పష్టత కాని ఉండదు. వాస్తవానికి ఇది సామాజికీకరణలో ఒక భాగం.

సాధారణంగా మొదటి రెండు విధానాలను విద్యా రంగంగా పరిగణిస్తే, తరువాత రెండు విధానాలను సంస్కృతి, సామాజికీకరణలో భాగంగా నేర్చుకుంటారు. వీటి వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి గ్రాంసీ హెజమనీ భావం ఉపయోగ పడుతుంది.

## హెజమనీ

గ్రాంసీ భావాలలో అతి ముఖ్యమైంది హెజమనీ. సమాజం లోని ఆధిపత్య వర్గం విద్యాసంస్థలు, మత సంస్థలు, ప్రజలు రూపొందించుకున్న ఇతర సాంస్కృతిక, సామాజిక సంస్థల ద్వారా తమ వర్గ భావజాలాన్ని ప్రజా సమూహాల లోకజ్ఞానంలోకి చొప్పించడం ద్వారా పౌర సమాజ సమ్మతిని రాబట్టుకొంటుంది. ఇలాంటి సమ్మతిని పొందడాన్ని గ్రాంసీ 'హెజమనీ' గా నిర్వచించాడు. పైన చెప్పిన అనుభవం ఈ హెజమనీకి చెందినదే. హెజమనీలో అతి ప్రధానమైన అంశం పెట్టుబడిదారీ వర్గం బల ప్రయోగం ద్వారా కాకుండా ప్రజలను ఒప్పించడం ద్వారా ప్రజల భావజాలాన్ని తమకు అనుకూలంగా మార్చడం ద్వారా పరిపాలన సాగిస్తూ ఉంటారు. దీన్ని 'సమ్మతి' అంటారు. పెట్టుబడిదారి వ్యవస్థ బలపడడంలోనూ, ఈ వ్యవస్థ పట్ల పీడిత ప్రజలలో అంగీకారం లేదా ఆమోదం పొందడంలోనూ సివిల్ సొసైటీలోని అన్ని సంస్థల కన్నా విద్యా విధానం కీలక పాత్ర వహిస్తుంది. హెజమోనీలో భాగంగా పౌరసమాజంలోని వ్యక్తులు, బృందాలు తమ భావాలను అంగీకరించే విధంగా విద్యను వాడుకుంటుంది. ఇక్కడ విద్య అంటే నియత విద్యకు, స్కూలుకు పరిమితం కాదు. విద్యావ్యవస్థ అనేది విస్తృత అర్థంలో వాడబడింది. దీనిలో సామాజికీకరణలో భాగంగా ఉన్న పాఠశాల విద్య నుండి వయోజన విద్య వరకు అనేక విద్యా విధానాలు ఇమిడి ఉన్నాయి. హెజమనీలో ఉండే అన్ని సంబంధాలు విద్యా సంబంధాలని, అందువల్ల వ్యవస్థ మార్పు కోసం జరిగే రాజకీయ పోరాటం విద్యా పోరాటంగా కూడా ఉండాలని అని గ్రాంసీ ఉద్ఘాటించాడు.

ఏ విద్య కూడా తటస్థంగా ఉండదు. అది హెజమనీలో భాగంగా అప్పుడు సమాజంలో ప్రచారంలో ఉన్న పెట్టుబడిదారీ వర్గ భావజాలాన్ని ప్రచారం చేయడానికి, లేదా ఆ భావాలను వ్యతిరేకించడానికి ఉపయోగిస్తారు. పాలకవర్గ అనుకూలురైన మేధావులు వర్గ ఆధిపత్యాన్ని సమర్థించే భావనలను చాలా పొందికగా అదేపనిగా ప్రచారం చేస్తారు. ఈ పని మాస్ మీడియా, దేవాలయాలు, పాఠశాలలు, కుటుంబం ద్వారా జరుగుతుంది. అయితే ప్రజల జీవితానుభవాలు ఆధిపత్య వర్గ భావజాలానికి భిన్నంగా ఉంటాయి. దీనితో అధీన వర్గాల సభ్యులు ద్వంద్వ చైతన్యం కలిగి ఉంటారు. వారు హెజమనీపై ఆధారపడిన వైరుధ్యపూరిత అసమంజస విశ్వాసాలను, మరోవైపు దైనందిన అనుభవాలు కలగజేసే భావాలను ఏకకాలంలో కలిగి ఉంటారు. అందువలన పౌర సమాజం మీద హెజమనీ అన్నది పాలకవర్గం సాధించుకునే ప్రక్రియ మాత్రమే కాదు. దీనికి ప్రతిగా దోపిడీ వ్యవస్థను కూలదోసే ప్రత్యామ్నాయ హెజమనీ (కౌంటర్ హెజమనీ) కూడా ఉంటాయని గ్రాంసీగుర్తించాడు. గ్రాంసీ అభిప్రాయం ప్రకారం జనులందరూ ప్రపంచం గురించి ఆలోచిస్తారు. ప్రజా సంస్కృతి యొక్క లోకజ్ఞానం (కామన్ సెన్స్) ద్వారానే వారు వారి యొక్క జీవితాలను అనుభవాలను అర్థం చేసుకుంటారు. కామన్ సెన్స్ ఒకానొక సామాజిక వ్యవస్థకు విలక్షణమైన, ఆ వ్యవస్థలో నాటుకుని ఉన్న నమ్మకాలు, ఊహలను సూచిస్తుంది. కామన్ సెన్స్ ఒక వైరుధ్యాల పుట్ట. దీనిలో మతపరమైన విశ్వాసాలు, ఆచారాలు, సాంప్రదాయాలు పాలక వర్గాలు పెంచి పోషించే భావజాలం ఉంటాయి. అదే సమయంలో దీనికి భిన్నమైన జీవిత అనుభవాలు ఉంటాయి. ఈ విధంగా కామన్ సెన్స్ భావజాల సంఘర్షణకు ఒక కీలక రంగం అవుతుంది. ప్రత్యేకంగా కామన్ సెన్స్ అనే పోరాట రంగం నుండి క్యాపిటలిజం యొక్క వర్గ స్వభావాన్ని గుర్తించే విచక్షణ జ్ఞానం (గుడ్ సెన్స్) పుట్టుకొస్తుందని ఆశించాడు. కామన్ సెన్స్ అనేది భావజాల పోరాటానికి ముఖ్య క్షేత్రం. ఎందుకంటే దైనందిన ప్రపంచంలోని కార్యకలాపాలకు మార్గదర్శకత్వం వహించే ఆచరణాత్మక చైతన్యం యొక్క రంగం అది.

గ్రాంసీ విద్య, సాంస్కృతికి చర్యల ద్వారా హెజమనీ వ్యతిరేక చర్యలు పాల్పడ్డానికి, లోకజ్ఞానం నుండి విచక్షణా జ్ఞానం

రూపొందడానికి వయోజన విద్య ఒక వేదికగా ఉపయోగపడుతుందని భావించాడు. ఇక్కడ వయోజన విద్య అంటే వయోజన జీవితాల్లో ఉపయోగించే నియత, అనియత విద్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణించాలి. గ్రాంసీ వయోజన విద్యను ప్రగతిశీల విముక్తికరమైన ప్రత్యామ్నాయ ఆధిపత్యం సాధించడానికి మార్గంగా భావించాడు. ఇది పాలక వర్గాలు, ప్రభుత్వాలు గరిపే విద్య కాదు. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు తమకు తాము గరపుకొనే వయోజన విద్య. దీనిలో భాగంగా ఆర్గానిక్ మేధావులు (organic intellectuals) అతి కీలక పాత్ర వహిస్తారని వారి ద్వారా ప్రజల్లో కలిగే మార్పు సామాజిక మార్పుకు దోహదం చేస్తుందని వివరించాడు.

## మేధావులు (Intellectuals)

గ్రాంసీ మనుషులందరూ మేధావులే కానీ సమాజంలోని అందరూ మేధావుల విధిని కలిగి ఉండరు అని రాశాడు. ప్రతి వర్గం ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ మేధావుల పొరలను సజీవంగా తనతో పాటే సృష్టిస్తుంది. సాంప్రదాయ, ఆర్గానిక్ మేధావులు మధ్య తేడా ఉంటుంది అంటాడు గ్రాంసీ. సాంప్రదాయ మేధావులు తాము సామాజిక వర్గాలకు అతీతులమని, స్వతంత్రమని పొరపాటుగా భావిస్తూ, సామాజిక, రాజకీయ మార్పులకు అతీతంగా, పాత సంస్కృతికి ప్రతీకలుగా ఉంటారు. వీరికి భిన్నంగా ఆర్గానిక్ మేధావులు ప్రజా సమూహాల ఉమ్మడి లక్ష్యాలను వ్యక్తం చేసేవారుగా ఉంటారు. వీరు సమాజంలో నైతికమేధో సంస్కరణ తేవడానికి కృషి చేస్తారు. ఒక మేధావి ఎంత వరకు ఆర్గానిక్ అనే దానికి ప్రమాణం ఏమిటంటే అతను సభ్యునిగా తన సంస్థతో ఎంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నాడన్నదే. ఆర్గానిక్ మేధావులు ఏ వర్గానికి అయితే ప్రాతినిధ్యం వహిస్తున్నారో ఆ వర్గ భావజాలాన్ని ప్రచారం చేయడానికి కృషి చేస్తారు.

వయోజన విద్యలో ప్రఖ్యాతి చెందిన ఇద్దరు మేధావులు ఉదాహరణగా తీసుకుంటే ఇది మరింత స్పష్టంగా అర్థం అవుతుంది. ఒకరు డేల్ కార్నిగి, రెండోవారు పాలోఫ్రెయిరె. ఇద్దరు వయోజన విద్యావేత్తలుగా తరగతులు నిర్వహించారు. ఇద్దరు తరువాతి కాలంలో వారి పుస్తకాల ద్వారా ప్రసిద్ధి చెందారు. డేల్ కార్నిగి తన వయోజన విద్యా తరగతుల్లో వ్యక్తిత్వ వికాసం గురించి ప్రధానంగా కేంద్రీకరించారు. ఒక వ్యక్తి తనలోని లోపాలను సరిదిద్దుకోవడం ద్వారా లేదా తనకు తన వ్యక్తిత్వాన్ని తను ఉన్న వ్యవస్థకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా అభివృద్ధి చెందవచ్చని వివరించారు. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాడకుండా దాన్ని మార్చకుండా నిన్ను నువ్వు మార్చుకోవడం ద్వారా నువ్వు బాగుపడతావ్, సమాజం మార్పుతో నీకు అవసరం లేదని ఈ సిద్ధాంతసారం. How to Win Friends and Influence People, How to Stop Worrying and Start Living వంటి ఆయన పుస్తకాలు అనేక భాషలలోనికి అనువదింపబడి, కొన్ని కోట్ల కాపీలు అమ్ముడుపోయాయి. ఆయన నిర్వహించే తరగతులు, పుస్తకాల ద్వారా పెట్టుబడిదారీ వర్గ భావనలను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈయన పెట్టుబడిదారి వర్గ ఆర్గానిక్ మేధావి.

దీనికి భిన్నంగా పాలోఫ్రెయిరె నిర్వహించిన వయోజనవిద్యా తరగతుల్లో వ్యక్తి అభివృద్ధి సమాజం అభివృద్ధితో ముడిపడి ఉంటుందని, పేదరికానికి, దోపిడీకి మూలం ఉత్పత్తి వనరులు, సంపద అసమాన పంపిణీ అని, అది తొలగించకుండా దానిపై తిరుగుబాటు చేయకుండా సమానత్వం సాధ్యం కాదని వాదించారు. ఈ రకమైన మార్పు వల్లే వ్యక్తి, సమాజం అభివృద్ధి సాధ్యమని తెలియజెప్పారు. ఆయన తరగతులకు హాజరైన అభ్యాసకులు రాడికల్స్‌గా మారి బ్రెజిల్, చిలి, నికార్గువా వంటి దేశాలలో విప్లవ ఉద్యమాలకు కృషి చేశారు. Pedagogy of the Oppressed, Cultural Action for Freedom వంటి ఆయన పుస్తకాలు అనేక దేశాలలో విప్లవోద్యమాలకు విద్య ఒక ఆయుధంగా ఉపయోగపడ్డాయి.

డేల్ కార్నిగి ఉపన్యాసాలు, పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గం, వారి భావాలు బలపడ్డానికి ఉపయోగపడితే, పాలో ఫ్రెయిరి ఉపన్యాసాలు, పుస్తకాలు అనేక దేశాల్లో విప్లవ శక్తులు బలపడటానికి ఉపయోగ పడ్డాయి. డేల్ కార్నిగి పెట్టుబడిదారీ వర్గఆర్గానిక్ మేధావి కాగా పాలోఫ్రెయిరి మత ప్రచారకుడైనా పీడిత ప్రజల ఆర్గానిక్ మేధావిగా పరిగణించాలి.గ్రాంసీ వయోజనవిద్య అధ్యాపకులు ఆర్గానిక్ మేధావులుగా ఉండాలంటాడు. వీరు వార్ ఆఫ్ పొజిషన్‌లో సాంస్కృతిక విద్యా కార్యకర్తగా కీలకపాత్ర వహిస్తారు. వీరు ప్రత్యామ్నాయ ఆధిపత్యానికి అణగారిన వర్గాల అధికారానికి కృషి చేస్తారు. వీరు తమ మేధో విషయాలన్నీ కార్మికవర్గ అనుభవాల నుండి తీసుకుంటారు. అదే సమయంలో కార్మిక వర్గానికి సైద్ధాంతిక చైతన్యాన్ని అందిస్తారు.

## వయోజన విద్య అభ్యసన విధానాలు ప్రదేశాలు

గ్రాంసీ భావన ప్రకారం సమాజ మార్పుకు కృషి చేసే వివిధ సామాజిక, సాంస్కృతికసంస్థలు వయోజన విద్యాభ్యాసానికి వేదికలుగా మారాలి. వీటి ద్వారా ప్రత్యామ్నాయ ఆధిపత్యానికి అవసరమైన భావజాలాన్ని ప్రజలకు అందించాలి. అవి విద్యాసంస్థలు కావచ్చు, సాంస్కృతిక సంస్థలు కావచ్చు, కర్మాగారాలు కావచ్చు. దీనిలో భాగంగా కర్మాగారాల్లోని కార్మికులకు సాంస్కృతిక సంఘాలు ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని గ్రాంసీ అనేక చోట్ల వివరించారు. ఆయన కార్మికుల విద్య అవసరాలను గురించి, బోధన విధానం గురించి చర్చించారు. చెప్పే వారికి నేర్చుకునే వారికి మధ్య హెచ్చుతగ్గులు, అంతరాలు ఉండకూడదని సంభాషణ ద్వారా విద్యా బోధన జరగాలని భావించారు. అలాగే విద్యలో ఎక్కువ తక్కువ అనే సాంస్కృతిక విభజన పోవడానికి గ్రీకు లాటిన్ భాషల వంటి అంశాలను కూడా నేర్పవలసిన అవసరం ఉందని భావించారు. గ్రాంసీ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడమే కాకుండా ఆచరణలో వివిధ వేదికల ద్వారా వయోజన విద్య కార్యకలాపాలు నిర్వహించారు. వాటిలో ముఖ్యమైనది ఫ్యాక్టరీ కౌన్సిల్స్‌లో నిర్వహించిన విద్యా కార్యక్రమం.

ఫ్యాక్టరీ కౌన్సిల్స్ ద్వారా నిర్వహించిన విద్యలో కార్మికులను జీతగాళ్లుగా కాకుండా ఉత్పత్తిదారులుగా ఆలోచించే విద్య అవసరాన్ని గ్రాంసీ విశదీకరించారు. దీని వలన కార్మికులు రాజ్యాధికారాన్ని సాధించడానికి ముందే నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారని భావించాడు. ఈ సందర్భంలో నైపుణ్యం గల కార్మికులకు నైపుణ్యం లేని కార్మికులకు పరిపాలనలో భాగంగా ఉన్న ఉద్యోగులకు సంఘీభావం ఏర్పడుతుందని చెప్పారు. పనిచేసే ప్రదేశం లేదా కర్మాగారం గురించిన అవగాహన సమాజం పనిచేసే విధానాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందని వివరించారు. దీని కొరకు కార్మికుల సాంస్కృతిక సంస్థలు ఏర్పాటు చేసి విద్యాపరమైన చర్చలు జరపాలని దీనిలో వ్యక్తి ఉన్నతే కాకుండా సమాజ అభివృద్ధికి దోహదం చేయాలని ఉద్ఘాటించాడు. అయితే ఫ్యాక్టరీ కౌన్సిల్ ద్వారా మాత్రమే వయోజన విద్య సాధ్యం కాదని సివిల్ సొసైటీలోని అన్ని సంస్థలు దీనిలో భాగస్వామ్యులు కావాలని, ఇది వార్ ఆఫ్ పొజిషన్‌లో కీలకమని భావించాడు. ఆయన ఇదే ఆదర్శంగా అనేక ప్రాజెక్ట్స్‌లో పాల్గొని వాటి ద్వారా వయోజన విద్యకు కృషి చేశారు దీనికి మంచి ఉదాహరణ గ్రాంసీ నిర్వహించిన జైలు స్కూలు. దీనిలో ఉపాధ్యాయుడు అభ్యాసకుడు అనే భేదం లేకుండా అభ్యాసకుడు ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయుడు అభ్యాసకుడుగా పరస్పరం ఒకరి నుండి ఒకరు నేర్చుకుంటారు. అలాగే పత్రికలను కూడా మరొక వయోజన విద్యా వేదికగా భావించాడు. పత్రికల ద్వారా సాహిత్య, సాంస్కృతిక అంశాలను వర్గ దృక్పథంలో విశ్లేషించారు. వాటి ద్వారా ప్రచారంలో ఉన్న సంస్కృతికి భిన్నంగా నూతన సంస్కృతికి కృషి జరిపారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే అధిపత్య వర్గభావజాలంపై పోరాడకుండా ఒక్క రాజకీయ రంగంలో పోరాటం ద్వారా విజయం సాధించడం కష్టం. ఈ ఆధిపత్య భావజాల వ్యతిరేక పోరాటానికి వయోజనవిద్య దాని విస్తృత అర్థంలో కీలక పాత్ర వహిస్తుందని ప్రతిపాదించాడు.

గ్రాంసీప్రతిపాదించిన సిద్ధాంతం భారతదేశానికి చాలా ప్రాసంగికత ఉంది. ఎక్కడైతే ప్రగతిశీల శక్తులు వయోజన విద్యా రంగంలో కృషి చేసిన ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో ప్రగతిశీల శక్తుల ప్రభావం దీర్ఘకాలం కొనసాగింది. అటువంటి కృషి జరగని రాష్ట్రాల్లో ప్రగతిశీల శక్తులు కొంత వెనకబడ్డాయి. ఉదాహరణ కేరళ రాష్ట్రంలో అక్షరాస్యతా ఉద్యమంలో ప్రగతిశీల వ్యక్తులు, సంఘాలు కీలక పాత్ర వహించారు. దాని ప్రభావంతోఈనాటికి ఆ రాష్ట్రంలో ప్రగతిశీల భావాలు చాలా వరకు కొనసాగుతున్నాయి. అదే కొన్ని ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో ప్రగతిశీల పార్టీలు రాజకీయ పోరాటానికి ఇచ్చిన ప్రాముఖ్యత విద్యా, వయోజన విద్యా రంగాలకు ఇవ్వలేదు. అక్కడ ప్రగతిశీల శక్తులు కొంత వెనకబడ్డాయి. అంతర్జాతీయంగా వయోజన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన దేశం క్యూబా కూడా దీనికి మరో మంచి ఉదాహరణ. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రగతిశీల పార్టీలు, సంస్థలు వయోజన విద్యా రంగంలో గ్రాంసీ దృక్పథంలో కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ❑

---

**పాలిత వర్గంగా ఉన్న వర్గం నిజంగానే స్వతంత్రమై, ప్రాముఖ్యం వహించే దశకు చేరుకున్నప్పుడు, నూతన రాజ్యాధికార వ్యవస్థను నిర్మించవలసి వచ్చినప్పుడు, నూతన మేధో - నైతిక విధానాన్ని రూపొందించవలసిన కచ్చితమయిన అవసరం ఏర్పడుతుంది. అది నూతన సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకోడానికి దారితీస్తుంది. అంచేత మనం వీలయినంత విస్తృతంగా సార్వజనీన భావనలను అభివృద్ధి చేసుకుని వుండాలి! అత్యంత నిశితమయిన, నిర్ణయాత్మకమయిన భావజాల శస్త్రాలను సిద్ధం చేసుకుని వుండాలి !!** *- గ్రాంసీ*


# మార్క్స్ వారసుడు గ్రాంసీ

జి రాములు



మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకి ఎలా అన్వయించాలో తెలుసుకోవాలనుకుంటే గ్రాంసిని చదవాల్సిందే. మార్క్సిజాన్ని ఆయా దేశాలకు అన్వర్తింపచేసుకొని రష్యాలో లెనిన్, చైనాలో మావో, వియత్నాంలో హోచిమిన్, క్యూబాలో కాస్ట్రో విప్లవాలు విజయవంతం చేసుకున్నారు. వారు తమ దేశాలలో విప్లవం తేవడం మీదనే ప్రధాన కేంద్రీకరణ చేశారు. కాని గ్రాంసి తన ఇటలీలో ఎందుకు విప్లవం రావడం లేదో ఆలోచించడం ప్రారంభించి, మార్క్స్ లాగ సార్వజనీనమైన సూత్రీకరణలు చేశారు. మార్క్సిజాన్ని తాజా పర్చడంలో, విస్తృతపర్చడంలో గణనీయమైన కృషి చేశారు.

పెట్టుబడి దారి వ్యవస్థ ఏర్పడగానే సోషలిస్టు విప్లవానికి పరిస్థితులు పరిపక్వమౌతాయన్న సంప్రదాయ అవగాహన ఎందుకు తప్పిందో పరిశీలించడానికే తీవ్ర ప్రయత్నాలు చేశాడు. కారణాలు వెతికాడు. ఏ ఉద్యమానికైనా, ఏ విప్లవానికైనా సాంస్కృతిక పునాది కీలకం. ఈ పునాది ఎంత బలంగా ఉంటే ఆ విప్లవ లక్ష్యాలు అంతా బలంగా వుంటాయి. సంస్కృతినంతా ప్రభావం చేసేది పౌర సమాజం. పౌరసమాజాన్ని ఆజమాయిషి చేయగలిగితేనే అధికారంలోకి రావడం గాని పాలన సాగించడం గాని సాధ్యమని రూఢి చేసుకున్నాడు గ్రాంసీ.




మానవుని జీవన గమనం మొత్తానికి ప్రాతినిధ్యం వహించేది సంస్కృతి. మానవుని సామాజిక జీవన లక్షణాలన్ని సాంస్కృతిక రంగంలో వ్యక్తీకరించబడుతాయి.సంస్కృతి అంటే కేవలం సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం, సాహిత్యం లాంటి కళలకు పరిమితమైన అంశమే కాదు. ఆర్థిక, సామాజిక, రాజకీయాలన్ని సంస్కృతిలో భాగమనేది గ్రాంసి సూత్రీకరణలో కీలకం.

రాజకీయాధికారమొస్తే సర్వం సాధించినట్లు భావించే వారిని దృష్టిలో ఉంచుకొని గ్రాంసీ చేసిన విశ్లేషణ ఎంతో విలువైంది. ఎవరు రాజ్యాధికారం చెలాయిస్తారో వారు పాలక వర్గాల రాజ కోటకు “బయట కందకం” లాంటివారే. దాని లోపల శక్తివంతమైన “కోటలు ,బురుజుల” లాగ వుండేది సంస్కృతే. ఆ సంస్కృతే పాలకవర్గాల ఆధిపత్యానికి మహాకుడ్యాల వలే కాపలా కాస్తుందంటారు.

కార్ల్ మార్క్స్ సంస్కృతిపై చెప్పిన విషయాలు పరిశీలిస్తే గ్రాంసి మార్క్స్‌ల మధ్య ఉన్న సామీప్యత అర్థమవుతుంది. అన్ని కాలాల్లోను పాలక వర్గాల భావాలు, సంస్కృతి పరస్పర సంభంధితంగా వుంటాయి. పాలకవర్గాలే భూములు, పరిశ్రమల్లాంటి ఉత్పత్తి సాధనాలతో పాటు పాలక మేధావులను కూడ తయారు చేస్తాయి. ఆ పాలక మేధావులు భావాలు ఉత్పత్తి చేస్తారు, తమ నోటి ద్వారా, కలాల ద్వారా తమ భావాలను పంపిణి చేస్తారు. అవి ప్రజల మనస్సుల్లో భౌతిక శక్తిగా మారుతాయి. అవే సమాజాన్ని అజమాయిషి చేస్తాయి. మారిన భౌతిక శక్తే సంస్కృతిగా చలామణిలోకి వస్తుందంటారు మార్క్స్. అందుకే మార్క్సును గ్రాంసిని లోతుగా అధ్యయనం చేసిన వారెవరైనా గ్రాంసీలో మార్క్సును చూస్తారు. మార్క్సిజాన్ని ప్రస్తుత పరిస్థితులకు అన్వర్తింప చేసినవారిలో ముందు వరుసలో చెప్ప దగినవాడు గ్రాంసే. “గ్రాంసీ” సూత్రీకరణ వెలుగులో మన దేశంలోని సంస్కృతి లక్షణాలు పరిశీలిద్దాం.

అన్ని సమాజాలలాగే మన దేశంలో కూడా మనిషి పుట్టిన దగ్గర నుండి చచ్చిపోయే దాకా, ఆదిక్రియల నుండి అంత్యక్రియల దాకా అనేక మజిలీలు, క్రతువులుంటాయి. ఆచారాలు, సంప్రదాయాలు, సామెతలు, వేషధారణ తదితరములన్ని సంస్కృతిలో భాగమే అవుతాయి. సంస్కృతి కాలాలను బట్టి, ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. సంస్కృతి పాలకుల చేతిలో పనిముట్టుగా వుంది. ఎవరు పాలకులుగా వుంటే వారు

తమకనుకూలంగా వుండే సంస్కృతిని కాపాడుకొంటారు. లేకుంటే సృష్టించు కోడానికి ప్రయత్నించడం సహజం.

మన సంస్కృతిని మనువాద ఆధిపత్య శక్తులు పెంచి పోషిస్తున్నాయి. ఇవి సమాజాన్ని తిరోగమింపచేస్తున్నాయి. వేల సంవత్సరాలుగా ఈ కంపు సంస్కృతి గుట్టలుగుట్టలుగా పోగుపడి వుంది. ప్రస్తుత కేంద్రప్రభుత్వం, బూజుపట్టిన ఆ సంస్కృతిని పెంచి పోషించే సంఘ్ పరివార్ ఆధీనంలో వుంది. ప్రస్తుత సంస్కృతి ఆర్థిక దోపిడి వ్యవస్థను, అగ్రకుల ఆధిపత్యాన్ని, పురుషాధిపత్యాన్ని నిలబెడుతున్నది. కాలానికి, అవసరాలకు అణుగుణంగా వుండి, ప్రజల అభ్యున్నతికి తోడ్పడే ప్రత్యామ్నాయ సంస్కృతిని సృష్టించాలి. అందుకు సాంస్కృతిక రంగంలో 3 రకాల పోరాట రూపాలుగా చేయాల్సి ఉంటుంది.

1) అనాదిగా కొనసాగుతున్న బూజుపట్టిన సంస్కృతులను భూస్థాపితం చేయాలి.

2) ఇప్పటికే ఉన్న సత్సంప్రదాయాలను సంరక్షించుకోవాలి.

3) మారుతున్న కాలంతో పాటు ప్రజానుకూల ప్రత్యామ్నాయ సంస్కృతులను సృష్టించాలి.

ప్రపంచంలోని కొన్ని దేశాల్లో కొన్ని ఈ రకమైన పనికిమాలిన సంస్కృతులు ఉండి వుండొచ్చు. కాని ఇంత బూజుపట్టిన సంస్కృతి మరెక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. ప్రస్థుతం ఉనికిలో వున్న ప్రతిదానికీ గతం వుంటుంది, భవిష్యత్తు వుంటుంది. ఈ బూజుపట్టిన తిరోగామి సంస్కృతికి పునాది (గతం) మను ధర్మశాస్త్రంగా చెప్పవచ్చు. మానవాళి చూసిన అత్యంత అప్రజాస్వామిక, అమానుషమైన ధర్మశాస్త్రంగా ఇది ప్రపంచ చరిత్రలో నిలిచిపోయింది. మనుధర్మ శాస్త్ర సారాంశమంతా "బ్రాహ్మణ హితః; బ్రాహ్మణ సుఖః "అంటారు ప్రముఖ అభ్యుదయచరిత్ర రచయితలైన సర్దేశాయి , రాహుల్ సాంకృత్యాయన్, కోశాంబి తదితరులు.

మన సమాజంలో వున్న అభివృద్ధి నిరోధక (తిరోగామి) సంస్కృతికి వ్యతిరేకంగా అభివృద్ధికర (పురోగామి) శక్తులు నిరంతరం ఘర్షణ పడుతూనే వున్నాయి. వాస్తవానికి భారతీయ సంస్కృతి విశిష్టమైనది. బుద్ధిని కంటే ముందు కూడా చార్వాక, లోకహిత తదితర ప్రగతిశీల శక్తులున్నా, భారతీయ ప్రగతిశీల స్రవంతికి బుద్దుడొక మూలమలుపు. మన భారతీయ సంస్కృతిలో బుద్దుడితో ప్రారంభమైన అభ్యుదయ సుసంపన్నమైన గొప్ప సంస్కృతిని ఒక పథకం ప్రకారం పూర్వపక్షం చేసింది బ్రాహ్మణీయ మను వాదం.

తిరోగామి శక్తులకు మను వాదం ఎలా 'పునాది' యో "పురోగామి" శక్తులకు బౌద్ధం అలానే పునాదిగా వుంది. బుద్ధుడు దేవుడును గుర్తించలేదు. బుద్ధుడు భౌతిక వాస్తవాన్ని నమ్మాడు. మూఢనమ్మకాలను వ్యతిరేకించాడు. "బహు జనహితః బహుజన సుఖః "అని సాధారణ ప్రజల బాగోగులు గురించి మాట్లాడిన మొదటి తత్వవేత్తగా గుర్తింపు కూడా పొందాడు. బుద్ధుడి ప్రభావం ఇప్పటికి ఆసియా ఖండంలో ప్రభలంగా వుంది. భారత సమాజం లో పురోగామి సంస్కృతికి పునాదిగా బుద్ధుడును పరిగణిస్తారు. ప్రగతిశీల విధానాలను కాపాడాలి, కొనసాగించాలి.

మార్క్స్, ఐన్‌స్టీన్, బెర్ట్రాండ్ రస్సెల్, వివేకానందుడు, రవీంద్రనాథ్ టాగూర్, అంబేద్కర్ తదితరులు బుద్ధుడు పురోగామి సాంస్కృతిక శక్తులకు ఎందుకు పునాదియో వివరంగా చెప్పారు.

భారతీయ సమాజంలో ఆర్యభట్ట, వరాహమిహిరుడు, చరకుడు, వేమన, కబీర్, పూలే, నారాయణ గురు , పెరియార్, గురజాడ, కందుకూరి వీరేశలింగం, అంబేద్కర్, వామపక్షాలు, హేతువాదులు, నాస్తికుల వాదనలకు స్ఫూర్తి బుద్ధుడు అనడంలో సందేహం లేదు.

మనువాద తిరోగామి సంస్కృతికి బౌద్ధ పురోగామి సంస్కృతికి పరస్పరం జరిగిన ఘర్షణల ఫలితమే నేడున్న సంస్కృతి. ప్రస్తుతమున్న బూజు పట్టిన సంస్కృతికి వ్యతిరేకంగా ఆర్థిక రంగంలో జరిగిన, జరుగుతున్న పోరాటాలు గాని, పూలే, అంబేద్కర్ తదితరుల నాయకత్వంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న కుల వ్యవస్థ వ్యతిరేకంగా పోరాటాలు గాని, రాజారాం మోహన్ రాయ్, గురజాడ, కందుకూరిల నాయకత్వాన జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న మహిళ అభ్యుదయానికి, మూఢవిశ్వాసాలుకు వ్యతిరేకంగా పోరాటాలు అన్ని భారతీయ సమాజంలో దాగున్న గొప్ప సంస్కృతి కాపాడే అంశాలుగా చెప్పవచ్చు. ఈ పోరాటాలవారసత్వాన్ని కొనసాగించాల్సి వుంది.

మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణమైన ప్రత్యామ్నాయ సంస్కృతిని సృష్టించాలి. మూడు వేల సంవత్సరాలుగా కుళ్ళికంపు కొడుతున్న మనువాద సంస్కృతి స్థానే సరైన ప్రత్యామ్నాయం ప్రతిపాదించకుండ మనువాద సంస్కృతిని వ్యతిరేకించలేము, ఓడించలేము. ఈ ప్రత్యామ్నాయం ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాలలో సృష్టించాల్సిన అవసరం వుంది. శ్రమశక్తి దోపిడి చేయడం తప్పు

కాదని, ఎలా సంపాదించాడనేది కాదు, ఎంత సంపాదించాడనేది ముఖ్యమనే సంస్కృతిని అంతం చేయాలి.

శ్రమను అగౌరవపరిచి, సోమరితనాన్ని గొప్పగా భావించే సంస్కృతిని అంతం చేసి శ్రమను గౌరవించి, శ్రమకు తగ్గ ఫలితముండాలనే సంస్కృతిని సృష్టించాలి. తరతరాలుగా వారసత్వంగా అతి కొద్ది వర్గాలు, కులాలు పాలకులుగా, మిగతా వారు పాలితులుగా వుండే రాజకీయ సంస్కృతి స్థానే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతిని సృష్టించాలి. మహిళలను తక్కువగా చూడటం, కట్నం పేరిట గృహహింసలు, "శీలం". పేరిట వేధింపులు, దౌర్జన్యాలు, హత్యలను నిరసించే సంస్కృతిని సృష్టించాలి. ఇదంతా జరగాలంటే మనిషి ఆలోచన, జీవన క్రమంలోనే గుణాత్మక మార్పు రావాలి. మనిషి పుట్టుక నుండి గిట్టే దాకా అనేక క్రతువులుంటాయి. జన్మదినం, అన్నప్రస్థానం, విద్యాభ్యాసం, చీరెలు-పంచెలు కట్టించడం, వివాహం, శ్రీమంతం, షష్టిపూర్తి, అంతిమయాత్ర, కర్మకాండ, దినాలు/ఖర్మలు తదితరనేకముంటాయి, మూఢనమ్మకాలు, జ్యోతిష్యాలు, జాతకాలు, వాస్తు, బాణమతి, బలులు, తదితర అశాస్త్రీయ పద్ధతులు, సంస్కృతులెన్నో వున్నాయి.

అనేక పండుగలుంటాయి. అందులో సంక్రాంత్రి, ఉగాది, వినాయకచవితి, దసరా, దీపావళి లాంటి సంప్రదాయ పండుగలున్నాయి. జనవరి 1, జనవరి26, ఫిబ్రవరి 14, ఏప్రిల్ 14, ఆగష్టు 15, అక్టోబర్ 2 లాంటి ప్రభుత్వ జోక్యముండే ఉత్సవాలుంటాయి. వీటన్నిటికి సరైన, మానవీయ, శాస్త్రీయ ప్రత్యామ్నాయాలు వెదకాల్సి వుంది. స్వకులవివాహాలు, మత విద్వేషాలు లాంటి ప్రముఖమైన సమాజ తిరోగమన సంస్కృతికి ప్రత్యామ్నాయం సృష్టించాల్సి వుంది.


1. సైన్స్ ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టాలి.
2. మూఢనమ్మకాల నిషేధ చట్టం తేవాలి.
3. సంఘ సంస్కరణోద్యమాలు చేపట్టాలి
4. కులాంతర, మతాంతర వివాహాలే ఒక విధానంగా మారాలి.
5. స్వకుల వివాహాలు నిరుత్సాహపర్చాలి.
6. అబద్ధాలు, అశాస్త్రీయ విషయాలు ప్రచారం చేసే స్వాములు, బాబాలను నియంత్రించాలి.
7. భారతీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించిన, వహిస్తున్న సామాజిక విప్లవకారుల జీవితాలను, కృషిని, ఆదర్శాలను శ్లాఘించే సంస్కృతిని సృష్టించాలి.
8. మహిళలను సమానంగా, గౌరవంగా చూసే సంస్కృతిని సృష్టించాలి.
9. శ్రమను గౌరవించే సంస్కృతిని పెంపొందించాలి.

1. ఈ కార్యక్రమాల నిర్వహణకు వివిధ స్థాయిలలో నిర్మాణ యంత్రాంగాలు ఏర్పడాలి.
2. ఎలాంటి ఆధిపత్యాన్నెదిరించినా అభ్యుదయమే. బూజు పట్టిన మనువాద సంస్కృతిని ఎదిరించడం తక్షణ కర్తవ్యంగా సంస్థల నేర్పాటుచేయాలి
3. ఈ అభ్యుదయ శక్తులతో కూడిన సంస్థలను ఐక్యతా కేంద్రాలుగా మార్చాలి.

ప్రపంచ వ్యాపితంగా అనేక పునర్జీవనోద్యమాలు, సంస్కరణోద్యమాలు, విప్లవాలు వచ్చినవి. శాస్త్రీయంగా, సాంకేతికంగా ఎంతో ముందుకెళ్తున్నవి. మన దేశం అన్ని రంగాలలో వెనుకబడటానికి మన సంస్కృతి కూడా ఒక ప్రధాన కారణంగా వుంది. ఈ సంస్కృతే దేశాభివృద్ధికి, సమాజ పురోగమనానికి, మానవీయ విలువలకు అడ్డంకిగా వుంది. అందుకే కుళ్ళి కంపు కొడుతున్న ఈ బూజుపట్టిన మనువాద సంస్కృతిని పాతరేయాలి. ప్రగశీలభారతీయ సంస్కృతిని కొనసాగించాలి. ప్రత్యామ్నాయ మానవీయ సంస్కృతిని సృష్టించాల్సి వుంది.

గ్రాంసీ చెప్పినట్లు మనుషులందరూ మేధావులే. సంప్రదాయ మేధావత్వాన్ని ఆయన "లోకజ్ఞానం "అన్నారు. సమాజం పురోగమనానికి "విచక్షణాజ్ఞానం" కావాలంటారు.

ప్రస్తుత భారత దేశం 1920-30 నాటి ఇటలీ పరిస్థితులతో పోలి వున్నవి. అప్పటి ఇటలీ పాలకుడు ముస్సోలినికి ప్రస్తుత భారత ప్రధాని మోడీకి చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. ఇద్దరూ బూజు పట్టిన పాత సాంప్రదాయాలను, సంస్కృతిని ఆసరా చేసుకున్న వారే. ఇద్దరు ఎన్నికల ద్వారా ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన వారే. ఆ సంస్కృతి రక్షణ పేరిటనే దోపిడీ, దౌర్జన్యం, అణచివేత, నియంతృత్వం ముస్సోలిని ఇటలీలో సాగించినట్లే మన దేశంలో మోడీ పాలన సాగుతుంది. గ్రాంసీ భాషలో వీరు ఆదారపడ్డది "బాస్టర్డ్ సంస్కృతి" లేదా "బాస్టర్డ్ హెజిమొని". దీనికి వ్యతిరేకంగా "ప్రత్యామ్నాయసంస్కృతి" లేదా "కౌంటర్ హెజిమొని"ను స్థాపించడమే విప్లవకారుల తక్షణ కర్తవ్యం కావాలి. ❑




# ఉపశ్రేణుల్ని విస్తృతం చేసిన గ్రాంసీ

కొప్పర్తి వెంకట రమణమూర్తి

ఆంటోనియో గ్రాంసీ ప్రస్తావించిన సాంకేతిక పదాలలో ఉపశ్రేణులు ప్రత్యేకమైందీ, విస్తారంగా చర్చకు గురైందీ. సాధారణంగా సాంకేతిక పదానికి ఒకే అర్థం లేదా నిర్వచనం ఉంటాయి. అట్లా అయితేనే అది సాంకేతికం అవుతుంది. కానీ సామాజికాంశాల్ని విశ్లేషిస్తూ వచ్చిన గ్రాంసీ వేర్వేరు సందర్భాలలో వేర్వేరు శ్రేణుల్ని ఉపశ్రేణులుగా గుర్తించాడు, ప్రస్తావించాడు. కమ్యూనిస్టు అయిన కారణంగా ఫాసిస్ట్ జైలులో నిర్బంధితుడై మార్క్సిజంను వ్యాఖ్యానించ పూనుకున్న గ్రాంసీ జైలు సెన్సార్‌ను తప్పించుకోవడానికి వర్గానికి ప్రచ్ఛన్న పదంగా దీన్ని ప్రయోగించాడు. కొన్ని సందర్భాల వరకు అది నిజమే అయినా అనేక ఇతర సందర్భాలలో సమాజంలో అణచివేతకు గురైన అన్ని వర్గాలను ఉద్దేశించే ఈ ప్రయోగం చేసినట్టు స్పష్టమౌతుంది. మార్క్సిజం కు philosophy of praxis అనే మారు వేషం వేసిన గ్రాంసీ ప్రొలిటేరియట్ కు లేదా శ్రామిక వర్గానికి కట్టిన బహురూప వేషమే subalterns లేదా ఉపశ్రేణులు.

గ్రాంసీ మార్క్సిజంను చూసిన దృక్కోణం ఉపశ్రేణుల నిర్వచనంలో సూక్ష్మరూపమై కనిపిస్తుంది. మార్క్సిజం ఆచరణలో చూపిన flexibility ఉపశ్రేణుల్లోకి చేర్చుకున్న వర్గాల విస్తృతిలో ప్రతిఫలిస్తుంది. గ్రాంసీ విప్లవంలో అధికారం చేజిక్కించుకునే శ్రామికవర్గంగా ఉపశ్రేణుల్ని ప్రస్తావించినా వారిని కార్మికవర్గానికి పరిమితం చెయ్యలేదు. గ్రాంసీ మార్క్సిజం మీద చేసిన నిర్మాణాత్మకమైన విమర్శ ఇక్కణ్ణుంచే ప్రారంభమౌతుంది. రష్యాలో ఫ్యూడల్ వ్యవస్థ మిగిలి ఉండగానే విప్లవం సంభవించడం, పెట్టుబడి అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లో విప్లవం రాకపోవడం వెనుక రష్యాలో రాజ్యవ్యవస్థ తన సంప్రదాయ అణచివేత సాధనాల్ని ఉపయోగించడం, పశ్చిమ దేశాల్లో వాటితో పాటు పౌరసమాజ అంగీకారం కూడా పొందడాన్ని హెజిమొనీగా గుర్తించిన గ్రాంసీ దాన్ని పడగొట్టడానికి ప్రజలలో నిర్మించవలసిన కౌంటర్ హెజిమొనీ సాధించడానికి కార్మికవర్గం ఒక్కటే సరిపోదనీ అణచివేతకు గురైన రైతులు మొదలుకుని మహిళలు, మైనారిటీలు, సాంస్కృతిక వివక్షకు గురైన ప్రాంతాల, సమూహాలనన్నిటినీ కలుపుకోవాలని సంకల్పించాడు. ఈ వర్గాలనన్నిటినీ కలిపే ఉపశ్రేణులన్నాడు. ఆర్థికం ప్రాతిపదికగా మార్క్స్ చేసిన వర్గ విభజనకు వివిధ రూపాల అణచివేతనూ వివక్షనూ జతచేసి ప్రొలటేరియట్‌ను విస్తృతపరిచాడు.

ఉపశ్రేణుల్ని అర్థం చేసుకోవడంలో గ్రాంసీకి చారిత్రక దృక్పథం ఉంది. ఒకానొక సమాజంలో ఆధిపత్య వర్గాల చేత తమ చరిత్ర సంస్కృతుల నిర్మాణంలో వ్యక్తులుగా, జాతి పౌరులుగా భాగస్వామ్యం నిరాకరింపబడిన వర్గాలను ఉపశ్రేణులంటూ గ్రాంసీ మరో నిర్వచనం ఇచ్చాడు. ఫాసిస్ట్ ముస్సోలిని చేత అతని అనుచరుల చేత ఈ రకమైన వివక్షకు గురిచేయబడిన కార్మికులు, రైతులు ఉపశ్రేణులుగా తొలి దశలో గ్రాంసీ దృష్టిలో ఉన్నారు. ప్రిజన్ నోట్‌బుక్స్‌లో ఉపశ్రేణుల చారిత్రక పరిణామం గురించి ఉపోద్ఘాతం రాస్తూ గ్రాంసీ, ఉపశ్రేణుల నిర్వచనంలోనే అసంఘటిత తత్వం ఉందనీ ఆ రీత్యా అవి సంఘటితమై ఉండవనీ రాజ్యంగా రూపొందేవరకూ అవి సంఘటితం కాజాలవనీ అన్నాడు. అవి పౌరసమాజంతో అంతర్గతంగా ముడిపడి ఉంటాయని తత్ఫలితంగా రాజ్యంతో కూడా అదే స్థితి కలిగి ఉంటాయనీ అన్నాడు. ఉపశ్రేణుల ఈ స్థితినీ, ఇటలీలో వాటి చారిత్రక క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఆరు అంశాల అధ్యయనాన్ని ప్రతిపాదించాడు. మొదటిది ఉత్పత్తి రంగంలో వచ్చే మార్పులు శ్రేణుల నిర్మాణంపై చూపే ప్రభావాన్ని గమనించడం, రెండవది అవి ఆధిపత్య రాజకీయ వర్గాలతో చురుకుగానో లేక సాత్వికంగానో సంకీర్ణమై వారి కార్యక్రమాల్ని ప్రభావితం చెయ్యడం,



మూడవది ఉపశ్రేణులను అణచి ఉంచడానికి కొత్త పార్టీలు ఆధిపత్య వర్గాలు పుట్టుకు రావడం, నాల్గవది పాక్షికంగా నైనా తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఉపశ్రేణులే సమీకరణల్ని రూపొందించడం, ఐదవది పాత సమీకరణల్లో ఉపశ్రేణుల స్వయంప్రతిపత్తిని కాపాడే కొత్త సమీకరణల మీద అవగాహన ఏర్పరచుకోవడం, ఆరవది ఉపశ్రేణుల అంతర్గత స్వయంప్రతిపత్తిని కాపాడే సమీకరణలను అధ్యయనం చెయ్యడం. ఈ నేపథ్యంలో ఉపశ్రేణుల చరిత్ర ఆధిపత్య వర్గాలతో ముడిపడి ఉంటుందన్న గ్రాంసీ దీర్ఘకాలం పట్టినా రాజ్యాధికారం చేజిక్కించు కోవడం ద్వారానే వాటికి శాశ్వత విముక్తి కలుగుతుందని రాశాడు. అందుకు ఆధిపత్య వర్గ సాంస్కృతిక హెజిమొనీ నుంచి ఉపశ్రేణులు బయటపడాలని అకాంక్షించాడు.

రష్యా విప్లవం సంభవించి రెండు నెలలు తిరక్కుండా 1917 డిసెంబర్‌లో రాసిన వ్యాసంలో 'పెట్టుబడి' కి భిన్నంగా రష్యాలో విప్లవం సంభవించడాన్ని గుర్తించాడు గ్రాంసీ. మార్క్సిజంలోని భావ సాంద్రతను స్వీకరించిన బోల్షివిక్‌లు పరిస్థితులు పెట్టుబడి గ్రంథంలో చెప్పినట్టు యాంత్రికంగా జరిగేవరకు ఆగలేదనీ చలనశీలత కలిగిన మనుషులుగా అందివచ్చిన పరిస్థితుల్లో నుంచి విప్లవించారని విశ్లేషించాడు. అంతకు ముందు ప్రపంచ యుద్ధం వల్ల విధ్వంసమైన రష్యాలో ప్రజలు 'భూమి కోసం, శాంతి కోసం' చేసిన నినాదాల్లో మొదటిది గ్రాంసీ దృష్టి నుంచి తప్పించుకో లేదనుకోవాలి. ఇదంతా ఎందుకంటే గ్రాంసీ ఉపశ్రేణుల విభాగంలో కార్మికులతో పాటు రైతాంగానికి పెద్ద చోటు కల్పించాడని చెప్పడానికే. అరెస్టు కావడానికి ముందు 1926లో రాసిన ' దక్షిణాది సమస్య: కొన్ని అంశాలు'. అనే అసంపూర్ణ వ్యాసంలో మొదటిసారి కార్మిక కర్షక సంఘటనను ప్రస్తావించాడు. ఈ వ్యాసంలోనే ఇటలీలోని ఉత్తరాది కార్మిక వర్గానికీ, దక్షిణాది రైతాంగానికి అవసరమైన సయోధ్యను ప్రస్తావించాడు. ఇది వర్గ పరమైన కలయికే కాదు, ప్రాంతీయమైంది కూడా. దక్షిణాది రైతుల్ని అమాయకులుగా, మేదకులుగా పరిగణించిన మేధావుల్ని (సోషలిస్టు మేధావులతో సహా) తీవ్రంగా ఖండించిన గ్రాంసీ ఈ పరిగణన ఎట్లా ప్రాంతీయ వర్గ ఐక్యతకు ప్రతిబంధకంగా మారిందో చెబుతాడు. ఇటువంటి విశాల ప్రాతిపదిక లేకపోవడమే మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఇటలీలో బూర్జువా వర్గాలు అధికారం చేజిక్కించుకోవడానికి కారణమైందంటాడు. ఈ వ్యాసం లోనే గ్రామీణ బూర్జువా వర్గానికి చెందిన మధ్య, క్రింది తరగతి మేధావుల గురించి ప్రస్తావిస్తూ వారిని కూడా ఉపశ్రేణులుగానే వర్గీకరించాడు. తదనంతర కాలంలో ప్రిజన్ నోట్‌బుక్స్‌లో విస్తరించిన సవర్గ మేధావుల భావనకు అంకురార్పణ ఈ సందర్భంగానే జరిగింది.

గ్రాంసీ ఉపశ్రేణుల భావన ఆయన ఆలోచనలన్నిటిలోకి విస్తరించి ఉంది. ఉపశ్రేణుల నుంచే ఆవిర్భవించే సవర్గ మేధావి వర్గం ప్రజల లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చడంలో కీలక పాత్ర వహించాలనీ అందులో సాహిత్య సాంస్కృతిక రంగాలు ముఖ్య భూమిక వహించాలని గ్రాంసీ ఆకాంక్షించాడు. అంతే కాదు, ఉపశ్రేణులకు నాయకత్వం వహించే కార్మిక వర్గం అందరి ఆకాంక్షలకు ప్రాతినిథ్యం వహించాలని నిర్దేశించాడు. పాలక వర్గాల హెజిమొనీకి ప్రత్యామ్నాయంగా రూపొందాల్సిన కౌంటర్ (ప్రజా) హెజిమొనీ నిర్మాణంలో ఉపశ్రేణీ నాయకులు పాలక వర్గం ఇవ్వ జూపే ప్రలోభాలకు గురైతే బాస్టర్డ్ హెజిమొనీ ఏర్పడుతుందని కూడా హెచ్చరించాడు.

గ్రాంసీ సవర్గ మేధావుల భావన గురించి మాట్లాడనిదే ఉపశ్రేణుల చర్చ పూర్తి కాదు. మనుషులందరూ మేధావులే కానీ అందరూ మేధో కర్తృత్వం నెరపలేరు అన్న గ్రాంసీ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడంలో పాలక వర్గాల ఆధిపత్యం నెలకొనడంలో ఆ వర్గానికే చెందిన మేధావులు కారణమైనట్టు ఉపశ్రేణులు నిర్మించాల్సిన కౌంటర్ హెజిమొనీలో వారి నుంచి వచ్చిన మేధావులే ముఖ్య పాత్ర వహించాల్సి ఉంటుందన్నాడు. ఒక నిర్దిష్ట ఉపశ్రేణి నుంచే దానికి చెందిన సవర్గ మేధావులు ఆవిర్భవిస్తారని గ్రాంసీ నిక్కచ్చిగా చెప్పలేదుకానీ వారు ఆ వర్గ తాత్వికతకు విప్లవాత్మకతకు ఎక్కువ అనుకూలంగా ఉంటారనీ, ఆ వర్గ ప్రజల లోకజ్ఞానంతో మౌలిక అనుబంధం కలిగి, ప్రాపంచిక సమస్యలకు సైద్ధాంతిక తాత్వికతకు మధ్య సమన్వయం చెయ్యగలరనీ భావించాడు. తమని తాము ప్రత్యేక వర్గంగా భావించుకునే సంప్రదాయ మేధావి వర్గం నుంచి కొంత మందినైనా సైద్ధాంతికంగా గెలుచుకోవలసిన అవసరం సవర్గ మేధావులకు ఉందనీ, ఎంతగా ఒక ఉపశ్రేణి సవర్గ మేధావులను రూపొందించుకోగలదో అంతగా సంప్రదాయ మేధావులను తనలో కలుపుకోగలదనీ భావించాడు.

గ్రాంసీతో ప్రారంభమైన ఉపశ్రేణుల భావన చరిత్ర అధ్యయనంలోకి ప్రవేశించి అక్కణ్నుంచి అనేక ఇతర సామాజిక శాస్త్రాలకూ, సాహిత్య రంగానికీ విస్తరించి ఒక గ్లోబల్ తాత్వికతగా మారింది. ఉపశ్రేణుల కోణం నుంచి చరిత్ర అధ్యయనాన్ని ప్రారంభించిన సుప్రసిద్ధ చరిత్రకారుడు రంజిత్ గుహ, 1982లో

రాసిన 'వలస భారత దేశ చరిత్ర రచన : కొన్ని అంశాలు' అనే వ్యాసంలో అప్పటి దాకా చరిత్ర రచన శిష్ట వర్గ (elitist) కోణం నుంచే జరిగిందనీ చరిత్ర నిర్మాణంలో రైతులు, గిరిజనులు, స్త్రీల వంటి ఉపశ్రేణులు విస్మరణకు గురయ్యాయనే విమర్శ లేవనెత్తి history from the belowకు అంకురార్పణ చేశాడు. గ్రాంసీ నుంచి ఉపశ్రేణుల భావనను స్వీకరించినట్లు చెబుతూ సబాల్టర్న్ అంటే 'క్రింది తరగతి' అనే ఆక్స్‌ఫర్డ్ నిఘంటు అర్థాన్ని ఉటంకిస్తూ అది వర్గ, కుల, వయో, లింగ, హోదాలన్నిటికీ వర్తిస్తుందనే అర్థం చెప్పాడు. క్రింది తరగతి అనేది పై తరగతితో అనివార్యంగా ముడిపడి ఉన్న అంశమని అంటూ తమ అధ్యయనంలో శిష్టవర్గాన్ని ఆధిపత్య వర్గానికి ప్రత్యామ్నాయంగా పరిగణించామనీ అన్నాడు. శిష్టవర్గంలో వలస పాలకులతో పాటు దేశీయ భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, పెద్ద వ్యాపారస్థులు, ఉన్నతాధికారులు ఉంటారని చెబుతూ ఈ వర్గానికి చెందని వారంతా ఉపశ్రేణులేనని నిర్వచించాడు. ప్రాంతీయ, స్థానిక స్థాయిల్లో గ్రామీణ పెత్తందార్లు, భూములు కోల్పోయిన భూస్వాములు, ధనిక రైతులు మొదలైన వర్గాలు ఉపశ్రేణులే అయినప్పటికీ ఆధిపత్య వర్గాల ప్రయోజనాలు కాపాడడానికి పని చేస్తాయని గుర్తించాడు.

ఈ వ్యాసంతో ప్రారంభమైన దక్షిణాసియా చరిత్ర, సమాజాల ఉపశ్రేణీ అధ్యయనం Subaltern Studies పేర 1982–2005 మధ్య 12 వ్యాస సంపుటులుగా వచ్చింది. ఈ క్రమం ఉపశ్రేణుల్ని ప్రజలకు ప్రత్యామ్నాయంగా మార్చింది. ఉపశ్రేణీ రాజకీయాలు ప్రజా రాజకీయాలయ్యాయి. ప్రజలకు ప్రజలే ప్రతినిధులయ్యారు. తమ చరిత్ర నిర్మాతలు తామేనని వారు గుర్తించారు. తొలి ఆరు సంపుటుల వరకు శిష్ట వర్గానికి భిన్నంగా ఉపశ్రేణుల్ని నిలబెట్టడానికీ , చరిత్రలో వారికి స్వయం ప్రతిపత్తి గల ఆవరణను నిర్మించడానికి కృషి జరిగింది. గాయత్రి స్పివక్ ప్రవేశంతో ఈ అధ్యయనంలో ముఖ్యంగా అట్టడుగు పేద మహిళల పాత్ర చర్చకు వచ్చింది. ఆమె రాసిన Can the subaltern speak ? వ్యాసం సంచలనం సృష్టించింది. అక్కణ్ణుంచి ఈ అధ్యయనం మలుపు తిరిగి, చరిత్రలో ఉపశ్రేణుల పాత్రను పునర్నిర్మించడానికి అవసరమైన ఆధారాలు మిగలలేదని గుర్తింపు వచ్చింది.

శిష్ట వర్గ వాచక (text) మే ఆధారం కాగా వాచకం కప్పుకున్న ముసుగు ను తొలగించి వాస్తవాల్ని గ్రహించాల్సి వచ్చింది. క్రమంగా తొలి దశలో మార్క్స్ గ్రాంసీలు నడిపించిన ఈ ఆలోచనల్ని మలి దశలో ఫుకో వంటి ఉత్తరాధునికులు (post-modern) ప్రభావితం చేశారు. క్రమంగా వలసోత్తరవాద (post-colonial) ప్రభావం పడడంతో ఉపశ్రేణీ– ఆధిపత్య వర్గాల నిర్వచనాలు విస్తృతమయ్యాయి. మొత్తం ఒక జాతి అంతా ఉపశ్రేణి అయి దాన్ని పాలించిన వలసవాదులు శిష్టవర్గంగా భావించబడ్డారు. సాంస్కృతిక మూలాలూ సంప్రదాయమూ ఉపశ్రేణిత్వం కాగా ఆధునికత శిష్టత్వం అయింది. మూడో ప్రపంచ దేశాలు ఉపశ్రేణులుగా యూరప్ అమెరికాలు శిష్టవర్గంగా పరిగణింప బడ్డాయి.

ఉపశ్రేణుల భావన చరిత్ర నుంచి రాజనీతి, మానవ నిర్మాణ, సమాజ శాస్త్రాలకూ, సాహిత్య విమర్శకూ, సంస్కృతీ అధ్యయనాలకు విస్తరించింది. వీటిల్లో సాహిత్య సాంస్కృతిక రంగాలు గ్రాంసీ మూల భావనల్లో చోటు చేసుకున్నాయి. ఉపశ్రేణుల చరిత్ర భవిష్యత్ పాత్రల మీద లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లో విస్తారంగా పరిశోధనలు జరుగుతున్నాయి. 1980ల తర్వాత భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఉపశ్రేణీ చైతన్యం పెరిగింది. అనేక రాజకీయ సమీకరణల్లో వివిధ ఉపశ్రేణుల కలయిక అనివార్యమౌతోంది. మార్క్సిస్ట్ భావజాలం సాంస్కృతిక వివక్ష పట్ల చూపిన ఉపేక్ష వల్ల దూరమైన దళిత చైతన్యం ఆర్థిక అసమత్వ నిర్మూలన అవసరాన్ని గుర్తిస్తోంది. ఇది గ్రాంసీ ఉపశ్రేణుల భావనని సమకాలీనం చేస్తున్నది. ❑


---

❖ **లోకుల జ్ఞానం నిలవనీటి మడుగు లాంటిది కాదు. అది నిరంతర పరిణామ స్రవంతి. మామూలు మనుషులలో వ్యాపించిపోయే శాస్త్రీయ పరిజ్ఞానంతోనూ, తాత్విక చింతనతోనూ ఈ లోకుల జ్ఞానం సుసంపన్నమవుతూ వుంటుంది. తత్వశాస్త్రానికీ, వైజ్ఞానిక శాస్త్రానికీ, అర్థశాస్త్రానికీ - మామూలుగా మనం చెప్పుకునే జానపద విజ్ఞానానికీ మధ్యలో ఉంటుంది ఈ జనాభిప్రాయం. భవిష్యత్ జనాభిప్రాయాన్ని రూపొందించేది లోకుల జ్ఞానమే! నిర్దిష్ట స్థల కాలాల్లో ఏర్పడే మామూలు మనుషుల అభిప్రాయాలకు చట్రం రూపం కల్పిస్తే వచ్చేదే ఈ జనాభిప్రాయం.** *- గ్రాంసీ*

❖ **ప్రతి మనిషీ ఎంతో కొంత మేధావే! కానీ, సమాజంలో మేధావులు నిర్వర్తించాల్సిన విధులనూ కర్తవ్యాలనూ ప్రతి మనిషీ నిర్వర్తించలేడు!** *- గ్రాంసీ*

# ఉపశ్రేణుల ప్రవక్త గ్రాంసీ

'పాతప్రపంచం మరణిస్తూ కొత్తప్రపంచం జనిస్తున్న ఈ సంధి కాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు' అని ఫాసిస్టు, నాజీ పాలకుల్ని ఉద్దేశించి ఆంటోనియో గ్రాంసీ అన్న దాదాపు వంద సంవత్సరాల తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు లేకపోవడం గ్రాంసీని ప్రాసంగికం చేస్తున్నది. 1891లో జన్మించి ముస్సోలిని ఫాసిస్టు ప్రభుత్వంచే నిర్బంధానికి గురై చివరి పదకొండు సంవత్సరాలు జైలులోనే రాపాడి నలభై ఆరు ఏళ్లకే మరణించిన ఈ ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి రూళ్లకర్ర లాంటిదనుకున్న మార్క్సిస్టు సిద్ధాంతానికి వంగే గుణాన్ని ఆపాదించాడు. 1937లో మరణించిన గ్రాంసీ 1960ల తర్వాత, ముఖ్యంగా 1970ల తర్వాత జీవించడం ప్రారంభించి దశాబ్దాలు గడిచేకొద్దీ మరింత పఠనీయమూ, ఆచరణీయమూ అవుతున్నాడు. తీవ్రమైన అనారోగ్యంతో, దారుణ ప్రతికూల పరిస్థితుల మధ్య సాగిన జైలు జీవితంలో ఆయన రాసిన ముప్పైకి పైగా ప్రిజన్ నోట్ బుక్స్ రానున్న కాలానికి విజన్ నోట్ బుక్స్ అయ్యాయి. 'ఈ బుర్రని ఇరవై సంవత్సరాల పాటు పనిచెయ్యకుండా ఆపాలి' అంటూ అన్నే ఏళ్లు జైలుశిక్ష విధించిన ఫాసిస్టు ప్రభుత్వం సూర్యుణ్ణి జైలుగోడల మధ్యకు రాకుండా ఆపగలిగింది కానీ, అతని ఆలోచనల్నీ అనంతరకాలంలో వాటి ప్రసారాన్ని అడ్డుకోలేక పోయింది.




మార్క్సిస్ట్ అయిన కారణంగా జైలుకెళ్లిన గ్రాంసీ మార్క్స్ ఆలోచనల మీద మౌలిక ప్రశ్నలు లేవనెత్తాడు. ప్రాథమిక సూత్రాలు కొన్నింటిని దిద్దడానికి ప్రయత్నించాడు. ఆ కారణంగానే మార్క్సిస్ట్ నియతివాదాన్ని వ్యతిరేకించి మార్క్సిస్టులు కానివారు సైతం అధ్యయనం చేయవలసిన వాడయ్యాడు. గ్రాంసీ రాజకీయ సామాజిక అంశాల మీద చేసిన కొత్త ఆలోచనలు ఇరవయ్యొకటో శతాబ్దపు మనుగడకు సూచికలయ్యాయి. గ్రాంసీని చదివి కొందరూ చదవకనే కొందరు అనుసరించడం దాదాపు తొమ్మిది దశాబ్దాల తర్వాత కూడా నిలబడిన అతని సిద్ధాంతాలలోని సమకాలీనతకు నిదర్శనం. మార్క్సిజానికి కొనసాగింపుగా గ్రాంసీ చేసిన ప్రతిపాదనలు ప్రపంచానికి కొత్తదారి చూపించాయి.

ఆర్థికసంబంధాలు పునాదిగా రాజకీయ సామాజిక మత సాంస్కృతిక సంబంధాలు నిర్మితమౌతాయనే రెండంచెల మార్క్సిస్ట్ దృక్పథంలో పౌరసమాజం అనే మధ్య అంచె ఉండడాన్ని గుర్తించాడు గ్రాంసీ. అది రాజ్య, న్యాయ, రక్షక వ్యవస్థల్లో భాగం కాని విభాగం. ఆర్థికసంబంధాలు మాత్రమే సామాజిక సాంస్కృతిక సంబంధాలని నిర్ధారించవనీ వాటి మధ్య ఆదానప్రదానాలుంటాయనీ అనడంతో గ్రాంసీకి కొత్తదారులు తెరుచుకున్నాయి. సమకాలీన సమాజంలో విరివిగా వాడబడుతూ చర్చకు గురౌతున్న 'సాంస్కృతిక ఆధిపత్యం' (కల్చరల్ హెజిమొని) భావన ఆంటోనియో గ్రాంసీతో ముడిపడి వుంది. ఇటలీలో ఫాసిజం ఆవిర్భావం వెనుక పని చేసిన రోమన్ సాంస్కృతిక పునరుజ్జీవన భావజాలం గ్రాంసీని ఆలోచింప చేసింది. ఫాసిజం పేరిట ప్రగాఢ జాతీయభావం ఏర్పడడంలో ముస్సోలిని ప్రేరేపించిన రోమన్ సంస్కృతీ ఔన్నత్యం నిర్వహించిన పాత్ర గమనంలోకి వచ్చింది. అట్లాగే మొదటి ప్రపంచయుద్ధం తర్వాత ఇటలీలో ఏర్పడ్డ ఆర్థికమాంద్యం, రాజకీయ అస్థిరత, శ్రామికోద్యమాల వైఫల్యం నేపథ్యంలోంచి సాంస్కృతిక ఆధిపత్యం నిర్వహించగలుగుతున్న పాత్రను ఆయన అంచనా వేశాడు. ఆధిపత్యవర్గాలు ఆధిపత్య భావజాలాన్ని రాజకీయరంగంలో బలప్రయోగంతో సాధించగలిగితే సాంస్కృతిక రంగంలో పౌరసమాజం అంగీకారంతో సాధించగలుగుతాయని సూత్రీకరించాడు. ప్రభుత్వవర్గాల సాంస్కృతిక భావజాలమే విధాయకమనీ, అనుసరణీయమనీ, అదే తమ భావజాలం కూడా అని పౌరసమాజం చేత కూడా ఆమోదింపచెయ్యడాన్ని కల్చరల్

హెజిమొనిగా నిర్వచించాడు. ఫాసిస్టు ప్రభుత్వాలే కాదు సోషలిస్టు వ్యవస్థలో శ్రామికవర్గాలు కూడ తమ సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలగాలని సూచించాడు గ్రాంసీ. ఈ క్రమంలో కలుపుకు వెళ్లవలసిన సామాజిక ఉపశ్రేణుల్ని ప్రస్తావిస్తూ వారిని మొదటిసారిగా సబాల్టర్న్ వర్గాలుగా పేర్కొన్నాడు. ఈ వర్గాల ఐక్యత రాజ్యాధికార స్థాపనను సుగమం చేస్తుందని సూచించాడు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ సమాజంలోని ఒకానొక ప్రాథమికవర్గం ఇతర సామాజిక ఉప శ్రేణుల్ని సమీకరించడం ద్వారా సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పవచ్చుననీ, ఈ క్రమంలో వారి భాష, సంగీతసాహిత్యాలూ, కళలూ, జానపద సంప్రదాయాలూ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయనీ అన్నాడు.

గ్రాంసీ మేధావుల్ని రెండు రకాలుగా వర్గీకరించాడు. ఇతరుల్ని సంప్రదాయ మేధావులుగా పేర్కొన్న గ్రాంసీ ఆయా వర్గాల నుంచీ ఉపశ్రేణుల్నించీ రూపొందే మేధావుల్ని సవర్గ మేధావులని (ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) అన్నాడు. గ్రాంసీ అభిప్రాయంలో రాజకీయ కార్యకర్తలు, నిర్వాహకులు, ఉద్యమ నాయకులు కూడా మేధావులే. భౌతిక, బౌద్ధిక కార్యకలాపాల పట్ల గ్రాంసీ తేడా చూపలేదు. ఏ భౌతిక కార్యకలాపమైనా ఎంతో కొంత బుద్ధిని ఉపయోగించకుండా ఎట్లా సాధ్యపడదో దేన్నైనా అధ్యయనం ద్వారా గ్రహించడానికి కొంతైనా శారీరకశ్రమను వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తించాడు. ఉద్యమాన్ని యుద్ధంగా భావిస్తూ యుద్ధవిన్యాసం, యుద్ధవ్యూహం అనే రెండు తంత్రాలను ప్రతిపాదించాడు గ్రాంసీ. శత్రువును సరాసరి ఎదుర్కోవడం యుద్ధ విన్యాసమైతే, ఇతరవర్గాలతో స్నేహ సంబంధాలు, పౌరసమాజ అంగీకారం పొందడం వంటివి యుద్ధవ్యూహంలో భాగాలు.

అనేక వైరుధ్యాలుండే లోకజ్ఞానం లేదా కామన్ సెన్స్ గురించి కూడా గ్రాంసీ రాస్తాడు. అనేక ప్రాపంచిక దృక్పథాలు ఉన్నాయనీ అవి పరస్పర విరుద్ధ తత్వాలతో అసంపూర్ణ పూర్ణత్వాన్ని కలిగి వుంటాయనీ దాన్నే లోకజ్ఞానం అంటారనీ అన్నాడు. అసమానత్వం, అణచివేత వంటివి సహజమైనవీ, మార్చ వీలు లేనివీ అనే భావనలు ఈ కామన్‌సెన్స్ నుంచే వస్తాయంటాడు. అయితే దీనిని విలోమచైతన్యంగానో వ్యతిరేకచైతన్యంగానో భావించడానికి వీల్లేదని అంటూ అందులో కొంత సత్యమూ ఉండకపోదంటాడు.

అనేక సందర్భాలలో జైలు అధికారుల సెన్సార్ నుంచి తప్పించుకోవడం కోసం మార్క్సిజంకు ఆచరణీయసూత్రాల తత్వం (ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్) గా మారుపేరు పెట్టిన గ్రాంసీ దానిని ఒక నైరూప్య తాత్వికతగా భావించలేదు. అది ప్రజల స్థితిగతులు తాము అనుభవిస్తున్నంత సహజంగా వారి చైతన్యంలోకి కామన్ సెన్స్‌లోకి ఇంకిపోయేటట్లు చెయ్యగలిగేదిగా చూశాడు. ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్ అంటే గ్రాంసీకి సమాజంలోని వైరుధ్యాలను గుర్తించే శాస్త్రమే కాదు, ఆ వైరుధ్యాల మీద అనుభవపూర్వక అవగాహన కూడా ఉండడం. అది అతనికి తాము జీవిస్తున్న కాలపు స్వీయ చారిత్రక అవగాహన.

గ్రాంసీ 1937లో చనిపోయినా ఫాసిస్టు ప్రభుత్వ పతనం తర్వాత 1945 నుంచే అతని రచనలు వెలుగు చూడడం ప్రారంభమైంది. 1971 వరకు వాటి ఇంగ్లీషు అనువాదమే వెలువడలేదు 1980కి ఇటలీలో అతని సర్వలభ్య రచనల సంకలనం వచ్చింది. ఈ లోగా రష్యా లోనూ, తూర్పు యూరప్ లోనూ సోషలిస్ట్ వ్యవస్థల పతనం ప్రారంభమైంది. మార్క్సిస్ట్ సిద్ధాంతం ఆచరణ మీద నీడలు వ్యాపించాయి. కొత్త సామాజిక సమీకరణాలు రూపొందడం ఆరంభమైంది. ఈ నేపథ్యంలో గ్రాంసీ రచనల అధ్యయనం పెరిగింది. 1980 లకు ముందూ వెనుకా లెవనెత్తబడిన కొన్ని ప్రశ్నలకి గ్రాంసీలో సమాధానాలు దొరికాయి.

ఆర్థిక సంబంధాల పునాది మీద మాత్రమే రాజకీయ సామాజిక వ్యవస్థలు నిర్మితం కావనీ అవి పరస్పర ఆధారితాలనీ, ఆర్థిక సంబంధాలు రాజకీయ సామాజిక సంబంధాలను ఒకవైపు రూపొందిస్తూ మరొవైపు నిర్వహిస్తే, రాజకీయ సామాజిక సంబంధాలు ఒకవైపు ఆర్థిక సంబంధాలను రూపొందిస్తూ మరో వైపున నిర్వహిస్తాయన్న గ్రాంసీ చాలామందికి ఆమోదయోగ్యుడయ్యాడు. మతం ఆర్థికం మొదలైన అంశాల మీద ఆర్థికం ప్రభావం ప్రశ్నార్థకమైంది. గ్రాంసీ ప్రతిపాదించిన సాంస్కృతిక ఆధిపత్యం భారతదేశంలో వేర్వేరు కోణాల్లో చర్చకు వచ్చింది. బూర్జువా ప్రభుత్వం తన భావజాలాన్నే ప్రజల భావజాలంగా అంగీకరింపచెయ్యడంలో విజయం సాధిస్తుందనీ దానికి ప్రత్యామ్నాయంగా శ్రామికవర్గాలు ఇతర సామాజికవర్గాలను కలుపుకుని తానే సాంస్కృతిక ఆధిపత్యం నెలకొల్పాలనే గ్రాంసీ భావనకు ప్రచారం వచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మెజారిటీ ప్రజల మత పార్టీ అయినందున అది సాంస్కృతిక ఆధిపత్యం సునాయాసంగా సాధించ గలిగింది. గ్రాంసీ ప్రతిపాదించినట్టుగానే రాజకీయ ఆధిపత్యం వెనుక సాంస్కృతిక

ఆధిపత్యం దన్నుగా నిలబడింది. ఈ నేపథ్యంలో దేశవ్యాపితంగా విస్తరిస్తున్న లౌకికోద్యమాలు గ్రాంసీని సజీవుణ్ణి చేస్తున్నాయి.

గ్రాంసీ ప్రయోగించిన వాటిల్లో ప్రపంచం మీద, భారతదేశం మీద విస్తారమైన ప్రభావం చూపిన పదం ఆయనే మొదటిసారి ఉపయోగించిన ఉపశ్రేణులు (సబాల్టర్న్). సబాల్టర్న్ గ్రూప్స్ అనీ, సబాల్టర్న్ క్లాసెస్ అనీ గ్రాంసీ ఉపయోగించిన మాటలు జైలు సెన్సార్‌ను తప్పించుకునేందుకు ప్రోలెటేరియెట్‌కు ప్రత్యామ్నాయంగా వాడాడని భావించినప్పటికీ అనేక సందర్భాలలో అది శ్రామికవర్గం ఇతర ఉపశ్రేణులతో కలవడం గురించిన సందర్భమే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రోలెటేరియెట్‌లోని ఆర్థికకోణాన్ని సబాల్టర్న్‌లోని సామాజిక సాంస్కృతిక కోణంలోకి కొనసాగించడమే గ్రాంసీ తెచ్చిన విప్లవం. ఇది అంతర్జాతీయస్థాయిలో రణజిత్ గుహ వంటి చరిత్రకారుల సారధ్యంలో ఆదివాసీల స్త్రీల రైతుల దృష్టి నుంచి చరిత్రను పునర్నిర్మించడానికి దారితీస్తే దేశీయంగా స్థానికంగా అనేక అస్తిత్వ ఉద్యమాలు ఆవిర్భవించడానికి కారణమైంది.

ఆర్థిక తారతమ్యం ప్రాతిపదికగా ఏర్పడిన శ్రామికవర్గం నుంచి సాంస్కృతిక వివక్షకు గురైన వర్గాలు విడిపోవడం గ్రాంసీ అవసరాన్ని ముందుకు తెస్తున్నది. ఉన్నవాళ్లు లేనివాళ్లూ అనే అడ్డుకోత విభజన నుంచి అగ్రవర్ణాలూ నిమ్నవర్ణాలూ, స్త్రీలూ పౌరుషులూ అనే నిలువుకోత విభజన జరుగుతున్నప్పుడు ఈ రెండు రకాల విభజనలో ఎక్కువగా ఉన్నది శ్రామికవర్గాలు. కార్మికకర్షక వర్గంలో అధికంగా ఉన్నది దళిత బహుజనులైతే, దాదాపు దళిత బహుజనులంతా శ్రామిక వర్గమే. కులం, వర్గం అనేవి రెండు వేర్వేరు సమస్యలైనా ఎదుర్కొంటున్న శ్రేణి ఒక్కటేనని గుర్తించడంలో గ్రాంసీ వర్తింపు ఉంది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా అగ్రవర్ణస్వామ్యంగా కొనసాగుతున్న పరిస్థితి నుంచి మారడానికి కావలసిన పరిస్థితుల్లో ఉపశ్రేణుల మధ్య ఏర్పడవలసిన సంఘీభావం గ్రాంసీ ప్రస్తావించిన యుద్ధవ్యూహ స్థితికి సరిపోలుతుంది. దేశజనాభాలో అరవై ఆరు శాతం ఉన్న ఈ శ్రేణులు ప్రధాన శ్రేణులుగా రూపొందడానికి రాజ్యాధికార సాధనే లక్ష్యమని గుర్తించడంలోనూ గ్రాంసీ ఉంటాడు. ఐదువేల సంవత్సరాల నాగరిక చరిత్రలోనే కాదు, ఏడు దశాబ్దాల గణతంత్రంలోనూ ఈ వర్గాలకు రాజ్యాధికారం అందని ద్రాక్షే అయ్యింది. అందలేదు కదా అని ద్రాక్ష పుల్లనిదని సరిపెట్టుకునే కాల్పనికతకు కాలం చెల్లిందను కోవడంలో గ్రాంసీ ఉంటాడు. అధికారం క్రమేపీ క్రిందివర్గాలకి అందడమే చరిత్రగమన లక్షణమని గుర్తిస్తే ప్రాచీనయుగంలో రాచరికవర్గానికీ, మధ్యయుగంలో భూస్వాములకూ, ఆధునిక యుగారంభంలో ఉన్నత మధ్య తరగతికీ అందివచ్చిన అధికారం ఇప్పుడు దళిత బహుజన శ్రామిక వర్గాలకు దక్కవలసి ఉందనుకోవడంలో గ్రాంసీ అస్తిత్వం ఉంటుంది.

ఈ నేపథ్యంలో చూసినపుడు గ్రాంసీ– అంబేద్కర్‌ల మధ్య ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఇద్దరూ 1891 లోనే జన్మించారు. ఇద్దరూ తమ వర్గం చైతన్యీకరింపబడడంలోనే ఆ వర్గం భవిష్యత్తు ఉందని గుర్తించారు. ఇద్దరూ రాజ్యాధికార స్థాపన వెనుక సాంస్కృతిక ఆధిపత్యస్థాపనలో తమతమ వర్గాలు నాయకత్వం వహించాలని కాంక్షించారు సైద్ధాంతికంగా సవర్గ మేథావుల గురించి గ్రాంసీ రాస్తున్నపుడే అంబేద్కర్ అందుకు గొప్ప ఉదాహరణగా ఆవిర్భవించడం వారిద్దరి మధ్య బలీయమైన బంధాన్ని సృష్టిస్తోంది. వారి తులనాత్మక అధ్యయన అవసరాన్ని సూచిస్తోంది.

గ్రాంసీ గతం కాదు. అతను ప్రస్తుతం. బీమాకోరేగావ్ కేసులో వరవరరావు, తెల్తుంబ్డే తదితరుల్ని నిర్బంధంలోకి తీసుకోవడం ఫాసిస్టు నియంత ముస్సోలిని మీద హత్యాప్రయత్న నేరారోపణ మీద గ్రాంసీని నిర్బంధంలోకి తీసుకోవడాన్ని గుర్తుకు తెస్తున్నది. అందుకే గ్రాంసీ అన్న ఈ వ్యాస ప్రారంభ వాక్యాల్నే ఇక్కడ పునరుల్లేఖించవలసి వస్తున్నది.

'పాతప్రపంచం మరణిస్తూ కొత్త ప్రపంచం జనిస్తున్న ఈ సంధికాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు.' ❑

**కొప్పర్తి వెంకట రమణమూర్తి**

**2020 జూలై 25న ప్రచురితమైన వ్యాసం– *ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...***

---

❖ **సంస్కారం అంటే ఏమిటని ఎవరయినా నన్నడిగితే నేనీ నిర్వచనం చెప్తాను. ఆలోచనలను లోతుగా - మథించడం; ప్రాథమికమయిన భావనలను తెలుసుకునివుండడం; ఏ విషయాన్ని ఆలోచిస్తున్నప్పటికీ, కార్యకారణ సంబంధాలను ముడిపెట్టి ఆలోచించగలిగే అలవాటు అభ్యాసం చేసుకోవడం; ఏ కార్యాచరణలో ఉన్నప్పటికీ చక్కగా కర్తవ్యాన్ని నిర్వర్తించడమే సంస్కారం కలిగి వుండడం అంటాన్నేను!**


*- గ్రాంసీ*



# విప్లవోద్యమానికి గ్రాంసీ విలువైన బోధనలు

**మర్ల విజయ కుమార్**

ఆంటోనియో గ్రామ్సీ 1914లో ఇటలీ సోషలిస్టు పార్టీలో చేరి, ఆ పార్టీ పత్రిక 'అవంతీ!' (ముందడుగు) కు వ్యాసాలు వ్రాస్తుండేవాడు. సోషలిస్టు పార్టీలోని తన సహచరులు, వామపక్షీయులైన, అమాడియో బోర్డిగా, పాల్మిరో టొగ్లియాట్టీ వంటి కామ్రేడ్ల సాహచర్యంలో మార్క్సిస్టు భావజాలాన్ని ఆంటోనియో గ్రామ్సీ అలవర్చుకున్నాడు. తన వామపక్ష సహచరులతో కలిసి, ఇటలీలో కమ్యూనిస్టు పార్టీని 1921లో స్థాపించారు. "లా ఆర్డైన్ న్యూవో" (నవ యుగం) పేరున ఒక పత్రికను స్థాపించి, మార్క్సిస్టు సిద్ధాంతం, దాని ఆచరణపై ఆయన అనేక వ్యాసాలు వ్రాశారు. రానురాను కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్ట పెరిగింది. బలమైన ట్రేడ్ యూనియన్లు ఏర్పడ్డాయి. 1922 నాటికి ఇటలీలోని అనేక నగరాలలో కార్మికులు సంఘటిత శక్తిగా సమ్మెలు చేశారు. ఫ్యాక్టరీలను ఆక్రమించుకుని, కార్మిక సోవియట్లను ఏర్పరిచారు. మొదటి ప్రపంచ యుద్ధం అంతం అయిన తరువాత ఇటలీ, యూరప్‌లోని మిగతా దేశాలవలెనే తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నది. అట్టి పరిస్థితులలో, ఇటలీలో ఫాసిస్టు శక్తులు విజృంభించాయి. ఇటలీ దేశభక్తి ముసుగులో, ప్రజలలో ఉన్న తీవ్ర అసంతృప్తిని వినియోగించుకుని బెనిటో ముస్సోలినీ నాయకత్వాన ఫాసిస్టులు 1922లో అధికారాన్ని చేజిక్కించుకున్నారు. బ్లేక్ షర్ట్స్ (నల్ల చొక్కాలు) పేరున సాయుధ దళాలను తయారుచేసి, క్రమ శిక్షణ, దేశభక్తి పేరున యువతను తమ వైపు ఆకర్షించుకుని, ఇతర రాజకీయ పక్షాలపై వారు దాడులకు పూనుకున్నారు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కు ఇటలీ నుండి ప్రతినిధిగా ఎన్నుకోబడి, గ్రామ్సీ మాస్కోలో రెండు ఏళ్ళు పనిచేశారు. ప్రపంచ వ్యాప్తంగా అన్నిదేశాలలో ఒకే విధంగా కార్మిక, కర్షక విప్లవాలు జరగవనీ, ప్రతిదేశ ప్రత్యేక చారిత్రిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను అనుసరించి ఆయా దేశాలలో విప్లవ ఉద్యమం రూపుదిద్దుకుంటుందనీ గ్రాంసీ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశాలలో వాదించారు. ఆయనకు లెనిన్ మద్దతు లభించింది. "రష్యాలో జరిగిన పద్ధతిలో తమ దేశంలో కూడా విప్లవం సంభవిస్తుందనే భ్రమలో ఎవరైనా ఉంటే, వారు తమ జీవితకాలంలో ఆ విప్లవాన్ని చూడలేరు" అని ఆ సందర్భంలోనే లెనిన్ వ్యాఖ్యానించారు. 1923లో ఇటలీకి తిరిగి వచ్చిన గ్రామ్సి, ఫాసిస్టులు అధికారాన్ని చేపడుతుంటే, కమ్యూనిస్టులు నిరోధించలేకపోవటానికి కారణాలను విశదీకరించారు. కార్మిక వర్గం తమ వర్గ ప్రయోజనాలను విస్మరించి, వర్గశత్రువులైన ఫాసిస్టులకు, వారికి కొమ్ముగాసే బడాపెట్టుబడిదారీ వర్గానికి ఏ కారణంచేత మద్దతు ఇచ్చి, వారికి అధికారాన్ని కట్టబెట్టారు అనే విషయాన్ని ఆయన వివరించారు. కమ్యూనిస్టు పార్టీ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ఐక్య సంఘటన ఏర్పాటు చెయ్యటంలో విఫలమవటానికి, ఒక ప్రక్కన కొందరి అతివాద ఒంటెత్తు పోకడలు, మరొక ప్రక్కన ఆర్థిక పోరాటాలకే పరిమితమై పోయిన కొందరి మితవాదపోకడలు కారణాలని వాదించారు. అట్లానే కార్మిక, కర్షక వర్గాల విశ్వాసాన్ని నిలబెట్టుకోవటంలో కమ్యూనిస్టులు సరైన విధానాలతో వర్గచైతన్యాన్ని ఆ వర్గాలలో పెంపొందించకుండా, కేవలం ఆర్థిక పోరాటాలను వారికి అలవాటు చెయ్యటం కారణమని వివరించారు. 1923లో కమ్యూనిస్టు పార్టీ పత్రిక "లా యూనిటా" ను ప్రారంభించారు. 1924లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. అదే సంవత్సరం, పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన గ్రామ్సి పార్లమెంటులో 1926లో ఒక చారిత్రాత్మకమైన ప్రసంగంలో కమ్యూనిస్టు పార్టీ ఫాసిజాన్ని ఎందుకు వ్యతిరేకిస్తుందో, ఫాసిజం వలన, ఇటలీ ప్రజలకు, మొత్తంగా ప్రపంచానికి ఏవిధమైన ప్రమాదం జరగబోతోందో వివరించారు. ఫాసిస్టు నియంత ముస్సోలినీ తన



అధికారాన్ని పదిలపరచుకొని, ఇక రాజకీయ పార్టీలపై నిషేధాన్ని, ముఖ్యంగా కమ్యూనిస్టులపై అణచివేతను ప్రారంభించాడు. కమ్యూనిస్టులు అత్యంత ప్రమాదకర పరిస్థితులలో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. గ్రామ్చిని అరెస్టు చేసి, 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ్చికి జైలులో ఏ విధమైన వైద్య సహాయం అందకుండా ఫాసిస్టు అధికారులు నిరోధించారు. ఆయన కుటుంబసభ్యులు రహస్యంగా అందజేసిన మందులతో ఆయన తన ప్రాణాన్ని నిలబెట్టుకున్నారు. 1929లో ఆయనకు ఉత్తరాలు వ్రాయటానికి, సెన్సారు అయిన పుస్తకాలు చదవటానికి అనుమతి లభించింది. ఏవిధమైన మార్క్సిస్టు సాహిత్యం ఆయన వద్దకు చేరకుండా చేశారు.

'జైలు నోటు పుస్తకాల' పేరున 3000 పేజీల రచనలను ఆయన వ్రాసి, రహస్యంగా బయటకు అందజేశారు. ఆయన మార్క్సిస్టు సిద్ధాంతంలో ఒక కొత్త ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా నూతన పారిశ్రామిక యుగంలో పెట్టుబడిదారీవర్గం తమ అధికారాన్ని ఏవిధంగా నిలబెట్టుకుంటుందో, ప్రజలపై తమ భావజాలాన్ని ఏ విధంగా రుద్ది, ప్రజలు ఏ విధంగా పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని విమర్శనారహితంగా అంగీకరించేటట్లు చేయగలుగుతారో వివరించారు. ఉపరితలంలో ఉన్న పౌర సమాజంలో పెట్టుబడిదారీవర్గం యొక్క భావజాలం న్యాయసమ్మతమైనదిగా ప్రజలు భావించేటట్లుగా చేయటానికి, ఏ విధంగా న్యాయ, విద్యా వ్యవస్థలను, మతాన్ని, సంస్కృతిని వాడుకుంటారో ఆయన రచనలలో వివరించబడింది. ప్రచార సాధనాలలో అబద్ధాలను నిజాలుగా చూపించి, ప్రజల ఆలోచనా విధానాన్ని నియంత్రించే పద్ధతిని ఆయన విశదీకరించారు. దీనినే ఆయన 'మానసిక ఆధిపత్యం' (ఇంగ్లీషులో 'హెగెమొనీ') గా పిలిచారు. అంతకు ముందు మార్క్స్, లెనిన్, రోజా లక్జంబర్గ్లు ఈ మానసిక ఆధిపత్యాన్ని వివరించినా, దీనికి ఒక శాస్త్రీయ రూపాన్ని ఇచ్చినది గ్రామ్చినే. ఈ మానసిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ, అధికారాన్ని చెలాయించటానికి పౌర సమాజంలో వీలయినంత వరకూ హింసారహితంగా పెట్టుబడిదారీ వర్గం ప్రజలను ప్రభావితం చేస్తుందనీ, అవసరమైనప్పుడు మాత్రం రాజ్యాధికారం యొక్క బలాన్ని ఉపయోగించటానికి వెనుకాడదనీ ఆయన సిద్ధాంతీకరించారు. ప్రతీ యుగంలోనూ, అధికార వర్గం యొక్క ఆలోచనా విధానమే ప్రజల మనసులను కూడా ఏలుతూ ఉంటుందని మార్క్స్ వివరించారు. నేటి ప్రసార మాధ్యమాలలో కుప్పలుతెప్పలుగా పాలకవర్గాన్నీ, వారి విధానాలను పొగుడుతూ, వారుచేసే ప్రతిచర్యను సమర్ధించుతూ, ప్రజల మనసులలో, ఇంతకు మించి వేరే ఆలోచనా విధానానికి తావులేదనీ, ఇప్పటి వరకూ ఈ భూప్రపంచంపై ఉద్భవించిన అన్ని ఆర్థిక వ్యవస్థలలో, పెట్టుబడిదారీ విధానమే ఉన్నతమైనదనే భావనాస్రవంతిని, ప్రజల మనసులలో పెంచి పోషిస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజలకు నిత్యం ఎదురయ్యే అధిక ధరలు, అందుబాటులో లేని విద్య, వైద్యం, రవాణా సదుపాయాలు, యువతలో తీవ్రంగా ఉన్న నిరుద్యోగం తదితర సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించటానికి, మతాన్ని, కుల మత విద్వేషాల్ని, ప్రాంతీయ దురభిమానాన్ని, కుహనాదేశభక్తిని ఆయుధాలుగా ఉపయోగించుకుని, ప్రజలలో ప్రబలే అసంతృప్తిని తెలివిగా సమాజంలోని మైనారిటీ వర్గం వారిపైన, లేదా బలహీన వర్గాల వారిపైన ఆగ్రహావేశాలను రేపి, ప్రజల మధ్యన విభేదాలను తమ రాజకీయ అవసరాలకు వాడుకుంటారు. విద్యావ్యవస్థను ఉపయోగించుకుని పిల్లలమనసులలో ఈ వ్యవస్థ అజరామరమైనది, దీనిని ఎదిరించటం అసాధ్యం అనే భావనను కలగజేస్తారు. ఇక ఎవరైనా నోరు విప్పితే, పోలీసు బలగం, కోర్టులు ఉండనే ఉన్నాయి. ప్రజలలో తిరుగుబాటు తత్వం అనేది తలెత్తకుండా ఈ రాజ్యాంగ, పాలనా వ్యవస్థలకు తోడుగా మత గురువులు కూడా ఉపయోగపడుతారు. కార్మిక వర్గం ఈ పెట్టుబడిదారీవర్గం చెలాయించే మానసిక ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా తమదైన మానసిక ఆధిపత్యాన్ని ప్రజల మనసులలో ఏర్పరచటానికి కృషి చెయ్యాలనీ, పెట్టుబడిదారీ వ్యవస్థ పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను, పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలను అంతం చేయటానికి చేసే అంతిమ పోరాటం (వార్ ఒఫ్ మేనివర్) తో బాటుగా, ఉపరితలంలో పౌర సమాజం లోనూ, ప్రచార సాధనాలలోనూ, సాంస్కృతిక పునరుజ్జీవనం లోనూ, అనేక తత్కాల పోరాటాలను (వార్ ఆఫ్ పొసిషన్) సమాంతరంగా చెయ్యవల్సి ఉంటుందనీ ఆయన చెప్పారు. దీని కోసం కార్మిక వర్గం ఒక చారిత్రిక సంఘటనను ఏర్పాటు చేయాలని, అందులో కార్మిక వర్గంతో బాటుగా, రైతాంగం, ఉద్యోగులు, సైనికులు ఆదిగా దోపిడీకి గురయ్యే అన్ని వర్గాలను తమతో బాటుగా కలుపుకుని ముందుకు సాగాలని ఆయన విశదీకరించారు.

శ్రామిక వర్గం, సమాజంలోని ఇతర పీడిత, తాడిత వర్గాలను తమతో కలుపుకుని ఒక ఐక్య శక్తిగా ముందుకు సాగి, పెద్దఎత్తున పోరాటాలను సలిపే సామర్థ్యం సంపాదించుకోవాలని ఆయన ఉద్దేశ్యం. ట్రేడ్ యూనియన్లు, రైతు, కూలీ సంఘాలు, దళిత హక్కుల కోసం, వారి ఆర్థిక ఉన్నతి కోసం పోరాడే సంఘాలు, తమ పోరాటాన్ని ఆర్థికపరమైన పోరాటాలకే పరిమితం చెయ్యకుండా, సామాజిక, రాజకీయ సమస్యలపైన సమాంతరంగా పోరాటం చెయ్యటం ద్వారానే ఈ విస్తృత ఐక్య వేదికకు రూపం ఇవ్వగలుగుతారు. ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఈ విషయమై ప్రత్యేక వివరణను ఇచ్చారు. పునాది సంబంధాలైన ఉత్పత్తి సంబంధాలు, ఆస్తి సంబంధాలను మార్చటానికి జరిగే దీర్ఘకాలిక విప్లవ పోరాటానికి తోడుగా, ఉపరితల సంబంధాలైన ఆర్థిక పోరాటాలు, సామాజిక, రాజకీయ సమస్యలపైన పోరాటాలూ సమాంతరంగా జరగాలని, ఏ ఒక్కదానికీ ప్రాధాన్యతనిచ్చి, రెండవదానిని అశ్రద్ధ చేయటం జరిగినా, విప్లవపోరాటాలు వెనకడుగు వేస్తాయని చెప్పారు. ఈ విషయాన్నే గ్రాంప్చి వివరిస్తూ, తత్కాల పోరాటాలైన ఉపరితలంలోని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో జరిపే పోరాటాలు, పునాది సంబంధాలలో విప్లవాత్మక మార్పుకోసం జరిగే, అంతిమ పోరుకు, తోడుగా జరగాలని నొక్కి చెప్పారు.

మెజారిటీ ప్రజల మనసులలో, దోపిడీ వర్గ మానసిక ఆధిపత్యానికి ప్రతిగా, కార్మిక, కర్షక ఐక్య సంఘటన తమదైన మానసిక ఆధిపత్యాన్ని స్థాపించనిదే, వారు అధికారాన్ని చేజిక్కించుకోవటం సాధ్యం కాదని గ్రాంప్చి ప్రత్యేకంగా చెప్పారు. లెనిన్ కూడా ఈ విషయమై, విప్లవదశ ఎప్పుడు ఏర్పడుతుందీ అనే దానికి, "పాత వ్యవస్థ ఇక అనవసరమని, దానిని విసర్జించాలని అధికశాతం ప్రజలు నమ్మినప్పుడు, ఇక అధికారాన్ని చేజిక్కించుకోవటానికి ఇంతకు మించిన అనువైన సమయం మరొకటి లేదని విప్లవ శక్తులు భావించినప్పుడు మాత్రమే విప్లవ అంతిమ పోరాటం సాధ్యపడుతుందని" వివరించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పని చేసేటప్పుడు, ప్రజాస్వామ్య పద్ధతులలో అధికారాన్ని చేజిక్కించు కోవాలన్నా, ఇదే సూత్రం వర్తిస్తుంది. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, విప్లవకర పార్టీ అధికారాన్ని చేజిక్కించుకున్నంత మాత్రాన దోపిడీ అంతం అయిపోయి, సోషలిజం అవతరించదు. సమాజంలో పెట్టుబడి ఆర్థిక సంబంధాలు కొనసాగుతూన్నంత కాలం, దోపిడీ ఉంటూనే ఉంటుంది. మావో చెప్పినట్లుగా, కమ్యూనిస్టు పార్టీ అధికారం పొందిన తరువాత, అడుగడుగునా, దోపిడీ శక్తులతో, పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాల నిర్మూలనకై దీర్ఘకాలిక పోరాటం సలపవలసి ఉన్నది. ఇక సామాజిక విప్లవం పూర్తి కావటానికి ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చును.

సామాజిక విప్లవం అంటే, ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సంబంధాలలో పాత దోపిడీ వ్యవస్థ యొక్క లక్షణాల స్థానంలో కొత్త సోషలిస్టు విలువలను ఏర్పాటు చెయ్యటం. అప్పుడు మాత్రమే సోషలిస్టు విప్లవం విజయవంతమైనట్లుగా భావించాలి. ఇది దీర్ఘకాలిక పోరాటం. కొన్ని తరాల పాటు దీనికోసం కమ్యూనిస్టులు కృషి చేయవలసి ఉన్నది.

1971లో గ్రాంప్చి సమగ్ర రచనలు ఇంగ్లీషులో వెలుగు చూసాయి. అప్పుడే బయటి ప్రపంచానికి గ్రాంప్చి మహత్తర మేధస్సు గురించి తెలియవచ్చింది. మార్క్సిస్టు సిద్ధాంత పరిపుష్టికి మార్క్స్, లెనిన్‌ల తరువాత అత్యంత ప్రతిభావంతమైన కృషి చేసినది గ్రాంప్చి అని నేడు ప్రపంచం గుర్తించింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది గ్రాంప్చి రచనలపై పరిశోధనలు చేస్తున్నారు.

మార్క్సిస్టు సిద్ధాంతంలో ఆయన చేసిన కృషి 20వ, 21వ శతాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు అనేక కొత్త పాఠాలను నేర్పింది. ముఖ్యంగా, ఆయన చేసిన హెచ్చరిక, "ఎప్పుడైతే పెట్టుబడిదారీ వర్గం ప్రజల దృష్టిలో అప్రదిష్టపాలై, ఇక ఎంతమాత్రమూ పాలించలేని పరిస్థితులు వచ్చినప్పుడు, కమ్యూనిస్టులు ఆ సవాలును ఎదుర్కొని అధికారాన్ని హస్తగతం చేసుకోవటంలో విఫలమైతే, తిరిగి, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క వికృత రూపాలైన ఫాసిస్టు శక్తులు విజృంభిస్తాయి," అనే మాట నేటి భారత దేశ పరిస్థితులకు చక్కగా సరిపోతుంది. ఆ కారణం చేతనే, గ్రాంప్చి బోధనలు మనం చదివి అర్థం చేసుకుని ఆచరణలో అమలు చెయ్యవలసిన అవసరం నేడు ఎంతైనా ఉన్నది.

నేటి సమాజంపై ప్రచార సాధనాల ప్రభావాన్ని గురించి, మానసిక ఆధిపత్యాన్ని గురించి గ్రాంప్చి ఆలోచనలు నేటి సమాచార వ్యవస్థ ఆధారంగా రూపుదిద్దుకుంటూన్న సమాచార, విజ్ఞాన వ్యవస్థకు ఎన్నో కొత్త విషయాలను వివరిస్తోంది. మార్క్సిస్టులకే కాకుండా, అనేక మంది బూర్జువా సిద్ధాంతకర్తలకు కూడా గ్రాంప్చి రచనలు అత్యంత విలువైనవిగా పరిగణింపబడు తున్నాయి. అయితే, మన గ్రాంప్చిని మనం స్వంతం చేసుకోనిదే, విప్లవోద్యమానికి అత్యంత విలువైన ఆయన బోధనలను మనం పోగొట్టుకునే ప్రమాదం పొంచి ఉన్నది. ❑

# మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన గ్రాంసీ




డా॥ బి. రమేష్‌చంద్రబాబు

20వ శతాబ్దంలో మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన మేధావుల్లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు, మార్క్సిస్టు మేధావి అయిన ఆంటోనియో గ్రాంసి ప్రముఖుడు.

దక్షిణ ఇటలీలో వెనుకబడిన ప్రాంతం సార్డీనియాలో జన్మించి, బాల్యంలోనే పేదరికాన్ని చవిచూశాడు గ్రాంసి. చదువుకోవడానికి అవకాశం లేక తండ్రి జైలుశిక్ష అనుభవిస్తున్న కాలంలో కుటుంబాన్ని తల్లి పోషిస్తున్నప్పుడు అండగా బరువులు మోసే పని చేస్తూ సహాయం చేశాడు. తండ్రి విడుదల తర్వాత సాధారణ స్కూలులో చదివాడు. తర్వాత అన్నతో కలిసి ఉంటూ ట్యూరిన్‌లో ఉన్నత పాఠశాల పూర్తి చేశాడు. ఆ కాలంలో ఉద్యమాలలో పాల్గొనకపోయినా సాంఘిక నిరసనోద్యమాలు పరిశీలనతో అవి గ్రాంసీపై ప్రభావం చూపాయి. ఇటాలియన్ సోషలిస్టు పార్టీలో సభ్యుడుగా ఉన్న గ్రాంసీ అన్న ఆంటోనియోకు అవంతి పత్రికను పరిచయం చేశాడు. అక్కడే గ్రాంసీ మార్క్స్ పుస్తకాలను అధ్యయనం చేశాడు.

అనారోగ్యం, పేదరికం విశ్వవిద్యాలయంలో స్కాలర్‌షిప్ ఉన్నప్పటికీ పట్టా తీసుకోకుండానే వదిలివేయాల్సి వచ్చింది. జర్నలిస్టుగా పని చేయడం ప్రారంభించాడు. ఆ కాలంలోనే ఆర్డినో నోవా పత్రిక సంపాదకుడిగా పనిచేశాడు. ఫ్యాక్టరీ కౌన్సిల్ ఉద్యమాన్ని రూపొందించాడు.

1916–19 సంవత్సరాలలో ఇటలీ సోషలిస్టు పార్టీలో పని చేస్తూ పార్టీలోని సంస్కరణవాదానికి వ్యతిరేకంగా మిత్రులతో కలిసి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇటలీని స్థాపించాడు. 1922–24 కాలంలో కొమింటర్న్‌లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా మాస్కోలో ఉన్నారు. 1924లో ఇటలీ పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.




1926లో ముస్సోలినీపై హత్యా ప్రయత్నం జరిగిందని ఆరోపిస్తూ పలువురు ప్రతిపక్ష నేతలను అరెస్టు చేశారు. వారిలో ఆంటోనియో గ్రాంసీ ఒకరు. గ్రాంసీకి 20 సంవత్సరాల జైలుశిక్ష విధించారు. 1929లో జైలులో ఉంటూ గ్రాంసీ జైలు నోటుబుక్స్ రాయడం ప్రారంభించారు. శిక్షా కాలంలో గ్రాంసీ తన ఆలోచనలు 30కి పైగా నోట్‌బుక్స్‌లో పొందుపర్చారు.

మార్క్స్, ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక, గ్రాంసీ జైలు నోట్‌బుక్స్ చూస్తే పైకి చాల భిన్నమైనవిగా కనిపిస్తాయి. కమ్యూనిస్టు ప్రణాళికలో ఉద్యమించడానికి పురికొల్పుతూ విజ్ఞప్తి చేస్తే, జైలు నోట్‌బుక్స్‌లో ఆచితూచి ముందుకు సాగాలని, దీనికి తగిన సన్నాహాలు కావాలని, జాతీయ బ్లాక్ ఏర్పడాలని సూచిస్తాడు. గ్రాంసీ జైలు నోట్‌బుక్స్‌ను మార్క్స్ రచనలు గ్రూండిజ్, రాత ప్రతులతో పోల్చవచ్చు. ఈ రచనలు వారి మరణానంతరం మాత్రమే ప్రచురించబడ్డాయి. ఇవి ఈ రచయితలు తర్వాతి కాలంలో రాయడానికి కావలసిన సన్నాహక విషయ సంగ్రహంగా ఏర్పాటు చేసుకున్నవి.

మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికను 1847లో యూరప్‌లో రాబోయే ఉద్యమాల నేపథ్యంలో రచించారు. కాని గ్రాంసి తన రచనలను జైలులో తాను ఆశించిన విప్లవం ముగిసిన అధ్యాయంగా మిగిలిన కాలంలో కొనసాగించారు. రాజకీయ సంఘటనలు రెండవ, మూడవ ఇంటర్నేషనల్‌లోని మార్క్సిస్టు మేధావులు ఊహించిన రీతిలో జరగలేదు. ఇది గ్రాంసీ ఆలోచనల ప్రత్యేకతకు ప్రాతిపదికగా ఉంది.

1847 నాటి మార్క్స్, ఎంగెల్స్‌లనూ జైలు నోట్‌బుక్స్ రాసే గ్రాంసీని పోల్చినప్పుడు ఈ గ్రంథాల చారిత్రక నేపథ్యాన్ని తప్పక దృష్టిలో ఉంచుకోవాలి. ఈ రెండు గ్రంథాల మధ్య గల వ్యత్యాసం అందరి కంటే గ్రాంసీకే

బాగా తెలుసు. ప్రత్యక్ష యుద్ధం నుంచి యుద్ధ సన్నాహక కాలానికి మారడం అంటే తక్షణ యుద్ధంలో పాల్గొనడం నుంచి వెనకడుగు వేసి యుద్ధభూమిలో కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవడం గురించి ఆలోచించాలి. 1848 తర్వాత యూరప్‌లో జరిగిన సంఘటనలపై ఎంగెల్స్ ఆత్మవిమర్శనాత్మక ప్రతిస్పందనలు దీనిని బలపరుస్తున్నాయి.

గ్రాంసీ తన నోట్‌బుక్స్‌లో మార్క్స్‌ను విస్తృతంగా ఉటంకించారు. ఫ్యూయర్‌బాక్‌పై సిద్ధాంతాలు, పవిత్ర కుటుంబం, 18వ లూయీ బ్రుమేర్ మరియు ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం నుంచి తరచు ప్రస్తావించినా, పెట్టుబడి గ్రంథం నుంచి కూడా విపులంగా తన రచనలలో వాడుకున్నారు. నోట్‌బుక్స్‌లో పెట్టుబడిని తరచు రాజకీయ అర్థశాస్త్ర విమర్శ అనే ఉపమకుటంతో రాశారు. క్రోషే, బుఖారిన్‌లతో సైద్ధాంతిక విమర్శలో యిది ఎక్కువగా కనపడుతుంది. ఆర్థిక మరియు నియతివాద మార్క్సిజానికి విరుద్ధంగా 1859 నాటి Preface to the contribution to the critic of Political Economy లో స్వీయాత్మక భావజాలం మరియు రాజకీయాలకు మార్క్స్‌లో స్థానాన్ని గ్రాంసీ గుర్తించాడు.

పునాది, ఉపరితల సంబంధాలకు గ్రాంసీ కొత్త అర్థానిచ్చాడు. ఇదే తన సిద్ధాంత రచనలకు కేంద్రబిందువయింది. 1859 Prefaceను ప్రత్యేకంగా అధ్యయనం చేయడంతో భావజాలాల స్థాయిలోనే మనుషులు ఆర్థిక ప్రపంచంలోని వైరుధ్యాల పట్ల చైతన్యవంతులవుతారని గ్రాంసీ నొక్కి చెప్పాడు. దీనికి నిర్ద్వందంగా పిడివాద మార్క్సిజంపై ఎంగెల్స్ శక్తి కొలదీ పోరాడడాన్ని ఉటంకించాడు.

కమ్యూనిస్టు ప్రణాళికను తన రచనలలో గ్రాంసీ తక్కువగా ఉటంకించినా జైలులో ఉన్నప్పుడే గ్రాంసీ ప్రణాళికలోని 'పెట్టుబడి దారులు కార్మికులూ' అనే మొదటి అధ్యాయాన్ని జర్మనీ భాష నుంచి అనువదించాడనేది చాల ప్రాధాన్యత గల విషయం. ఇది 7వ జైలు నోట్‌బుక్‌లో మార్క్స్ యితర రచనతో కలిసి మనకు కనబడుతుంది. బుఖారిన్ తన "Popular Manual of Marxist Ideology" లో గతాన్నంతనూ అహేతుకంగా, ఘోరమైందిగా వ్యతిరేకించినప్పుడు బూర్జువా వర్గం ప్రగతిశీల, విప్లవాత్మక పాత్ర పోషించిన విషయాన్ని కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక మొదటి అధ్యాయంలో వివరించడాన్ని గుర్తు చేస్తూ బుఖారిన్‌ను విమర్శించారు.

కమ్యూనిస్టు ప్రణాళిక, జైలు నోట్‌బుక్స్ మధ్య సంబంధాలు చూసేటప్పుడు వాటి సాహిత్య, చారిత్రక సందర్భాల తేడాలతో సరిపెడితే చాలదు. 80-90 సంవత్సరాల కాలం వాటి మధ్య వృథాగా జరిగిపోలేదు. ప్రణాళికలో తన కాలానికే కాక భవిష్యత్తు కాలానికి వెలుగునిచ్చే సూచనలు ఉన్నాయి. గ్రాంసీ మార్క్స్ ఎంగెల్స్‌లు ఎంచుకున్న పునాదిపైనే తన ప్రపంచ దృక్పథాన్ని రూపొందించుకుని రచనను సాగించాడు. కమ్యూనిస్టు ప్రణాళికలోని ప్రతిపాదనలు, చరిత్ర వర్గపోరాటాల చరిత్ర, కార్మిక వర్గం పెట్టుబడిదారీ వర్గానికి వర్గశత్రువు. కార్మికవర్గం తనతో పాటు మొత్తం మానవాళిని విముక్తి చేస్తుంది" వీటిని సంపూర్ణంగా గ్రాంసీ అంగీకరించాడు.

అదే సమయంలో మార్క్స్, ఎంగెల్స్‌ల దృక్పథానికి గ్రాంసీ చాలా విలువైన మార్పులు, సవరణలు చేశాడనడంలో సందేహం లేదు. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలోనే మార్క్స్, ఎంగెల్స్ భౌతిక సంబంధాలు, సాంస్కృతిక భావజాలాల మధ్య సంబంధాలపై స్పందించారు. "మనుషుల ఆలోచనలు, దృక్పథాలు ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి చైతన్యం, తన భౌతిక ఉనికి, సామాజిక సంబంధాలు, సాంఘిక జీవితంలో మార్పులు వచ్చిన ప్రతిసారీ మారుతుంటాయి. మేధోఉత్పత్తి తన స్వభావాన్ని భౌతిక ఉత్పత్తిలో మార్పులకు అనుగుణంగా ఉంటుందని భావాల చరిత్ర రుజువు చేస్తోంది. ప్రతి యుగంలోనూ ఆధిపత్య భావాలు ఎల్లప్పుడూ అధికార వర్గాల భావాలే. మార్క్స్ ఎంగెల్స్‌ల దృక్పథాన్ని యిది సంపూర్ణంగా వెల్లడించకపోయినా, చాలా రచనల్లో ఈ అభిప్రాయాన్ని వారు బలంగా తెలియచేశారు. చైతన్యం యొక్క ఉత్పత్తి అయిన భావజాలం సాంఘిక ఆర్థిక సంబంధాల నుంచి వెలువడుతాయి. మార్క్సిజం సాంఘిక చారిత్రక వాస్తవాన్ని ఈ ఏక కారణ వివరణతో నిర్మించింది.

గ్రాంసీ భావజాలాన్ని పునఃమూల్యాంకనం చేసి భావాల కుటుంబంలోకి పునఃప్రవేశింపచేయడం ద్వారా మార్క్స్ చెప్పినట్లు హేతుబద్ధం కాని చైతన్యం మరియు నిర్దిష్ట పునాదిపై ఆధారపడ్డ ఉపరితలం అనే రెండు ముఖాలకు భిన్నంగా తనదైన, నూతన భావనను ముందుంచాడు. గ్రాంసీ దృష్టిలో భావజాలం అనేది వాస్తవానికి సామాజిక సమూహం యొక్క ప్రాతినిధ్యం. ప్రతి వ్యక్తికీ ప్రపంచ దృక్పథం ఉంటుంది. ఇది తనది మాత్రమే కాదు. యాంత్రిక ధోరణిలో కాక తాను ఉన్న సాంఘిక సమూహానికి కూడా చెందిన దృక్పథం యిది.

సమూహాలు వారి భావజాలంతో స్పష్టంగా నిర్మించ బడతాయి. ఆ విధంగా ఈ సిద్ధాంతం సాంఘిక సమూహాలను ఆర్థిక విషయాలతో కాకుండా నిర్వచిస్తుంది. ఇది భావజాలాల

పట్ల భౌతికవాద, వర్గ పోరాట భావనే కాని మార్క్స్ చెప్పిన దానికి భిన్నమైనది. ఇది గ్రాంసీ ఆధిపత్య సిద్ధాంతంతో వారి ఆధిపత్యానికి జరిగే పోరాటంతోనూ ముడిపడి ఉన్న భావన.

కమ్యూనిస్టు ప్రణాళికలో పెట్టుబడిదారీ వ్యవస్థ తెచ్చే ప్రపంచీకరణపై స్పష్టమైన అవగాహన ఉంది. రాజకీయ కేంద్రీకరణ, స్థానిక సంస్థల ఏకీకరణ, నూతన జాతీయ రాజ్య వ్యవస్థల పనితీరు కనిపిస్తున్నప్పటికీ వీరు కార్మికవర్గం యొక్క జాతీయ స్వభావాన్ని తిరస్కరించారు. గ్రాంసీ లెనిన్‌ను అనుసరిస్తూ ఆధిపత్యం యొక్క జాతీయ స్వభావాన్ని నొక్కి చెప్పారు. పెట్టుబడిదారీ వర్గంతో శ్రామికవర్గ పోరాటం స్వరూపంలో ముందుగా జాతీయ ఉద్యమమే. ఈ రెండు పోరాటాలూ భిన్నంగా ఉన్నప్పటికీ వాటి ఉమ్మడి ప్రేరణ, పద్ధతి, అంతిమ లక్ష్యం ఒక్కటే. చారిత్రక ఘటనే భిన్నమైంది.

కమ్యూనిస్టు ప్రణాళికతో మార్క్స్ ఎంగెల్స్‌లు రాజ్యవ్యవస్థక పరిమిత పాత్రనే యిచ్చారు. 18వ లూయీ బ్రుమేర్ రాసే కాలానికి వారి అవగాహన పెరిగింది. కాని గ్రాంసీ రాజ్యవ్యవస్థ పట్ల అవగాహనను మరింత ముందుకు తీసుకొని వెళ్ళాడు. రాజ్య వ్యవస్థ భావనను చాలా విస్తృతపరిచాడు. ఇది సమ్మతి, ఆధిపత్యం తెచ్చే మరిన్ని ఉపకరణాలు జోడించడం మాత్రమే కాదు. గ్రాంసీ సిద్ధాంతంలో పౌర సమాజం రాజ్యవ్యవస్థ గతితార్కిక ఐక్యతతో ఉంటాయి. వాటిని వేరు చేయడం లేదా ఒక దానిని తక్కువ చేయడం కుదరదు. గ్రాంసీ 20వ శతాబ్దంలో ఆర్థిక, రాజకీయాల మధ్య నూతన సంబంధాలను చూశాడు. ఉత్పత్తి రంగంలో రాజ్య వ్యవస్థ జోక్యం చేసుకోవడం, సంస్థాగత మరియు హేతుబద్ధీకరణతో రాజకీయాలు సమాజంలో సంబంధాలను ఏర్పరచుకోవడం, సమాజాన్ని మార్చడం తెలుసుకున్నాడు. రాజ్య వ్యవస్థ, రాజకీయ శక్తుల పాత్రను లోతుగా అర్థం చేసుకొని లెనిన్ వలెనే దానిపై ప్రత్యేక దృష్టి సారించాడు.

గ్రాంసీ మార్క్స్, ఎంగెల్స్ ఏర్పరచిన దృక్పథంలోనే తన కాలానికి, సమాజానికి మార్క్సిజాన్ని అన్వయిస్తూ కొత్త భావజాలాన్ని, కొత్త ఆలోచనలనూ జైలు నోట్‌బుక్స్‌లో అందించారు. రాజకీయాలలోకి 1916లో ప్రవేశించిన గ్రాంసీ 1927లో అరెస్టు చేయబడి మరో 10 సం॥లు జైలులో గడుపుతూ తన ఆలోచనలను అనారోగ్యం, జైలు ఆంక్షలూ అధిగమిస్తూ మనకు అందించారు. వాటిని అర్థం చేసుకుని, అన్వయించు కుంటూ ముందుకు సాగడం మన కర్తవ్యం ❑

## గ్రామ్‌సీ నోట్‌బుక్స్...

**(61వ పేజీ తరువాయి)**

ఈ రంగంలో, అడ్డుకోత-నిలువుకోత పరిశోధనలు జరగాలని గ్రామ్‌సీ కాంక్షించారు. ముఖ్యంగా, స్కాట్లండ్ కవి, మేధావి, కమ్యూనిస్టు యోధుడు హేమిష్ హెండర్సన్ తన గీతాల్లో ప్రజల సృజనాత్మకతను ప్రతిఫలించిన రీతిని గ్రామ్‌సీ తన జైలు జాబుల్లో ప్రత్యేకించి అభినందించారు. తదనంతర కాలంలో, లోకుల సంస్కృతి గురించి గ్రామ్ సీ రూపొందించిన సైద్ధాంతిక పునాదుల గురించి చెప్పుకోదగిన విశ్లేషణ ప్రకటించిన మేధావుల్లో హెండర్సన్ ప్రముఖులుగా నిలిచేందుకు ఈ ప్రోత్సాహం దారి తీసింది. హెండర్సన్ లాంటి వాళ్ళ కృషిని తక్కువ అంచనా వెయ్యడం కాదు కానీ, ఈ భావన గురించి లోతయిన పరిశోధన జరగవలసిన అవసరం అలాగే మిగిలి వుంది.

### ముగింపు: చారిత్రిక బంధం

1920-30 దశకాల్లో గ్రామ్‌సీ తన నోట్ బుక్‌లో నమోదు చేసిన ఈ భావనలు ఆ కాలానికి కచ్చితంగా అపూర్వాలే. అవి, మూసకట్టు సిద్ధాంత రచనల పరిధిని దాటి, సృజనాత్మక దృక్పథం ప్రదర్శించిన మాట తిరుగులేని వాస్తవం. అయితే, 1960 దశకంలో తూర్పు యూరప్‌లోని సోషలిస్టు దేశాల్లో సంభవించిన పరిణామాల నేపథ్యంలోనే గ్రామ్‌సీ భావాల ప్రాసంగికత తిరిగి రంగం మీదకు వచ్చింది. తెలుగునాట కొద్దిమంది వామపక్ష మేధావులు సమాజ శ్రేయస్సు గురించే కాకుండా, భావనా స్వాతంత్ర్యం ప్రాముఖ్యాన్ని గ్రహించిన దశ అది. కీర్క్‌గార్డ్ జీన్ పాల్ సార్త్ర్ లాంటి పాశ్చాత్య మేధావుల అస్తిత్వవాదం మేధావుల్లో ప్రాచుర్యం సంపాదించుకున్నది కూడా అదే దశలో. సరిగ్గా అదే దశలో, భారత్ - ఉత్తర, దక్షిణ అమెరికా- దక్షిణాఫ్రికా దేశాల్లో గాంధీజీ కార్యకలాపాలపై పునర్మూల్యాంకనాలు మొదలయ్యాయి.

దాదాపు అదే కాలంలో యూరప్-అమెరికా దేశాల్లో డేవిడ్ హార్వే లాంటి విద్వాంసులు నేరుగా మార్క్స్ ఎంగెల్స్‌ల ప్రధానరచనల పునఃపఠనం చేపట్టారు. ఇవన్నీ పరస్పరం సంబంధంలేని సంఘటనలు- పరిణామాల్లా కనిపించినప్పటికీ, వాటి మధ్య చారిత్రిక బంధం ఒకటుంది. కొత్త ప్రపంచం "కొత్తగా" ఆలోచించేందుకు చేసిన ప్రయత్నాలది. ఈ ప్రయత్నాల మధ్య తీవ్రమయిన వైరుధ్యాలూ ఉన్నాయి, ఎన్నో సామ్యాలూ ఉన్నాయి. సామ్యాల మేరకయినా, సమైక్యంగా కృషి జరిగితే పదే పదే చక్రాన్ని కనిపెట్టే వృధా శ్రమ తప్పుతుందని నా అభిప్రాయం. ❑



# మార్క్స్‌వాద మేధావి ఆంటోనియో గ్రాంసీ


తక్కోలు మాచిరెడ్డి

పార్టీలో, సమాజంలో మేధావుల పాత్ర ఏమిటో, కార్మికవర్గ ఆధిపత్యం, ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలిసుకోవాలంటే ఆంటోనియో గ్రాంసీని గురించి ప్రస్తావించాల్సి వుంటుంది. మార్క్స్‌వాదం కార్ల్ మార్క్స్, వ్లదిమీర్ లెనిన్‌లతోనే ఆగిపోలేదు. ఆ తర్వాత వచ్చిన మార్క్స్ వాదులు దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారనేది ఒక వాస్తవం. ఈ సందర్భంగా మనకు ముందుగా గుర్తొచ్చేది గియోర్గి లూకాచ్, ఆంటోనియో గ్రాంసీ, ఆల్‌తుజర్ మొదలైనవారు. ఇప్పుడు గ్రాంసీని గురించి కొంత తెలుసుకుందాం.

ఇటలీలోని సార్డీనియా రాష్ట్రం అలెస్‌లో 1891లో గ్రాంసీ జన్మించాడు. తల్లి ఓ సంపన్న కుటుంబానికి చెందినది. తండ్రి ఓ చిన్న ప్రభుత్వోద్యోగి. మూడేళ్ల వయసులో జరిగిన ఒక ప్రమాదంలో గ్రాంసీకి గూని వచ్చింది. తండ్రి సరిగా ఉద్యోగం చెయ్యక జైలుపాలయ్యాడు. అందువల్ల గ్రాంసీ బాల్యం ఒంటరితనంతో గడిచింది. ఇది అతని విరామమెరుగని అధ్యయనాన్ని సుగమం చేసింది. పుస్తకాలు విపరీతంగా చదివేవాడు. పాత్రికేయుడుగా కొంతకాలం పనిచేశాడు. తర్వాత భాషాశాస్త్రంలో ప్రావీణ్యం కోసం ట్యూరిన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. 1913లో ఇటలీ సోషలిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నాడు. ఆ పార్టీ పత్రిక 'అవంతి' కోసం పాత్రికేయ రచనలు చేశాడు. 1919–20లో ట్యూరిన్‌లో వచ్చిన ఫ్యాక్టరీ కౌన్సిళ్ల ఉద్యమం కోసం నడిపే 'ఆర్డినోనువో' (కొత్త వ్యవస్థ) అనే పత్రికను సంపాదకునిగా పని చేశారు. ఈ పత్రిక ఫ్యాక్టరీ లోపల కార్మికుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచాలనీ, ఉత్పాదకతను మెరుగుపరచాలని నొక్కి చెప్పేది. ఈ అంశం నేడు కార్మికుల పక్షం వహించే మన పత్రికలు కూడా గమనించాలి.

గ్రాంసీ ప్రతిపాదించే విప్లవక్రమం మన ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. కార్మికులు ఉత్పత్తిలో ఎక్కువ వాటా రావాలని మాత్రమే కాకుండా సోషలిస్టు ఉత్పత్తి విధానాన్ని రూపొందించు కోవాలనీ, ఈ దిశగా కార్మికుల్ని ప్రేరేపించాలని అంటారు. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ అవతరించిన కాలం (1921) నుంచి 1936 వరకు అంటే చనిపోయే ముందు వరకూ గ్రాంసీ పార్టీలో ఉంటూ పార్టీ విధానాలను రూపొందించేవారు. అంతే కాక, అంతర్జాతీయ సామ్యవాద సంస్థ అయిన 'కోమింటర్న్'లో క్రియాశీలమైన పాత్ర వహించాడు. 1926 నుంచి 1937 వరకూ అంటే దాదాపు మరణించే వరకు జైలుశిక్ష అనుభవించాడు. అక్కడ జైలులో వుంటూ అతను రాసిన కొన్ని నోట్సు జైలు నోటు పుస్తకాలుగా అచ్చయి ప్రసిద్ధికెక్కాయి.

కార్మిక సంఘాలు ఆర్థిక అంశాలకే ప్రాధాన్యం ఇవ్వకుండా వుండాలనీ వారు ఫ్యాక్టరీ సమితుల్లో క్రియాశీలం కావాలన్నారు. ఈ సమితుల్నే సూక్ష్మరూపంలో కార్మిక రాజ్యం, కార్మిక ప్రజాస్వామ్యం అనవచ్చునంటారు. ఈ సమితులు ఎన్నికల ద్వారా ఎలా ఏర్పడాలో గ్రాంసీ వివరిస్తాడు. ఈ సమితుల ప్రధాన కర్తవ్యం కార్మికులకు సుపరిపాలన, సాంకేతిక పరిజ్ఞానం కోసం వారికి శిక్షణ ఇవ్వడం అని పేర్కొంటాడు. 1977 తర్వాత రష్యాలో ఏర్పడిన సోవియట్ (రష్యన్, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో ట,డలు లేవు) ల కంటే ఇటలీలోని ఈ సమితులు ఎక్కువ కార్యకలాపాలు నిర్వహిస్తాయని గ్రాంసీ అభిప్రాయపడతారు. కాని పార్టీ లేకపోవడంతో ఈ సమితులు సఫలం కాలేదు. అందుకే గ్రాంసీ సామ్యవాద పార్టీ ఆవశ్యకతను నొక్కి చెబుతాడు. విప్లవ క్రమంలో ప్రయత్నపూర్వకంగా నిర్దేశాను సారంగా వచ్చే ఉద్యమాలూ, అప్రయత్నంగా అంటే spontaneousగా వచ్చే ఆందోళనలు, తిరుగుబాట్లు – ఈ రెండూ కలవడం విప్లవానికి అవసరమంటాడు ఆయన. దీనికి పార్టీ నేతృత్వం వహించాలని అభిప్రాయ పడతారు. ఈ భావన నేటికీ ప్రాసంగికమే,



ఆచరణ సాధ్యమే. మన దేశంలో ఈ రెండవరకపు విప్లవాత్మక తిరుగుబాటు ఇపుడు అవసరం, ఆవశ్యకం. కాని దురదృష్టవశాత్తు ఇవి చాలా అరుదే.

గ్రాంసీ సైద్ధాంతిక వివరణలు అతను జైలులో వుంటూ (1926-37) అప్పుడప్పుడూ రాసుకున్న నోట్స్‌లో వ్యక్తమయి నాయి. ఈ నోట్సు తెగిన గొలుసులా ఉంటాయి. ఒకే ఆకారంలో, వరుసలో లేవు. అయినా వీటిలోని అంశాలు అతి ముఖ్యమైనవి. మరీ ముఖ్యంగా మేధావులను గురించిన అతని సైద్ధాంతిక రచన వీటిలోనే ఉంది. కార్ల్‌మార్క్స్ బుద్ధిజీవులు అనే పదాన్ని సాంప్రదాయికమైన అర్థంలో వాడాడు. శారీరక, బౌద్ధిక శ్రమల మధ్య గల అంతరాన్ని సూచిస్తూ ఆయన ఈ పదం వాడాడు. కాని గ్రాంసీ అలాకాక, మేధావి అనే పదాన్ని intelligentsia అనే అర్థంలో కాకుండా విస్తృతమైన అర్థంలో వాడాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రతి సామాజిక వర్గమూ ఆర్థికరంగంలోనే కాక సాంఘిక, రాజకీయ రంగాల్లో కూడా తనకు ఒక సజాతీయతను కల్పించేదీ, తన సొంత విధులను గురించి తనకే చైతన్యం కలిగించేదీ అయిన ఒకానొక లేక ఒకటికంటే ఎక్కువగా మేధావుల పొర(ల)ను స్వాభావికంగానే సృష్టించుకుంటుంది.

విప్లవ క్రమంలో మేధావుల పాత్రను ఆయన గొప్పగా అంచనా వేశాడని చెప్పుకోవచ్చు. మేధావులు రెండు రకాలుగా ఉంటారని అంటాడు గ్రాంసీ. సాంప్రదాయిక మేధావులు, స్వాభావిక మేధావులు అని, సాంప్రదాయిక మేధావులు సామాజిక, రాజకీయ మార్పులకు అతీతంగా, వాటికంటే ఉన్నతంగా ఉంటారు. ఒక విధమైన నిరంతరాయతను కలిగివుంటారు. వీరి కింద కవులు, కళాకారులు, రచయితలు, తత్వవేత్తలు మొదలైన వారు వస్తారని అభిప్రాయపడతారు. వీరు తమను రూపొందించిన ఉత్పత్తి విధానం అంతరించినా కూడా జీవిస్తారు. ఇక స్వాభావిక మేధావులు ఎంత వరకు సహజంగా వుంటారంటే వారు ఏ సంస్థలో సభ్యులై వుంటారో, ఆ సంస్థ తన వర్గానికి ఎంత సన్నిహితంగా ఉంటుందనే దానిపై ఇది (వాళ్ల స్వాభావికత) ఆధారపడి ఉంటుంది. వివిధ రంగాల్లో వీరు తమ వర్గపు సమష్టి చైతన్యాన్ని అభివ్యక్తీకరిస్తుంటారు.

ఇటలీలో చర్చికి చెందిన విశ్వజనీన మేధావులు బూర్జువా వర్గానికి చెందిన మేధావుల్ని తమకు అనుకూలంగా మలుచుకోగలిగారు. పునరుజ్జీవన దశలో బూర్జువా వర్గం తన సొంత మేధావుల్ని సృష్టించుకోగల్గింది. ఇక మన దేశంలో ప్రజా ఉద్యమాల్లో మేధావుల్ని ఇతోధికంగా ఇముడ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రగతిశీల మేధావులు ఇతర సామాజిక బృందాల మేధావుల్ని తమ వైపు ఆకర్షిస్తారు. కార్మికవర్గానికి తమకంటూ స్వాభావిక మేధావులు కొందరుండాలి. ఇది తప్పనిసరి అని అభిప్రాయపడతాడు గ్రాంసీ. ఉపరి నిర్మాణం ద్వారా పునాదిని విశ్లేషించవచ్చు అని ధీమాగా ప్రకటిస్తాడు ఆయన. పెట్టుబడి వాదాన్ని వ్యతిరేకించే సకల శక్తులన్నింటినీ ఐక్యం చేసి లేక కూటమిగా ఏర్పడి దాన్ని ఎదుర్కొనాలి అంటాడు గ్రాంసీ. ఇది ప్రాసంగికమే నేటికీ. ప్రపంచవ్యాప్తంగా సామ్యవాదం రాగలదన్న ట్రోత్‌స్కీ అభిప్రాయాన్ని తప్పుపడుతూ, గ్రాంసీ అంటాడు : "అంతర్జాతీయతావాదం సరైనదే... కాని విప్లవపు ఆరంభస్థానం జాతీయం అని గమనించాలి" లెనిన్ పంథా సరియైనదని విశ్వసిస్తాడు. శాశ్వత విప్లవ సిద్ధాంతాన్ని అతను ఆమోదించడు.. కార్మికవర్గ నియంతృత్వం స్థానే కార్మిక ఆధిపత్యాన్ని ప్రతిపాదిస్తాడు. గ్రాంసీ! అది ప్రజాస్వామికంగా అమలు జరగాలంటాడు. గ్రాంసీ మూడవ ఇంటర్నేషనల్‌లో ఉండి క్రియాశీలంగా కృషి చేశాడు. మార్క్సువాదం-లెనిన్ వాదంను సమర్థిస్తూనే ఆయన వాటిని అధిగమించి సైద్ధాంతిక దోహదం చేశాడు. ❑

*(కమ్యూనిజం సిద్ధాంత మాసపత్రిక సౌజన్యంతో...)*

---

- **ప్రతి రాజ్యమూ ఒక అర్థంలో నియంతృత్వమే!** *- గ్రాంసీ*
- **తల గోడకేసి బాదుకుంటే, కచ్చితంగా బద్దలయ్యేది మన తలే- గోడ ఎన్నటికీ బద్దలవదు!!** *- గ్రాంసీ*
- **చరిత్ర అంటే, అవసరమూ- స్వేచ్ఛా, ఈ రెండింటి కలయికే!** *- గ్రాంసీ*
- **పాత ప్రపంచం అంతరిస్తోంది; కొత్త ప్రపంచం అవతారమెత్తడానికి గింజుకుంటోంది. ఈ అసుర సంధ్య దశ రాక్షసులకు అనువయింది!!** *- గ్రాంసీ*




# పౌర సమాజం - గ్రాంసీ - ఒక పరిశీలన

డా॥ బి.వి.వి. బాలకృష్ణ

ఇటలీ కమ్యూనిస్టు పార్టీలో ముప్ఫై నలభై దశకాలలో ఒక ప్రముఖ వ్యక్తి ఆంటోనియో గ్రాంసీ. చాలాకాలం ఆ పార్టీ నాయకుడిగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ కీలక పాత్రధారిగా ఉన్న టోగ్లియాటి.... సహచరుడు. సమకాలీన ప్రపంచంలో ప్రముఖ మేధావిగా గుర్తింపు పొందాడు. ఫాసిస్టు ముస్సొలిని పాలనలో జైలుపాలై అందులో నుండే రచించిన "ప్రిజన్ నోట్సు" ప్రపంచ మేధావుల దృష్టిని ఆకర్షించింది. దానిపై విశ్లేషణా పరంపరలూ విమర్శలూ అసంఖ్యాకంగా వచ్చాయి. పౌరసమాజంలోని ప్రధాన సిద్ధాంతకర్తలలో ఒకరిగా గ్రాంసీని పేర్కొనటం జరుగుతుంది. గ్రాంసీ పౌర సమాజం గురించి ఒకే చోట విపులంగా చర్చించలేదు గాని రాజ్యంలో పౌరసమాజ పాత్రను విశ్లేషించారు. ఆధునిక రాజ్యం పట్ల గ్రాంసీ భావన త్రికోణమైనది. దానిలో మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి. రాజకీయ సమాజం, పౌర సమాజం మరియు ఆర్థిక రంగం విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయి. ముందుగా రాజకీయ సమాజం, పౌర సమాజం గురించి పరిశీలిద్దాం.

మన ముందు ఉన్న తక్షణ కర్తవ్యం రెండు ప్రధాన ఉపరితల నిర్మాణ స్థాయిలను ఏర్పాటు చేయడం మొదటి స్థాయిని పౌర సమాజం అని పిలువచ్చు. రెండో స్థాయి రాజకీయ సమాజం లేదా రాజ్యం. ఈ రెండు స్థాయిలు ఒక వైపు సమాజమంతటా ఆధిపత్య విధులను నిర్వహిస్తే మరో వైపు రాజ్యం లేదా చట్టబద్ధ మైన ప్రభుత్వం ద్వారా "ప్రత్యక్ష ఆధిపత్యం" లేదా "నియంత్రణ"ను కొనసాగిస్తాయి.




గ్రాంసీ 1931 సం॥ ఒక లేఖలో పౌర సమాజం గురించి ఇలా వివరించారు. ప్రైవేటు సంస్థలు అనబడే చర్చి, కార్మిక సంఘాలు, పాఠశాలలు, కళాశాలలు తదితర సంస్థలే పౌర సమాజంలో ఇమిడి ఉంటాయి. ఇలాంటి సమాజంలోనే మేధావులు తమ కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. గ్రాంసీ పేర్కొన్న ఈ అభిప్రాయాన్ని బట్టి పౌర సమాజం అంటే ఉత్పత్తి ప్రక్రియకు భిన్నమైన రాజ్యం సార్వజనిక నిర్మాణాలతో సంబంధం లేని ప్రైవేటు సంస్థలతో పౌర సమాజం ఏర్పడుతుంది. సామాజిక పద్ధతులు, ఆచారాలు, సాంప్రదాయాలు సంక్లిష్ట కలయిక ఫలితంగానే ఈ పౌర సమాజ సంస్థలు పుట్టుకొస్తాయి. వాటిలో పెట్టుబడిదారీ, కార్మిక నిర్మాణాలకు ఉన్న మౌలిక వ్యత్యాసం ఒకటే 'అదే అణచివేత'. అణచివేతపై రాజ్య సంస్థలకే గుత్తాధిపత్యం ఉంటుంది. దీనిని బట్టి పెట్టుబడిదారీ సమాజంలో మూడు రకాలైన సంబంధాలు ఉంటాయి.

1. కార్మిక పెట్టుబడిదారీవర్గ సంబంధాలు
2. రాజ్యాన్ని నిర్ధారించే అణచివేత సంబంధాలు
3. పౌర సమాజాన్ని నిర్మించే ఇతర అన్ని సామాజిక సంబంధాలు

పెట్టుబడిదారులు, కార్మికులు, ఇతరులు అందరూ కలిసి రాజకీయ సైద్ధాంతిక పోరు జరిపే క్షేత్రమే పౌర సమాజం. అందులో రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, మత సంస్థలు, ఇతర విభిన్న సంస్థలు ప్రత్యక్షమవుతాయి. కేవలం వర్గపోరాటాలే కాకుండా ప్రధాన స్రవంతి ప్రజాస్వామిక పోరాటాలకు కూడా పౌర సమాజం క్షేత్రంగా ఉంటుంది. ఆ విధంగా పౌర సమాజంలో రెండు ప్రాథమిక వర్గాల మధ్య (కార్మిక – పెట్టుబడిదారీ) ఆధిపత్య పోరు జరుగుతుంది. పౌరసమాజం ఒక నైతిక, విలువలు గల సమాజమని కూడా గ్రాంసీ అభిప్రాయ పడ్డాడు. ఎందుకంటే పౌర సమాజంలో రాజకీయం, సైద్ధాంతిక పోరాటాల ద్వారా పాలకవర్గం తన ఆధిపత్యాన్ని నిర్మించింది. ఉత్పత్తి, రాజ్యంతో సంబంధం లేని సంస్థలన్నీ పౌర సమాజం క్రిందకి వస్తాయి. అందులో కుటుంబం కూడా ఒకటి. పౌర సమాజంలో కుటుంబానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఎందుకంటే కుటుంబంలోనే మహిళలు ప్రాథమికంగా శ్రమిస్తారు. కార్మిక శక్తి అనే ఆర్థిక, శారీరక ఫలితాన్ని ఉత్పత్తి

☞ మిగతా 96వ పేజీలో


# ఎమ్.ఎన్.రాయ్ జ్ఞాపకాలలో గ్రాంసీ



గౌరవ్

ఆంటోనియో గ్రాంసీ పై ప్రత్యేక సంచిక తీసుకు రావడం ఒక మంచి ప్రయత్నం. చాన్నాళ్ళ క్రితం చదివిన Prison Notebooks గుర్తొచ్చాయ్. ఫాసిజపు దుర్మార్గానికి చిన్న వయసులోనే బలైపోయిన తొలి వ్యక్తులలో ఆంటోనియో గ్రాంసీ ఒకరు. అంతే కాదు మార్క్సిజాన్ని వినూత్నమైన రీతిలో అర్థం చేసుకుని తాత్వికంగా విశేష కృషి చేసిన అనితరసాధ్యమైన కమ్యూనిస్టు గ్రాంసీ.

ఒక ఆసక్తికరమైన విషయం ప్రస్తావించాలి. ఈరోజు అంతర్జాతీయంగా గ్రాంసీ మీద అనేక అధ్యాయనాలు జరుగుతున్నాయి. కానీ, అసలు గ్రాంసీ ప్రపంచానికి తెలీక మునుపే అతడి ప్రాముఖ్యతని బలంగా గుర్తించిన వ్యక్తి ఎం.ఎన్. రాయ్. గ్రాంసీని తత్వ విజ్ఞాన శాస్త్రానికి ఎంతో గొప్ప దోహదం చేసిన మేధావిగా పేర్కొన్నాడు.




గుంటూరులో కొన్నేళ్ళ క్రితం జరిగిన ఇంటూరు సాంబశివరావు అనే భావోద్యమకారుని సంస్మరణ సభ రిపోర్టుకి సంబంధించిన వార్త హేతువాది పత్రికలో వచ్చింది. అది తెలుపుతూ మిత్రులు రవిచంద్ గారు గ్రాంసీ గురించి తన ప్రసంగంలో ప్రస్తావించినట్లు ఉంది. అది చూసి నేనాయనకి లేఖ రాయగా అనేక విషయాలతో పాటు పై విషయాన్ని గురించి కూడా ప్రస్తావిస్తూ జవాబు రాసారు.

యం.యన్.రాయ్ తన స్మృతులు (Memoirs) లోని 37వ అధ్యాయం The old guard of German Communism లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, "It was a curious coincidence that there was another hunchback amongst the most outstanding communist leaders. It was Antonio Gramsci of Italy. I met him in Moscow. He was not a worker, but an intellectual, a professor of philosophy. He also was shy. Arrested in the earlier years of the fascist regime, he spent twenty two years in prison, and died soon after his release, on liberation of Italy. The hardship of long imprisonment had shattered his delicate health, but could not daunt his spirit... " అంటాడు. అంతేకాదు, "Gramsci came to the conclusion that the philosophical aspect of Marxism should be revised .......Gramsci had left behind about 2000 pages of manuscript as a result of a profound study in prison. It may turn out to be the greatest contribution to the philosophical thought hitherto made by any communist" అంటాడు.

"ఇప్పటి వరకూ ఏ కమ్యూనిస్టూ కూడా అందించని అత్యున్నత కృషి ఇది" అని గ్రాంసీ కృషిని కొనియాడాడు రాయ్.

గ్రాంసీ సిద్ధాంతీకరించిన cultural hegemonyని కూడా లోతుగా అర్థం చేసుకోబట్టే సాంస్కృతిక వికాసోద్యమ ప్రాధాన్యతను గుర్తించి Indian Renaissance Institute రాయ్ స్థాపించాడనేది నా అభిప్రాయం. తర్వాత కాలంలో గ్రాంసీని అంబేద్కర్‌తో సహా పోలుస్తూ అనేక అధ్యయనాలు చేసారు (కొన్ని అంతర్జాలంలో కూడా ఉన్నాయి) కానీ, సాంస్కృతిక ఆధిపత్యాన్ని గురించి గ్రాంసీ సూత్రీకరణలపై ఎప్పటికంటే ఈరోజు అధ్యయనం, చర్చ జరగాల్సిన అవసరం మరింత ఎక్కువ ఉందనేది నా అభిప్రాయం.

Organic intellectualsని స్వతంత్ర ఆలోచనాపరుల్ని మల్చుకోవాల్సిన బాధ్యతను గుర్తించిన మొదటి తరం కమ్యూనిస్టు ఉద్యమకారుల్లో గ్రాంసీ ఒకరు. కమ్యూనిస్టేతర అభ్యుదయపు అస్తిత్వాన్ని కూడా సగౌరవంగా గుర్తించి అదెంత అవసరమో చెప్పడానికి ప్రయత్నించిన వాడాయన. ఇటాలియన్ కమ్యూనిస్టు, నాయకుడు పన్మిరో తోగ్లిట్టాకి రాసిన ఒక లేఖలో గ్రాంస్కీ, "Infact, it is our objective to contribute to the creating and maintaining of a unitary plan in which the diverse tendencies and personalities could gather and meld together" అంటాడు. (ఇది నెట్‌లో అందుబాటులో ఉంది). జరిగే ప్రతీ మంచికి ఎడంగా జరుగుతూ సిద్ధాంత కళ్ళద్దాల నుండి, పార్టీల ప్రభావం నుండీ తప్పా లోకాన్ని చూడటం రాని వారికి వ్యతిరేకంగా ప్రగతిశీల భిన్నత్వాన్ని అదెక్కడున్నా ఆహ్వానించాలనే ఈ దృక్పథం ఈ రోజు మరింత అవసరం. ❑



# ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు
# బాస్టర్డ్ హెజమనీ - ప్రజా హెజమనీ

డి వి వి యస్ వర్మ


## ప్రాంతీయ పార్టీలు : బాస్టర్డ్ హెజమనీ

2014 నాటికి ఆంధ్ర ప్రాంత రాజకీయం ఒక ప్రత్యేక దశకు చేరుకుంది.

1. 1952లో రెండు జాతీయ పార్టీల మధ్య – కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య– రాజకీయ సంఘర్షణ జరిగింది. ఇప్పుడు దానికి విరుద్ధంగా రెండు ప్రాంతీయ పార్టీల మధ్య – తెలుగు దేశం, వైసీపీ పార్టీల మధ్య– రాజకీయ సంఘర్షణ రూపం తీసుకుంది.

ఆనాడు ఎన్నికల సంఘర్షణలోప్రధాన పాత్ర వహించిన కాంగ్రెస్–కమ్యూనిస్టు పార్టీలు, 2014–2019లో జరిగిన ఎన్నికల సంఘర్షణలో తెర వెనుకకు నెట్టబడ్డాయి. ఈ రెండు ఎన్నికలలో ఆ పార్టీలకు శాసనసభ లో ఒక స్థానం కూడా దక్కని స్థితి వచ్చింది.

2. ఆనాడు కాంగ్రెస్ – కమ్యూనిస్టు పార్టీల మధ్య రాజకీయ సంఘర్షణ వర్గ సంఘర్షణ రూపంలో జరిగింది. ఇప్పుడు అది కుల సమీకరణాల సంఘర్షణ రూపం ధరించి సమాజంలో వివిధ వర్గాలను సమీకరించడానికి బదులు వివిధ కులాలను సమీకరించే రూపం ధరించింది.




3. ఆనాడు విధానపరమైనదిగా సాగిన రాజకీయ సంఘర్షణ నేడు కేవలం అధికార సాధనే లక్ష్యంగా సాగుతున్నది.

అభివృద్ధి నమూనాలతో ప్రజల ఆకాంక్షల చుట్టూ సాగిన ఎన్నికల సమరం ఇప్పుడు డబ్బు చుట్టూ, ప్రలోభాల చుట్టూ, రాయితీల చుట్టూ ఓట్లను పొందే ప్రక్రియగా రూపాంతరం చెందింది.

ఇలాంటి వికృత రాజకీయాలకి దారి తీసిన ఆర్థిక, రాజకీయ పరిణామాలను మనం విశ్లేషించుకోవాలి.

## ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భావం

1. భూఆదాయం నుండి పెట్టుబడిదారీ ఆదాయానికి మార్పు

1950 దశకంలో ఆంధ్రప్రాంతంలో వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా వుంది. 1960 దశకంలో ప్రారంభమైన సాంద్ర వ్యవసాయం, హరితవిప్లవం ఈ ఆదాయాన్ని మరింత పెంచింది. భూస్వాములు, ధనికరైతులు దగ్గర సంపద పోగుపడింది. దీనిని మరికొంత భూవిస్తరణకు వినియోగించే దశలో 1972లో భూసంస్కరణల చట్టం వచ్చింది. దీనిని భూ యజమానులు తీవ్రస్థాయిలో "జై ఆంధ్ర" ఉద్యమ రూపంలో ప్రతిఘటించారు. జాతీయస్థాయి పాలక పెట్టుబడిదారీ వర్గానికి ప్రాంతీయ భూస్వామ్య వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణగా సాగింది.

ఈ చట్టం వల్ల భూమి పంపిణీ జరగకపోయినా, భూకమతాల విస్తరణ ఆగింది. మిగులు సంపద రకరకాల రంగాలలో పెట్టుబడులుగా తరలడం ప్రారంభమైంది.

1991 తర్వాత రెండు పరిణామాలు జరిగాయి. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాల అమలు ప్రారంభం అయింది. ప్రపంచీకరణ విస్తరించింది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక, వాణిజ్య వ్యాపార రంగాలలో, పట్టణీకరణలో భాగంగా రియల్ ఎస్టేటు రంగం వగైరాలలో పెట్టుబడులకు, అదనపు ఆదాయానికి ద్వారాలు తెరుచుకున్నాయి.

మరోపక్క వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో పడింది. భూమి ఒక ఆస్తిగా తప్ప అదనపు ఆదాయాన్ని ఇచ్చేది కాకపోగా నష్టాల బాట పట్టింది.

గ్రామాలో భూ యజమానులు ప్రత్యక్షంగా వ్యవసాయం చెయ్యడం నుండి క్రమంగా తప్పుకున్నారు. వ్యవసాయంలో కౌలు రైతులను ప్రవేశపెట్టారు. భూ ఆస్తిని వుంచుకుంటూనే, కౌలును

పొందుతూ వ్యవసాయ సంక్షోభాన్ని కౌలు రైతులకు దఖలు పర్చారు. కౌలు రైతులు పగలూ రాత్రులూ చేసిన శ్రమే వారికి ఆదాయం అయింది. ఏదైనా విపత్తు సంభవిస్తే అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పించారు.

సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ గ్రామీణ భూస్వాములు, ధనికరైతులు దానిని అందిపుచ్చుకుని వివిధ రంగాలలో రకరకాల రూపాలలో పెట్టుబడిదారులుగా రూపాంతరం చెందారు. స్వేచ్ఛా పెట్టుబడిదారీ గొడుగు కింద వారంతా ఒక వర్గంగా రూపొందారు. భూ ఆస్తి సంబంధాలకు పెట్టుబడికి వున్న వైరుధ్యాన్ని సమన్వయం చేసుకున్నారు. అంతగా అంతర్గత ఘర్షణలేని ఒకే వర్గంగా అవతరించారు.

2. ఫ్యూడల్ పట్టు నుండి డబ్బు పట్టుకు మారిన రాజకీయం

ఈ కాలంలో గ్రామీణ ప్రాంత రాజకీయం కూడా మార్పులకు గురైంది. 1994 రాజ్యాంగ సవరణకు పూర్వ రాష్ట్రంలో రాజకీయరంగంలో ఎదుగుదలకు పంచాయితీరాజ్ వ్యవస్థ నిచ్చెనమెట్లుగా వుండేది. అంచెలంచెలుగా శాసనసభకు దాని ద్వారా ఎదిగే పద్ధతిని పార్టీలు అనుసరించేవి. 1994 రాజ్యాంగ సవరణ తర్వాత 60 శాతం స్థానాలు బడుగు బలహీనవర్గాలకు రిజర్వుకావడంతో పంచాయితీల వ్యవస్థ మీద భూస్వామ్య వర్గాల ప్రత్యక్ష నాయకత్వ పాత్ర సన్నగిల్లింది. వారు పరోక్షంగా తమ అనుయాయుల ఆధారంగా పట్టు కొనసాగించడం తప్ప ప్రత్యక్ష పట్టు సడలింది.

మరో పక్క ఎన్నికల రాజకీయంలో డబ్బు ప్రవేశించింది. ఏ స్థాయిలోనైనా పాలక పార్టీల టికెట్లు డబ్బు పెట్టగలిగేవారికే దక్కే స్థితి వచ్చింది. దాంతో రాజకీయ రంగంలో ఫ్యూడల్ పట్టు స్థానంలో డబ్బు పట్టు ఆక్రమించింది. డబ్బు ప్రవేశంతో పదవులు గత రాజకీయజీవితంతో సంబంధం లేని కొనుగోలు సరుకు అయింది. కొత్త పెట్టుబడిదారీ వర్గం ఈ దారిలోనే రాజకీయ అధికారాన్ని పొందే మార్గాన్ని అవలంభించింది. ఎన్నికల వ్యవస్థ కూడా భూస్వామ్యపద్ధతుల నుండి పెట్టుబడిదారీ పద్ధతికి మారింది.

## రెండు ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించిన తీరు

1983 ఎన్నికలు రాష్ట్ర రాజకీయంలో కొన్ని ప్రత్యేకతలను తెచ్చిపెట్టింది. రాష్ట్రంలో అంతవరకు జాతీయ పార్టీల మధ్య నడిచిన రాజకీయం ఇప్పుడు ఒక జాతీయపార్టీకి, ఒక ప్రాంతీయ పార్టీకి మధ్య రాజకీయ సంఘర్షణగా మారింది.

1983లో కాంగ్రెస్ రాజకీయ గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టడంతో పాటు రాష్ట్రంలో రెడ్డి కుల ఆధిపత్య రాజకీయాన్ని కూడా తొలగించింది. ఇలా కమ్మకులం అధికారంలోకి తొలిసారి రంగప్రవేశం చేసింది. దాంతో రాజకీయంలో కులాల ఆధిపత్య పోరుకు బీజాలు పడ్డాయి. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీల వ్యవస్థ ఏర్పాటునీ, అవి కుల రాజకీయ సంఘర్షణ రూపం తీసుకున్న క్రమాన్ని విశ్లేషించుకోవాలి.

ప్రస్తుతానికి రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలు - తెలుగుదేశం - వై.యస్.ఆర్ పార్టీలు ఒక దానికి మరొకటి ప్రత్యామ్నాయంగా వున్నాయి

## తెలుగు దేశం పార్టీ

1982లో తెలుగుదేశం ఒక ప్రాంతీయ పార్టీగా ఏర్పడింది. అన్ని ప్రాంతీయ పార్టీలలాగే ఇది కూడా వ్యక్తి కేంద్రంగా ఏర్పడింది. ఇలాంటి పార్టీల కొనసాగింపు కూడా ఆ వ్యక్తి వారసత్వం రూపంలోనే వుంటుంది.

1989 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలైంది. పార్టీ కార్యకలాపాలకు ఎన్.టి.ఆర్ దూరంగా వున్నాడు. పార్టీ పగ్గాలు చేపట్టిన చంద్రబాబు తనకంటూ ఒక వర్గాన్ని రూపొందించుకున్నాడు. 1994 ఎన్నికలలో తన వర్గానికి ఎక్కువ సీట్లు కేటాయించుకోగలిగాడు. 1995లో లక్ష్మీపార్వతి జోక్యం సమస్యపై ఎన్టిఆర్ ప్రభుత్వాన్ని అస్థిరపరచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు . ఈ సమయంలో ఆ పార్టీని అనుసరించే ప్రజా సమూహాలలో వారసత్వం సమస్య ముందుకొచ్చింది. ఎన్టిఆర్ మరణం తర్వాత వారసత్వాన్ని లక్ష్మీపార్వతి దక్కించుకోవాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్టిఆర్ కుటుంబ సభ్యులందరినీ చంద్రబాబు ఆకట్టుకోవడంతో వారసత్వ సమస్య ఆయనకు అనుకూలంగా మారింది. 1999 ఎన్నికలలో చంద్రబాబు తన నాయకత్వంతోనే ఎన్నికల్లో గెలిచాడు.

## ప్రాంతీయ పార్టీగా కాంగ్రెస్ - వారసుడుగా జగన్

మరోపక్క కాంగ్రెస్ పార్టీ నుండి వైయస్ఆర్‌సిపి ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టుకొచ్చిన క్రమంలో కొన్ని ప్రత్యేకతలు వున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వరసగా రెండు ఎన్నికల్లో (1994-1999) పరాజయం పాలైంది. అదే సమయంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయి వుంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుని ఎదుర్కొని నిలబడగల నాయకత్వం కోసం కాంగ్రెస్‌లో తపన ప్రారంభం అయింది. ఈ

నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబును సమర్ధవంతంగా ఎదుర్కొంటున్న రాజశేఖర్ రెడ్డి అటు పార్టీ దృష్టినీ, ఇటు ప్రజల దృష్టినీ ఆకర్షించారు.

కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతో నిమిత్తం లేకుండా రాజశేఖర రెడ్డి సుదీర్ఘమైన పాదయాత్ర చేశాడు. ప్రజలలో వచ్చిన స్పందనతో కాంగ్రెస్ శ్రేణులు ఆయన నాయకత్వం కింద సమీకృతం అయ్యారు. పాదయాత్ర ద్వారా పేదలలో, రైతులకు, సామాన్యులలో మంచి గుర్తింపుతో పాటు వారితో మమేకం కావడంతో ప్రజానాయకుడుగా ఎదిగాడు.

## ఇద్దరు నేతల మధ్య పోరు

మొత్తం మీద తెలుగుదేశం అంటే చంద్రబాబు అన్నట్లే కాంగ్రెస్ అంటే రాజశేఖర్ రెడ్డి అన్న స్థితి రాష్ట్రంలో ఏర్పడింది. దీంతో రెండు పార్టీల మధ్య పోటీ ఇద్దరు నాయకుల మధ్య పోటీగా మారింది. 2004 లో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఈ పరిస్థితి స్థిరపడింది.

2004లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాని అది సంకీర్ణ ప్రభుత్వంగా వుంది. రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి పాలన మీద, పథకాల మీద ఎలాంటి ఆంక్షలు పెట్టే స్థితిలో కాంగ్రెస్ హైకమాండ్ లేదు. ఆయన ప్రకటించిన సంక్షేమ పథకాలు, అర్హులందరికీ అందించే పద్ధతి సాగునీటి రంగం మీద కల్పించిన ఆకాంక్షలు ఉచిత విద్యుత్ వగైరాలు పేదలు, రైతులు అందరి ఆదరాభిమానాలు పొందాడు. 2009 ఎన్నికలలో ఆయన తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. కొద్ది నెలలకే సంభవించిన దుర్మరణం ప్రజల సానుభూతిని విపరీతం చేశాయి. ఆయనకు వారసుడుగా జగన్ ముందుకు వచ్చాడు. కాని కాంగ్రెస్ అధిష్టానం తన పద్ధతి ప్రకారం హైకమాండ్ ద్వారా నిర్ణయించి రోశయ్యను ముఖ్యమంత్రిని చేశారు.

జగన్ అధిష్టానాన్ని ధిక్కరించి "ఓదార్పు యాత్ర" చేశాడు. పల్లెల్లో మరణించిన కుటుంబాలను పరామర్శించడం, సభలలో ప్రసగించడం ద్వారా రాజశేఖర్ రెడ్డిపై వున్న సానుభూతిని, ఆయనకు వారసునిగా జగన్ తన వైపు మళ్లించుకున్నాడు.

కాంగ్రెస్ పార్టీ నుండి తన వెంట వచ్చిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి జగన్ ఎన్నికల బరిలోకి దిగాడు. కాంగ్రెస్‌నీ, తెలుగుదేశాన్ని ఓడించి ఘనవిజయం సాధించాడు. రాజశేఖర రెడ్డికి వారసునిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ జగన్ పరం అయ్యాయి. 2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ఆ ఎన్నికలలో నామమాత్రంగా మిగిలింది. జగన్ ప్రాంతీయ పార్టీ కూడా వ్యక్తి చుట్టూ నిర్మితమైంది. ఇలా రెండు ప్రాంతీయ పార్టీలు, రెండు కులాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల చుట్టూ నిర్మితమైన వారసత్వ పార్టీల నేతలు రాష్ట్ర రాజకీయంలో ఒకరికి మరొకరు ప్రత్యామ్నాయంగా రూపొందారు.

## ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం - రెండు ప్రాంతీయ పార్టీలు

### అధికార క్రీడ –ధన రాజకీయం

ఇప్పుడు ఈ ప్రాంతీయ పార్టీల మధ్య సాగుతున్న కుల సమీకరణల సంఘర్షణ పూర్వాపరాలను విశ్లేషించుకుందాం.

రాష్ట్రంలో ప్రాంతీయ పెట్టుబడిదారీ శక్తులు ఒక వర్గంగా రూపొందిన క్రమాన్ని మనం చూశాం. ఇది ఒక కులానికి మాత్రమే చెందింది కాదు. సంపన్నవర్గాల – కులాల సమ్మేళనం. అయితే వారికి కుల ప్రయోజనాల కంటే వర్గ ప్రయోజనాలే ప్రధానంగా వుంటాయి.

ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం తనను కూలదోసే ప్రగతిశీల రాజకీయ ప్రత్యామ్నాయాన్ని కోరుకోదు. అది దాని వర్గ ప్రయోజనాలకు విరుద్ధం. అలాగే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం తనకు అనుకూలమైనదే అయినా ఒక జాతీయ పార్టీ ప్రత్యామ్నాయాన్ని కూడా అంతగా కోరుకోదు. ఎందుకంటే తన ప్రయోజనాలకు అనుగుణంగా జాతీయపార్టీని మల్చుకోవడంలో వున్న కష్టనష్టాలు దానికి తెలుసు. అందుచేత ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం తన వర్గ ప్రయోజనాలు కాపాడే రెండు ప్రాంతీయ పార్టీల ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటుంది. అప్పుడు ఎవరు అధికారంలోకి వచ్చినా తమ వర్గపాలన యధావిధిగా కొనసాగుతుంది. అంటే అది రెండు ప్రాంతీయ పార్టీలను కోరుకుంటుంది. ఈ రెండు తమ వర్గ ప్రయోజనాలు కాపాడేవిగా వుండాలని కోరుకుంటుంది.

అందుకే రాష్ట్రంలో ఈ రెండు ప్రాంతీయ పార్టీలకీ వర్గపరంగా వున్న పునాది ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గమే. ఇలా ఒకే వర్గానికి రెండు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు రాజకీయ అధికారం కోసం సాగే సంఘర్షణ వర్గ పోరాట రూపం ధరించదు. ఎందుకంటే అది తమ వర్గ పునాదిని దెబ్బ తీస్తుంది.

అందుచేత రాజకీయ సంఘర్షణ కేవలం అధికార క్రీడగా ఒకరిని ఓడిచి మరొకరు అధికారంలోకి రావడం తప్ప వర్గపరమైన మార్పులకు అందులో చోటు వుండదు. మరొకటి ఎన్నికల్లో డబ్బుది ప్రధాన పాత్ర చెయ్యడం డబ్బు ప్రధానపాత్ర వహిస్తే సామాన్యుల ప్రగతిశీల ప్రత్యామ్నాయం వృద్ధి చెందడాన్ని అది నిరోధిస్తుంది. డబ్బుతో సాగే ఈ ఆట ప్రాంతీయ

పెట్టుబడిదారీ వర్గం చేతుల నుండి అధికారం జారకుండా చేస్తుంది. అలాగే ప్రజలను వర్గ సమస్యల మీద సమీకరించడం ఈ అధికార క్రీడలో వుండదు.

## కులసమీకరణల రాజకీయం

ధన రాజకీయంతో పాటు ప్రజలను సమీకరించే ప్రత్యామ్నాయ మార్గం అవసరం అవుతుంది. దీని పర్యవసానంగా వచ్చిందే కులసమీకరణల రాజకీయం.

ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం రెండు పార్టీ రూపంలో కుల సమీకరణల రాజకీయం సాగిస్తున్నది.

రాష్ట్రంలో ఇప్పుడు రెండు ప్రాంతీయ పార్టీల వ్యవస్థ స్థిరపడింది. ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గానికి ఈ రెండు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. ఇలా ఒకే వర్గ పునాది మీద ఏర్పడిన రెండు పార్టీలు సాగించే రాజకీయ సంఘర్షణ ఒక ప్రత్యేక రూపంలో తప్ప సాధ్యం కాదు. అది ఒక వర్గాన్ని కూల్చి మరోవర్గం అధికారాన్ని పొందే రూపంలో సాధ్యం కాదు. అందువల్ల అది వర్గ ప్రాతిపదిక లేని కేవలం అధికార క్రీడ రూపంలోనే సాగుతుంది. వర్గ ప్రమేయం లేని రూపంలో సాగుతుంది. అందుకే రాష్ట్రంలో రాజకీయం కుల సమీకరణల సంఘర్షణ రూపం తీసుకుంది. ఇలాంటి కుల సమీకరణలను సాధించడం, ఆ ప్రజా సమూహాలను ఓటు బ్యాంకులుగా మార్చుకోడానికి వారి సమ్మతిని పొందే మార్గాలు ఈ ప్రాంతీయ పార్టీల రాజకీయ సంఘర్షణలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

## పౌర సమాజ సమ్మతి- బాస్టర్డ్ హెజమనీ

ఇలాంటి రాజకీయ అధికార క్రీడలో ప్రజల సమ్మతిని పొందే మార్గాలను విశ్లేషించుకోడానికి గ్రాంసీ భావజాలం మనకు దారి చూపిస్తుంది.

పౌర సమాజ సమ్మతిని సాధించే రెండు రకాల పద్ధతులను గ్రాంసీ ఆవిష్కరించాడు. మొదటిది ప్రత్యక్ష ప్రజా సమ్మతిని పద్ధతి దీనిని సాధించే వర్గం ప్రజా సమూహాల నిజమైన ప్రయోజనాలను తన ప్రయోజనాలుగా ప్రకటించి ప్రజల క్రియాశీల భాగస్వామ్యం తో ఒక ఉమ్మడి సమ్మతిని సాధిస్తుంది. దాని ద్వారా ఈ వర్గాల ఉమ్మడి ప్రయోజనాలను సాధించే వ్యవస్థ సాధిస్తుంది. ఇది నిజాయితీగా సాధించే ప్రజాసమ్మతి.

మరో పద్ధతి పరోక్షంగా ప్రజా సమ్మతిని సాధించడం. ఇక్కడ పౌరసమాజ సమ్మతిని సాధించే వర్గం తన మిత్ర వర్గాలుగా భావించే ఉపశ్రేణి ప్రజా సమూహాల నుండి క్రియాశీలమైన వారిని తన వర్గంలో ఇముడ్చుకుంటుంది. వారి ద్వారా ఆ ప్రజా సమూహాల సమ్మతిని పరోక్షంగా పొందే ప్రయత్నం చేస్తుంది. అలాగే ఆయా ప్రజాసమూహాలకు కొన్ని రాయితీలు ఇచ్చి వారు వర్గపరమైన ఆలోచనల వైపు మళ్లకుండా తటస్థ పరుస్తుంది. ఈ పద్ధతులతో సాధించే పరోక్ష సమ్మతిని గ్రాంసీ నీతిబాహ్యమైన, వంచనతో కూడిన బాస్టర్డ్ హెజమనీగా నిర్వచించారు.

రాష్ట్రంలో ఈ రెండు ప్రాంతీయ పార్టీలు అవలంభిస్తున్న పద్ధతులకీ గ్రాంసీ నిర్వచించిన బాస్టర్డ్ హెజమనీకి చాలా పోలికలు కన్పిస్తాయి. అందుచేత గ్రాంసీ భావాల నేపథ్యంలో ఈ రెండు ప్రాంతీయ పార్టీల విధానాలను మనం విశ్లేషించుకోవాలి.

ఈ రెండు పార్టీలు రాష్ట్రంలో ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం స్థిరపడడానికి, బలపడడానికి, విస్తరించడానికి తగిన విధానాలను అనుసరిస్తున్నాయి. దీనిపట్ల ప్రజలలో అసంతృప్తి రాకుండా వారిని తటస్థపరిచే పద్ధతులను పాటిస్తున్నాయి.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఆర్థిక రాయితీలు, పన్ను రాయితీలు, భూసేకరణ రాయితీలు, విద్యుత్ రాయితీలు ఇతర మౌలిక సదుపాయాల కల్పన వగైరాలు ఈ రెండు పార్టీలు సమానంగానే తోడ్పాటునిచ్చాయి. ఇదంతా రాష్ట్రంలో ఉద్యోగ కల్పన పేరుతో నిరుద్యోగులను ఆకర్షించే మార్గంగా మలుచుకున్నాయి.

కార్పొరేట్ వైద్యం ఒక వ్యాపారంగా విస్తరించింది. అవి ప్రజల్ని నిలువుదోపిడీ చేస్తూ లాభాల వేట సాగిస్తున్నాయి. ఈ దోపిడీని, వీటి వ్యాప్తినీ అరికట్టేందుకు ఈ రెండు పార్టీలు ఏ చర్యలు తీసుకోలేదు. వైద్య సేవలలో పెరిగిన ఈ అంతరం సామాన్యులలో తీవ్ర నిరసనకు దారితీసింది. అయితే కార్పొరేట్ వైద్యాన్ని అదుపు చెయ్యడానికి బదులు పేదలకు సామాన్యులకు కార్పొరేట్ వైద్యసేవలు అందించే పేరుతో ప్రభుత్వ సొమ్ముతో ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ఒకరు ప్రవేశపెడితే మరొకరు దానినే కొనసాగించారు. పైకి ఇది పేదలకు కార్పొరేట్ వైద్య సేవగా కనిపించినా నిజానికి ఈ కార్పొరేట్ ఆసుపత్రులకే ప్రభుత్వ సొమ్ము దక్కింది.

కార్పొరేట్ విద్యారంగం కూడా విపరీతంగా విస్తరించింది. ఫీజుల దందా సాగుతోంది. పేదల చదువు, సంపన్నుల చదువును వేరు చేసింది. పేదలు, సామాన్యుల పిల్లలు చదువు కోసం కార్పొరేట్ల బారిన పడి ఆస్తులు అమ్ముకొంటున్నారు. అప్పుల పాలౌతున్నారు. కార్పొరేట్ విద్యను ఈ రెండు పార్టీలు కట్టడి

చెయ్యకపోగా పేదలకు కార్పొరేట్ చదువుల నినాదాన్ని ముందుకు తెచ్చారు. ఫీజు రీ–ఇంబర్స్‌మెంట్లు పథకం తెచ్చి ఉభయతారకంగా వ్యవహరించారు.

గ్రామీణప్రాంతంలో భూ ఆస్తి ఒకరిది; సాగుపని మరొకరిది అయింది. సాగుచెయ్యని భూకామందుల జోలికి పోకుండా, కౌలు నిర్ధారణకు తగిన పద్ధతిని తీసుకురాకుండా కౌలు దారులకు ప్రభుత్వ రాయితీలు ఇచ్చే కార్డుల పద్ధతి ముందుకు తెచ్చారు. ఇది ఆచరణలో అమలుకానిదైనా దాని చుట్టూనే కౌలు రైతులకు ఆశలు కల్పిస్తున్నారు.

ఇలా ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను ఈ రెండు పార్టీలలో ఎవరు అధికారంలో వున్నా వారు ఈ వర్గ ప్రయోజనాలకు దోహదపడే విధానాలనే అమలు చేస్తున్నారు.

సమాజంలో వున్న ఉపశ్రేణులని కులం పేరుతో, మతం పేరుతో సమీకరించుకోడానికి ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయి. పరోక్ష పద్ధతిలో ఆయా కులాల మద్దతు సంపాదించడానికి వారి నాయకులను వివిధ కుల కార్పొరేషన్లలో ఇముడ్చుకుంటున్నాయి. ఇతర నామినేటెడ్ పోస్టులలో వివిధ కులాలకు ప్రాతినిధ్యం కల్పించడానికి ఒకరిని మించి మరొకరు పోటీ పడుతున్నారు. కేవలం రాజకీయ అధికారమే లక్ష్యం కావడంతో ఒక పార్టీ నుండి మరో పార్టీకి నాయకుల ఆకర్షణలు సునాయాసంగా జరిగిపోతున్నాయి. ఒకే వర్గ పునాది కావడం వల్ల వారు ఎలాంటి ఇబ్బంది పడే స్థితి లేకుండా పోయింది.

ప్రజల ప్రమేయం లేని ఈ పరోక్ష సమ్మతిని సాధించే ప్రక్రియలో ఉపశ్రేణులకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే ఆకాంక్ష పక్కకు పోయింది. ఎందుకంటే అలాంటి ఆకాంక్ష వర్గ చైతన్యాన్ని పెంపొందిస్తుంది. ఇప్పుడు ఈ రెండు పార్టీలు ఓట్లు కోసం తమ ఆకాంక్షలనే ప్రజల ఆకాంక్షలుగా ప్రకటిస్తున్నారు. ఒక వర్గం నుండి మరొక వర్గానికి సంపద మార్పిడికి బదులు ప్రభుత్వ ధనాన్ని రాయితీలు, సంక్షేమం రూపంలో అందిస్తున్నారు. ఒకరిని మించి మరొకరు ఈ తరహా ఓట్ల వేటలో పోటీపడుతున్నారు. ఇవి ప్రజల నిత్య జీవితం నుండి పుట్టిన కొత్త ఆకాంక్షలు కావు. ఈ పార్టీలు వండి వారుస్తున్న ఓట్ల ఆకాంక్షలు ఒకరు పసుపు, కుంకుమ, పండగలకు ప్రభుత్వ కానుకలు, పెళ్ళికి డబ్బులు, ప్రభుత్వం తరఫున బారసాలలు, పిల్లలకు గోరుముద్దలు వగైరాలు... అందిస్తే, మరొకరు రుణమాఫీలు, అమ్మఒడి, వివిధ వృత్తుల వారికి ఏదో ఒక ఉచితాన్ని పంచి పెట్టి ఇదంతా సంక్షేమంగా ప్రకటిస్తున్నారు. కులాల వారీగా, తరగతుల వారీగా ఓటు బ్యాంకుల కోసం సాగించే ఈ తరహా పథకాలు ఉపశ్రేణుల స్థితిని అలాగే వుంచి వారు మరింతగా ప్రభుత్వ పథకాలపై ఆధారపడేటట్లు ఏదో ఒక పార్టీకి మద్ధతుదారులుగా మారేట్టు చేస్తున్నారు. ఇవన్నీ వారిలో కొత్త ఆకాంక్షలు రేకెత్తకుండా, వర్గ చైతన్యం పొందకుండా కేవలం ఓట్ల సమ్మతిని పొందే బాస్టర్డ్ పద్ధతి. ఇది సమాజాన్ని మార్చేది కాదు. ఉపశ్రేణులను దోపిడీ నుండి, వివక్ష నుండి విముక్తి చేసేది కాదు.

ఈ రెండు ప్రాంతీయ పార్టీలకు, కుల సమీకరణల రాజకీయానికి, ఉపశ్రేణులను వంచించే ప్రలోభాలకు వ్యతిరేకంగా ఒక నిజమైన ప్రజా ప్రత్యామ్నాయం రూపుదిద్దుకోవాలి.

## ప్రత్యామ్నాయం : ప్రజా హెజమనీ

రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న బాస్టర్డ్ హెజమనీ ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గాన్ని స్థిరపరిచి, విస్తరింప చేస్తుంది. ఇది అన్ని రంగాలకు విస్తరించి అందరినీ దోపిడీ చేస్తున్నది. సంపద కేంద్రీకరణ వేగంగా సాగుతున్నది. సమాజంలో పేదరికాన్ని శాశ్వితం చేస్తున్నది. ఈ అంతరాలపై ప్రజల దృష్టి పడకుండా రాజకీయ సంఘర్షణను కుల సమీకరణల ప్రాతిపదికగా మార్చింది. కుల వివక్షను తెర వెనుకకు నెట్టి కులాల గోడల్ని స్థిర పరుస్తున్నది. ఉపశ్రేణులకు స్వతంత్ర జీవనానికి బదులు వారిని ప్రలోభాల చుట్టూ, రాయితీల చుట్టూ తిప్పుతున్నది. మరో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి రాజకీయ రంగ ప్రవేశం చెయ్యడానికి వీలు లేకుండా ఎన్నికల వ్యవస్థను కుబేరుల ఆటగా మార్చింది.

దీనికి ప్రత్యామ్నాయంగా పౌరసమాజంలో ప్రజా హెజమనీ ని నిర్మించాలి. అది ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం మూలాల మీద దాడి చేసేది కావాలి. ఈ వ్యవస్థను మార్చి ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని, దోపిడీ లేని ,కుల వివక్షలేని సమాజాన్ని అందించేది కావాలి. ఇలాంటి ఉమ్మడి ప్రయోజనాలను సాధించే ప్రత్యామ్నాయ హెజమనీని పౌర సమాజంలో సాధించాలి. పౌర సమాజంలో ఈ ప్రత్యామ్నాయ భావజాలం ఆధిపత్యం వహించే కార్యకలాపాలకు రూపకల్పన జరగాలి

పౌర సమాజంలో ప్రత్యామ్నాయ హెజమనీ అన్న భావనకు గ్రాంసీ రూపశిల్పి. ప్రత్యామ్నాయ హెజమనీ సాధనకు అవసరమైన మార్గాలను ఆయన ఆవిష్కరించాడు. దానిని నిర్దిష్టమైన చారిత్రక, రాజకీయ నేపథ్యంలో అన్వయించుకోవాలి. ఈ రాష్ట్రంలో పౌర సమాజంలో ప్రత్యామ్నాయ హెజమనీ సాధించడానికి చేసిన ప్రయత్నాల అనుభవాలను జోడించుకోవాలి. ఆ ప్రయోగాల తర్వాత మారిన పరిస్థితులను అంచనా వేసుకోవాలి. అందుకు గ్రాంసీ భావజాలం ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

## మారిన పరిస్థితులు - చీలిన ఉద్యమాలు

రాష్ట్రంలో 1952 నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. 1942–46 మధ్య కాలంలో కమ్యూనిస్టు పార్టీ అన్ని తరగతుల ప్రజా సమూహాలను వివిధ ప్రజా సంఘాలలో సంఘటిత పరిచింది. సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా పౌర సమాజంలో భావజాల ఆధిపత్యాన్ని సాధించింది.

తర్వాత కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. విడిపోయిన మార్క్సిస్టు పార్టీ మరో చీలికకు గురైంది. దాని నుండి చీలిన నక్సలైట్ గ్రూపులు మళ్లీ మళ్లీ చీలిపోయాయి. ఒకనాడు పౌర సమాజంలో ప్రత్యామ్నాయ హెజమనీకి చోదకశక్తిగా వున్న వామపక్షం ప్రస్తుతం ఈ చీలికలలోనే కొనసాగుతూ బలహీన పడింది.

రాష్ట్రంలో 1980 దశకంలో దళితుల పై ఆధిపత్య కులాలు సాగించిన మూకుమ్మడి దాడులు, హత్యాకాండ నేపథ్యంలో దళిత మహాసభ ఆవిర్భవించింది. అది దళిత పదానికి విశాలమైన నిర్వచనాన్ని ఇచ్చింది. యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీల ఐక్యవేదికగా పేర్కొంది. అది కుల రహిత, వర్గ రహిత సమాజాన్ని సాధించడం లక్ష్యంగా చెప్పుకుంది. ఈ ఉపశ్రేణి కులాల ఐక్యతకు అంతర్గత వైరుధ్యాలను పక్కన పెట్టాలని పేర్కొంది. ఈ ఐక్య సంఘటనకు అనుబంధంగా రచయితలతోను, కళాబృందాల తోను, ఒక భావ విప్లవాన్ని సాధించాలని తలపెట్టింది. ఈ దిశగా స్థిరమైన అడుగులు పడకముందే దళిత మహాసభ చీలిపోయింది. దానికి సూత్రధారిగా వున్న దళితులు (యస్.సి.లు) రిజర్వేషన్ల అంశంపై విభేదించి అంతర్గతంగా వున్న కులపరమైన విభేదంతో రెండుగా చీలిపోయింది. అవి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి – మాల మహానాడులుగా నేటికీ కొనసాగుతున్నాయి

ఇప్పుడు దళిత మహాసభ లేదు. ఎక్కడికక్కడ ఎవరికివారుగా అంబేద్కర్ సంఘాలు నడుపుకుంటూ ఎక్కడైనా అవమానాలు, అత్యాచారాలు జరిగితే దానిని ప్రతిఘటించే రూపంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు.

మరో పక్క ఆదివాసీలలో – ఉద్యమాలలోను ఇలాంటి చీలికలే కనిపిస్తున్నాయి. వెల్లడి ప్రాంతాలలో యస్.టి.లుగా గుర్తింపు పొందినవారు ఒకపక్క, షెడ్యులు ప్రాంతాలలో నివసించే ఆదివాసీలు మరో పక్క రిజర్వేషన్లతో సహా ఇతర సమస్యలపై ఘర్షణ పడుతున్నారు.

బి.సిలలో అనేక కులాలున్నాయి. ఇందులో వర్గ విభజన కూడా హెచ్చుగా వుంది. భూ యజమానులు, పారిశ్రామికవేత్తలు, ఇతర ఆర్థిక కార్యకలాపాలలోనూ ఆధిపత్య రాజకీయ కార్యకలాపాలలోనూ పాత్ర పోషిస్తున్నారు.

బహుజనుల రాజ్యాధికారం అన్న సమస్య ప్రతి ఎన్నికల ముందు వినిపిస్తుంది. ఐతే పాలక వర్గాల నుండి మరిన్ని రాజకీయ పదవులు పొందడంతో సరిపెట్టుకుంటున్నది

ఈ బి.సి కులాలలో కుల పరమైన అంతరాలు, వైరుద్యాలు వున్నాయి. ప్రతి కులం తన అస్తిత్వం కోసం కుల సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నది. మరోపక్క ఫూలే భావజాలంతో ప్రభావితులైన వారు రాజ్యాధికార స్వరాన్ని వినిపిస్తున్నారు.

ఇలాంటి అంతర్గత వైరుధ్యాలతో దళిత – బహుజన ఐక్యత రావడం లేదు. అస్తిత్వవాద ఉద్యమాల పరిధిలో కులచైతన్యం, ఆత్మగౌరవం, రాజ్యాధికార కాంక్షలు మాత్రం వ్యక్తం అవుతున్నాయి. మొత్తం మీద దళిత – బహుజన ఐక్యత వైరుధ్యాలతో సతమతమౌతున్నది. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలు సాగిస్తున్న కుల సమీకరణల సంఘర్షణలోవారు పాత్రధారులవుతున్నారు.

ఈ నేపథ్యంలో వ్యవస్థను మార్చే ప్రత్యామ్నాయం పౌర సమాజంలో ఆధిపత్యాన్ని సాధించడంలో చాలా సంక్లిష్టతలు చోటుచేసుకున్నాయి.

## ఉపశ్రేణుల శకలాలతో ప్రజా హెజమనీ

ఆంధ్రరాష్ట్రంలో నెలకొల్పే ప్రత్యామ్నాయం ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ పాలనకు దాని బాస్టర్డ్ హెజమనీకి వ్యతిరేకంగా ప్రజా హెజమనీని సాధించేది కావాలి. అందుచేత ఒకే వర్గ పునాది గల తెలుగుదేశం, వై.సి.పిలు రెండింటికీ అది ప్రత్యామ్నాయం కావాలి. ఈ రెండు ప్రాంతీయ పార్టీల మధ్య ఒక దానిని ఎంచుకుని మరో దానిపై పోరాడే అవకాశం లేదు. అలా ఎంచుకుంటే అది ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ పాలనకు ప్రత్యామ్నాయం కాకపోగా దానికి తోడ్పాటు ఇచ్చేది అవుతుంది.

## ఉపశ్రేణుల చారిత్రిక సంఘటన

ఈ ప్రత్యామ్నాయ ప్రజా హెజమనీకి సారథ్యం వహించే వర్గం లేదా పార్టీ లేదా సంస్థ ఈ ఉపశ్రేణుల లన్నింటినీ సంఘటితపరిచేదిగా వుండాలి. ఇది ఒక విడివిడి సమూదాయాల ఐక్య సంఘటన లాంటిది కాదు. ఇదొక ఉమ్మడి ప్రయత్నం. అందులో అందరి ఆకాంక్షలకు స్థానం వుండాలి. అందరూ ఈ సంఘటన తమదిగా భావించేలా రూపుదిద్దుకోవాలి. దీనిని గ్రాంసీ ఒక చారిత్రక సముదాయం లేదా ముద్ద అన్నాడు. అలాంటి హిస్టారిక్ బ్లాక్ ఏర్పడాలి.

ఇది భావసారూప్యత గల ముద్ద కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఏ ఒక్క సిద్ధాంత భావజాలమూ ఇలాంటి ముద్దకు ప్రాతినిధ్యం వహించే స్థితి లేదు. ఉప శ్రేణి కులాలలో అస్తిత్వవాద ఉద్యమాల ప్రభావం బలంగా వున్న నేపథ్యంలో వీటన్నింటికీ ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి భావజాలాన్ని పెంపొందించు కోవాలి. వర్గ దోపిడీని అంతం చేసే మార్క్స్ భావజాలాన్ని, కుల వివక్షను నిర్మూలించే అంబేద్కర్, ఫూలేల భావజాలాల సమన్వయంతోనే ఈ సంఘటన ఏర్పడే అవకాశం ఉంది. ప్రాంతీయ పెట్టుబడిదారీ దోపిడీని ప్రతిఘటించడానికి, కుల సమీకరణల రాజకీయాన్ని వ్యతిరేకించడానికి ఇలాంటి భావ సమన్వయం తప్పనిసరి అవుతుంది. అప్పుడు వర్గరహిత, వివక్షరహిత సమాజం ఈ సంఘటనకు నినాదం అవుతుంది.

కుల నిర్మూలన జరిగినా వర్గ దోపిడీ దానంతట అదే అంతం కాదు అలాగే వర్గ దోపిడీ పోయినా కులం దానంత అదే తొలగి పోదు. అందువల్ల ఇది జమిలిగా సాగించాల్సిన రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక ఉద్యమం

ఈ మౌలిక సంఘటనలో లింగవివక్షకు వ్యతిరేకంగా మహిళలను సమీకరించడం, మైనార్టీల హక్కుల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ సంస్థలను ప్రజాస్వామిక హక్కుల సంస్థలను, ఇతర సామాజిక ఉద్యమాలను దీనిలో భాగం చెయ్యడానికి ఆయా సంస్థల నినాదాలను, లక్ష్యాలను ఈ సంఘటన తన కార్యక్రమంలో భాగంగా ప్రకటించుకోవాలి. అప్పుడే పౌరసమాజంలో భావజాల ఆధిపత్యం సంపాదించే విశాల ప్రాతిపదిక ఏర్పడుతుంది.

## సవర్గ మేధావులు

ప్రత్యామ్నాయ హెజమనీకి సాగే ఉద్యమం పౌరసమాజంలో సిద్ధాంత పోరాటం అవుతుంది. దానిని నిర్వహించడానికి తగిన స్వవర్గ మేధావులను అది రూపొందించుకోవాలి. చరిత్రను పునర్ నిర్మించడం, నూతన సమాజ ఆకాంక్షలను, దాని స్వరూప స్వభావాలను వెల్లడించగల సాహిత్య సృష్టి జరగాలి.

ప్రస్తుతం వర్గ దృక్పథంతో రాసే రచయితలున్నారు. అస్తిత్వవాద కుల చైతన్యంతో రచనలు చేసే వారున్నారు. అలాగే మహిళల, మైనారిటీల అస్తిత్వ వాదాన్ని ప్రకటించే రచయితలూ ఉన్నారు. వీరిలో చాలా మంది ఆయా ఉద్యమాలలో పాత్ర దారులుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి వున్నారు . ఇది విడివిడి స్రవంతుల ప్రత్యేక భావజాలంగా వుంది. పైగా కొంత పరస్పర వ్యతిరేక భావజాలం కూడా కనిపిస్తుంది. ఒక ఉమ్మడి భావజాలం గల సవర్గ మేధావులను వీరి నుండి రూపొందించుకునే అవకాశాలు వున్నాయి.

## సాంస్కృతిక విప్లవం

ప్రతి వ్యక్తి ఒక తత్వవేత్తే అంటాడు గ్రాంసీ. తాత్వికులు సాగించే అన్వేషణ వారు చెయ్యరు, కాని తననీ, తన చుట్టూ వున్న సమాజాన్ని వారు అర్థం చేసుకునేందుకు వినియోగించే సాధనం ఒకటి వుంది. అదే ప్రజలకు అందుబాటులో వుండే లోకజ్ఞానం. దీనిని తప్పుడు చైతన్యంగా కొట్టి పారెయ్యకూడదు అంటాడు గ్రాంసీ. ఇందులో పొసగని అంశాలు వుంటాయి. మతపరమైన విశ్వాసాలు, సంప్రదాయాల పరంపర, మూఢ నమ్మకాలతో పాటు పాలకవర్గాలు అందించే భావజాలంతో పాటు వారి జీవితానుభవాలు వగైరాలన్నీ వుంటాయి. ఇది వారి భావనా ప్రపంచం. బయటి నుండి అందించే సిద్ధాంత అంశాలు వారిని అంతగా ప్రభావితం చెయ్యవు. వారి లోకజ్ఞాన, ప్రపంచంలో ప్రవేశించి దానిని విచక్షణా జ్ఞానంగా మార్చాలి. అప్పుడే నిజమైన భావ విప్లవం జరుగుతుంది. వారిలో కొత్త ఆకాంక్షలు మొలకెత్తుతాయి. వ్యవస్థను మార్చే ఉద్యమాలలో భాగస్వాములవుతారు.

ఈ పరిణామంలో సాహిత్య, సాంస్కృతిక రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఉపశ్రేణుల ఉమ్మడి ఆకాంక్షలతో కూడిన బలమైన సాంస్కృతిక ఉద్యమం సాగినప్పుడే పౌర సమాజంలో వివిధ సముదాయాలు చైతన్యవంతం అవుతాయి. పౌర సమాజంలో భావజాల ఆధిపత్యానికి అది దారితీస్తుంది.

ఆధునిక ప్రపంచంలో ప్రచార, ప్రసార మాధ్యమాలలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన పత్రికలు, 24 గంటల టెలివిజన్ ప్రసారాలు, విస్తరించిన సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లు అనునిత్యమూ ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ మాధ్యమాలను వినియోగించు కోవడంతో పాటు అక్కడ జరుగుతున్న భావజాల పోరాటంలో క్రియాశీలంగా పాల్గొనాల్సిన ప్రత్యేక పరిస్థితిని గుర్తించాలి.

మరో పక్క ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమై, వారి భాగస్వామ్యంతో, వారి మధ్యన సాగే సజీవ సాంస్కృతిక ఉద్యమ కార్యకలాపాలు భావ విప్లవంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందన్న అంశాన్ని గుర్తుంచు కోవాలి.

పౌర సమాజంలో భావజాల ఆధిపత్యం కింది నుండి జరిగే ప్రక్రియగా గ్రాంసీ ప్రకటించారు. అట్టడుగునవున్న ప్రజా

సమూహాలను ఉత్తేజపరిస్తే వారు తమ నాయకుల్ని తామే సృష్టించుకుంటారు. అంతేకానీ కొద్దిమంది నాయకుల కలయికతో పౌర సమాజంలో భావజాల ఆధిపత్యం సిద్ధించదు.

ముందుగా వ్యవస్థను మార్చే ప్రయత్నం చేసేవారు. మార్క్సిజం, అంబేద్కరిజం, జ్యోతీబా పూలే రచనలతో పాటు గ్రాంసీని ప్రత్యేకంగా అధ్యయనం చెయ్యాలి. అలాగే మన రాష్ట్రంలో పౌర సమాజంలో ప్రజా హెజమనీ కోసం జరిగిన ప్రయత్నాలను అధ్యయనం చెయ్యాలి. ఒకనాడు కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాలను నిర్మించిన తీరును అర్థం చేసుకోవాలి. వారు ప్రజా సంఘాలను ఆయా వర్గాల ఐక్యవేదికలుగా నిర్వహించిన పద్ధతులు తెలుసుకోవాలి. నాయకత్వంలో కమ్యూనిస్టులు కాని వారికి తగిన స్థానం కల్పించి అందరి సంస్థగా ప్రజా సంఘాలను నిర్వహించిన అనుభవాలను గ్రహించాలి. అననుకూల రాజకీయ పరిస్థితులలో కూడా ప్రజా సంఘాలు బహుముఖ ఉద్యమాలను సాగించడానికి అవకాశమున్న ప్రతి అవకాశాన్ని వినియోగించు కున్న తీరును పసిగట్టాలి.

దళిత మహాసభ సమాజంలోని మరో ముఖ్యమైన కుల వివక్ష సమస్యను ముందుకు తెచ్చింది. బహుజనుల రాజ్యాధికార సమస్యగా దానికి ప్రయత్నం చేసారు. ఇప్పుడు ఈ అనుభవాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ భావజాల ఆధిపత్యానికి ప్రస్తుత వ్యవస్థను ప్రతిఘటించే కార్యకలాపాలను రూపొందించుకోవాలి.

వ్యవస్థను మార్చాలని భావించేవారు ఎవరైనా పౌర సమాజం మీద భావ జాల ఆధిపత్యం సంపాదించడం తప్పనిసరి. అంటే ప్రజా సమూహాల ఇష్ట పూర్వక సమ్మతి పొందడం తప్పనిసరి. పైపై కూడికలు తీసివేతలతో, సంఘటనలతో వ్యవస్థలు మారవు దీనిని కార్యరూపంలోకి పెట్టడానికి మనం గతం నుండి అనుభవాలను నేర్చుకోవాలి. రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. ప్రస్తుత వికృత రూపంలో సాగుతున్న రాజకీయాల్ని మార్చడానికి సన్నద్ధులు కావాలి. ఈ బృహత్తర ప్రయత్నానికి ప్రస్తుతం వ్యవస్థను మార్చాలని కోరుకునే వారిలో ఎవరో ఒకరు గంట కట్టాలి. ఆలా జరగకపోతే పరిస్థితుల ప్రోద్భలంతో అలాంటి కొత్త శక్తులు అంకురిస్తాయి.

చరిత్ర ఎల్లకాలం ఒకేచోట స్థిరంగా నిలిచిపోదు. అది ముందుకు సాగుతుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు – ప్రజలను దానికి సన్నద్ధం చెయ్యడమే అందరికీ కర్తవ్యం కావాలి. ❑

---

## పౌర సమాజం - గ్రాంసీ - ఒక పరిశీలన

**(87వ పేజీ తరువాయి)**

చేస్తారు. ఇక్కడ మహిళల అణచివేతకు సంబంధించిన అత్యంత సంక్లిష్టమైన వ్యవస్థ స్వరూపానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడానికి చోటు ఉండదు. మహిళల గృహశ్రమకు ఎలాంటి ప్రతిఫలం ఉండదు. అయితే ప్రస్తుతం ఇక్కడ మహిళల అణచివేతను క్యాపటలిస్టు దోపిడి నుంచి వేరుగా చూడవలసి ఉంటుంది. కార్మికవర్గం తన ఆధిపత్య పోరాటంలో భాగంగా సమీకరించే విశాలమైన సామాజిక శక్తుల సంఘటనలో మహిళా ఉద్యమం ఒక కీలక అంశంగా ఉంటుంది.

పౌర సమాజం, రాజకీయ సమాజం అనే పదాంశాలను గ్రాంసీ హెగెల్ నుంచి స్వీకరించాడు. హెగెల్ వ్యవస్థలో పౌర సమాజాన్ని ఆర్థిక సంబంధాల క్షేత్రంగా నిర్ధారించారు. తొలి దశలో మార్క్స్ ఎంగెల్స్ కూడా ఇలాంటి అర్థంలోనే ఈ పదాన్ని వినియోగించారు. అయితే తమ సిద్ధాంతాన్ని చారిత్రక భౌతికవాదం, ఉత్పత్తి శక్తులు – సంబంధాలు అనే అంశాలతో పరిపుష్టం చేసిన తరువాత నాడు పౌర సమాజం అనే అంశాన్ని తొలగించారు కాబట్టి ఆ పదానికి గ్రాంసీ కొత్త అర్థాన్ని ఇవ్వడం న్యాయబద్ధమేనని చెప్పాలి.

చారిత్రకంగా పాలకవర్గం తన ఆధిపత్యాన్ని కొనసాగించ డానికి రాజ్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుంటుందని గ్రాంసీ పేర్కొన్నారు. రాజకీయ పౌర సమాజం కలయికే రాజ్యమని కూడా చెప్పవచ్చు.

రాజ్య సిద్ధాంతంతో పాటు గ్రాంసీ పౌరసమాజ భావన విశ్లేషణ ఉంటుంది. సమిష్టి పాలనలో కొందరు వ్యక్తులు ఎదుటి వారిపై చెలాయించే ఆధిపత్యాన్ని ఎదుర్కొని నివారించవలసిన బాధ్యత పౌరసమాజంపై ఉంది. సమాజంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రాజ్యం పట్ల, ప్రభుత్వ విధానాల పట్ల సమాజ స్థితిగతులు పట్ల అవగాహన కలిగిన సామాన్య వ్యక్తులను కూడా పౌర సమాజంలో భాగస్వాములను చేసినట్లు అయితే ప్రజలు చైతన్యవంతులై ప్రభుత్వ విధానాలను నిశితంగా గమనించి వ్యవస్థ మార్పునకు తమ తీర్పును వెల్లడిస్తారు. తద్వారా సమాజంలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరి ప్రజస్వామ్యం విజయవంతం అవుతుంది. పౌరసమాజంపై గ్రాంసీ అభిప్రాయాలు మహోన్నతమైనవిగా పేర్కొనవచ్చు. ❑

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**



# రత్న నర్సింగ్ హోమ్

# Ratna Nursing Home

## తణుకు

*Consulting Doctors*

**డా॥ వల్లూరి సోమశేఖర్**
M.B.B.S., D.C.H., M.D. (Gen Medicine)
Regd. No. 16999

**డా॥ బిక్కిన ఘనశ్యామ్**
M.B.B.S., M.D. (Gen Medicine)
Regd. No. 78473

**డా॥ వల్లూరి సుబ్బలక్ష్మి**
M.B.B.S., D.G.O.
Regd. No. 18121

**డా॥ బిక్కిన అమృత రత్న**
M.B.B.S., M.S., (OBG/Gynea)
Regd. No. 85666

# HARVEST
## JUNIOR COLLEGE

*Welcome to Schoollage*



నా స్నేహితులు కార్పోరేట్ కాలేజీల్లో పడ్డ కష్టాల్ని చెపుతుంటే హార్వెస్ట్‌లో నేను ఒత్తిడి లేకుండా ఆనందంగా ఎలా చదువుకొన్నానో చెప్పాను.



మా ప్రొఫెసర్స్ ఏ కాలేజీలో చదువుకొన్నావని అడుగుతుంటే ఆనందంతో కళ్ళు చెమర్చాయి ....థ్యాంక్యూ హార్వెస్ట్

*Hai, Do you recognise us !*

**We are Harvestians**



సూరత్‌కల్ క్యాంపస్ ఓ కలల ప్రపంచం థ్యాంక్స్ టు.... హార్వెస్ట్

ప్రియమైన తల్లిదండ్రులకు, విద్యార్థులకు,

హార్వెస్ట్ జూనియర్ కాలేజ్ 2020–21 సంవత్సరానికి ఇంటర్‌మీడియట్ అడ్మిషన్లను ప్రారంభించింది. ప్రస్తుత కార్పొరేట్ తరహా బోధనలో విద్యార్థుల పైన తీవ్రమైన ఒత్తిడి, మొరటైన అభ్యాస పద్ధతి, సృజనాత్మకత లోపించటం మనందరకు తెలుసు. ఈ పద్ధతిలో చదివిన విద్యార్థులు ఉన్నత చదువులలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హార్వెస్ట్ బోధనా పద్ధతి విద్యార్థుల సృజనాత్మక శక్తికి పదును పెట్టి, వారి ఆలోచనా శక్తిని పెంపొందిస్తుంది.

కాన్సెప్ట్ క్లారిటీ, అకడమిక్ ప్లానింగ్, కంటెంట్ డిజైన్‌తో పాటు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ కూడా JEEలో ర్యాంక్ సాధించడానికి ముఖ్యమైనవి. హార్వెస్ట్‌లో ఇంటర్‌మీడియట్ విద్యార్థులకైనా, సి.బి.యస్.ఇ. విద్యార్థులకైనా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. విద్యార్థుల కాన్ఫిడెన్స్ పెంచేలా ఒత్తిడి లేకుండా పోటీలో గెలిచేలా హార్వెస్ట్ బోధనాపద్ధతి ఉంటుంది.

హార్వెస్ట్ ఇప్పుడు NTA యొక్క గుర్తింపు పొందిన JEE, NEET పరీక్షల ప్రాక్టీస్ సెంటర్‌గా ఉంది. 70 కంప్యూటర్లతో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ లాబ్‌లతో అత్యాధునికమైన కాలేజ్. ఆడ పిల్లలకు, మగ పిల్లలకు వేరు వేరుగా తరగతులు నిర్వహించబడతాయి. హార్వెస్ట్ ఫ్యాకల్టీ FITJEE, N-120, ALLEN, C.O+ బ్యాచ్‌ల శిక్షణలో ఆరితేరిన అధ్యాపక బృందంతో పటిష్టపరచబడింది.



నా ఆశలకు ఆలంబనగా నిలిచిన హార్వెస్ట్ నన్ను దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన NIT లో నిలబెట్టింది...



విజ్ఞానపు సరిహద్దులలో ఆనందపు లోతులు చూస్తున్నాను...




**Near Mamata General Hospital, Khammam Tel. : 08742-295442, 92487 77752, 60**

**E-mail : harvestkhammam@gmail.com www.harvestpublicschool.com**